
భారతి

ఆంధ్రగ్రంథమాలా

ప్రచురణములు

ఆంధ్రవిజ్ఞాన సర్వస్వము

విజ్ఞానమును సంపాదించుటకు తెలుసుకోదగిన ప్రతి విషయమును ఈమహాగ్రంథములో సవిస్తరముగా ప్రతిపాదింపబడియున్నది. ఇట్టి గ్రంథము నిదివరకెవ్వరును ప్రచురించియుండలేదు. ఇందలి విషయములను ప్రత్యేకించి వేరొకచోట కొలదిమాటలలో అలవి గాదు. ఇది ప్రతి ఆంధ్రునియింటను ఉండి తీరవలసిన గ్రంథము. ఏవిషయమును గురించి సంశయము వచ్చినను దీనిని ఒకమారు విలోకించి సంశయనివృత్తి గావించుకొనవచ్చును. ప్రస్తుతము రెండు సంపుటములు ప్రచురితములై యున్నవి. వీనిలో 'అ' మొదలు 'అశ్వ[illegible]' వరకును గల సమస్త విషయములనుగురించిన వ్యాసములు గలవు. ఏకవర్ణ, ద్వివర్ణ, త్రివర్ణ చిత్రపటములుగూడ అనేకము జతపరుపబడియున్నవి. ప్రతి సంపుటము చక్కని స్వదేశీచర్మముతో పూర్తిగా బైండు చేయబడి, బంగారురేఖల అక్షరములతో తీర్పబడియున్నది. ఒక్కొక్క సంపుటములోను 600 పుటలున్నవి. సంపుటము 1-కి వెల 10-0-0

ఆంధ్రశబ్దచింతామణి

ఆంధ్రభారత లక్ష్యములతోను, సంప్రదాయార్థములతోను పారనంది రామశాస్త్రులు గారు రచించిన ఉద్యోతిని అను సంస్కృతాంధ్ర వ్యాఖ్యానములతో సమేతమైన నన్నయభట్టు వ్యాకరణము. వెల 0-12-0

ఆంధ్రవాఙ్మయసూచిక

1927-వ సంవత్సరము వరకును ముద్రితములై నట్టియు, అముద్రితములై వివిధభాండాగారములం దున్నట్టియు ఆంధ్రగ్రంథముల పట్టిక. వెల 1-0-0

శతకమంజరి

భక్తిసంపుటము. ప్రాచీనశతకముల క్రోడీకరణము. వెల 1-0-0

(పై గ్రంథము లన్నియు కొలదిప్రతులు మాత్రమే నిలువయున్నవి.)

బసవపురాణము

పాల్కురికి సోమనాథకవి రచించిన ద్విపద కావ్యము. వేటూరి ప్రభాకరశాస్త్రిగారు రచించిన చక్కని, విపులమయిన పీఠికతో సహితము. వెల 2-8-0

(భాషా విషయకములు - సారస్వతము)

పారిభాషిక పదకోశము

అనేక ఆధునిక శాస్త్రములకు సంబంధించిన పదములకు సరియైన తెలుగుపదముల కోశము. అనేక గ్రంథములను పరిశీలనచేసి కూర్పబడినది. విద్యార్థులకు, ఉపాధ్యాయులకు, గ్రంథకర్తలకు అత్యుపయోగకరమైన నిఘంటువు. వెల 1-4-0

శ్రీ పండితారాధ్య చరిత్ర

శైవమతప్రతిపాదకమగు ద్విపదకావ్యము. పాల్కురికి సోమనాథ కవి రచితము. డా. చిలుకూరి నారాయణరావుగారు సంస్కరించిరి. దీక్షా, పురాతన, వాద, మహిమ, పర్వత మను పంచప్రకరణములును ఒకే సంపుటమున గలవు. ఇంత నిర్దుష్టముగ ఈగ్రంథము నిదివరకెవ్వరును ప్రకటించలేదు. నారాయణరావుగారు రచించిన అమూల్యమైన పెద్ద పీఠిక కూడ కలదు. చక్కనిబైండు. వెల 5-0-0

(భగవద్గీతలు)

భగవద్గీత (సంస్కృతము)

శ్రీశంకర భాష్యముతోను, దానికి కీ. శే. బెల్లంకొండ రామరావుగారిచే వ్రాయబడిన భాష్యార్క ప్రకాశము అను విపుల సంస్కృత వ్యాఖ్యానముతోను సహితము. నాలుగు సంపుటములు. వెల 6-0-0

కావ్యాత్మ

సంస్కృతాలంకార శాస్త్రమును సమగ్రముగా విమర్శించుచు రచించిన విమర్శగ్రంథం. సారస్వత ప్రియులకు ఆదరణీయమైనది. వెల 2-0-0

భారతి

సచిత్ర మాసపత్రిక

BHARATHI

(A TELUGU MONTHLY)

సంపాదకుడు:

శి. శంభుప్రసాద్

ఆంధ్రపత్రికా ముద్రాలయము,

మద్రాసు.

౧౯౪౦

సంపుటము ~~౧౭, సంచిక~~

1 · 6

ప్రకటన

ఈక్రింది కనబరచిన నెంబర్ల వారికి ఈనెల భారతి (194· సం. జూన్ నెల)తో ఇదివరకు చెల్లించిన చందా పూర్తి యగుచున్నది. తిరిగి ఇంకొక సంవత్సరమున కగు చందా మాకు చేరునట్లు ఈనెలాఖరులోగా మనియార్డరు చేసినచో తెంపు లేకుండ పత్రికను పంపుచుందుము. అట్లు తమ యొద్దనుండి 30-వ తేది లోపుగ సొమ్ము రానిచో సమాజభాషాభిమానులగు తాము తిరిగి ఇంకొక సంవత్సరమువఱకు భారతి చందాదారులుగ నుందురను నమ్మకముతో 1940 సం జూలై 10-వ తేదిని రూ 6—4—0 లకు వి. పి పంపుచున్నాము. కావున తా మెప్పటివలెనే పత్రికయం దభిమానముంచి సొమ్ము చెల్లించి వి. పి. ని గైకొన ప్రార్థితులు. ఒకవేళ తమకి పత్రిక ప్రస్తుత మనవసరముగ దోచినచో మాకావిషయము వెంటనే తెలియజేసిన యెడల వి. పి. పంపుట నాపుదుము.

B 5. D 4. G 1, 2. H 1. H 1 a. H 1 b. H 22, 23, 25, 26, 51, 53, 54. K 3, 10. N 4, 5. P 6. R 6, 19. S 12, 15, 20, 69, 70, 73, 78, 85, 87, 89. V 9, 10, 22, 25. Y 2.

వ్యాసవిలేఖకులకు మనవి

వ్యాసాలు ఎనిమిదిపుటలకు మించకుండా ఉండాలి. కాగితానికి ఒకపెడే వ్రాయాలి. శాస్త్రీయవిషయాలనుగురించిన వ్యాసాలుకూడా ఎక్కువ పరిభాషా, ఎక్కువ వివరాలూ లేకుండా సంగ్రహంగాను, సామాన్యపాఠకునికి విషయం బోధపడేటట్టు సులభంగాను, మనస్సును కథలా ఆకట్టేటట్టు ఆకర్షకంగాను ఉండాలి. శాసనవ్యాసాలు పదిపన్నెండు పుటలకు మించేయెడల రెండు సంచికలలో ప్రకటింపవలసివచ్చును. "బాలానందమున" కుచితమైన కథలు, పాటలు, సాధ్యమైనంతవరకు పిల్లలభాషలో రచించి పంపించవలసినదని కవులకు మనవి. విమర్శలకు గ్రంథములు పంపువారు రెండుప్రతులు పంపవలెను. ఇతరత్ర ప్రకటితమైన రచన లేవీ పంపవద్దు.

దేశాన్ని ఎక్కువగా కలవరపరుస్తున్న సాంఘిక, ఆర్థిక, రాజకీయాది విషయాలనుగురించీ, మనఆంధ్రుల ప్రత్యేకసమస్యలనుగురించీ ప్రత్యేకవ్యాసాలు కావాలి. సాధ్యమయినంతవరకు ఎత్తుకునే విషయంలోను, చూచే దృష్టిలోను, రచించే రచనలోను కొత్తదనం కావాలి. మన ఉద్యమాలు, మనదేశం, మనసంఘం, మనఆశయాలు భారతిలో ప్రతిఫలించేటట్టు చూడవలసిదని వ్యాసకర్తలకు మనవి.—భా. సం.

భారతి — సప్తదశ సంపుటము. భా — ౧.

వ్యాసముల అకారాది సూచి.

* ఈ గుర్తు కలవి ౬-వ సంచికలోని వ్యాసములు

త్రివర్ణచిత్రముల అకారాదిసూచి



విషయసూచిక

చిత్రములు

వి ష య సూ చి క

చిత్రములు

త్రివర్ణ చిత్రము : చంద్రికాశోభ

చిత్రకారుడు : శ్రీ పి. ఆర్. శర్మగారు.

విషయసూచిక

చిత్రములు

వి ష య సూ చి క

చిత్రములు

త్రివర్ణ చిత్రము : కౌజుల జంట

చిత్రకారుడు : శ్రీ దొంతంశెట్టి పాపారావుగారు.

విషయసూచిక

భారతి

సచిత్ర మాసపత్రిక

BHARATHI

(A TELUGU MONTHLY)

సంపాదకుడు:

శి. శంభుప్రసాద్

ఆంధ్రపత్రికా ముద్రాలయము,

మద్రాసు.

౧౯౪౦

సంపుటము ౧౭, సంచిక ౧

ప్రకటన

ఈక్రింది కనబరచిన నెంబర్ల వారికి ఈనెల భారతి (1940 సం. జనవరినెల)తో ఇదివరకు చెల్లించిన చందా పూర్తి యగుచున్నది. తిరిగి ఇంకొక సంవత్సరమున కగు చందా మాకు చేరునట్లు ఈనెలాఖరులోగా మనియార్డరు చేసినచో తెంపు లేకుండ పత్రికను పంపుచుందుము. అట్లు తమ యొద్దనుండి 30-వ తేది లోపుగ సొమ్మురానిచో సహజభాషాభిమానులగు తాము తిరిగి ఇంకొక సంవత్సరమువఱకు భారతి చందాదారులుగ నుందురను నమ్మకముతో 1940 సం. ఫిబ్రవరి 10-వ తేదిని ర్సా 6—4—0 లకు వి. పి. పంపుచున్నాము. గావున తా మెప్పటివలెనే పత్రికయం దభిమాన ముంచి సొమ్ము చెల్లించి వి. పి. ని గైకొన బ్రార్థితులు. ఒకవేళ తమకీ పత్రిక ప్రస్తుత మనవసరముగ దోచినచో మాకావిషయము వెంటనే తెలియంజేసిన యెడల వి. పి. పంపుట నాపుదుము.

A 3. B 7. H 29, 30, 62, 64, 65. K 11, 13. L 2. M 15. P 13, 38, 39. R 25, 26. S 26, 27, 29, 31, 47, 99, 103, 107, 107 a, 111, 112, 113, 115, 117. V 29.

వ్యాసవిలేఖకులకు మనవి

వ్యాసాలు ఎనిమిదిపుటలకు మించకుండా ఉండాలి. కాగితానికి ఒకపెడే వ్రాయాలి. శాస్త్రీయవిషయాలనుగురించిన వ్యాసాలుకూడా ఎక్కువ పరిభాషా, ఎక్కువ వివరాలూ లేకుండా సంగ్రహంగాను, సామాన్యపాఠకునికి విషయం బోధపడేటట్టు సులభంగాను, మనస్సును కథలా ఆకట్టేటట్టు ఆకర్షకంగాను ఉండాలి. శాసనవ్యాసాలు పదిపన్నెండు పుటలకు మించేయెడల రెండు సంచికలలో ప్రకటింపవలసివచ్చును.

దేశాన్ని ఎక్కువగా కలవరపరుస్తున్న సాంఘిక, ఆర్థిక, రాజకీయాది విషయాలనుగురించీ, మనఆంధ్రుల ప్రత్యేకసమస్యలనుగురించీ ప్రత్యేకవ్యాసాలు కావాలి. సాధ్యమయినంతవరకు ఎత్తుకునే విషయంలోను, చూచే దృష్టిలోను, రచించే రచనలోను కొత్తదనం కావాలి. మన ఉద్యమాలు, మనదేశం, మనసంఘం, మనఆశయాలు భారతిలో ప్రతిఫలించేటట్టు చూడవలసిదని వ్యాసకర్తలకు మనవి.—భా. సం.



సంపుటం. ౧౭ ప్రమాది, పుష్యమాసము (జనవరి 1940) సంఖ్య. ౧

స్వవిషయము

ఈ సంచికతో భారతికి పదునారేండ్లు నిండినవి; పదునేడవ సంవత్సరము పైబడినది. తొలుదొల్త నే యాశయముతో నీ పత్రిక ప్రారంభింపబడినదో తదాశయస్ఫూర్తికై నాటి నుండి నేటివరకు భారతి సర్వవిధముల కృషి చేసినది. ఆ కృషి ఎంతవరకు ఫలించినదో నిర్ణయింపజాలినవారు పాఠకమహాశయులే. ఏ మహోత్తరమైన సంకల్పముతో నీ భారతిపత్రికాసంస్థాపనము తలపెట్టబడెనో, ఆయాదర్శమును మరువకయే ప్రస్తుత నిర్వాహకులును ఈ పత్రికను నడుపుచున్నారు. ఈ పత్రికానిర్వహణము లోపరహితమని మేము భావించుటలేదు. కాని, ఈ లోపములు ప్రమాదవశములును, అనివార్యములే గాని బుద్ధిపూర్వకములు మాత్రము కావు. ఆర్థికముగ భారతి స్వయంపోషకము కాలేదు. వైజ్ఞానికముగను అనుకొనినంత విజయము సమకూరలేదనియే మా నమ్మకము. ఇందులకు కారణములు బహుళములు. ఏమైనను, మంచిచెడ్డలన్నిటికిని బాధ్యతను మేమే వహించుచున్నాము.

* * *

భారతి ప్రత్యేకముగ నే మతప్రచారమునకుగాని యేర్పడి యుండలేదు. ఒకశక్తికిగాని, ఒక వాదమునకుగాని, ఒక వర్గమునకుగాని చెందిన పత్రిక గాదు. భారత జాతీయమహోత్కృష్ట్యమును, ముఖ్యముగ ఆంధ్రుల మహోత్కృష్టతను, విశిష్టత్వమును నిరూపించుటయే భారతి పరమలక్ష్యము. అద్దమునందువలె ఆంధ్రుల సర్వతోముఖాభ్యుద

యమును ప్రతిఫలింప జేయుటయే భారతి సంకల్పము. భారతికి పూర్వాచారము నెడ అంధవిశ్వాసముగాని, ఆధునిక సంప్రదాయముపట్ల అత్యాదరముగాని లేదు. సనాతన, అధునాతనములకును, పూర్వాపరములు రెంటికిని సమన్వయమును సమకూర్చి భిన్న భిన్న వర్గములకు, మతములకు నుండెడి సంఘర్షణను సమయజేసి, ఆంధ్రుల ఉత్తమ కళా, విజ్ఞాన కాంతులను దశదిశల విరజిమ్ముటయే భారతి విధ్యుక్త ధర్మము. ఈ ధర్మ నిర్వహణమునకై పరుల నెంతమాత్రమును నొప్పింప బనిలేదు. వీణానాదము వలన శ్రోతలు అవ్యయానందము ననుభవించునట్లు, కళగాని, కావ్యముగాని మానవుల కుత్తేజమును కలిగించి, వారిని ఉదాత్తులనుగ చేయవలెను. విద్యమాన సంఘమునందు ప్రజలలో మానసిక పరివర్తనము కలుగ జేయవలెననెడి యుత్సుకతతో నుడుకు రక్తముగల ఆధునికులు కొందరు తమ వ్రాతలలో అసహనమును, పారుష్యమును ప్రకటించుచున్నారు. సాహిత్య క్షేత్రమునందే గాక, సినిమా మొదలగు కళావీథులందును యిదే చిత్తవృత్తి ప్రత్యక్ష మగుచున్నది. సంఘము నంతయు మరమ్మతు చేయగలమను భ్రమచే పండితమ్మన్యులు కొందరు విచక్షణ లేకయే పూర్వసంప్రదాయము లన్నింటిపైనను దాడివెడలుచున్నారు. ఏకాలమునగాని ఏ దేశమును సర్వ సద్గుణముల కాలవాలమై యుండలేదు. అటులే నేటి భారతజాతికూడ కొన్ని అత్యాచారములకు, అనాచారములకు అంధ విశ్వాసములకును బలియై యుండవచ్చును. కాని, ఈ దోషములను గోరంతలను కొండంతలుగ జేసి, ఈ కుళ్లునంతయు తోడి ప్రజాబాహుళ్యము కండ్లముందు ప్రత్యక్షము చేయుట సంస్కరణకు మార్గముకాదు. ఋతుధర్మము ననుసరించి పుష్పము తనంతదా వికసించవలెనేగాని బలవంతముగ పట్టుకారుతో పట్టి లాగిన నేమగును? సంస్కారప్రియులీర్ష్యా ఉసూయలకు ఈషణ్మాత్రమేని తమ మానసములందు తావీయరాదు. ముఖ్యముగ కళాహృదయముగలవారిట్టి పారుష్యమును సహింపజాలరు. మనము వ్రాయు ప్రతి వాక్యమునందును, మనము చేయు ప్రతిపని యందును ద్వేషమునకు బదులు ప్రేమ ప్రకాశించు చుండవలెను. కాఠిన్యమునకు మారుగ కరుణ చిప్పిలు చుండవలెను. అసహనమునకు మారు ఔదార్యము పరిమళింపవలెను.

* * *

సాహిత్యరంగమునం దీవరకే పేరుప్రతిష్ఠల నార్జించినవారినే గాక, సాహిత్య సేవా తత్పరులైన నవయువకుల రచనలను ప్రోత్సహించుటకంటె భారతికి ప్రియతమ మైనది వేరొకటి లేదు. తక్కిన శాఖలందువలెనే మన వాఙ్మయ వీథులలోను భారతి జనించిన దాది విప్లవకరమైన మార్పు లనేకములు సంభవించినవి. ౧౯౧౪-౧౮ సం॥ పు ఐరోపాసంగ్రామమందు పాశ్చాత్య దేశముల యువకులు లక్షలకొలది తమ యసువులను ప్రజాస్వామ్య సిద్ధాంతసంరక్షణకై బలిదానము చేసిరి. కాని

యుద్ధానంతరము పరిస్థితు లేమియు చక్క
బడలేదు. నైరాశ్యము, అవిశ్వాసములు
యువజనమానసముల నలముకొనెను. యువ
జనులయందు కలిగిన తీవ్రజిజ్ఞాసాఫలితముగ
సాంఘిక పునర్నిర్మాణమునకు మరింత
దోహద మేర్పడినది. సాహిత్యక్షేత్రమందు
కూడ తీవ్రభావపరివర్తనము కలిగినది. భారత
దేశముతో బాటు,ఆంధ్ర దేశముకూడ ఈభావ
ప్రాబల్యమునకు లోనైనది. అధునికప్రయాణ
సౌకర్యములవల్లను, ఆర్థికకారణములవల్లను
ప్రపంచమునం దన్ని దేశములును ఒకదాని
కొకటి చేరువకువచ్చియున్నందున, విదేశము
లలో జనించిన ఈ నవ్యభావప్రభావము
ఆంధ్రసాహిత్యముపై ముద్రితము కాకపో
లేదు. పరులనుండి మనము గ్రహించదగి
నంతవరకు గ్రహించుట మేలే. కాని ఆంధ్ర
సాహిత్యపరులు కొందరు స్వతంత్రభావనా
శక్తి లోపించినవారై, అనుకరణాసక్తిని
మాత్రమే ప్రకటించుచుండుట విచార
హేతువు. ఈ వ్యామోహము నరికట్టవలసిన
యవసర మెంతేనికద్దు. పాశ్చాత్యుల తలకట్లను
మన మనుకరించినంత సులభముగ వారి
రచనల ననుకరింప చెల్లదు. మన పూర్వసం
ప్రదాయములను, స్వతస్సిద్ధములైన మనయల
వాట్లను వీడి కేవల పరావలంబనమే ఆధార
ముగ జేసికొంటిమేని, నేల విడిచి సాముచేసి
నట్లు కాకతప్పదు.

* * *

పైని పేర్కొనినట్లు ప్రపంచమంతటను
నిరాశ ప్రబలుచున్నది. పూర్వసంప్రదాయ
ములు,నియమములు ఉల్లంఘింపబడుచున్నవి.
నిరీశ్వరవాదమునకు బలము చేకూరినది.
మానవుని పాపము పండి, ప్రపంచమున ప్ర
ళయ మేర్పడుచున్నదని పెద్ద లనుచున్నారు.
ఈ ప్రయత్నమంతయు మానవుని జీవితమును
సుఖమయముగ జేయుటకే. ఈ జన్మములో
మానవుడు ఎన్ని బాధల ననుభవించిన,జన్మాం
తరమునం దన్ని సుఖములను బడయగలడను
భావము తొలగవలెను. తక్కిన జీవ
జంతువులతో బాటు మానవుడు జీవితము
గడపవలసినవాడే గాని, ప్రత్యేకకార్య
ములను నిర్దేశించి ఈశ్వరుడు మానవుని
సృజించి యుండలేదు. మనకంటికి కనిపించు
నట్టిదే ప్రపంచము. తక్కిన జీవరాశితో బా
టు మానవుడు కూడ ఈప్రపంచమున కష్ట
సుఖములను రెంటిని అనుభవించుచున్నాడు.
ఈ వివిధమతముల తత్త్వపరిశీలనకు గడంగుట
ఇపుడు మా యుద్దేశము కాదు. కాని, జన
సంఘమును సంస్కరించి, భావపరివర్తనను
తలపెట్టువా రెల్లరీ భిన్నభిన్నమతములను
గురించి తీవ్రముగ నాలోచింపవలెను. మా
నవుని ఉదాత్తునిగను, ఉదారచరితునిగను
చేయుటయే ఏ మతముయొక్కగాని, ఏ తత్త్వ
ముయొక్కగాని పరమోద్దేశము. భగవం
తునియందలి విశ్వాసము సైతము మాన
వుని శీలమును చక్కదిద్దునిమిత్తమే.

* * *

మానవుని దుశ్చారిత్రముచే గాని, భగ
వత్సంకల్పముచేగాని, ఎందుచేతనైననేమి
ప్రపంచమునందు కొంతభాగము సంగ్రామ
మున మునిగియున్నది. కిడచిన యుద్ధము
నందుకంటె, ఇప్పుడు జరుగుచున్న సంగ్రా
మమందు మానవక్షోభ మిక్కుటముగ
నుండకతప్పదు. దీనినుండి 'ప్రజాస్వామ్య'
మనెడి అమృతమే జనించునో, లేక వర్ణ
ల్పసంధివంటి హాలాహలమే బయలెడ

లునో ఇప్పుడు చెప్పలేము. కాలగర్భమున నేమి దాగియున్నదో ఎవ రెరుంగుదురు?

ఇంగ్లండుకు లోబడియున్న కారణమున ఇండియాకూడ ఈ యుద్ధమున చేరకతప్పినది కాదు. ఇంగ్లండు తన సంగ్రామోద్దేశములను విశదము చేయవలెను. ఇండియాపట్లకూడ వెంటనే వానిని వర్తింపచేయవలెను. సంగ్రామానంతరము ఇండియా స్వతంత్రదేశముగ ప్రకటింపవలెను. ఈ షరతులను నెరవేర్చిననే తప్ప యుద్ధమున సహకారము సలుపజాలమని కాంగ్రెసుమహాసభ ప్రకటించినది. కాని, బ్రిటిషుప్రభుత్వము ససేమిరా యనుచున్నది. కాంగ్రెసువారు ముందుగ అల్పసంఖ్యాకసంఘము లన్నింటితోను ఒడంబడిక కుదుర్చుకొనవలెననియు, అటుపిమ్మట ప్రజాప్రతినిధులతో తాము సంప్రదింతు మనియు, ప్రభుత్వమువా రనుచున్నారు. అనగా, వెనుకటి రౌండుటేబిలుసభానాటకమే తిరిగి ప్రదర్శింపబడును. రౌండుటేబిలు సభల ద్వారా పరిష్కారముచేయుపద్ధతి మనకు నూతనము కాదు. ఈ సభలవలన ఏకీభావ మేర్పడుటగాని, సమరసమగు పరిష్కారము కుదురుటగాని సంభవింపదని అనుభవమువల్ల మన మెరింగినవిషయమే. కాంగ్రెసీ యుద్ధమున తటస్థముగ నుండుటకు తీర్మానించినది. 'మీ నైతికసహాయ మేపాటి?' దని సర్. శామ్యుల్ హోరు కడు చులకనగ మాట్లాడినాడు. 'నైతికకారణములవల్లనే మే మీ యుద్ధమున ప్రవేశించితి' మని అహోరాత్రములు విధివిరామము లేక ప్రపంచమంతయు మారుమ్రోగునట్లు బ్రిటిషు రాజ్యాంగవేత్తలు చాటుచున్నప్పుడు సర్. శామ్యుల్ హోరుగారి ఈసడింపుమాటల కర్థ ముండునా? కాంగ్రెసు తాటస్థ్యము నెవ్వరును కాదనజాలరు. కాంగ్రెసునిర్ణయము పరిణతబుద్ధిని, సునిశితదూరదృష్టిని ప్రకటించుచున్నది. వైరివర్గము ఆపదయందు చిక్కియున్నప్పుడే కాంగ్రెసు సత్యాగ్రహాయుధమును ప్రయోగించి, శత్రువును నొక్కవలెనని వాదించువారును లేకపోలేదు. కాంగ్రెసుపై వీరు కారములు, మిరియములు నూరుచున్నారు. సామాన్యరాజకీయవాదుల కిది చక్కని యుపాయముగ తోపవచ్చును. కాని సత్యాగ్రహి ఎల్లప్పుడును తన స్వశక్తిపై, ఆత్మబలముపై నాధారపడునేగాని, ఎదుటివాని దౌర్బల్యము నవకాశముగ జేసికొని పోరు సలుపడు.

* * *

ఒకవేళ అట్టి పద్ధతులచేత పోరాటమును సాగింతు మనుకొన్నను దేశ మిప్పుడు సత్యాగ్రహోద్యమమునకు సంసిద్ధముగ నున్నదా? ఒకవైపున మహమ్మదీయులు కాంగ్రెసునాయకుల దూలనాడుచు, కాంగ్రెసు ప్రాబల్యము నణచివేయుటకై బ్రహ్మాండమును తలక్రిందు చేయుచున్నారు. ఇటు దక్షిణదేశమునకూడ కాంగ్రెసు విరోధు లీ పాటకు పల్లవి పాడుచున్నారు. ఇట్టిస్థితిలో సత్యాగ్రహమును ప్రారంభించిన ఎట్టి విపరీత ఫలితము లేర్పడునో చెప్పజాలము. ఇదివరలో సత్యాగ్రహ, శాసనోల్లంఘనములు కొనసాగింపబడినపుడు కాంగ్రెసేతరులు తటస్థముగ నుండినహేతువుచే కొంతవరకైన ఆయుద్యమములు విజయమును బడసెను. పూర్వముకంటె కూడ కాంగ్రెసు ఈమా రనేక ప్రతికూలశక్తుల నెదుర్కొనవలసియున్నది. కాంగ్రెసేతరులు, ముఖ్యముగ మహమ్మదీయులు, తటస్థ

ముగనైన నుందురను అభయ మేర్పడువరకు సత్యాగ్రహమును పునరుద్ధరించుటకు సాధ్యముకాదు. సుభాష్ చంద్రబోసుగాని, యమ్. యన్. రాయిగారుగాని గాంధిగారి పద్ధతుల నుపేక్షన చేయుట సులభమే. గాంధిజీ స్వాతంత్ర్యోద్యమమునకు నాయకత్వమును వహించి, నిర్వహించినచో తమ ఫార్వర్డు బ్లాకును విరమింతుమని సుభాష్ బాబు ఆడిన మాటల కేరికేని నవ్వు రాకమానదు. ఫార్వర్డుబ్లాకునకు దేశమం దిపుడున్న పేరు ప్రతిష్ఠ లేమి? నామమాత్రావశిష్టమైన ఈ పక్ష ముండిన నెంత, పూడిన నెంత ? అహింసాత్మక సత్యాగ్రహోద్యమ జనకుడగు గాంధి మహాత్ముని అధ్వర్యముననే ఈ యుద్యమము మరల నిర్వహింపబడవలె నని దేశ మపేక్షించినచో గాంధిగారి యభీష్టాను సారము ప్రజలు నడుచుకొనవలెను. కాంగ్రెసుమంత్రివర్గములు రాజీనామా లిచ్చి రెండునెలలే యైనది. ఈలోపుననే సత్యాగ్రహము ప్రారంభింపవలె ననుట దూరదృష్టికి లక్షణము కాదు. సత్యాగ్రహమునకు దేశ మాయత్తము కావలె నని గాంధిజీ కోరుచున్నాడు. నాయకున కామాత్రము స్వాతంత్ర్యము ఉండనక్కర లేదా?

* * *

స్వరాజ్య పోరాటమునకు రూపకల్పన చేసి, దానిని అనుష్ఠాన యోగ్యముగ చేయ గలవాడు దేశమున గాంధిమహాత్ముడొక్క రుడేయను విషయము నిర్వివాదమైనప్పటికిని, గాంధితత్త్వముకూడ సంపూర్ణమును, సర్వ సమగ్రము నని చెప్ప వీలు లేదు. గాంధిమతము (Gandhism) హేతువాదమున కెడమీయదు. గాంధిగారు శేకార్యమునైనను ఏదియో అశరీరవాణియొక్క ప్రబోధముననగాని తల పెట్టరు. త్రికరణముల మానవు డహింసా బద్ధుడై యుండవలెనని గాంధిగారు చూపెడి పట్టుదలకును, సాధారణ మానవుని జీవిత ధోరణికిని—ముఖ్యముగ రాజకీయోద్యమములందు — సామరస్య మెంతమాత్రమును కుదురజాలదు. ఉహింసాసిద్ధాంతము నొక వ్రతముగను, జీవితపరమార్థముగను, అనుల్లంఘనీయమైన నిత్యసత్యముగను పరిగణింపవలె ననుట హేతువాదబుద్ధి గలవారికి దుర్గ్రాహ్యముగ నుండగలదు. భారతదేశమున నివసించు ప్రతివ్యక్తియున్న గాంధి మహాత్ము డాశించునట్టి అహింసాపరాయణుడైననో నిక వేరే స్వరాజ్య మెందులకు? శిక్షణ, కట్టుబాటుల లవడుటకుగాను అహింసాసిద్ధాంతమున కింతటి ప్రాముఖ్యమొసంగబడెనన్నచో వివాద మక్కరయే లేదు. అంతకు మించి, కఠోరమైన ఈ అహింసా వ్రతానుష్ఠానమున కర్థము లేదు. కావున, గాంధిగారు తమ అహింసా సిద్ధాంతమును, సామాన్యమానవుడు తన దైనందినజీవితమునం దనుష్ఠించుటకు సాధ్య మగునట్లు చేయవలెను.

మహాత్ము డాదేశించెడి అహింసావలంబనము సంపూర్ణ జితేంద్రియత్వము లేక నిరోత్మహాత్వముతో తప్ప సాధ్యముగాదు. ఈ నిరోత్మహాత్వ మెట్టిది? జిజ్ఞాసువులందగ్రగణ్యులలో నొకరైన హాగ్స్లీగా రిట్లు చెప్పియున్నారు:—

"ప్రపంచమునందు సర్వస్వాతంత్ర్య మనుభవించుచున్న ప్రజలందరును, ఆదర్శప్రాయుడగువ్యక్తి విషయమై, గత కాలము లేక ఈకాల పురుషాంతరముల నుండియు, తమారమి ఒకేవిధమగు అభిప్రాయ

ము కలిగియున్నారు. పరాధీనప్రజ లోకనాశకవ్యక్తిని, పరలోకవాదు పరలోకవ్యక్తిని ప్రమాణ పురుషునిగ నెగడిరి; కాని సర్వకాలములందును సమస్త ప్రపంచమునందును స్వతంత్ర మానవు లెల్లరు నేకకంఠముతో ఆదర్శవ్యక్తిని నిర్వచించి యుండిరి. స్వతంత్రులగు తత్త్వశాస్త్రజ్ఞులచే నిర్వచింపబడిన ఆదర్శవ్యక్తిని ఒక్కమాటలో వర్ణించుట సుకరము కాదు. ఆదర్శవ్యక్తి — పురుషోత్తముడు – నిస్సంగుడైనవాడు. బాహ్యేంద్రియములకు, అంతరింద్రియములకు లొంగనివాడు; ఇంద్రియ చాపల్యమును జయించినవాడు; అరిషడ్వర్గము నణచినవాడు; కీర్తి, సంపద, పేరు ప్రతిష్ఠలనుసైత మాశింపనివాడు; అహంభావము లేనివాడు. ఐహికవిషయముల కంటె నుండెడిస్థితిని సత్యము, అనంతము నైన బ్రహ్మను సంధానముగ నిఖిలవేదాంతులును, మతసంస్థాపకు లందరును నిర్వచనము చేసియున్నారు. ఈ జితేంద్రియత్వము లేక నిస్సంగత్వము ఐహికాతీతమైన ఆధ్యాత్మిక సిద్ధాంతములతో సమన్వయింపబడియున్నది."

* * *

అహింసయందు స్వతస్సిద్ధమగు మరొక లోటున్నది. ఏమాత్రము విజయము ప్రాప్తించినను అహింసాపరుడు దానితో తృప్తిచెందును. మన యనుభవమునందే ఈ విషయ మనేకమారులు రుజువైనది. ప్రత్యర్థియొక్క హృదయ పరివర్తనముపై అహింసానుష్ఠానపరుడాధారపడును. మరియు, సామాన్యబుద్ధికి అతీతమైన ఆధ్యాత్మిక కారణముల నాతడు నిమిత్తములుగ స్వీకరించును. కావున అహింసా కార్యక్రమమును అధిభౌతిక సమస్యలతో ముడిపెట్టరాదు. అందలి కార్యకారణము లన్నియు సామాన్య మానవబుద్ధికి బోధపడవలెను.

రాజకీయ క్షేత్రమున హింసాహింసలయొక్క ప్రయోజనము తుల్యమే. హింసామార్గముకంటెను అహింసావలంబనమువలన మానవుని బాధానుభవము తక్కువయగు ననెడి విశ్వాసము చొప్పున మన మహింసవైపు మొగ్గుచున్నాము. అహింస మానవశీలమును సంస్కరించునని కొందరకు విశ్వాసముండుట సహజమే. ఐనను, అహింసానుష్ఠానమునకు ఈశ్వరునియందు భక్తి, విశ్వాసము లుండ బనియేమి? అహింసయందీ నమ్మకము ఒక విధమైన జీవిత దృక్పథము మన జెల్లును: అంతమాత్రమే. అహింసవలన మానవశీలమును సంస్కరింప జూచినచో మానవభాషలో మాటాడవలెనేగాని, దేవభాషలో సిద్ధాంతములు చేసి ప్రయోజనము లేదు. ఇహలోక విషయములను పారలౌకిక విషయములతో ముడిపెట్టక మానవులు స్వశక్తితో నెటుల జీవించగలరో నాయకులు బోధించుట భావ్యము.

* * *

మా వ్యాసకర్తలకును, మా పాఠక మహాశయులకును, మా హితచింతకు లందరకును మా యెడల కనబరచుచున్న ఆదరణ కెంతయు కృతజ్ఞతాపూర్వకమైన వందనము లర్పించుచు, ఇటువలెనే చిరకాలము మా యెడ సహానుభూతిని చూపుదురుగాక యని కోరుచున్నాము. ఈ నూతన సంవత్సర మెల్లరకును సకలైశ్వర్యములను, శాంతి, సౌఖ్యములను చేకూర్చుగాక యని ఆశించుచున్నాము.

దీవెనలు

శ్రీ గుఱ్ఱప్పడియ ఆంజనేయులు

౧

ప్రౌఢలగు పండితుల పాణిపుటములందు
మెల్లమెల్లఁగ శైశవ మెల్ల జారి
నాటుకొన్నది క్రొంజవ్వనంపుసొబగు
రసికమోహిని యైన భారతికి నేఁడు.

౨

మోడై పోయినకైత రాగిలఁగ నే మూర్తంబున న్నిన్నుఁ గ
న్నాఁడో! చల్లనితండ్రి, విశ్వదుఁడు ; నీ నాడెంపువాల్చూపులన్
గూడంబెట్టిన పూవుదేనియల మిన్కుల్ చిన్కులై వ్రాలి, తో
డ్తోడం బోసె, నవీన జీవనపుఁ గాంతుల్ సాహితీవల్లికిన్.

౩

కదల న్నేర్చిననాఁడె మేల్విదుషివౌ కల్యాణి నీ నాటికిన్
బదియాఱేడుల జాణవైతి ; వికపై భాషాప్రపంచమ్మునన్
బదియార్వన్నియపైడిలీల, విలసత్పర్వేందుబింబద్యుతిన్
గొద లేకుండఁ జరించి, సన్నుతులఁ గైకొ మ్మింపుగాన్ భారతీ!

౪

మృదుసౌరభము పొంగి పొదలుతీయని పద్యనవలతాంతముల వేనలిని దురిమి,
లేతనవ్వులఁ జిత్రలేఖనీశర్వాణి చిదిమిపెట్టిన బొట్టు నుదుట దిద్ది,
ప్రాచీనశాసన ఫలక సంపదలైన యాణిముత్తెపుఁగోవ లఱుతఁ బూని,
వివిధసాహిత్యకోవిదు లొసంగు సువర్ణ లలితకౌశేయచేలములఁ దాల్చి,

తెలుఁగువెలుఁగుల విన్నాణ మొలుకు సొగసు
కరిగిపోసిన నెమ్మేని మురుపు సూపి,
రాజవిబుధుల, సుకవిసీరేజభవుల,
వలచి వలపించుకొనవమ్మ! వలసినట్లు.

౫

ముప్పొద్దులను గేలు మొగిచి లక్ష్మీపుత్రు లర్పించుకానుక లందుకొనుచు,
రమణీయకావ్యమర్మము లుగ్గడించు పండితకోటితో ముచ్చటించుకొనుచు,
ఘనులు పూనిన విశ్వకల్యాణకరణ సంభారంబులోఁ బాలు పంచుకొనుచు,
జనకునికీర్తిరాజ్యపు ధనాగారంబు సంచితప్రౌఢి రక్షించుకొనుచు,
అమృతరసమగ్న జగము జోహారు లిడగ
మేటిసింగారమున వీణె మీటుకొనుచు,
దినదినాభ్యుదయమ్ముఁ జేకొనఁగదమ్మ!
తల్లి! భారతి! ఆచంద్రతారకముగ.

౬

విమల కర్పూర నీరాజనమును దివిచి
గాన మొనరింపవలయు మాంగళ్యగీతి;
వత్సరం బిది ముగియులోపల బిరాన
ఆంధ్రరాష్ట్రేందిరా వివాహమున నీవు!

పుస్తకం*

శ్రీ వేలూరి శివరామశాస్త్రి

పుస్తకం గురువునూ, స్నేహితుడునూ, ప్రియురాలున్నూ. ఒక శాస్త్రగ్రంథం తీసుకోండి, అది చేతిలో ఉన్నంతసేపూ గురువు మన యెదుట ఉన్నట్టే ఉంటుంది. ఏదో కావ్యమూ, నాటకమూ తీసుకోండి; స్నేహితుడిలాగానూ, ప్రియురాలిలాగానూ, లేక ఇంకో ఆత్మలాగానూ, ఛాయలాగానూ కూడా కూడా వస్తూంటుంది.

పూర్వకాలంలో తాటాకులమీదా భూర్జపత్రాలమీదా గంటాలతో వ్రాసేవారు. ఆ తాటాకులు తేలివి కాకుండాను చాలకాలం మనేవిగానూ ఉండేట్లు కొలతలు పట్టి కోసి బహు ఓర్పుతో ముత్యాలు వాట్లమీద ఒలకపోసి, పుస్తకానికి రెండు పక్కలా అట్టలకింద బల్లలు కట్టి ఆకాశవిధి చేసేవారు. పిల్లవానిమీదకంటె ఎక్కువ వాత్సల్యంతో దింపి చదువుకొని శత్రువును కట్టినట్టు కట్టిపెట్టి మళ్లా డోలోత్సవం చేస్తూండేవారు. ఈలా ఒక్కొక్క గ్రంథం వ్రాయడానికి కొన్ని యేండ్లు పట్టేది.

భారతం వ్యాసుడు చెప్పాడు, గణపతి వ్రాశాడు. "ఏమి చెప్పెదుం గురునాథా!" అనే ఇతిహాసంవల్ల తిక్కన్న చెప్పాడు, కుమ్మర గురునాథుడు వ్రాశాడు అనిన్నీ వింటాం. గంటంతో వ్రాసేవానికి చురుకైనకపి అక్షరాలందించడం మనుష్య ప్రజ్ఞ కతీతమో కాదో తెలుసుకోవడాని కవకాశం లేకుండాపోయింది ఈలా వ్రాయబడే యీ గ్రంథాలు కొన్ని శరీరాల్లో అతికాయులను మహాకాయులను దాటిపోయేవి.

మన దేశంలో త్రికాలజ్ఞులు, మయబ్రహ్మలూ ఎంతమంది వున్నా అచ్చు కని పెట్టాగు కారు. తెలిసే కనిపెట్టలేదని దేశభక్తులూ వైరభక్తులూ కొందరు చెపుతూంటారు. ఎంచేతనంటే, అన లిన్ని పుస్తకాలూ, ఈపుస్తకాల కింత ప్రచారమూ అక్కర లేదు. కాబట్టి అచ్చుమరలతో ఏమి ప్రయోజనం? ఇంతేకాక పుస్తకం ఎవడుపడితే వాడు చదువగూడదు.

ఈ కలికాలంలో పుస్తకాలు ముందు అంగుష్ఠమాత్ర ప్రమాణంలోకి దిగేయి. ఇవి చాలా చాలా సుకుమారాలూ సుందరాలూ. "పుస్తకం హస్తభూషణం" అనే మాట వాచ్యంగా వీటికి చెలామణీ అవుతుంది. కాని వీట్ల ఆయుర్దాయం దరిహామీద చాలా తక్కువ. ప్రాచీనకాలంలో ఇంత కష్టపడి వ్రాసుకున్న గ్రంథాలను కూడా దుర్వినియోగం చేసేవారున్నారనేందుకు ఈ కిందకథ ఒక మంచి ఉదాహరణం:— వ్యాకరణశాస్త్రం ఆరంభించిన

* ఆల్ ఇండియా రేడియో ఉపన్యాసము. వారి అనుమతితో.

కుర్రవాడొకడు "నాన్నా! నాన్నా! కయ్యటం వ్రాయించిపెట్టు" అని తండ్రిని వేడించటం మొదలుపెట్టాట్ట. "అఇఉణ్" మొదలుపెట్టావో లేవో అప్పుడే నీకు కయ్యటం ఎందుకురా? అని తండ్రి గద మాయించాడు. అంతటితో కొడుకు సత్యాగ్రహంలో ప్రధానభాగమయిన నిరశనవ్రతమే కాకుండా నిర్నిద్రవ్రతమూ, అహింసాపూర్ణంగా ఆత్మోపాలంభనమూ, సర్వాంగీణంగా రోదనమూ అవలంబించుకూర్చున్నాడు.

ఏ జేమో చదివేట్టున్నాడనుకొని తండ్రి చాలాధనం వ్యయపరచి కయ్యటం వ్రాయించి కొడుక్కిచ్చాడు.

కయ్యటం అనేది ఒక వ్యాకరణగ్రంథం. అది ఒక మనిషిమోతకు కొంచెం ఎక్కువ. కొడుకు ఆగ్రంథం ఎగాదిగా చూచి చాలా సంతోషించి "నాన్నా, నాన్నా! నాకో గది కావాలి" అని అన్నాడు. కొడుకు నిర్విఘ్నంగా చదువుకుంటాడని తండ్రి ఒక గది ఖాళీ చేసి యిచ్చాడు. ఆ కుర్రవాడు ఆ కయ్యటంతో ఆ చదువులగదిలో ప్రవేశించి తలుపులు మూసుకున్నాడు. వాడు తెగ చదువుతున్నాడని ఇంటిల్లిపాదీ అనుకుంటున్నారు. ఇల్లా చాలాకాలం గడిచిపోయింది.

కుర్రాడిల్లా తెగచదివితే పిచ్చెక్కిపోతుందని తండ్రి తలుపు తియ్యమని నడుమనడుమ పిలుస్తూండేవాడు. కాని కుర్రాడు ఏకటాకీమీద వుండి సమాధానం ఇచ్చేవాడు కాడు. తండ్రి ఒకనాడు పిలిచి పిలిచి విసుకెత్తి ఏమిటో ఈ వ్యవహారం చూదామని ఉరకెత్తాడు. శేషశాయిలా వుంది కొడుకు వ్యవహారం! కయ్యటం కొంత కాళ్లకిందా కొంత తలకిందా వేసుకొని కొడుకు సుఖనిద్రలో ఉన్నాడు. 'కయ్యటం మొదలెయ్యగానే కంటినిండా నిద్ర' అనే సామెత ఆనాటినుంచి వ్యవహారంలోకి వచ్చింది. సకల గ్రంథాలనుకూడా ఈలా దుర్వ్యవహారం చేసేవారుండేవారు.

"పుస్తకం వనితా విత్తం పరహస్తగతం గతం,
అథవా పునరాయాతి జీర్ణం భ్రష్టాచ ఖండశః"

అనే సూక్తి పుట్టింది. పుస్తకమూ ఆడదీ డబ్బూ ఈ మూడూ పరుల చేతులలోకి పోతే ఇహ పోయినట్టేనట! ఒకవేళ వస్తేగిస్తే పుస్తకం తుక్కుతుక్కై వస్తుందట. ఆడది వస్తే భ్రష్టురాలై వస్తుందట. డబ్బు వస్తే అప్పుడో కాస్తా, అప్పుడో కాస్తాగా వస్తుందట. ఈ శ్లోకంలో ఉదాహరింపబడ్డ పుస్తకం అచ్చుపుస్తకం గాదు; తాటాకుల పుస్తకం. దాన్నే తుక్కుతుక్కుగా చేయగల మహాత్ములా కాలంలో ఉండేవారన్నమాట.

ఆడంగులు కొందరు ఈ కాలంలోని పుస్తకాల కాకితాలు కొన్ని చింపి పొయ్యిలో పెట్టుకుంటూంటే మగవాళ్లు కొన్ని కాగితాలు చింపి మంచి పొట్లాలు వగైరాకు ఉపయోగిస్తున్నారు. కొందరు మగవాళ్లు కొన్ని పొడుగుపాటి పుస్తకాలను బంతులు కొట్టడానికి bat లుగా ఉపయోగిస్తారు. కొందరాడవాళ్లు పుస్తకాలలోనే గనక బొమ్మలుంటే వాట్లను విరిచి వాళ్ల పిల్లల యేడ్పు పోగొడ్తారు. కొందరు ఇంకోళ్ల పుస్తకాలలోని బొమ్మలు చింపి దాచుకొని ఏ తొందరలోనో వాపస్ చేస్తే

దాటుకుపోతారు. కొంద రీ పుస్తకాలను తలదిండ్లుగాను కుర్చీలలో మెత్తగానూ వాడుకుంటారు. పూర్వకాలంలో ఆడవాళ్లు వాకిట ఉన్నప్పుడు మోచెయ్యో లేక గడ్డి దిండో తలకింద పెట్టుకునేవారు. నేటి పూర్వాచారంవారు పేపర్లు కొన్ని కట్టకట్టి దిండుగా వాడి పేడనీళ్లు చల్లి వాటిని కలుపుకుంటున్నారు. నవీనాచారంవారు పుస్తకాలను నిరాఘాటంగా దిండ్లు చేసేసుకుంటున్నారు.

పూర్వకాలంలోకూడా తాటాకు పుస్తకాలు మడే! ఈకాలపు పుస్తకాలు మరలలో మెదగడంవల్లా అడ్డమైనవాళ్లూ దారాలతో కుట్టడంవల్లా మడికావు. అందుకని కొందరు తాటాకుల పుస్తకం మాత్రమే పెట్టి సరస్వతి పూజ చేసుకుంటారు. కోర్టులు పుస్తకాన్ని ప్రమాణానికింద ఉపయోగించి సర్వకాల సర్వావస్థలలోనూ అచ్చుపుస్తకం మడి అని 'లా' చేసేసినయి. అది నెత్తిమీద పెట్టుకునే సరికే అసత్యాలన్నీ సత్యాలకింద మారిపోతయి.

ఇప్పుడు మగవాళ్లకంటె ఆడవాళ్లకే పుస్తకాలెక్కువ ఉపయోగిస్తున్నట్టు చూస్తాం. హస్తభూషణమైన పుస్తకం ఈకాలంలో ఆడవాళ్లకు "పాకశాసనం."

ఆడవాళ్లకు మగవాళ్ల దయవల్ల చదువుకని వేరే తీరిక ఉండదు. వాళ్లు మడికట్టుకొని గిన్నె పొయిమీద పడేసి ఏకుర్రాడి చేతో పుస్తకం చేతుల్లో పడేయించుకుంటారు. వాళ్ల చేతులు పదును పదును నిప్పూనీరూ మొదలయిన భూతాలతోటీ నేయినూనె మొదలయిన స్నేహద్రవ్యాలతోటీ ఉప్పూకారం మొదలయిన పదార్థాలతోటీ మెదుగుతూ ఉండవలసినందువల్ల వాట్ల గుణాగుణాలన్నీ ఎప్పటికప్పుడు పుస్తకాలకూడా సంక్రమిస్తయి. పొయ్యి ఊదవలిసి వస్తే విసినికర్రై రెక్కలు తెరుచుకుంటుంది. పిల్లలేడిస్తే బెత్తంగా మారుతుంది. మళ్లా ఆ పిల్లాళ్ల కన్నీళ్లు తుడవడానికి చేరుమాలవుతుంది. ఇంతలో మగడు వచ్చి "ఈ పాడు చదువులతోటి వంటంతా మంటవుతుంది" అని ఉరిమితే పాపం అలుగ్గుడ్డైపోతుంది.

కొందరాడవాళ్లీ మగవాళ్ల అధికారానికి జంకి పడుకునేటప్పుడుమాత్రం పుస్తకాలు విప్పుతారు. కొంచెం సేపట్లోనే నిద్రాదేవి వచ్చి యీ సరస్వతీదేవిని ఓడించేస్తుంది. ఆఖరుగా పుస్తకమూ తెరుచుకున్నపాళంగా అప్పచ్చి అయిపోతుంది. కాని కొందరు జాగ్రత్తగా తలకిందకి తోసేసుకుంటారు. పుస్తకాలలో చదువు వారి తలలోకి ఎక్కదు కాని వారి తల్లోని వారి పరిమళనూనో కొబ్బరినూనో సరస్వతి కూడా రాసుకుంటుంది.

కొందరు చదువుకున్నంతసేపూ చదువుకొని పుస్తకాలను నీటిబిందె మీద మూతలుగా ఉపయోగం చేస్తారు. ఒకానొకప్పుడు ఈ సరస్వతి నీళ్లు తాగి ఉక్కిరిబిక్కిరై మూల్గుతుంది. ఒకానొకప్పుడు బిందెలో జలక్రీడ చేయటంకూడా కద్దు. అనుకోని పెద్దమనుష్యులెవళ్లో హఠాత్తుగా రావడంవల్ల పుస్తకాలు ఆకాశయానం చేసి ఏ మారుమూలలో చుక్క తెగిపడ్డట్టు పడి విమానమంత చప్పుడుతో అట్టలు పగిలి, కోణాలు విరిగి. [illegible]

మట్టిముద్ద అయిపోతాయి. ప్రాచీనాచార పరాయణులకు గ్రంథాలమీద భక్తి ఎక్కువ. వాళ్లేదైనా అపూర్వమైన గ్రంథం తీసుకుంటే వాళ్లి దగ్గిరనుంచి మరి రాదు. వాటికి గ్రంథ కర్తా గ్రంథమూ ఒక్కటే. మాతో మహాభాష్యం చదవేవా రొగ రుండేవారు. నడక ప్రయాణం చేస్తూవున్నప్పుడు ఆయన మహాభాష్యాన్ని నెత్తిమీదనుంచి దింపేవారు కారు. ఆయ నేదైనా చిన్న పని చేయవలసి వస్తే దాన్ని నేలమీద పెట్టక ఇంకోరి నెత్తిమీద పెట్టేవారు. పతంజలి తరువాత పతంజలిఅంతవాడు నాగేశభట్టు 'శబ్దేందుశేఖరః పుత్రో మంజూషా మమ పుత్రికా' అన్నాడు. పుస్తకాలు ఈలాటి పూజాపురస్కారాలూ, అత్యాచారాలూ ఎన్నో అనుభవిస్తున్నాయి. లోకులు కొన్ని కొన్ని వస్తువులు పుచ్చుకోవడమూ, తిరిగీ ఇచ్చివేయడమూ మామూలు. పారలూ, గునపాలూ మొదలయిన వ్యవసాయపు పనిముట్లూ చేటలూ, జల్లెడలూ మొదలైన గృహవస్తువులూ అందరూ తెచ్చుకోవడమూ, మళ్లా యిచ్చివేయడమూ కద్దు. ఈ యిచ్చిపుచ్చుకోవడాలు. లేకపోతే లోకవ్యవహారం స్తంభించిపోతుంది.

ధనధాన్యాలు కాలం జరిగినకొద్దీ వడ్డీలచేతా, నాములచేతా పెరిగి పెరిగి తిరిగీ యివ్వబోయే సరికి ఇబ్బడీ ముబ్బడీ అయిపోతయ్. పుస్తకంమాత్రం ఆసామీ చేతుల్లోకి వెళ్లే యోగం ఉంటే చిక్కి సగమై మాసి నుసి పోతూంది.

తీసుకున్న వస్తువును ఇద్దామని లోలోపల అనుకున్నా ఇవ్వకుండా మరిచిపోయే వాళ్లు పూర్వజన్మలో గాని, యీ జన్మలో గాని దొంగతనానికి అలవాటుపడ్డవాళ్లని సైకో ఎనలిస్టులు చెబుతారు. ఇది పుస్తకాలతో మనకున్న బహ్యపరిచయం!



ఓ ప్రభూ!

శ్రీ జంధ్యాల పాపయ్యశాస్త్రి

౧

ఉదయాద్రి కొలువున
కొదమభానుని జూచి —
చరమాద్రి కాల్జారు
చందమామను జూచి —
ఉప్పొంగి బిట్టార్తువా?
ఓ ప్రభూ!
ఉస్సు రని నిట్టూర్తువా?

౨

పసమించు పురిటింటి
పసిపాప దెస గాంచి —
పసిచెడ్డ పెటింటి
ముసలాపెదశ గాంచి —
పొంగిపోవుచు నుందువా?
ఓ ప్రభూ!
క్రుంగిపోవుచు నుందువా?

౩

సూటుబూటులతోటి
సీటుగాళ్లను జూచి —
పాంపూసల గోచి
పాతరాయల జూచి —
కౌతుకము రెట్టింతువా?
ఓ ప్రభూ!
కరిగి నీరై పోదువా?

౪

చిన్నారి పొన్నారి
చిగురుటాకుల కేళి —
పండి రాలుచు నున్న
పండుటాకుల కేళి —
సంతోషముగ జూతువా?
ఓ ప్రభూ!
సంతాప మొనగబోతువా?

౫

పట్ట మేలే తేని
పసిడి పళ్లెములోన —
కట్టె లమ్మెవాని
మట్టికంచములోన —
పన్నీరు చిలికింతువా?
ఓ ప్రభూ!
కన్నీరు నొలికింతువా?

౬

పార్కులో విహరించు
బాబుగారిని గాంచి —
జైలులో కృశియించు
చిన్ని బిడ్డను గాంచి —
కులికిపోవుచు నుందువా?
ఓ ప్రభూ!
కుమిలిపోవుచు నుందువా!

౭

'ఫెళ ఫెళా' మ్రోగేటి
పెండ్లి బాజాలలో —
'చేవుతో' యని యేడ్చు
చావుకంఠాలలో —
తెల్లబోలు పోయింతువా?
ఓ ప్రభూ!
తలకొరివి పెట్టింతువా?

౮

పరుల స్వేచ్ఛల నడ్డి
పాలించు భూభుజుల —
పరతంత్రులై భంగ
పడియున్న భూప్రజల —
అందలము లెక్కింతువా?
ఓ ప్రభూ!
క్రింద పడ ద్రొక్కింతువా?

తిక్కన - సుదేష్ణ

శ్రీ వెంపటి శ్రీనివాసమూర్తి

కావ్యములో ప్రధానపాత్రలను సృష్టించుట యందు కవు లందరును తమ నేర్పును ప్రకటింతురు. కాని కథానుసరణియందు తా ముపయోగించు సామాన్య పాత్రలనుగూడ నిర్దుష్టముగా ప్రదర్శించుటయందే కవుల మహత్వము మనకు గోచరించును. ఎందరో కవులు నాయికానాయకులనుమాత్రము అతిశ్రద్ధతో చిత్రించి అల్పపాత్రలను సృష్టించుటలో వెనుకబడి కావ్యము నతుకులబొంత కావించియున్నారు. అల్పప్రాముఖ్యము గలిగి ఒకటి రెండు పర్యాయములుమాత్రమే మన కగపడు పాత్రలనుగూడ అనల్పసామర్థ్యముతో ఉన్నత స్థాయిలో ప్రదర్శించినప్పుడే అఖండ రసపుష్టిని జెంది కావ్యము సర్వాంగసుందరముగా నుండగలదు. ఈ విశేషమును గుర్తించిన మహాకవులలో తిక్కన సోమయాజి అగ్రగణ్యుడు.

'నానారసాభ్యుదయోల్లాసి' యైన విరాట పర్వమునందు కీచకవధ యొక రసవంతమైన ఘట్టము. ఈ ఘట్టమునం దొకించుక ప్రాముఖ్యము గలిగిన వ్యక్తి సుదేష్ణ. ఇచ్చటగాక మరల ఉత్తరా వివాహసందర్భమున నామమాత్రముగా సుదేష్ణ కనబడుచున్నది. ఈ రెండుచోట్ల దప్ప భారతములో నింకెక్కడను సుదేష్ణ మన కగపడదు. భారతములో నింత స్వల్ప ప్రాముఖ్యము గల పాత్రకు తిక్కన ఎట్లు మెరుగులు పెట్టినాడో పరిశీలింతము.

వ్యవహారమునందు విరాటరాజు భార్య 'సుధేష్ణ' యని పిలువబడుచున్నది. కాని భారతమునం దీమె పేరు 'సుదేష్ణ' యని యున్నది. కాకునూరి అప్పకవి గూడ వర్గాక్షరములలో నొకదాని కొకటి ప్రాసచెల్లు నని లక్షణము వ్రాయుచు నీ క్రింది పద్యములో 'ద' కును 'ధ' కును ప్రాస జూపించినాడు.

క. ముద మొదవ రమ్య హర్మ్యము
గదిసి నిలువునఁ బ్రణయ సఖులతోడ విహారా
స్పదమగు వెలవున మెలగెడు
సుధేష్ణ తజ్జాలకముల జూచెం బ్రీతిన్.

—విరాట, ౧ ఆ. ౩౦౧ ప.

కావున అప్పకవిమతానుసారమున 'సుధేష్ణ' యని తెలియుచున్నది. కాని ఇది పొరబాటు. ఒక వేళ అప్పకవివద్దనున్న భారతప్రతిలో వ్యవహారాను సారము లేఖక ప్రమాదము జరిగియుండవచ్చును. ఆంధ్ర భారతమునకు మూలమైన సంస్కృతభారతమును జూచియుండినయెడల నీ ప్రమాదము సంభవించెడిది కాదు. తెలుగులిపిలో 'ద' 'ధ' ల కెక్కువ భేదములేదు గాని సంస్కృతమున రెండింటిని స్పష్టముగా గుర్తింప వచ్చును. ప్రస్తుతము ముద్రింపబడిన కలకత్తా, బొంబాయి సంస్కృత భారతప్రతులలోగాని, దక్షిణ దేశపు ప్రతులలోగాని 'సుదేష్ణ' అనియే యున్నది. సర్ మానియర్ విలియమ్స్ ప్రకటించిన సంస్కృతాంగ్లకోశమునందుగూడ సుదేష్ణ యనియే యున్నది. అంతేగాక సుదేలాదేశమునకు జెందినవారికి 'సుదేష్ణా' అని పేరున్నది. కాబట్టి 'సుదేలా' శబ్దమునుండియుద్భవించిన దగుటచే 'సుదేష్ణ' యగును కాని, వ్యవహారము నందున్నట్లు 'సుధేష్ణ' కాదు.*

భారతరంగమున సుదేష్ణ ప్రథమపర్యాయము విరాటపర్వ ప్రథమాశ్వాసమున ప్రవేశించినది. అజ్ఞాత

* పైపద్యములో గాక అప్పకవి యుదాహరించిన తిక్కన పద్యములలోగూడ ప్రాసస్థానమున పాఠాంతరము లున్న వనియు, వర్గప్రాస పూర్వకవి సమ్మతము గాదనియు శ్రీ పాద లక్ష్మీపతిశాస్త్రి గారు తెలుపుచున్నారు.

వాస సంవత్సరము గడుపుటకు ద్రౌపది సైరంధ్రివేష మున విరాటపురమున గాలిడినది. వేషము వేరైన దాని కడని రూపమును చూచి పురజనులు నుసురుకొను చున్నారు. ప్రణయసఖులతో సౌధాగ్రమున విహ రించు మత్స్యరాజమహిషి ఈ వింతను జూచి సైరం ధ్రిని పిలుకబంపినది. రూపాభిమానవతియైన సుదేష్ణ కుతూ హలముతో ద్రౌపది పాదాదిమస్తకము పరీక్షించి తరు వాత కుశలప్రశ్నాదిక మొనర్చినది. అజ్ఞాతవాస నియ మానుసారము ద్రౌపది ప్రత్యుత్తర మిచ్చినను సుదేష్ణ నమ్మలేదు. ఇప్పటికప్పుడే తన శాస్త్రము వెల్లడింప మొదలిడినది. ఒక్కమాటలో తనలోనున్న ఈర్ష్యా మంతయు బయల్పరచినది.

క. సురగరుడ ఖచర విద్యా
ధర కిన్నర యక్ష సిద్ధ తరుణులలో నీ
సరియగు సౌకుమార్యము కను ది
వ్యాకృతిం జనుదేరఁ గనము బొంకక చెపుమా.

—౧ ఆ. ౩౧౮ ప.

'బొంకక చెపుమా' అని లోగుట్టును వెలిచేయు టకు ప్రయత్నించినది. సైరంధ్రి బొంకిన దనుకొను టకు కారణ మేమున్నది? పాంచాలి సౌందర్యమునే వమే సుదేష్ణ నిర్ణయించినది. కాని సుదేష్ణ ప్రయ త్నము సఫలము కాలేదు. మొదట సత్యభామకడను, పిదప పాంచాలికడను పని చేయుచుంటినని దాన నని తెలిసి బొంకు బొంకి ప్రశ్నకు సమాధాన మీయకుండ సైరంధ్రి తప్పించుకొన్నది. అంతటితో సంభాషణ మార్చి సుదేష్ణయొక్క సందిగ్ధ హృదయమును అన్య విషయాక్రాంత మొనర్చినది. కాని సుదేష్ణ తన కల్మష హృదయమును దాచుకొన లేకపోయినది.

మ. అనినం గేకయరాజనందన ప్రధూ
తాశ్చర్యయై యిట్లను
నిను నీరూపము చూచి మాన్యపతి యీ
ర్ష్యాసాధ్వస మొందుచుం
డినఁ గొందుం దగ నింతలోన దలిరి నీ
పైఁ జూడ్కి సెక్కెల్ల నె
మ్మనముల్ విస్మయ మందఁ జూచెదరు భా
మాపల్లవిం! కేటికిన్

—౧ ఆ. ౩౨౧ ప.

రూపము చూచినంతమాత్రముననే రాజు ఉద్వి గ్నాత్మకుడౌనా! విరాటు డాహాత్రము మనస్సు నిగ్రహింప కానలేని హీనుడా! కాడు. భారతమునం దెల్లెడలను విరాటుని సద్గుణములే కనబడుచున్నవి. మారువేషమున నున్న పాండవులను వేరెరుగకనే యాదరించి యాశ్రయ మిచ్చినాడు. తుదకు ద్రోణాచార్యులతో పోరాడి వీర స్వర్గమును జూరగొనినాడు. అట్టి విరాటుని శీలమునకు సుదేష్ణ దోష మంటగట్టి నిందించిన దనుకొనుటకు వీలు లేదు. పైకి 'మాన్యపతి యీర్ష్యాసాధ్వస' మని చెప్పినను అంతర్గతముగా తనకుని విషయమే ఆలోచించినది. ద్రౌపదిరూపము చూచి అసూయగల తానే యుద్వి గ్నురాలైనది. దుర్విదగ్ధమగు తనమని తెంపుజేసినతో చెప్ప వలెనని తలచుచున్నది! 'నీచపురుషులవల్ల నీ భయములేదు నాభాగ్యము లెరుగుడు' మని ద్రౌపది చెప్పగనే యీర్ష్యావిషయమై శంకించి తప్పుడు రాజుపై ద్రోహినది. ఈ మాటలవలన ద్రౌపది సుందరి కాకపోవుట బంధము చేయుటకు ప్రయ త్నించినదే కాని అసమాన రూపవతియైన ద్రౌపదిని వదలిపెట్టుటకు సుదేష్ణ సిద్ధపడలేదు. అందుచేతనే పతు లగు గంధర్వులు తనను నీచబుద్ధితో జూచిన వారిని ఆ రాత్రిలోనే సమయింతురని ద్రౌపది చెప్పినను భయ పడక సైరంధ్రి నునిచికొన్నది. ఇక్కడ ద్రౌపదీవాక్య ములలో నాటకీయత యున్నదని యుక్తులతో కూడ కీచక వధ వృత్తాంత మంతయు సూచింపబడినది.

క. నీచమతి నన్ను నెవ్వడు
చూచిన నా రాత్రిలోనఁ జూతురు దెసఁ జా
రాచపలు పరిహారాగుల
గాచిన బలవిక్రమము లఖర్వులు నైనన్.

క. బంధు శీలంబులు శౌర్యము
దాంతములై శక్తి సంపదాధికులై
సింధుర సదృశత నన్నుసు
సంధులం బంధు లెవలించి చంపుదు రతనిన్.

—౧ ఆ. ౩౨౪– ౩౨౫.

ఈ మాటలలో నున్న గూఢార్థము మాట్లాడు చున్న ద్రౌపదికిగాని, వినుచున్న సుదేష్ణకుగాని తెలి యదు. [illegible]

తులకు మాత్రమే గోచరించును. షేక్స్పియరు నాటకములలో నిట్టి సన్నివేశములు (Dramatic Ironey) ఎక్కువగా గాన్పించును.

ఇంతవరకు వ్యాస భారత క్రమము నుండి ఔచిత్యముకొరకు తిక్కన చేసిన మార్పులను గమనింతము. ప్రథమమున వ్యాసుడు సుదేష్ణను 'పరమ సంమతా' అని సంబోధించినాడు*. తరువాత చేసిన దుష్కార్యమును బట్టి చూచినచో సుదేష్ణ కీ విశేషణము తగదని మనకు తెలియుచున్నది. అందువలన తిక్కన ఈ విశేషణమును వదలిపెట్టుటయేగాక ఆ చోట నింకొక విశేషణము నుపయోగించినాడు (మా, ౧. ౩౦౧ప.). తిక్కనచోట్ల ఇతడు సుదేష్ణకుపయోగించిన విశేషణములు 'జంతో' 'అపక్వసంవాదిని' మొదలైనవి. ఇవి సుదేష్ణశీలముపై చక్కగా ప్రతిఫలించుచున్నవి. కాని వ్యాసు డుపయోగించిన విశేషణము సుదేష్ణ మంచిదని ప్రత్యక్షముగా ప్రాయము మొసగుచున్నది. ఈ మార్పు చాల చిన్నదైనను పద ప్రమాణముల కెక్కువ పట్టివ్వగలను.

రెండవది సైరంధ్రి స్వీయవృత్తాంతమును గురించి మొదట చెప్పినమాటలు నమ్మక సుదేష్ణ నిజము చెప్పుమని మరల నడుగుటకు వ్యాసు డెనిమిదిశ్లోకములను వ్రాసినాడు. ఈ యెనిమిదిశ్లోకములలోని భావమును ఒక్కపద్యములో తిక్కన వెల్లడించినాడు. 'నీవు సురకన్యవా' లేక 'యక్షస్త్రీవా' లేక 'విద్యాధరయువతివా' అని వేరువేరుగా యడుగుటకన్న 'సురగరుడ ఖచర విద్యాధర కిన్నరయక్ష సిద్ధతరుణులలో నీ వెవ్వతెవని (౧ ఆ. ౩౧౪ ప.) యడుగుట ఉద్వేగపూరితమానసులకు సహజముగదా!

ఈ రెంటికంటె ముఖ్యమైన మార్పింకొకటి యగపడుచున్నది. ఆంధ్రభారతములో సుదేష్ణ సైరంధ్రితో 'నీరూపము నూచి మానృపతి యేమిసేయునో యని' మాత్రమే చెప్పినది. సంస్కృత భారతములో సుదేష్ణ—

"రాజా విరాటః సుశ్రోణి, దృష్ట్వా వపు రమానుషమ్,
విహాయ మాం వరారోహే, గచ్ఛేత్ సర్వేణ చేతసా.
యం హి త్వ మనవద్యాంగి, తరలాయతలోచనే,
ప్రసక్త మభివీక్షేథాః స కామవశగో భవేత్"

'అమానుషమైన నీరూపము చూచినంతనే రాజు నన్ను వదలిపెట్టి కాముకుడై నీ వెంబడి బడగలడన్నది. రాజు ఉద్యానమునందో, పట్టపుగదిలో నో వదలి పరకాంతలో మనసు పెంచినదిగా నున్నదో గమనింపుడు! అపమాన సౌందర్యవతియైన అన్యకాంతను జూచినప్పుడు ఉద్యానములో ఉన్నను జనులకు కాకపోయినను సామాన్యులకు విపరీతము కాదు. వ్యాస భారతములో జెప్పినదిగు జూచిన భార్యను వదలిపెట్టి భోగముకానిపజ్జ తేరు హీనలక్షణము స్ఫురించును. అనలిటువంటి యల్లికలను పతివ్రతయు పట్టమహిషియునైన సుదేష్ణచేత పలికించుట న్యాయ సంగతము. తిక్కన ఈ యసంగతమును తొలగించుటయేగాక విరాటుని శీలమునకును మెరుగుపెట్టినాడు.

అజ్ఞాతవాససంవత్సరములో చాలభాగ మెట్టి యసంగతమును లేకయే గడచినది. ఈకాలములో పనులు చేయించుకొనుచుండు సుదేష్ణ ద్రౌపదిని కష్టపెట్టినట్లును, ఆమెకు ద్రౌపది చాల భయపడి ప్రవర్తించుచున్నట్లును పాంచాలి భీమునితో నన్నమాటల వలనదెలియుచున్నది. ఇట్లు పదునొకమాసములు కొరవగా సంవత్సరము గడచినతరువాత నొకనాడు కీచకుడు తనయక్కయగు సుదేష్ణకు మ్రొక్కబోవుచు ఆమెకు కొలది దూరమున నున్న సైరంధ్రిని జూచి 'రాగసాగర పూరనిర్మగ్నుడై'నాడు. సహోదరికడ్డ సపర్యలైన సరిగా నందుకొనకయే తొందరపడి సైరంధ్రీ వృత్తాంతమామె నడిగినాడు. ఆమె కీచకుని అభిప్రాయము గ్రహించి అడిగిన ప్రశ్నకు సమాధానము చెప్పక ఇతరవిషయములను ముచ్చటించినది. ప్రశ్నకు సమాధాన మివ్వకుండుటచే తన యసమ్మతిని దెల్పి కీచకు నాప్రయత్నమునుండి

*విరాటస్యాస్తు కైకేయీ భార్యా పరమసంమతా ఆలోకయన్తీ దదృశే ప్రాసాదాదుపదాత్మజామ్.

మరల్ప జూచినది. కాని సుదేష్ణ కను సన్నలచేత స్వీయ కార్యమును నివర్తించుకొనునంతటి బలహీనుడు కాడు కీచకుడు. ఒకడు సన్మార్గమున నడువవలె ననిన రాజభయమైనను, పాపభీతియైనను నుండవలెను. ఈ రెండును కీచకుని బంధింపజాలవు. రాజుల నందరను యుద్ధములో జయించి రాజ్యతంత్రములు నడుపుచు పేరునకుమాత్రము రాజని విరాటునకు గూడు పెట్టుచున్నాడు. దుష్కార్యము చేయబోవునప్పుడు సామాన్యులను బెదరించినయెడల నూరకొందురు గాని కీచకునివంటివార లూరకొనరుగదా. కావున సుదేష్ణ కార్యభారము దేవునిపై వేసి తమ్మునికి తనఅయిష్టమును సూచించి అక్కడనుండి లేచిపోయినది. కాని సత్త్వహీనుడగు కీచకుడు వెంబడే ద్రౌపది యున్న యెడకేగినాడు. సుదేష్ణ అక్కడనుండి లేచిపోయినట్లు భారతమునందు స్పష్టముగా వ్రాయబడలేదు. కాని కీచకుడు మొదటిసారి అక్కతో మాట్లాడునప్పుడు 'ఇయ్యరవింద గంధికుల మేమి' అని వ్రేలితో జూపించి యడిగినవాడు, రెండవసారి అక్కను సమీపించి 'ఏ నప్పుడు నీకడం జూపి యన్వయనామధేయంబు లడిగిన యప్పొలతి ...' అని యనుటచేత సుదేష్ణ పూర్వోక్తప్రదేశమున గాక వేరొకచోట నున్నదని తెలియుచున్నది.

ద్రౌపదికడ్డ చీవాట్లు తిని చిన్నబోయిన ముఖముతో రెండవపర్యాయము అక్కకడ్డకు కీచకుడు వెళ్లి ద్రౌపదీవృత్తాంతము మరల నడిగినాడు. కీచకుని బెగిరపాటు సుదేష్ణ గ్రహించినది. సైరంధ్రి నైదుగురు గంధర్వులు కాచుచున్నారని తనకు తెలియును. కామోద్రేకముచేత కీచకుడు మాలినిని పరాభవించిన యెడల గంధర్వు లూరకొనరు. కీచకుని కపాయము వచ్చినయెడల నాతని భుజాబలముచే రక్షితమైన తమ రాజ్యమునకే ముప్పువచ్చును. కీచకుని వారించినయెడల నీకష్టము లన్నియు తొలగును. కాని కీచకుడు తాను వద్దన్న నాగెడువాడు కాడు. ఇప్పుడు తా నేమిచేయవలెను? సైరంధ్రి నతని కర్పించినచో తనకు మానహానియు నతనికి ప్రాణహానియు తప్పవు. అట్లు చేయకున్నచో కీచకు డిప్పుడే రాజును సింహాసనమునుండి తొలగద్రోయును. ఈ సందేహస్థితి చేత జేసిన సుదేష్ణ హృదయమును తిక్కన ఎంతచక్కగా నిరూపించినాడో చూడుడు !

" అతని బెగిరపాటు మాచి శిరఃకంపంబు సేయుచు సుదేష్ణ నిజాంతర్గతంబున-

తే. రాగరసమగ్నుడయ్యె సైరంధ్రిఁ జూచి
యకట దీన నింకేమి యపాయ మగునొ
వలదు తగదన్న నుడిగెడువాఁడె వీఁడు
మాయదైవము దీ నేమి సేయుదాన?"

—౨ ఆ. ౬౩ ప.

రాబోవు అపాయమును తొలగించు ఉపాయమేదియు నగపడకున్నను సుదేష్ణ స్వీయ ప్రయత్నములు మానుకొనలేదు. కీచకుని యుంపుడుగత్తెలను వర్ణించి నీరసాకారమైన సైరంధ్రినికోరుట తగదనినది. కాని తమ్ముడు అక్కకంటె రెండాకులెక్కువ చదివినవాడు. సుదేష్ణకంటె మేలైన యలంకారములతో పదగుంఫనతో సైరంధ్రిని వర్ణించి, 'నీ వెరుగక చెప్పితివి కాని అట్టియందము నింకొకచోట చూపించు'మని ప్రశ్నించినాడు. వ్యర్థమని తెలిసియు తనయందు తప్పు లేకుండ సుదేష్ణ నీతిని బోధించినది. తుద కన్నిటికంటె తన కెక్కువగా బాధించు గంధర్వభయమును చెప్పవల దని ప్రార్థించినది. సుదేష్ణభయమును విని సింహబలుడు నవ్వినాడు. అతని కీ వంకర మాటలన్నియు నచ్చలేదు. స్పష్టముగా 'నాకృద్ధికోరినచో సైరంధ్రిని పిలిపింపుము. లేకున్న ప్రాణములను విడుచుచున్నా' నని అక్కకాళ్ళపై బడినాడు. వెంటనే సుదేష్ణ చిన్నబోయినది — సింహబలు డంతటివాడు తనకాళ్ళపై బడినా డని కాదు, భావ్యనర్థకమును తొలగించుటకై తాఁబడ్డ పాట్లన్నియు వ్యర్థమైన వని. ఇక ప్రస్తుత కర్తవ్య మాలోచించినది. సైరంధ్రి చెప్పినట్లు నిజముగా గంధర్వు లున్నారో లేక యూరకనే బెదరించుటకై సైరంధ్రి యట్లు చెప్పినదేమో? గంధర్వుల మాట యబద్ధమైనచో కీచకున కే యపాయమును లేదు. ఒకవేళ నిజమైనను సింహబలుని వార లెదుర్కొనలేకపోవచ్చును. కీచకునికి గంధర్వుల చేతిలో చావు తప్పించినను మన్మథునిచేతిలో దప్పునట్లు లేదు. ముందునందు గంధర్వులచేత కలుగు సంకటము [illegible]

ననుకొంటె ప్రస్తుతము తన కోర్కెలనెఱవేఱుట తమ్ముని మనస్తాపమే చచ్చుటను తప్పించుటకు యుపకరణముగదా! కావున 'అన్నల వచ్చు నాపదల కన్నిటి కోర్చి' తమ్ముని కుపాయము చెప్పి పంపినది.

ఈ భాగమున తిక్కన సుదేష్ణహృదయమునందలి భావసంఘర్షణను ప్రదర్శించినాడు. కీచకు డడిగినంతనే సుదేష్ణ యొప్పుకొనినచో మన కామెయెడల సేవకైన జాలియును గలుగదు. రాణి సాధ్యమైనంతవరకు తమ్ముని మనస్సు త్రిప్ప ప్రయత్నించినది. సాధ్యము కానప్పుడు అతని కోర్కెకు తలయొగ్గినది. నిజముగా సుదేష్ణ ఋజుమార్గ ప్రవర్తిని యైనచో కీచకుని కోరికను నిరాకరింపకూడదా? రాణి యాజ్ఞాపించినచో నాతడేమి చేయునని ప్రశ్నింప వచ్చును. కాని రాణి కఠినముగా నాజ్ఞాపించినంతమాత్రమున గలుగు లాభ మేదియు లేదు. ఇంకొక చో కీచకుడు ద్రౌపదితో నేమని చెప్పుకొనినాడో చూడుడు:

క. నీ కొఱకత వేల యలఁగ బడి
వేవురు నే వలచి నట్టి వెదకిన నచ్చం
బై నచ్చి తలఁచు నా వి... ...
...కండు ... కంటేన్

— వి. ఆ. ౨౫ ప.

సంస్కృతభారతములో కీచకుడు మొదటిసారి అక్కవద్దకు వెళ్లు, అక్క వినుభక్ష్యము గన్పరచుట స్పష్టముగా లేదు. రెండవసారి అక్కను జేరి కీచకుడు వేరుమాట లేమియును పలుకక 'సైరంధ్రిని గూర్చి యున్నచో ప్రాణములను విడిచిపెట్టుచున్నాడ' నని నాడు. కుల గోత్రాదికముల ప్రశ్న లేమియు నడుగ లేదు. ఆతని మాటలు విని సుదేష్ణ జాలిపొంది వెంటనే ద్రౌపది నతని గృహమునకు మదిరావ్యాజమున పంపుటకు నిశ్చయించినది. 2 ఆ యుపాయ మతనికి జెప్పి సైరంధ్రిని విరాటుంకననుగా విజయప్రదేశమునకు ఇష్టము వచ్చినట్లు భోగింపుమని 'సలహా' ఇచ్చినది. ఈ సుదేష్ణ మాటలు చూచినచో నామె నీచస్వభావము గోచరింపగలదు.

"శక్ర సంప్రేషితా మేహాం విజనే నిరవగ్రహే,
సాంత్వ్యమానా యథాకామం సాంత్వ్యమానా
రమేద్యది."

ఆంధ్ర భారతమునందు సుదేష్ణ నీతిని బోధించియు, బెదరించియు ననేక విధముల కీచకుని దురుద్యోగము మాన్ప యత్నించి, లాభము లేనందున చిన్నబోయి విధిలేక సైరంధ్రిని బంపుట కొప్పుకొన్నది. సంస్కృతమునందు కీచకుడు దీనముగా ప్రార్థించినంతనే సుదేష్ణ జాలిచేత (కృపాం చక్రే) కీచకునకు చేదోడువాదోడుగా నుపచరించినది. వ్యాసుని సుదేష్ణ వలె తిక్కన సుదేష్ణ కీచకుని యానందమునలో తానును పాల్గొనలేదు. సంస్కృతములోని సుదేష్ణకు ఉచితానుచితములు శంకించుటగాని ముందు వెనుకాడుటగాని లేదు. ధర్మసూక్ష్మములు తిక్కనను బాధించినట్లుగా వ్యాసుని బాధింపలేదు. ఈ ధర్మాధర్మ విచారణ గల్పించుటచేత తిక్కన సుదేష్ణ శీలమును వేయిరెట్లు ప్రతిభావంత మొనర్చినాడు.

కీచకు డింటికిపోయి సైరంధ్రిరాక కెదురు చూచుచున్నాడు. అంతఃపురములో సుదేష్ణ పాంచాలిని రావించి 'తృష్ణ భావించుచు' కీచకునింట నుండు మదిరారసమును గొని రమ్మని యాజ్ఞాపించినది. ఇతరకై పైమాటలు చెప్పిన సమాజముగా నుండదని దప్పిగొన్నట్లు ప్రదర్శించుటకై మనస్సులో కూడ తృష్ణ భావించుకొన్నది. నటులైనను నాటకములోని రసముల నంతరంగమున భావించుకొనకపోయిన స్వాభావికముగా నటించలేరుగదా! ఈ నాట్యకళా

1. యథా కైకేయి సైరంధ్రీ సమేయాత్ తద్
విధీయతామ్,
యేనోపాయేన సైరంధ్రీ భజేన్మాం రాజగామినీ,
తం సుదేష్ణే పరీప్సస్వ ప్రాణాన్మోహాత్ ప్రహా
సిషమ్.

2. తస్యాస్తద్ బహుశః శ్రుత్వా వాచం విలపతస్తదా,
విరాటమహిషీ దేవీ కృపాంచక్రే మనస్వినీ.
స్వకార్యమభిసంధాయ తస్యార్థమనుచింత్య చ,
ఉద్వేగం చైవ కృష్ణాయాః సుదేష్ణా సూతమ
బ్రవీత్.

హితాంతకమును సత్కరించుకొనిరో తిక్కన సోమయాజి 'కృష్ణ భావించుచు' అని రచించినాడు. తరువాత సుదేష్ణ కీచకునివిషయమై తనకేమియు తెలియనట్లును, అత్యంతావసర మగుటచే ద్రౌపదిని బంపించుచున్నట్లును మాట్లాడినది—

క. కీచకునియింట నెప్పుడు,
వాచవి యగు బహువిధముల వారుణి గలుగున్
నే చని యిచటికిఁ గొని ర
మ్మా, చూతము గాని నీగమున వేగంబున్.
— వి. ఆ. ౮౯ ప.

ద్రౌపదియు కీచకుని విషయమై శంకించినట్లు మాట్లాడి నీచములైన పనులకు పోజాల నన్నది. బిడియపడి కీచకుని వృత్తాంతము చెప్పలేదు కాని, నిర్దాక్షిణ్యముగా 'నీ తమ్ముఁ డింతకు ముం దిట్లొనరించి పోయినాడు. నే నిప్పు డాతని యింటికి ఒంటరిగా నెట్లు పోవుదు' నని యడిగినచో సుదేష్ణ నిరుత్తర యయ్యెడిది. ఆ విధముగా నడుగక పోబట్టి సుదేష్ణ తప్పంతయు ద్రౌపదిమీదికే నెట్టి సంవత్సరమునుండి ఆశ్రయ మిచ్చి గౌరవముగా సంభావించుచున్న నా తా నడిగిన చిన్న కోరికను తీర్చుటకేదో యొక సాకున ద్రౌపది నిరాకరించుచున్నట్లు నిష్ఠురము లాడినది. పైనుండి ద్రౌపది యన్నట్లాపనిలో నీచత్వ మేమి లేదనియు, నీచులను బంపుట కిష్టము లేకనే ద్రౌపదిని బంపుచున్నాననియు వినయపుమాట లాడినది. సంపూర్ణముగా ననుమానరహిత మగుటకు సైరంధ్రిని 'వత్సే' యని ప్రేమ యుట్టిపడునట్లు సంబోధించినది.

ఉ. అక్కట నేను వేడ్కపడి
యాఁకెదు వాఁడవ మద్దిఁ దైరఁగా
నొక్కనికొల్పఁ బంచుటకు
నోపక చెప్పిన దీని నీవు గో
టిక్కలఁగాఁ జేసి నన్ను నతి
హీనవిధాన నియుక్తఁ జేతఁగా
నిక్కము యమ్మలించి తిది
నెయ్యము తియ్యము కల్మిరే సఖీ?
— వి. ఆ. ౯౯ వ.

సంస్కృతభారతములో సుదేష్ణ ఈ కౌశల్యమును ప్రకటించలేదు. కీచకునింటికి పోయి మదిరను తెమ్మని అధికారిణివలె నాజ్ఞాపించినది.

"ఉత్తిష్ఠ గచ్ఛ సైరంధ్రి, కీచకస్య నివేశనమ్,
పాన మానయ కల్యాణి, పిపాసా మాం ప్రబాధతే"

'ఉత్తిష్ఠ, గచ్ఛ' అని యాజ్ఞాపించుటలోను, 'కొనిరమ్మా చూతముగాని నీగమున వేగంబున్' అని యడుగుటలో నెంతభేద మున్నది! అనుమానరహితముగా ప్రవర్తించుటకు వ్యాసునిసుదేష్ణ ప్రయత్నించనే లేదు. పైనుండి సైరంధ్రి 'కీచకుడు నన్ను కామించును. అన్యులను బంపవలసిన'దని ప్రార్థించినను వినిపించుకొనక,

'నైవ త్వాం జాతు హింస్యాత్ స
ఇతః సంప్రేషితాం మయా'

'నాచేత పంపబడిన నిన్నతడు హింసింపడు పొమ్మ'ని కాంచనచషక మిచ్చి పంపినది. సుదేష్ణాజ్ఞను ధిక్కరించలేక సైరంధ్రి వెడలినది. ఆంధ్రభారతమునందు సుదేష్ణ వినయపుమాటలచేత సమ్మతింపజేసి మర్యాదగా బంపినది.

వ్యాసునిసుదేష్ణ నిజకార్యాచరణమం దితరులను లెక్కపెట్టని పెదకాలపు ధూర్తురాలు. తిక్కన సుదేష్ణ తియ్యనిమాటలతో పనులను సాధించుకొను నెల్లారి నెరజాణ. ఈ యొకపట్టుప్రవర్తనలో గూడ సుబుద్ధి కుబుద్ధుల సంఘర్షణ జరిగినది. సుదేష్ణ 'అనుచితమైన కనయము శంకించి'యు, 'తమ్ముని వలవంత' అనివార్య మగుటచే దుర్బుద్ధికే లొంగిపోయినది. సోదరప్రేమ, పాపభీతి, గంధర్వభయము — ఇవన్నియు సుదేష్ణహృదయములో కలిగించిన తాపాలను తిక్కన ఈఘట్టములో చూపించినాడు.

సుదేష్ణ ఆజ్ఞానుసారము ద్రౌపది కీచకునింటికి పోయి అతనిచే పరాభవింపబడినది. తన యవమానము సంగతియు సుదేష్ణమందిరమునకు తెలిపికొన్న ద్రౌపదిని [illegible] సుదేష్ణ సమ్మానించి '[illegible]' యని [illegible]

అందువలన ద్రౌపది ఆ 'జంతు' కీకష్టము లన్నియు తెలుపుటకై దేహము కంపించుచుండ నంతఃపురమున కేగినది. సుదేష్ణ తా నొనర్చిన కార్యము వికటించిన దని తెలిసికొన్నది. తానేమాత్రము బయటపడినను ద్రౌపదిచే నింద తప్పదని, తన కేమియు తెలియనట్లు గొంతు మార్చుకొని వినయముతో ద్రౌపది కెట్లు సంభాషించినదో చూడుడు:

సీ. ధరణీపరాగంబు పొరసి ధూసరితమై
చేడియ నీమేను చెన్నుఁ దఱిగెఁ
చిత్తంబు తలపోఁతచే వాడు పొందిన
చెలువ నీ నెమ్మోము చిన్నఁబోయెఁ
బ్రస్వేదమునఁ దోఁగి ఫాలంబుతో నంటి
యుంగ్రాలి నీకురు లొప్పు గందెఁ
గన్నీరు వఱ్ఱోడి కాంతి దొంతయుఁ గొన్న
నెలఁది నీకనుఁగవ ఖిన్నమయ్యె
నేది కారణముగ నెవ్వ రెచ్చోట నీ
కేమి కీడొనర్చి రెట్టివాటి
సాహసికులో వారిఁ జంపుదు నొంపుదు
భంగపఱతు నిక్కముపలుకుఁ జెపుము.

— ౨. ఆ. ౧౫౬ ప.

ఒకసారి మోసపుచ్చినను సుదేష్ణ కార్యము రెండవసారి సైరంధ్రిని మోసపుచ్చ లేకపోయినది. అసలీ దీర్ఘవర్ణనలోనే సుదేష్ణయొక్క అంతరంగము బయల్పడినది. వృత్తాంత మంతయు తెలిసికొని, ఎట్లు మాట్లాడవలెనో ముందే ఆలోచించుకొన్నవారు తప్ప తదితరు లింత చక్కగా అలంకారములతో దీర్ఘవర్ణన చేయజాలరు. ఎక్కువ దుఃఖావేశ మున్నప్పుడు తక్కువమాటలు పలుకుట సహజముగదా! సుదేష్ణ మనస్సులో లేని ప్రేమను మాటలతో వెల్లడించినది గాని పాంచాలి ఈ విషయము కనిపెట్టి 'నీ వెరింగియు నెరుంగమి భావించిన నింక నేమని పలుకం గలదాన' నన్నది. రాణి కీచకుని జంపెద నొంపెద నన్నదిగాని, ఆ 'యసత్యసంవాదిని' కల్లబొల్లిపలుకులను ద్రౌపది లక్ష్యపెట్టక 'బలవంతులైన నా పతు లుండగా నీ కెందు కీ కష్టము లెమ్మ'ని గూఢోక్తితో జవాబు చెప్పినది. తా ననుకొన్నంతపని యైనదని సుదేష్ణ 'నివ్వెరగంది' యూరకొన్నది. దూరాలోచనచే రానున్న యపాయమును గనిపెట్టి తొలగింప ప్రయత్నించినది. అలంఘనీయమైన దైవవిధి ఆత్మశక్తి నతిక్రమించినప్పుడు చేయునది లేక చేతులు ముడుచుకొని కూర్చున్నది.

కీచకసంహార మైనది. సైరంధ్రిని ఇంటినుండి వెడలనంపు మని విరాటుడు సుదేష్ణతో జెప్పెను. ఇంతలో సైరంధ్రి అంతఃపురములోనికి వచ్చినది. పూర్వప్రకారము రాణి కాఠిన్యమునుగాని కాపట్యమును గాని ప్రకటింపలేదు. వినయపూర్వకముగా రాజాజ్ఞను తెలిపినది. అంతటితో నూరుకొనక మనస్సులో నున్న యాక్రోశమును వెడల గ్రక్కినది.

క. విరుదు గల మగలు గల రని
తరమిడి చంపింపఁ జాలెదవు జనములు నీ
పొరువునఁ బోవెఱతురు మా
పురమును రాష్ట్రంబు వెడలిపొ మ్మింతైనన్.

— ౩ ఆ. ౬౧ ప.

అంతఃపురమును విడిచి వెళ్లుమని రాజాజ్ఞాపించ, పురమున్, రాష్ట్రమునుగూడ విడిచిపొమ్మని సుదేష్ణ ఆనతిచ్చినది. తనయందును, తనతమ్మునియందును లోప మేమియు లేనట్లు తప్పంతయు ద్రౌపదిమీద నెట్టినది. విరుదుగల మగ లున్నంతమాత్రమున పాంచాలి తనను పరాభవించిన కీచకులకు దప్ప ఇతరుల కెట్టియపకారమును జేయలేదే. ఐనను నూటయార్వురు తమ్ముల నొక్కసారి పోగొట్టుకొన్న సుదేష్ణకు ద్రౌపది ప్రపంచమున కంతకు నపకారము చేసినట్లగపడినది. అందువలననే కఠినముగా రాష్ట్రమునుగూడ విడిచిపొమ్మని విధించినది. కీచకు డొనర్చిన యపరాధమునకు ద్రౌపది విధించిన శిక్ష పిచ్చుకపై బ్రహ్మాస్త్రము వేసినట్లు కనిపించినది. తమ్మునితప్పు తప్పుగా కనబడలేదు. తమవారి తప్పులను దిగమ్రింగి ఎదుటివారితప్పుల నుగ్గడించుచు పోట్లాడుట ఆడువారికి సహజముగదా! ఇక పదుమూడు దినములుమాత్ర మచ్చట నుండనీయు మని ద్రౌపది యడిగినప్పుడు మాటాడనేరది 'నాభర్తను నందనులను కృపార్ద్రబుద్ధితో జూచుకొ'మ్మని వేడుకొన్నది. ఆత్మ

యులు బాగున్నతో తిక్కనవా రేమైనను సంకోచము లేదు కాబోలు!

తిక్కన మూలకథను యథాప్రకారముగానే యుంచినాడు. కాని పాత్రలకు మూలమునలేని సహజ త్వమును చేకూర్చ గలుగు గనుక మెప్పుకొనచేసినాడు. సంస్కృతభారతములో నున్నంత కఠినముగా నాంధ్ర భారతమున సుదేష్ణ ప్రవర్తింపలేదు. శాస్త్రముతో నంద రిని మెప్పించలేకయినది. అనర్థమును తప్పించుటకై స్వీయప్రయత్నములో లోప మేమియు జేయలేదు. వక్తి విపరీతముగా నుండుటచే విఫలురాలైనది. అది నీతిగా జరించినచో బహుశ తిక్కన స్త్రీజనసామాన్య చిత్తవృత్తినే చూపించినాడు. పైనుండి సుదేష్ణలో మూలమున లేని న్యాయాన్యాయదృష్టి, హృదయవేదన చూపించినాడు. దీనివలన సంపూర్ణముగా నిందిత చరిత్ర యైన సుదేష్ణ చాలవరకు ప్రశంసాపాత్ర మగుచున్నది. ఉత్తమురాలాయిక కాకపోవచ్చును, అధమమాత్రము కాదు. ఇట్లు తిక్కనసోమయాజి రస శేముషీ విశే షము చేత సుదేష్ణశీలము నున్నతస్థాయిలోనికి గొనివచ్చి ప్రతిభావంతము చేసినాడు.

మాలపిల్లని పిలుపు

శ్రీ కుంటిమద్ది రాఘవాచార్లు

నీగుడికి దూరదూరాన నిలిపినారు
ఎట్లు రాగల్గుదును? లోనికేను సామి!
వించు నుంటిని నీరూపు వీనులార,
చూచు భాగ్యము మాత్రము నోచనైతి.

తాకరానట్టివారికి తలుపు దీయ
వీలు లేదంచు బాపలు వెలికి ద్రోయ,
ఆశ లడుగంట నూహాల కందినంత
ధ్యాన మొనరించుచున్నాడ నాత్మలోనె.

నీకు నే లోపలకు రాగ నిజముగాను
కల్గునే కోప మేమైన? కమలనాభ!
లేక నాదృష్టిదోషాన లేచిపోయి
నిల్తువే నేరుచోటుల? నీరజాక్ష!

తాక నే జూచినంతన నీ కశుద్ధి
గల్గునా? ఇట్టిచోద్యము గలదె, నీదు
పేరు జెప్పిన మైలలు పారిపోవె!
అంటినంతనె అగ్గి చల్లారునొక్కొ?

జీవకారుణ్యమూర్తి! మా జీవములకు
ఇట్టి వెలివేయ నీమన సెట్టులొప్పె?
చెప్పరానట్టి చిక్కుల జిక్కినాను
చిక్కులన్నియు తెగద్రెంచి, స్వేచ్ఛగాను
సంచరించెద వేని నే సంతసమున
పాదముల నంటి, బాసెద పాతకముల.

మైలమడుగులతోడి యామందిరమ్ము
వీడి, ర మ్మీవలకు సామి! వేగముగను.
ఉత్తములతోనె యున్నినా ళ్లుండినావు!
నీచులందును వెలయుమా నేటినుండి.

పాదరక్ష ఉపన్యాసము

శ్రీ వార్తకవి కృష్ణమూర్తి

ఆవేళ ఆదివారం - అమావాస్యకూడా. మానాన్నగారు వాటిని కొనడం ఆసాయంకాలం నాలుగున్నరఘంటల ముహూర్తాన. వాటికిగాను ఆ బజారులో మేము వెదకని కొట్టు లేదు. రెండు మూడంగుళముల దళసరితో, నిగనిగలాడే గాజుపెంకులతో పొదగబడి, కిర్రుబుర్రుమంటూ, మా నాన్నగారి కాళ్లతో ముద్దుగా మెరుపుగా వున్నాయి ఆ చెప్పులజోళ్లు. ఆరాత్రి ఏడు ఘంటలకు దాసుగారి హరికథకు వెళ్లాం. వసారాలో జోళ్లు వదలి లోని కెళ్లి కూర్చున్నాం. పది ఘంటలకు కథ ముగిసింది. తర్వాత బయటికి వచ్చి చూచుసరికి మా నాన్నగారి క్రొత్తజోడు కనపడలేదు. వసారా అంతటినీ, గూళ్లలోను బారియలలో సహా వెతికాం. ఎక్కడగాని కనిపించాయిగావు. ఏ ముష్టివెధవ చేతుల్లోనో పడ్డాయని తెలుసుకొన్నాం. పాపం! మా నాన్నగారి ఆవేదన ఇంతా అంతా గాదు. ఎంతో వెదకి వెదకి భ్రమపడి కొన్నజోళ్లు ఒక్కక్షణంలో అమాంతంగా అలా మాయమైనందుకు వారికడుపు భగ్గుమని మండింది. దానితో, ఆచెప్పులదొంగ కెన్నో శాపాలు చదివేశారు. "నీ కెక్కడ మతి పోయిందిరా అబ్బాయి? అమావాస్య - ఆదివారం, రక్షి ఘంటల రాహుకాలం అనేసంగతి జ్ఞాపకం చేశావుగావు. ఎంతో ఇంగ్లీషు చదివేవు. ఇంకా ఎన్నో చదివి ఏడుస్తావంటావు." అంటూ నాకుగూడా రెండుచీవాట్లు పెట్టారు. ఇలా గొణుగుతూ సణుగుతూ మా నాన్నగారు, నేనూ ఇల్లు చేరాం. అప్పటికప్పుడే ౧౧ ఘంట లవడంచేత, గదిలో కెళ్లి పడుకున్నాం. మా నాన్నగారికి కలిగిన దుస్థితికి చింతిల్లుతూ పోయినజోళ్లని పదేపదే తలచుకోవడంమూలాన్ని నాకు త్వరలో నిద్దుర పట్టిందిగాదు. తర్వాతెప్పుడు కళ్లు మూశానో తెలీదు. ఆ తర్వాత జరిగిన వింతకథ ఇది.

హఠాత్తుగా ఎటునుంచో రెండు పాత చెప్పులు నడచుకుంటూ వచ్చి, నాగది ప్రవేశించాయి. వాటి నక్కడక్కడ ఎలుకలు ఫలహారం చేసినట్లుంది. ఎడమకాలిచెప్పుకు ఉంగటం మాసింది. కుడికాలిచెప్పుకు కుట్లూడినాయి. ఒకదానికి చెదపట్టింది, మరొకదానికి ఎలికపిటిక లంటుకున్నాయి. ఒకటి మడిగింది, మరొకటి ఉడికింది. ఎంతో వికారంగా అసహ్యంగా వున్నాయి. అందం తరిగి, అంగాంగము లుడిగి, జరాభారంతో కృశించే దిక్కులేని వృద్ధునిపోలిక తోపకేస్తాయి. ఒక భావకవి అయ్యుంటే, వాటిపై అప్పుడే ఒక భావగీత మల్లి పారవేసేవాడు. ఇంతలో నా జోళ్ళక్కడగల కుర్చీమీదకి, టకీమని ఎగిరినాయి. ఒకచెప్పు కూర్చొని అధ్యక్షత వహించింది. మరొకటి పైకి లేచి నిలుచుండి ఇలా ఉపన్యాస మారంభించింది. అచేతనము లెలా మాట్లాడగలవని ఆశ్చర్యపడుతూనా...

"మిత్రమా! అచేతనములెలా మాట్లాడ గలుగుతున్నా యని ఆశ్చర్యపడుతూన్నావు గాబోలు. ఈ ఆధునిక వైజ్ఞానికయుగాన ఇది చిత్రమైన విషయం గాదు. అసంభవమూ గాదు. అచేతనములు చేతనములైనాయి. అచరములు చరములైనాయి. లేనిచో విమానా లెలా తిరుగుతున్నాయి? రైళ్ళెలా సంచారము చేయ గలిగాయి? ఊపిరిలేని వస్తువులు మాట్లాడ్డం మీకింత క్రొత్తవింతా? ఎక్కడచూచినా యంత్రాలు, చెవులు చిల్లులుపడేలాగు గింగురు మంటూ బొబ్బ పెట్టడము లేదూ? హోరు మంటూ గాలి వీచడము లేదూ? సముద్రఘోష మీరు వినడంలేదూ? కావున ప్రస్తుతము నేను మాట్లాడడం సందేహించకుండా నిజమని నమ్ముతా రని నామనవి.

విషయాని కుపక్రమించే టందుకు ముందుగా, మీనాన్నగారి కీవేళ కలిగిన దుస్థితికి, మా సంతాపం తెలుపుకుంటాం. చూశారా? ఈ చెప్పులదొంగల చేతుల్లో పడి, మే మెంత హీనస్థితిలో చిక్కి కృశిస్తూన్నామో! చూపరికి ఏవగింపు కలిగించెడి వికారాకారాలతో మీ యెదుట గోచరిస్తున్నామో! ఎంత దిక్కుమాలిన దీనస్థితికి చిక్కి, మా విషాదచరిత్రల మీకు వినిపించి, మీ దయార్ద్రవచనముల మా దుఃఖాన్ని దిగమ్రింగుకుంటున్నామో మీకు తెలుస్తూంది గదా. ఎప్పుడీ నిర్భాగ్యపు దామోదరులకు—ఈ—చెప్పులదొంగలకు, తగిన శిక్ష లభిస్తుందో ఎదురుచూస్తున్నాం. మీ కెందు కింత కోప మంటారా? ఒకమాటు మా జీవిత చరిత్ర విన్నారంటే ఆవిషయం మీకు బోధపడుతుంది. ఈసృష్టిలో ప్రతి వస్తువుకు, చేతనమైనా, అచేతనమైనా ఒక చరిత్ర వుంటుంది. మీ జీవితం మాదిరిగా, దానికిగూడా కాల మెన్నో మార్పులు తెచ్చి పెట్టుట గద్దు. దానికిగూడా శైశవము, బాల్యము, యౌవనము, కౌమారము, వృద్ధాప్యము సహజములే. దాని జీవితానుభవాలు సుఖదుఃఖమిళితములే. అల్పవస్తువు లని మమ్ము నిరసనభావంతో చూడకండి. మానవ చరిత్రముగూడా అల్పంతో ఆరంభమైంది. దైవసృష్టిలో కీటకాది బ్రహ్మపర్యంతము ఒకటే. స్తంభంలో వుండే దేవుడు సూక్ష్మంలోగూడా వున్నాడు. కంకణగాథ మీకు క్రొత్తది గాదు. గడ్డిపోచచరిత్ర మీ కెరిగినదే. కావున ఈ సృష్టిలోని ప్రతివస్తువును, అల్పమైతేనేం, స్వల్పమైతేనేం, తృణీకరించకుండా మాచరిత్రలుగూడా విని మమ్ముల నాదరించాలని వేడుకుంటూన్నా.

మీ రెన్నో ఆత్మకథలు విని యుందురు. మహానుభావుల స్వీయచరిత్ర లెన్నో పఠించి యుంటారు. అనర్ఘ్యప్రాయుల ఆత్మకథలు మీకు తెలిసేయుండును. కాని నాలో అంత మహత్తు లేదు. శాస్త్రజ్ఞానం సున్న. వేదవాదనలే లేవు. ఒకసుగుణ మేమంటే, నేను మీ కెంతో ఉపయోగకారినైన వస్తువు. "పరోపకారార్థం ఇదం శరీరం" అన్నట్లు నా యావజ్జీవపర్యంతము మీ పాదసేవ చేస్తుంటా. రాజు మొదలు బంటువరకూ నన్ను నాజాతివారిని గౌరవింతురు. రాజాధిరాజైనను మమ్ముల తనకాళ్ల నిడుకొని మోయవలసిందే. లేనిచో ఏపామో, పురుగో పుట్రో, రాయో రప్పో మిమ్ముల బాధించ గలవు. మరిన్ని మండువేసంగిలో మేము [illegible] కథలంత అవసరము. లేకున్న మీరు

బయట టడుగు పెట్టగలరా? అడుగు పెట్టినచో కాళ్లు బొబ్బలుపొరి లెయిలెక్క లాడెదరు. మాకుగూడా పౌరుషము, ప్రతాపము, అధికారము, ఉన్నతులు వున్నాయి. దెబ్బతిన్న మనుజుని కులాని కెలేయుదురు. కత్తిపోటుకు గూడా అంత మర్యాద లేదు. తప్పగూడా లేదు. చెప్పదెబ్బంటే చాలు జను లదరి పడి చత్తురు. మాలోగూడా ఎన్నోరకాలున్నాయి. మీలో లేని ఫ్యాషనులు మాలో ఎన్నో వున్నాయి. కిర్రుచెప్పులు, తుర్రుచెప్పులు, అకుజోళ్లు, ఇలా పలురకాలు. ఆతర్వాత మాలో ఎన్నో జాతులు. మీలోనే కాదు వర్ణభేదా లుండడం; మాలో ఇంకా ఎక్కువే. బూట్సులనీ, షూలనీ, స్లిప్పర్లనీ, శాండల్సనీ - ఇలా ఎన్నోవిధాలు. మాలో కూడా ఒక్కొక్కప్పుడు యుద్ధాలు జరుగుతుంటాయి. దెబ్బలాటలో ఒకడు బూట్సు విసరిన మరొకడు జోడు విసరును. ఒకడు బూటు చేసిన వేరొకడు షూ చేయును. ఒకరినొకరు వెక్కిరించుకోవడం, తిట్టుకోవడం కూడా కద్దు. దేశాలపై దాడివెడలి యుద్ధాలు చేస్తుంటాము. గెలిచినవారిదే రాజ్యం. అందరూ వారి వేషభాషలే వాడుదురు. ఒకప్పు డీదేశములో కిర్రుచెప్పులు వాడేవారు. ఇప్పుడు చూడండి నానావిధాలు వాడుతున్నారు. అకుచెప్పులు కిర్రుచెప్పుల నోడించి రాజ్యం చేసినాయి. వాటిని గెల్చి బెల్టుజోళ్లు వచ్చాయి. ఆతర్వాత బూట్లు, కాబూలుజోళ్లు, బెంగాల్ షూలు రాజ్యాధికారం వహిస్తున్నాయి. ఇంకా కాలానుగతంగా ఎన్ని మార్పులు రాబోవునో? నాగరికత రోజూ మార్పు చెందుతూంటుంది. పూర్వం మీ స్త్రీలు నాజూకుగా రవికెలు [illegible] జాకెట్లు, కురుచచేతుల బాడీలు, గౌనులు వచ్చాయి. ఇంకే కొంతకాలానికి దిగంబరులై తిరుగుదురేమో? ఈ సూచనలు గూడా గన్పడుతున్నాయి. అమెరికాలో న్యూడిజం పేరట దిగంబరు లెందరో గలరు. మునుపు, స్త్రీలు నిడుదవెన్నెరులు గలిగి ముచ్చటగా కొప్పు పెట్టుచుండిరి. ఇప్పుడో - వెంట్రుకలు కత్తిరించి, కురుచలుచేసి, క్రాపింగులు మొదలెట్టినారు. ఇక కొన్నిరోజులకు వెంట్రుకలు నున్నగా గొరిగింతురేమో! శుభంగా కుంకుమ దాల్చడం ఫ్యాషన్ గాదట. పాదుముగాలతో తిరగడం చూస్తున్నాము మీ మగవారిఫ్యాషన్లేమి చెప్పటము! పట్టంచు పంచలు పోయి సూట్లు, పేంట్లు వచ్చాయి. ముద్దుగా ముడివేసికొనుచున్న వెంట్రుకలు తీయించి, పలువిధాల క్రాపింగులు పెట్టుచున్నారు. వీరి వింతవేషాలు చెప్పవచ్చిన నానోరు నొచ్చును. మీలో ఇన్ని మార్పులు గలుగుచున్నప్పుడు, మాలో గలిగెడి మార్పులకు కొదువా? వాటిని తలంచిన నాకెందుకో ఫక్కుమని నవ్వు వచ్చుచున్నది. నన్ను చూచుకొన్న నాకే నవ్వు వచ్చును. ఒరుల వైఖరి చూచిన నవ్వు రాకుండునా? మీలో ఎందరో విమర్శకులు గలరు. నన్ను విమర్శన చేసిన చేయవచ్చును. నన్ను పరిహాసించిన నా కవమాన మేమీ లేదు. నేనిప్పుడు ముసలిముండ నయ్యాను. మీరు నవ్వితేమాత్రం, నా యువ్వనం తిరిగి వచ్చునా? నా తెల్లవెంట్రుకలు నల్ల బడునా?

నేను పుట్టింది ధాతుసంవత్సర భాద్రపదమాసం బహుళాష్టమీ, ఆదివారంరోజున. మత్తిచాను చెప్పడం మాది ఒక వింత పుట్టుక. చావుతర్వాతనే, మాకు జననం. ఎక్కడే

దుము. చావన్న మీా కెంతో దుఃఖం, మాకెంతో యానందం. ఏ యెద్దో, గేదో చచ్చినదో మాపుణ్యాం పండునట్లు యెంతో ముద్దుగా అందంగా జన్మ మెత్తుదుము. మీా కిది చాలా విచిత్రంగా వుండునేమో! కాని దేవుడు మమ్ముల నట్లు పుట్టించినాడు.

నా స్వంతవూరు మాలపాడు. పేరుకు దగినట్లు మావూళ్లో ముప్పాతిక మువ్వీసం మాలలే. తదితరజాతులు తక్కువే. నేను పుట్టింది మాలపెద్ద చిన్నోడి గృహాన. నన్ను తయారుచేసింది నాతండ్రి మాలచిన్నోడే. మంచి దళసరియైన తోలుతో తయారైనా. అప్పుడు మావూళ్లో వాడుకలో వున్న కిర్రు చెప్పుల రూపంతో వెలువడినా. జిగజిగలాడు గున్నా రేకులతోను, తళతళలాడు చిన్న అద్దపు ముక్కలతోను, ఆభరణసహితంగా అలంకరింపబడి ఎంతో ముద్దుగా మురువుగా మెరుస్తూన్నా.

ఆరోజు అమావాస్య. పగలు ౧౨ గంటలయింది. నన్ను కొనడానికి ఒక పెద్దమనిషి వచ్చాడు. మా నాన్నగారితో బేరమాడి ఒకరూపాయి, మూడణాల ఆరుపైసలకు నన్ను కొన్నాడు. అంతటితో నాకూ, నా పుట్టినింటికీ ఋణానుబంధం తెగిపోయింది. ఆతర్వాత మా యజమానితో వారి ఇంటికి వెళ్లిపోయాను. ఇల్లుమాత్రం పెద్ద మేడే. కానీ నన్నెప్పుడూ నడవనే, విడచిపోవడం చేత ఇంటినంతటిని చూచేభాగ్యం అబ్బింది గాదు. మొత్తానికి పెద్దింటివారి కోడలైనందుకు సంతోషించా. ఆతర్వాత మా వారితోగూడా ఎన్నోవూళ్లు చూచాను. కాశీయాత్రలు చేశాను. పెళ్లిళ్ల కేగినా.

నన్ను మెచ్చుకొన్నారు. నా సౌందర్యము అందరికీ భ్రమ గొల్పేది. ఎప్పు డే యాపద సంభవించునో యని నిత్యమూ భయపడే దాన్ని.

ఇలా కొంతకాలము గడచింది. నాకు కీడు మూడురోజులు దగ్గరికి వచ్చాయి. ఒక రోజు ఉళ్లక్కి ఉత్తారావుగారింట హరికథా కాలక్షేపం జరుగుతూంది. నేనుగూడా మా యజమానివెంట, హరికథాశ్రవణ కేగినా. వారు నన్ను ద్వారముదగ్గర విడిచి లోని కెళ్లారు. హరికథదాసు అమాంతంగా బుర్ర త్రిప్పుతూ, వేశ్యకంటె అతివింతగా కులుకుతూ, నృత్యము చేస్తున్నాడు. తాను బొంగరములా, గిర్రుమని తిరుగుతూంటే తలపై పిలక తెయితెక్కలాడుతూంది. మద్దెల వాడు పళ్లు బిగించి దొమ్మరివాడి డోలు లాగు డం డం అంటూ చేతికొద్దీ బాదేస్తున్నాడు. ఈ ధమధమలలో, తాళధ్వనుల క్వణక్వణాలలో, దాసుగారి హరికథ ఏమాత్రమూ వినిపించడములేదు. భాగవతశిఖామణు లనబడువారు దాసుగారితోపాటు బుర్రలు త్రిప్పుతూ, ఆహా హూహూలతో అప్పుడప్పుడు ఓరచూపుల ప్రసరించి ప్రక్కనాసీనులై యున్న నారీమణుల చక్కదనాన్ని కన్నులపండువుగా ఆనందిస్తున్నారు. వీరందరిని చూచి ఒక పెద్ద నవ్వు నవ్వుకొన్నా. వారి వింతచేష్టల కెంతో అసహ్యమయింది. ఇలాంటి హరికథలవల్ల ముక్తియా? పురుషార్థమా? ముక్తి [illegible]మో, ఏముక్తి యనలే చెందము. ఇలా వితర్కిస్తూ మా యజమాని త్వరలో రానందుకు విసుగుకొంటూ కాచుకొన్నా. సరి — ఇంతలో దాపురించాడు

వక్తి. వీడిమొగం మండా. వీడికడుపు గాల్చా. వీ డావ్రాళ్లో పటంగి వెధవంట. చదువు లేదు సాము లేదు. పిచ్చయ్యగారి పెద్దకొడుకు, పేరు సోమయాజులు. నేతిబీర కాయలాంటి పేరు. చెప్పుల దొంగతనంలో అసమానకీర్తి గడించాడు. నా చెలికాండ్రెందరో వానితలపై తన్నారు. కానీ వెధవకు సిగ్గొచ్చిందిగాదు. నాశాపాలు వీడి కొకడికే గాదు; ప్రతి చెప్పులదొంగకీ తగులును గాక! ఇంతకూ మా క్రయము ఒకరూపాయో, రెండురూపాయలో. ఈమాత్రానికి మమ్ముల దొంగిలింపవలెనా? దొంగిలించి ఎన్ని మేడలు గట్టగలరు? మాజాతివారికి రాజరిక మిచ్చినపుడు న్యాయశాస్త్రాన్ని దిద్ది చట్టాన్ని మార్చి, ఈ చెప్పులదొంగలను కొఱత కే యిస్తాము. అప్పుడు మాదెబ్బ చూతురు గాక! ఇప్పు డెందుకు చెప్పాలి ?

సరికదా – సమయం కనిపెట్టి సోమయాజులు నాతో పలాయన మయ్యాడు. బయటకు తీయ భయపడి, ఒకనెలకాలము, వాడు తన ఇంటనున్న పాతబుట్టలో నన్ను దాచియుంచాడు. దానిలో తదితరవస్తువు లెన్నో వున్నాయి. చినిగిన గుడ్డపేలికలు, చిల్లులు పడిన సొంకాయచిప్పలు, త్రుప్పుపట్టిన మేకులు — ఇలాంటివి. నాతోడివారలకు, చుట్టపక్కాలకు దూరమైనా. నన్నెవరూ పలుకరించేవారు లేరు. నాకు జరిగిన పరాభవాని కెంతో చింతిల్లినా. నివురుగప్పిన నిప్పుచందమైంది నాగతి. ఇలాగే గాబోలు ఎన్నో విలువగల రత్నాలు సాగరజలముల నిమిడియుండును. ఎంతో పరిమళముగల ప్రసూనము లడవుల పాలగుట కద్దు. నాగతి ఇంతే ననుకొన్నా. ఇంతలో గోనుచుట్టు నన్నక్కడక్కడ తిని, వికృతాకారం చేసినాయి. పైగా చెదపట్టి మరింత వికారమైనా. అబ్బా! ఈ మొగ మెత్తి సరిసమానులలో నింకెలా దిరుగగలను ? ఎంతో అవమానమయింది. నాగర్వం నశించింది. చావు మేలనుకొన్నా. యవ్వన మడుగంటింది. ఆ బుట్టలోనే ముసలిదాన్నయ్యా. నన్ను చూచి మెచ్చుకునేవా రెవరు? ఇలా విచారిస్తుండగా, ఒకరోజున ఆముష్టివెధవసోమయాజులు నన్ను శోధించి, నా కురూపానికి అసహ్యించుకొని, ఎడమచేతితో తీసి బయట పారవేశాడు. చూశారా! పీనిమూలాన నాకు గలిగిన ముప్పుతిప్పలు. నా యజమానికి నష్టం తన కుపయోగించకపోయినా. దెబ్బపై దెబ్బ తిని, నొప్పికి బాధపడుతూ, బయట నున్న మురుగుకాలవముందు పడ్డా. దేవుని కెప్పుడు కరుణ గలుగునో? ఎప్పు డాతని సాన్నిధ్యము చేరెదనో? నేను పనికిరాని వస్తువును గాను. దిక్కులేమిచే తల్లడిల్లుతూన్నా. ఒళ్లంతా గాయాలతో బాధపడుతూన్నా. మీ రెవరైనా నన్ను తీసికెళ్లి ఏ హాస్పిటల్లోనైనా చేర్చి మందు యిప్పించమని మిమ్ముల కోరుతా. ముందైనా, మమ్ముల దొంగిలించక కష్టనష్టముల పాలు చేయవద్దని మిమ్ముల పదేపదే వేడుకుంటా. ఓ దయార్ద్రహృదయులారా! మీకు నమస్కారము, సెలవు."

ఆ వుపన్యాసం ముగియగానే నాకు మెలకువయింది. కళ్లు తెరచి చూచా. మా నల్లకుక్క, నాపాతజోడు నములుతూ నా కాళ్లదగ్గర కూచుంది. నన్ను చూడగానే తోకాడిస్తూ నాదగ్గరకు వచ్చి, నా చేతులు నాకడం మొదలెట్టింది. ఉపన్యాసకర్త

విమర్శనా పద్ధతులు

శ్రీ కొవ్విడి రామం

రసవంతమైన నాటకాన్ని చూసినా, ఆకర్ష ణీయమైన కావ్యాన్ని చదివినా, మనకు అత్యంతమైన ఆనందం కలుగుతుంది. బండరాతికి ప్రాణాన్ని కల్పించి, శిలాశకలాలతో ప్రతిమలను సృష్టించే శిల్పి చాతుర్యానికి మనం అబ్బురపడతాం. మనోభావములను భంగి ముల ద్వారా మనోహరంగా వ్యక్తీకరించే నర్తకి నాట్యకళాచాతుర్యానికి తల ఊపుతాం. అయితే యీ లలిత కళా ప్రదర్శనానికి ప్రతిభ అత్యవసరం. అది సహజ సిద్ధమయినది. కవి తన ప్రతిభను కావ్యంలో దే దీప్యంగా విజృంభింపజేసి కావ్యానికి అమృతత్వాన్ని సిద్ధింపజేసేటప్పుడు నిరూపించవలసిన వాడు విమర్శకుడు. కావ్యంలో వుండే కళాచమత్కృతిని కూలంకషంగా పరిశీలించి, ఆ కావ్యానికి సాహిత్యంలో లభించే స్థానాన్ని కూడా విమర్శకుడు నిర్ణయిస్తాడు.

కొన్ని కావ్యాలు తాత్కాలికంగా బ్రహ్మాండమైన ప్రాచుర్యాన్ని పొంది, తరువాత కాలగర్భంలో లీన మైపోతాయి. మరికొన్ని కావ్యాలు సమకాలికులకు నచ్చకపోయినా, తరువాత వచ్చే ప్రజలు వాటి ప్రాముఖ్యతను గ్రహించి, ఆ కావ్యములకు యథార్థమైన స్థానాన్ని యిస్తారు. ఈ విషయాన్నే ఆశించి, మహాకవి భవభూతి "కాలో హ్యయం నిరవధి ర్విపులా చ పృథ్వీ" అని చెప్పేడు. కాలం అనంత మైనది గాబట్టి, తన కావ్యాన్ని అప్పటివారు ఆమోదించకపోయినా, తరువాత వచ్చేవారి మన్ననలకైనా అది పాత్ర మవుతుందని ఆ కవి భావం. కాబట్టి మనం ఒక కావ్యాన్ని విమర్శించినప్పుడు, ఆ కవికి ఆ గ్రంథం గురించి యెటువంటి అభిప్రాయం వున్నదో విచారించి చెప్పయితే, ... ప్రాశస్త్యం మనకు బోధపడు

దేశ విఖ్యాతమైన బోరిస్ గ్రాపాల్, "Mighty Three" అనే గ్రంథంలో అభివర్ణించేడు. పౌష్కిన్ వ్రాసిన నాటకాన్ని విమర్శిస్తూ యితను

"Boris Gordov has been warmly appreciated by the Russian public, and was much treasured by Poushkin himself, still this tragedy was neither his concluding word, nor his greatest contribution to Russian Dramaturgic repertory"

అని ఒక్క వాక్యంలోనే యీ మూడు రకములైన అభిప్రాయములను విశదీకరించేడు. కావ్యవిమర్శనలో యిది ఒక విమర్శమైన పద్ధతి అని చెప్పవచ్చును. మన ప్రాచీన కావ్యములలో ఉండే కృత్యాది పద్యములలో కవితాలూకు ఉద్దేశము అతని విద్యా వైదుష్యము మొదలైనవి మనకు వ్యక్త మవుతాయి. సమకాలికుల కృతులను పరిశీలించినప్పుడు ఒక కవికి మరొక కవియందు యెటువంటిభావం వుండేదో కూడా మనకు తెలుస్తుంది. కేతన, తిక్కనసోమయాజీ సమ కాలికులు. కేతన రచించిన ఆంధ్రభాషాభూషణంలో

"కవిత చెప్పి యుభయకవిమిత్రు మెప్పించ
నేరిచి బ్రహ్మ మైన నతడు మెచ్చ
బరగ దశకుమారచరితంబు చెప్పిన
ప్రోడ నన్ను వేఱె పొగడ నేల"

అని చెప్పుకున్నాడు. దీనినిబట్టి తిక్కన తన కాలం నాటివారందరిచేత ప్రామాణికుడుగా పరిగణింపబడినా డని మనం గ్రహించవచ్చును. మన ప్రాచీన కవుల చరిత్ర సమగ్రంగా తెలియకపోవడంచేత, యీ పాశ్చాత్య విమర్శకుడు అవలంబించిన మార్గము మనకు అంత అను

విశిష్ట ప్రతిభావంతులైన కవుల కావ్య మార్గములను అనుసరించే ఆచారము అన్ని దేశములలోనూ వుంది. కాని అనుసరించే కవియొక్క మానసిక ప్రవృత్తినిబట్టి అతని కావ్యంలో విచిత్రమైన పరిణామములు కలుగుతాయి. భవభూతి, కాళిదాసు కూడా వాల్మీకినే గురువుగా భావించి, ఆయన వ్రాసిన రామాయణాన్నే ఆధారంగా తీసుకున్నారు. భవభూతిహృదయం కరుణరస మయినది. కాళిదాసునకు శృంగార రసముపైన మక్కువ యెక్కువ. కాళిదాసు లోకమునంతా ఆనందప్రదమైనదృష్టి(Optimistic view) తోనే చూసేవాడు. కనుకనే భయానకమైన తాటక వధను కూడా,

"రామమన్మథశరేణ తాడితా
దుస్సహేన హృదయే నిశాచరీ
గంధవద్రుధిరచందనోక్షితా
జీవితేశవసతిం జగామ సా."

అని శృంగారభూయిష్ఠంగా వర్ణించేడు. భవభూతి మానసిక ప్రవృత్తి యిటువంటిది కాదు. హాస్యరసం అతని నాటకములలో మనకు యెక్కువగా కనపడదు. ఒక్క విదూషకపాత్రను కూడా యీ కవి *వీరేశలింగంగారి కవుల చరిత్ర, భా. ౧. పు. ౨౩౩. తన నాటకములలో ప్రవేశపెట్టలేదు. ఏకోరసః కరుణ ఏవ అని కరుణరసమయమైన దృష్టితో యీ కవి లోకాన్ని చూసేడు. కనుకనే కరుణ రస పోషణలో యీకవి చూపించిన చాతుర్యం శృంగార రస పోషణలో చూపించలేక పోయాడు. కాళిదాసునకు, భవభూతికి గురువు వాల్మీకే అయినప్పటికీ, వ్యక్తిగతమైన మానసిక పరిస్థితులచేత, యీ రచయితల గ్రంథములలో విపరీతమైన భేదం మనకు కనిపిస్తుంది.

ఇంతే కాకుండా అనుసరించేవారు ప్రజ్ఞావంతులు కాకపోయినట్టయితే, ఆ అనుసరణ కేవలం వికృతంగా కూడా మారిపోతుంది. వ్యాసుడు, వాల్మీకి పెద్దలైన కవులు గంభీరమైన భావములతో కావ్యాల్ని వ్రాశారు. ఆ కావ్యములలో ఉండే ధర్మాలను గ్రామ్య ప్రజలకు ప్రబోధించడంకోసం వీధిభాగవతములు, ధీశాలులు కాకపోవడంచేత భాగవత రామాయణాదులలో ఉండే సున్నితమైన హాస్యం, సరసమైన శృంగారం, తోలు బొమ్మలాటలలోనూ, వీధిభాగవతంలోనూ మోటుహాస్యంగానూ, అసభ్యమైన శృంగారంగాను కూడా మారిపోయింది. కాబట్టి ఒకకవి మరొక కవిని అనుసరించేటప్పుడు ఆ కవితాలూకు ప్రభావం (Influence) యితనిమీద యే విధంగా పరిణమించినదీ విమర్శకుడు గమనించాలి. ఇది చాలా కష్టసాధ్యమైన పని.

ఏదైనా ఒక కావ్యం మనకు లభించినట్టయితే, దానిని మనకు సుపరిచితమైనటువంటివీన్నీ సుప్రసిద్ధమైనటువంటివీన్నీ కావ్యములతో పరిపోల్చి, ఆ కావ్యంతాలూకు గొప్పతనాన్ని నిర్ణయించాలి. మాననీయులైన అడిదం రామారావు పంతులుగారు విస్మృతకళింగాంధ్ర కవుల గ్రంథములను పరిశీలించినప్పుడు యీ పద్ధతినే అవలంబించేరు. పచ్చిమెట్ల పాపయకవిగారు వ్రాసిన రామచంద్రశతకమును సూరకవివిరచితమైన పోట్లపాటి వెంకటరమణత్రిశతకముతో పరిపోల్చి యీ విస్మృతకవిశతకానికి సారస్వతంలో యథార్థమైన స్థానాన్ని యిచ్చేరు. ఒక కావ్యాన్ని వేరొక కావ్యంతో పరిపోల్చి దాని కావ్యగుణములను శోధించడానికి విశేషమైన కావ్య పరిచయం అవసరం. ప్రతిభావంతులైన పండితులే ఆ పనిని నిర్వహించగలరు.

కవి యే సంప్రదాయము ననుసరించి యే దృష్టితో కావ్యాన్ని వ్రాసేడో గ్రహించి, ఆ సంప్రదాయము ననుసరించే విమర్శకుడు కావ్యాన్ని చదవవలసి వుంటుంది. ప్రబంధరచనకు అష్టాదశవర్ణనలు వుండాలని ఆ నాటివారి నియమం. కాబట్టి ప్రతీ ప్రబంధంలోనూ మన్మథోపాలంభము వుంటుందనిగానీ, ప్రబంధములలో వుండే దోషాలన్నీ ఆకాలంలోకి జొచ్చుకు పోయినాయనిగాని, ఆక్షేపించడం అంత సమంజసమైన పనిగాదు. ఆ వర్ణన ఆ రచనకు నిర్దిష్టమైనది. కాబట్టి ఒక ప్రబంధమును వేరొక ప్రబంధముతో పరిపోల్చి దాని విశిష్టతను గ్రహించాలి. నేడు కొన్ని నూతన రచనా విధానములు వచ్చేయి. ప్రబంధములను వీటితో పరిపోల్చి, ఆ ప్రబంధములకు

కవియొక్క రచనలను ఆనుపూర్వికంగా చదివినప్పుడే ఆకవియొక్క ప్రతిభ క్రమేణ యేవిధంగా అభివృద్ధిపొందినదీ మనకు తెలుస్తుంది. సాధారణంగా కవితాలూకు ప్రథమగ్రంథములలో శ్లేష, యమకము అనుప్రాస మొదలైనవాటికి యెక్కువ ప్రాధాన్యం యిస్తారు. ఇదిగాక పద్యపాదంతోటే భావంకూడా పూర్తి అయిపోతుంది. కొంచెం పరిణతమైన ప్రజ్ఞగలవారు ఒకేభావాన్ని మూడునాలుగు పాదములవరకు నడిపిస్తారు. అందుచేతనే పాదముతో భావము పూర్తి అయ్యే పద్యములు (End stopped lines) గల నాటకములు షేక్స్పియరు ప్రథమదశలో వ్రాసినవని విమర్శకులు సిద్ధాంతీకరించేరు. నిర్వచనోత్తర రామాయణంలోకంటె భారతంలోనే తిక్కన ప్రౌఢిమ యెక్కువగా ప్రదర్శించేడని విజ్ఞుల అభిప్రాయం. భవభూతియొక్క మొదటి నాటకానికీ, చరమదశలో వ్రాసిన ఉత్తరరామచరిత్రకూ అమితమైన భేదం కనబడుతుంది. మహావీరచరిత్రలో, కవి తనపాండిత్యానికే యెక్కువ ప్రాధాన్యం యిచ్చి మారుమూల పదాల్ని క్లిష్టమైన వ్యాకరణ విశేషములను ప్రయోగించేడు. కాని ఉత్తర రామచరిత్రలో కథా సంవిధానాన్ని అత్యంతరమణీయంగా యేర్పరచి, కరుణరసాన్ని అప్రతిహతంగా పోషించేడు. ఉత్తర రామచరిత్రలో కావ్యకళానైపుణ్యాన్ని అత్యద్భుతంగా ప్రదర్శించి కొన్నిచోట్ల కాళిదాసునికూడా మించిపోయినాడు.

మహాకావ్యము లన్నీ ధ్వనిప్రధానములు. మహత్తరమైన అనర్ఘరసములను, సంక్షిప్తంగా కవులు తమ కావ్యాలలో వ్యక్తీకరిస్తారు. కాబట్టి సామాన్యజనంకూడా యీకావ్యములలో వుండే గొప్పతనాన్ని గ్రహించేటట్లు చేస్తాడు విమర్శకుడు. మనోహరమైన సంఘటనలను చిత్రించడంలో ఆరితేరిన శిల్పి తిక్కన. అనేకమంది మనుష్యు లున్నప్పుడు వారిలో యిద్దరు యితరులకు యేవిధమైన అనుమానం కలిగించకుండా సాంకేతికంగా మాట్లాడుకునే విధానాన్ని ఇతను యెన్నోచోట్ల అతిరమ్యంగా విశదీకరించేడు. విరాటపర్వంలో గోగ్రహణ ఘట్టాన్ని పరిశీలించినట్లయితే

మహావీరులతో కూడిన సేనా సముద్రాన్ని యెదుర్కోడానికి అర్జునుడు ఒంటరిగా రావడం చూసి ద్రోణుడు అబ్బురపడ్డాడు. ఈ సమయంలో అర్జునుడు తన పరాక్రమాన్ని విజృంభింప చేసినట్లయితే, పాండవులకు సమయభంగం అవుతుందేమోనని ద్రోణునకు అనుమానం కలిగింది. కాబట్టి తన సందేహాన్ని నివృత్తి చేసుకోడానికి భీష్మునితో కనుసంజ్ఞ చేసి,

"ఎరవకరిగాక మీకు కురు
వీరులకుం బొడసూపువాడె, య
చ్చెరువొకమాని పేర నిటు
చేరగవచ్చుచు నున్నవాడహం
కరణము కాని యొండొకటి
గాదది పూర్తి విశేష మారయన్,
సరసతియట్లు వీనిమది
చొప్పది యెట్లొ యెరుంగ నయ్యెడున్"

అని అంటాడు. ద్రోణుడు చెప్పిన మాటలలో భావశ్లేషవుంది. ఈమాటల భావం భీష్మునికి ఒకలాగ మిగిలిన సేనకు మరొకలాగ అర్థమయింది. సైనికులందరూ ద్రోణుడు తమశత్రువు యొక్క సాహసాన్ని గురించి యీవిధంగా చెప్పేడని మాత్రమే అనుకున్నారు. కాని ద్రోణుడు నిగూఢంగా వ్యక్తీకరించిన సందేహాన్ని భీష్ముడు తెలుసుకున్నాడు. పాండవులకు అజ్ఞాతవాస పరిమితి దాటిపోయినదనీన్నీ, అర్జునుడు తన పరాక్రమాన్ని యిటుపైని విజృంభింప చేయవచ్చుననీన్నీ భీష్మునికి తెలుసును. కాని యీసంగతి వెంటనే ద్రోణునికి చెప్పినట్లయితే, వీరిద్దరూ ప్రత్యేకంగా మాట్లాడుకోవడం చూసి దుర్యోధనుడు అనుమానించవచ్చును. కాబట్టి భీష్ముడు ద్రోణునికి కావలసిన విషయాన్ని నిగూఢంగా వుంచి దుర్యోధనునితో యీ విధంగా అంటాడు.

"తలపగ రిపులకు నెమ్మగు,
కొలది గడచి వచ్చె నిదె యకుంఠిత బాహా
బలము నెరప నరుడయ్యెను
జలింపవలదింక మనకు శత్రులవలనన్"

దుర్యోధనునికి ధైర్యం చెప్పడానికి భీష్ముడు యీ విధంగా అన్నాడని సైనికులు భ్రమపడ్డారు. కాని "శత్రులను నిమ్మకుకొలది గెలిచివచ్చితిమి, జలింప వలదింక మనకు శత్రులవలనక" అన్న వాక్యం ద్రోణునికిమాత్రం మరొకవిధంగా బోధపడింది. అజ్ఞాతవాస పరిమితి దాటిపోయిన దనిన్నీ, అర్జునునకు శత్రువుల వల్ల యేవిధమైన భయము లేదనిన్నీ పైవాక్యం ద్వారా ద్రోణుడు గ్రహించి, చాలా సంతోషించేడు. తిక్కన అమాత్యుడైనందుకు తన రాజనీతి కౌశలాన్ని యిటువంటి సంఘట్టనలలో విజృంభింపజేసేడేమో అనిపిస్తుంది. ఈలాంటి విషయాల్ని విమర్శకుడు పాఠకులకు తెలియజెయ్యాలి.

ఇదిగాక కావ్యంలో వుండే పాత్రపోషణ, రసపోషణ, సంఘట్టనాసంవిధానము, పాత్రల స్వభావ నిరూపణ, మొదలైన విషయాలు సామాన్య పాఠకులు సులువుగా తెలుసుకోలేరు. కాబట్టి యీ విషయాలను గురించి విమర్శకుడు విపులంగా వారికి బోధించాలి. కనుక విమర్శకుడు ప్రతిభావంతుడైన కళోపాసకు డైనప్పుడే కావ్యాన్ని కూలంకషంగా పరిశీలించి దాని గుణాగుణములను నిర్ణయించ గలుగుతాడు.

కొంతమంది విమర్శకులు శ్రీనాథుడు కర్ణాటుడా, ఆంధ్రుడా? ఆంధ్రుడయితే నెల్లూరిమండలమువాడా? అనిన్నీ, మరికొందరు నన్నయ వైదికా నియోగిగా? అనిన్నీ, నన్నెచోడుడు నన్నయకు పూర్వుడా అర్వాచీనుడా అనిన్నీ పరిశోధనలు సాగించేరు. రసాస్వాదనమే ప్రధానంగాగల చదువరికి యీవిషయంతో జోక్యం లేనప్పటికీ, సాహిత్య చరిత్రను వ్రాసి కవికాలాదులను నిర్ణయించేవారికి యిటువంటి పరిశోధన అత్యంత ప్రధానమైనది. ఇటువంటి పరిశోధన కొంతమందికే పనికివస్తుంది.

మరికొందరు విమర్శకులు రామాయణాది గ్రంథములను కేవలం ద్వైతపరంగా గాని, అద్వైతపరంగా గాని అన్వయించి అర్థం చెబుతారు. ఈవిధమైన సాత్త్వికవిమర్శన బహుళజనోపయోగంగా వుండదు.

కవికీ సంఘానికీ అవినాభావసంబంధం వుంది. మానవజీవితంలో వుండే సంఘట్టనలను ఆహ్లాదకరంగా నిరూపించడమే సారస్వతము యొక్క పరమావధి కాబట్టి, ఆనాటి సాంఘికపరిస్థితులను కవి తన కావ్యంలో పరోక్షంగా నిరూపిస్తాడు. శైవమతానికీ, వైష్ణవమతానికీ బహిరంగమైన వాద ప్రతివాదములు జరిగే ఆ రోజులలో మహాకవి సాహసపోషుడు తనకృతిని హరిహరనాథునికి అంకిత మిచ్చి గ్రంథములోకూడా శివకేశవులకు అభేదాన్ని నిరూపించేడు. వీరేశలింగంగారికాలంలో జరిగిన ప్రబలమైన సాంఘిక సంస్కరణలే వారి ప్రహసనములకు కారణమని మనందరకు తెలిసినవిషయమే. నేడు హరిజన దేవాలయ ప్రవేశముతో "మాలపిల్ల" జమీందారీ రైతుల ఆలజడితో "రైతుబిడ్డ" అనే చలనచిత్రాలు రావడం మన మందరం చూస్తున్నాం. కాబట్టి విమర్శకుడు కవిని, ఆ కవిని పరివేష్టించిన సాంఘికపరిస్థితులనుకూడా గుర్తించాలి.

ఆంధ్రభాషలో పదకొండవ శతాబ్దమునుంచీ మనోహరమైన సాహిత్యగ్రంథములు వెలువడ్డాయి. కాని సాహిత్య సమీక్షా గ్రంథములు మాత్రం మన భాషలో చాలా తక్కువ. షేక్స్పియరు నాటకములను విమర్శిస్తూ నేటివరకూ యెన్నోవందల పుస్తకాలు వ్రాసేరు. మనంకూడా కవిత్రయము యొక్క పాత్రపోషణ, సంఘట్టనాసంవిధానము, భారతకాలము నాటి యుద్ధకౌశలము మొదలైన విషయములను గురించి ప్రత్యేకగ్రంథములను వ్రాయవచ్చును. మహాభారతంలో ఉండే సంస్కృతిని కూలంకషంగా తెలియజేసే గ్రంథంమాత్రం అత్యావశ్యక మని చెప్పాలి.

నేడు యుద్ధదేవత మహాప్రళయంగా తాండవ మాడుతూ వుంటే యీ విమర్శనలకు కావ్యసృష్టికి తావే దని ప్రశ్నించవచ్చును. గాని పదకొండవ శతాబ్దమునుంచి నేటివరకు భారతదేశంలో యెన్నో సంగ్రామాలు జరిగేయి, యెన్నో మతములవారు దేశాన్ని పాలించేరు కాని ఆనాటి గ్రంథములకు

మైన సంచలనం కలగలేదు. కవిత్రయమువారు ఆనాటి వారిచేత యేవిధంగా ఆదరింపబడియుండిరో, యీ నాటివారిచేతకూడా అదేవిధంగానే పూజింపబడు చున్నారు. భవభూతి ఉత్తరరామచరిత్ర ఏడవశతాబ్దమువారికి యేవిధమైన మనోవికాసము, హృదయావేశము కలిగించినదో, యీనాటివారికికూడా అదేవిధమైన వికాసమును, ఆవేశమునే కలిగిస్తున్నది. కాబట్టి కావ్యమునకు సార్వజనీనత్వము స్థిరత్వముకూడా లభిస్తుంది. ఏదేశంలో మనోబలము, దేహబలము, అహమహమికాభావంతో శోభిస్తాయో, ఆ దేశమే సర్వతోముఖాభివృద్ధిని పొందుతుంది. కాబట్టి విజ్ఞులు ఆంధ్ర సాహిత్యమును ప్రోత్సహింతురుగాక !

చాటుపద్యము

శ్రీ శేషాద్రిరమణ కవులు

కాకతీయ ప్రతాపరుద్రదేవుని గూర్చి సంస్కృతవాఙ్మయమున చాటుశ్లోకములు గలవుగాని, అతని గూర్చిన తెలుఁగుపద్యములు వినియుండము. ఈతని మాతృభాషలోఁ గవులు కావించిన ప్రశంసాపద్యములు వినరాకపోవుట శోచనీయము. నూఱుసంవత్సరముల క్రింద వ్రాయఁబడిన దశావతారచరిత్రము అను లిఖితగ్రంథములోఁ గొన్ని చాటుపద్యములతోఁ బాటు ప్రతాపరుద్రచక్రవర్తిని గూర్చిన ఈ చాటుపద్యము గలదు. అతని వితీర్ణమునకీ పద్యము సాక్ష్యముగాఁ గలదు.

"చం. దినకర! రేయునుం బగలు త్రిమ్మర నేల సురాద్రిచుట్టు; నీ
పెనయఁ బ్రతాపరుద్రమనుజేంద్రశిఖామణి భూరిదానవ
ర్తనుఁ దగఁ జూడఁగా సురధరాధర మర్థుల కిచ్చు నంచునో
యనఘ నమశ్శివాయ విభుఁ డాఢ్యుఁడు దేవధనంబు ముట్టునే."

ఏకలవ్యుడు

శ్రీ మల్లంపల్లి ఉమామహేశ్వరరావు.

ద్రోణుడు — కౌరవపాండవుల గురువు.
అర్జునుడు — పాండవ మధ్యముడు.
నకుల సహదేవులు — అర్జునుని తమ్ములు.
ఏకలవ్యుడు — నిషాదయువకుడు.
దుర్యోధనుడు — కౌరవనాయకుడు.
సువర్మవికర్ణులు — దుర్యోధనుని తమ్ములు.

మొదటిరంగము

[హస్తినాపురము: ద్రోణాచార్యుల భవన ప్రాంగణము. ద్రోణుడు ఆసనోపవిష్టుడై యుండును. ఆయన కెదురుగా ఏకలవ్యుడు వినమ్రభావము సూచించు ముఖముతో చేతులు రెండును జోడించుకొని మోకాళ్లపై కూర్చొని యుండును.]

ద్రో — వీలు పడదంటిని కదా! నీకేమి నేను ధనుర్విద్య నేర్పలేను!

ఏకల — తమ రిట్లు విద్యాదానమును నిరాకరింతు రని నేను కలనైన తలపలేదు. తమవద్ద శిష్యునిగ చేరి విద్య నభ్యసింతునని ఎంత ఉప్పొంగిపోతిని! మరల ప్రార్థించుచున్నాను. నన్ను శిష్యునిగ నంగీకరింపుడు.

ద్రో — ఓయీ గరువక గరువక నిషాదకులజునికా నన్ను విద్య గరుపమందువు? ఎంతటి ధర్మ విరుద్ధము.

ఏకల — స్వామీ! విద్యకు కులముతో సంబంధ మేమి? హీనకులజులు ఉన్నతవిద్యల నభ్యసించుట ఏల దోషము? అందువలన విద్యకు కళంకము కలుగు నందురా?

ద్రో — ఇట్టి విద్యల నభ్యసించుటకు హీనకులజుల కధికారము లేదు. అది ధర్మ విరుద్ధము, ఆచార విరుద్ధము. వర్ణాశ్రమధర్మములు పరిపాలింపబడ వలెను. బ్రహ్మక్షత్రియనందనులకే ధనుర్వేదము నభ్యసించుట కధికారము కలదు.

ఏకల — అది వారికే కల దననేల? ఇతరుల కెందుకు లేదు? విద్య, జ్ఞానము ఒకరి సొత్తా?

ద్రో — పూర్వమునుండి వచ్చు కట్టుబాటిది. సనాతనార్యసంప్రదాయము. ఎవరి నియమములైన ఆచార ధర్మములను వారు చేయవలయును. ఇది సంఘశ్రేయము. శుభప్రదము. అనాదిసిద్ధముగ వచ్చుచున్న కులాచారములను విసర్జించినచో యిక సంఘ మెక్కడ? శ్రేయ మెక్కడ? ఇంకను చిన్నవాడవు . . . నీకు తెలియదు సౌమ్య.

ఆల్ ఇండియా రేడియో, మద్రాస్ వారు బ్రాడ్కాస్ట్ చేసిన నాటిక యిది. వారి అనుమతితో

ఏకల — అట్లయిన హీనకులజులకు ఉన్నతవిద్య కధికారమే లేదా? ఎట్టి ఉన్నతకార్యములకును ఉపయోగింపనేరాదా?

ద్రో — ఆర్యులు ఎవరియోగ్యతకు తగినట్లు వారికి విద్యాధికముల కవకాశ మిచ్చియున్నారు. దానికి తగినట్లు సంతృప్తులై తమ తమ ధర్మములను నిర్వహింపవలె.

ఏకల — ధర్మజ్ఞా! చిన్ననాటనుంచి నాకు ధనుర్విద్యయన్న విపరీతాభిమానము. తగిన ఆచార్యునికొరకు దేశము కాని దేశములన్నియు తిరిగినాను. ఎక్కడికి వెళ్లినను మీ ధనుర్విద్యాకౌశల ప్రశంసే నా చెవిని పడినది. మీ విలువిద్య పాటవము గూర్చి ఎన్నెన్ని కథలో విన్నాను! నాటినుంచి మిమ్ము వెదకికొనుచు నేటికిచ్చటికి వచ్చినాను. మీరే నా గురుదేవులు. నిరంతరము మిమ్ము నా హృదయమునందు ఆరాధించుచునే ఉన్నాను. మిమ్ము గురువులుగ భావించి యిదివరకే యీవిలువిద్యలో కొంత సాధనచేసినాను. గురుమంత్రోపదేశము లేని విద్యకు సిద్ధిలేదు. అందుకే తమకడకు విద్యార్థినై వచ్చినాను.

ద్రో — ఓయీ ధర్మవిరుద్ధముగ ప్రవర్తింప నన్నేల ప్రోత్సహించెదవు? అయినను నిషాదులు మీకు విలువిద్య వేరే నేర్పుట ఎందుకు? మీకు సహజముగ వచ్చు విద్యయే కదా. అది... ఏకలవ్యా! నామీద నీకుగల భక్తికి, ధనుర్విద్యమీద నీకుగల ఆసక్తికి చాల సంతోషించినాను... కాని...

(ఆకాశము వంక చూచి)

ఆశ్చర్యమే! పాపము పావురము... తరుముకొని వచ్చుచున్నది డేగ... ఆ కపోతము అంగలార్చుచున్నది... వెంటనంటి పోవుచున్నది... అయ్యో.. దగ్గర ధనస్సు లేకపోయినది కదా?

ఏకల — గురుదేవా! యిదిగో ధనస్సు... ఉండుడు.. చచ్చెను డేగ...(బాణము వేయును)

ద్రో — ఎంతటిలక్ష్యశుద్ధి నీది. త్రుటిలో ఎగురుచున్న డేగనే పడగొట్టితివి. వత్సా! ఆయుష్మంతుడవై వర్ధిల్లు. ఎవరివద్ద నేర్చినావయ్యా యింతటి విద్య...

ఏకల — మా గురుదేవులవద్ద.

ద్రో — ఎవరా మహనీయుడు?

ఏకల — తమరే గురుదేవా! తమమూర్తిని మట్టితో నిర్మించుకొని ఆత్మనిష్ఠతో యింతవరకు ధనుర్విద్య నభ్యసించితిని. గురుదేవా! ఇప్పుడైన నన్ను శిష్యునిగ నంగీకరింపుడు.

ద్రో — ఓయీ, స్వయముగనే యింతటి హస్తలాఘవము సంపాదించిన నిన్ను ఎంతని పొగడను? నాకడనే విద్య నేర్చినచో నీవెంతటివాడవు కావు?... కాని నిన్ను శిష్యునిగ అంగీకరించుటకు నాకు గూడ అదృష్ట ముండవలెను.

ఏకల — ప్రభూ! అది మీలోనున్నది. అంగీకరించుట అంగీకరింపకపోవుట.

ద్రో — వత్సా! నేను దుర్బలహృదయుడను. సనాతన ధర్మములను ఉల్లంఘింపలేను. పొమ్ము. మరొక ఆచార్యుని వెదకికొని విద్య నభ్యసింపుము. నేనును ఆశీర్వదింతును.

ఏకల — వెనుకటి పరిస్థితుల ననుసరించి చేసిన కట్టడులు యిప్పుడుకూడ చెల్లవలెననుట ధర్మవేత్తలను మీకు ఉచితమా గురూ! పరిస్థితులు మారినవి. మీవంటివారు...

ద్రో — ఓయీ! నాయిష్టము వచ్చినట్లు చేయుటకు నేనెవ్వడను. ధర్మపరిపాలకుడు రాజు. అధర్మ వర్తనకు జరిగినచో రాజు మన్నింపడు. సంఘము సహింపదు . . . నాకును నిన్ను శిష్యునిగ పరిగ్రహింపవలె నని ఉన్నది . . కాని ధర్మాతిక్రమణ చేయజాలను. ఏకలవ్యా ! ఇక నిటనుండి పొమ్ము . . నామనస్సు ఓసవు పడలుచున్నది.

ఏకల — గురుదేవా ! హీనకులజులైన నావంటివారికి విద్యార్జనకు అవకాశమే లేదా ? కులమే ప్రధా

వమా? గుణము యోగ్యతే అప్రధానమా? యి
దెక్కడి ధర్మము.

ద్రో — వత్సా! ఎక్కడికి వెళ్లినను నీకు శుభమగును గాక. పొమ్ము... ఆచారముసంకెలలో ప్రభువు దాస్యములో తగులుకొని ఉన్న నాకు నీకోర్కె సఫలము చేయుట చేతకాదు.

ఏకల — ఇక ఆశ లేదా గురుదేవా? హీనకులమున పుట్టినందుల కిదియా ప్రతిఫలము. ఆ కులమున పుట్టితి నన్న అది నాతప్పా. అందుకు నే నెట్లు బాధ్యుడను.

ద్రో — వత్సా! యింక తరచక యిటనుండి పొమ్ము. నేను అస్వతంత్రుడను. దుర్బలుడను. సనాతనాచారధర్మనిబద్ధుడను. నీకు విద్యాప్రదానము చేయలేను. పొమ్ము. మరల నెప్పుడు నీ వీనగరపు పొలిమేరల గనపడరాదు.

ఏకల — మీ మనస్సు నొప్పించి...

ద్రో — ఏకలవ్యా... పొమ్ము.

(ఏకలవ్యుడు నిష్క్రమించును.)

అబ్బా! విద్యాదానమున కెంతగ ప్రాధేయపడినాడు. ఎంతటి ప్రజ్ఞావంతుడు. వెళ్లుచు వెళ్లుచు మువ్మారు ప్రదక్షిణచేసి మరీపోయినాడు... ఏమి ఆచారము, ఏమి నియమములు ... గుణము యోగ్యతే ప్రధానము కదా ... కులమా ... కులము ... ఛీ ... ఏమి ధర్మము లివి.

రెండవరంగము

(వనప్రదేశము: దుర్యోధనుడు ఆలోచనాపూర్వకముగ ఇటు నటు పచారు చేయుచుండును. దూరములో ఏకలవ్యుని కుటీరము కనపడుచుండును.)

దు — మొన్న ఆచార్యులవారు పెట్టిన అస్త్రవిద్యా పరీక్షలో నెగ్గినప్పటినుంచి పాండవులకు పొగరెక్కువైనది. అందులో అర్జునునికి కిందు మీదులు తెలియుటలేదు. ఎట్లయిన అతనికి పరాభవము కావింపవలెను. అర్జునుని అస్త్రాభ్యాసము నెపమున పరాభవింపవలెను. అదుగో వికర్ణుడు .. ఏమన్నారో?

(ప్రవేశము : వికర్ణుడు)

ఏమన్నారు వికర్ణా! వచ్చెదరా వారు.

విక — అన్నా! ధర్మజుడు, భీముడు విదురు నింటికి వెళ్లినారు. అర్జున నకుల సహదేవులు వచ్చుచున్నారు.

దు — చాలు మనకు కావలసినది వారే. కర్ణు డేడి?

విక — కర్ణ దుశ్శాసను లేవటకో పనిమీద వెళ్లినారు. వీలయిన వచ్చి యిక్కడ కలుసుకొందుమన్నారు. అదుగో అర్జునాదులు.

(ప్రవేశము : అర్జున నకుల సహదేవులు.)

దు — ఒకపరి అస్త్రాభ్యాసము చేయుదము. ఏమందు వర్జునా?

అర్జు — మీయిష్టము.

నకు — మరల పరాభవమునకా?

అర్జు — తమ్ముడా వూరుకో.

దు — అదుగో .. ఆచెట్టుకొమ్మపై యీ చిన్న బొమ్మను పెట్టెదను. దానిని గురిచూచి కొట్టవలయును.

సహ — ఈసారి నేను తప్పక యీపోటీలో గెలిచెద చూడు.

విక — నీ ప్రగల్భములు కేమిలే.

అర్జు — సిద్ధమేనా అందరూ? ప్రారంభింతమా దుర్యోధనా?

దు — కానిండు. ముందు మీరందరు — ఎవరు ఆ వచ్చునది. ఆర వెవరో బాణతూణీరములతో యిటే వచ్చుచున్నాడే.

(ఏకలవ్యుడు ప్రవేశించును.)

ఎవరోయి నీవు.

ఏకల — నేను నిషాదుడను ... అస్త్రవిద్యాభ్యాసము చేయుచ ట్లున్నారు. దానిని చూడవచ్చినాను. నేను కూడ యిందుపాల్గొన వచ్చునా?

దు — నీనివాస మెచ్చుట.

ఏకల — అదిగో ఆదూరమున కనపడు పర్ణకుటిరే నాది.

దు — ఏమందువర్జునా! యితనినికూడ అస్త్రా మొనరింప అంగీకరింతువా మనతో పాటు.

అర్జు — తప్పక. నా అభ్యంతర మెప్పుడును వుండదు.

ఏకల — (తన) ఓహో! మీరు కౌరవపాండవులా? ఎంతటిధన్యులు. నా ఆచార్యులవారి శిష్యులు.

దు — ఓయీ నీవుకూడ పాల్గొనవచ్చును . . . మొదలెట్టండి . . . తప్పినది . . . నీ గురి తప్పినది . . . అయ్యో . . . నీది మొదలే చెడినది . . . బారెడుదూరముగ పోయినది నీబాణము . . . . ఆఁ నీది తప్పినది . . .

అర్జు — నకులా! నీవు . . అయ్యయ్యో . . కొంచములో తప్పిపోయినది.

దు — నీదా సువర్ణ బాణము . . . ఆఁ తగిలె . . ఊహుఁ . . తప్పిపోయినది . . ప్రతిమ గాలి సవ్వడికి కదలిన దంతేనా? .. అర్జునుడే మొనగాడు . . అర్జునా వేయుము . . అరరే . . . యిదేమి విరుద్ధము . . . నీకును దూసుకుపోయినదే . . . అయినది . . . ఏమి పొంగిపోయి తబ్బిబ్బయితివి మొన్న . . . వెనుక ఆచార్యులున్న ఎంత నాటకమయిన ఆడెదవు . . . ఆహా! ఎంతటిపరాభవము . .

సు ని — ఆహా! ఎంతటి పరాభవము. ఓతాయిలారికి.

దు — వికర్ణా! ఉడికించకు ఒంటరిగాచేసి అతనిని. చూడు అతనికన్నుల నీరు తిరుగుచున్నది . . . ఊరకుండుడు.

అర్జు — నన్ను డికించ నక్కర లేదు . . . చే పడకను మానవలె.

దు — అతడు నడకదు మడకదు . . ఊరకుండుడు . . . ఓయీ నిషాదకుమారా! నీవు వేయుము. నీకసలే సాధ్యము కాదులే . . . అర్జునుడు తప్పిన నీవా కొట్టుట . . . వేసినావా బాణము . . . అరరే డబ్బలో బొమ్మ కూలినది . . . ఎంతటి లక్ష్యశుద్ధినీది . . . మా అర్జునుడిని తలదన్ను నట్లున్నావే!

అర్జు — ఓయీ ఎవరునీవు.

ఏకల — నేనొక ఎరుకలవాడను.

దు — ఇటురమ్ము. కూర్చుండుము. నీ పేరు?

ఏకల — నన్ను ఏకలవ్యు డందురు. తమ పేరు తెలుసుకొన వచ్చునా?

దు — నేను సుయోధనుడను. వీరు నాతమ్ములు. ఆతడు పాండవమధ్యముడు. వారు నకులసహదేవులు.

ఏకల — మీ కందరకు అంజలిచేసి మ్రొక్కుచున్నాను. మీ దర్శన మైనందుకు చాల సంతోషము కలిగినది. చాలసుదినము నేడు.

అర్జు — నీ గురు వెవ్వరు.

ఏకల — నా గురువా. . . . వారి శిష్యుడనని పిలుచుకొను భాగ్యము నాకు లేదు.

వి — అన్నా వీనిని మన కొలువులోనికి తీసికొందమా?

విక — చెప్పెద నుండుము . . . చూడు ఏకలవ్యా! మా అర్జునునికూడ తలదన్నితివే! పాప మాతడెట్లు దిగులుగొన్నాడో.

అర్జు — పోనీ, నీ వెవరిని గురువుగా భావించుచుంటివో మాకు తెలుపవచ్చునుగా!

ఏకల — నాగురుదేవులు శ్రీ ద్రోణాచార్యులవారు. కాని వారు నన్ను శిష్యునిగ నంగీకరింపజాలకున్నారు . . . నేను నిర్భాగ్యుడను . . .

అర్జు — ఏమి! ద్రోణాచార్యులవారా? వా రంగీకరింపనిదే నీ కింత విద్య ఎక్కడినుండి వచ్చినది?

దు — ఆ ప్రశ్నలన్నీ నీ కెందుకు? నీకు సమాధాన మిచ్చినాడు అంతే...

ఏకల — ఆ గురుదేవుని వాత్సల్యముచేతనే.

దు — దాని కేమిగాని, ఏకలవ్యా! మా కొలువున నుందువుగాని మా నగరమునకు రమ్ము.

ఏకల — ప్రభూ! మీ దయకు ఎంతయు కృతజ్ఞుడను. కాని గురుని అనుమతి లేనిదే నగరసీమను వదల అడుగిడజాలను.

దు — వారి అనుమతి ఏల? నీకు వచ్చిన భయము లేదు రమ్ము.

ఏకల — క్షమింపుడు. నాకు గురువాజ్ఞ లేదు. వారిని సందర్శింపగల భాగ్యమైనా వుండునో ఉండదో యింక.

అర్జు — ఏకలవ్యా! విచారింపకు. వారికి నీ సమాచారము తెలిపి వారిని నీకడ కొకమారు తీసుకు వచ్చెదను.

ఏకల — ఏమి నిజమేనా? వారు నా పర్ణకుటీరమునకు వచ్చెదరా? అంతటి భాగ్యమే అయితే వారి నొక్కమారు తప్పక తీసుకువచ్చెదరా? మీకు కృతజ్ఞుడను.

అర్జు — తప్పక తీసుకు వచ్చెదను.

దు — రావా మాతో ఏకలవ్యా.

ఏకల — క్షమింపుడు. మహారాజ! గుర్వాజ్ఞ లేదు నాకు. మరువకుమీ ఓ పాండవమిత్రమా.

(అందరు నిష్క్రమింతురు.)

మూడవ రంగము

[అదే వనప్రదేశము: వేరొకవైపు ద్రోణార్జునులు మాటలాడుకొనుచు ప్రవేశింతురు.]

ద్రో — అయిన నిపుడేమందువు?

అర్జు — ఏకలవ్యుడట...నిషాదుడట...ఏమి నైపుణి.. తుదకు నే నోడితిని...అతడు గెలిచినాడు...

ద్రో — అతనిని రానిచ్చిదెవరు?

అర్జు — దుర్యోధనుడు...అతనిని తన కొలువులోనికే తీసికొందును రమ్మన్నాడు. కాని గుర్వాజ్ఞ లేదు, రానన్నాడు. మీరు గురువులటగా అతనికి...నన్ను మించినవాడు లేడని [illegible]టని...తగిన పరాభవమైనది...మీకు నాకంటె ప్రియశిష్యుడు లేడనుకుంటిని...

ద్రో — ఇప్పటికీ నీవే నా ప్రియశిష్యుడవు.

అర్జు — ప్రియ శిష్యుడని ఏమిలాభము. శస్త్రాస్త్ర విద్యలలో నన్ను అద్వితీయుని చేసినప్పటి మాట కద?

ద్రో — నీకిదివరకే మాట యిచ్చితిని కదా? ఈ విద్య యందు నీతో సరివచ్చువా డుండడని...

అర్జు — ఉండకపోవుట యేమి? ఏకలవ్యు డుండనే వున్నాడు. అతని నేర్పు, చాకచక్యము ... మీరు నేర్పనిచో అతని కింత కౌశల మెటనుండి వచ్చినది..

ద్రో — అర్జునా! విద్యాపిపాస ఉన్నవారికి అన్నియు సాధ్యములే...

అర్జు — ఇప్పటికి నే నూహించుకొనలేకున్నాను. అంతటి ప్రజ్ఞ ఎట్లు... ఇటు.. ఇటు...

ద్రో — ఎక్కడికి తీసుకుని వెళ్లుచున్నావు.

అర్జు — అతని కడకే..

ద్రో — ఏకలవ్యునికడకా.. ఎందుకు.

అర్జు — అతనిని మీరు చూడవలెను. అతనివిద్యా కౌశలము చూచినపిదప నాకు ధైర్యము సడలినది.

ద్రో — అర్జునా పిరికిమాట లాడుచున్నా వేమి నేడు...

అర్జు — ఆచార్యోత్తమా! కౌరవపాండవులలో నా యంతటి ధనుర్విద్యా విశారదుడు లేడన్న దర్పముండెడిది, ఇంతవరకు...

ద్రో — ఇప్పుడుమాత్రము.

అర్జు — అట్లనకుడు.. ఇప్పుడా కర్ణుడు భార్గవుల యొద్ద అస్త్రవిద్యాభ్యాసము చేయుచున్నని తెలిసినది. అతనికితోడు ఇప్పుడీ ఏకలవ్యు డొకడు [illegible]

ద్రో — నీకు ఏకలవ్యునివలననిర్భయము పొసగ కట్టు కొన్నదే.

అర్జు — మరొక్కగురుడాతని సాధకించినచో రాజాజ్ఞ నతిక్రమించి మీ రాతనికి విద్యచెప్పక ఏమందురు.

ద్రో — వత్సా అర్జునా! నీకేమియు అట్టిభయము వలదు.

అర్జు — వల దన్నచో పోవునా?

ద్రో — అట్లయిన ఏమిచేయు మందువు నన్ను?

అర్జు — ఈ విద్యలో మా ఇరువురిలో శిష్యునిలో ఒకని అద్వితీయుని చేయుమందును.

ద్రో — శిష్యాలని చేయలేను.

అర్జు — అట్లయిన అతనిమీద...

ద్రో — అతని కన్న అభిమానము... అతని భక్తికి మేర లేదు.. అతడు కరకు తెలియకనే యిమ్మన్నను యిచ్చును.

అర్జు — అంతటిభక్తి పరుడా?..

ద్రో — నీ వెరుగవు. అదుగో చూడు, అతడేకదా ఏకలవ్యుడు. నా ప్రతిమ. ఆపూజ చూడు...

ఏకల — (ఆశ్చర్యముతో) ఓహో! ఏమిభాగ్యము. ఏమిభాగ్యము. నాగురుదేవులు. గురుదేవా! సాష్టాంగదండ ప్రణామములు.

ద్రో — నీవంటి శిష్యునిక చూడబోను...

ఏకల — ధన్యుడను...ధన్యుడను.

అర్జు — ఏకలవ్యా! మరి గురుదక్షిణ.

ఏకల — అర్జునా! ఈ నా సర్వస్వమూ నా గురువుల వారిదే . . . నాదేమున్నది . . ఏమి యిమ్మన్న నిచ్చెద . .

ద్రో — ఆహా! అంతటి సాహసికుడవే . . .

అర్జు — నీ అంగుష్ఠమును కోరుచున్నారు . . . గురు దక్షిణ...

ఏకల — ఇందుకు సందేహమెందుకు . . . యిదిగో..

ద్రో — అర్జునా ?

అర్జు — ఏకలవ్యా! నా రక్షణ సందేహించుచు న్నారు . . .

ఏకల — గురుదేవా! సందేహ మెందుకు . . . ఇది గో (కోసి యిచ్చును)

ద్రో — అర్జునా . . . ఏమిటి అర్జునా!

ఏకల — గురుదేవా! ఇదిగో నా అంగుష్ఠము మీ పాదములకడ నుంచితిని . . . ఇప్పటికదా మీకు నేను శిష్యుడ ననిపించుకుంటిని. గురుదక్షిణ రూపమున శిష్యత్వ ముద్ర పడినది . . . నాకంతే చాలు . .

ద్రో — ఏకలవ్యా!

ఏకల — గురుదేవా!



ప్రబుద్ధాత్మ

శ్రీ అ. సీతారాముడు

[ఎవరిలో కాని సుగుణాలకి నమస్కారము అవసరిస్తుందంటే, వాని మానవత్వం క్రమేణా నశిస్తూం వన్నమాట. రాక్షసుడుగానే అనతిమృగంగా తయారవుతాడు. వాని ఆత్మ గర్భం లోని దైవం పేరుకుకూడా నిలువదు.

ఈ సత్యాన్నే ఆ తివంరాత్రి సుందరి తెలుసుకుంది. అంతకుముందే ఆవేదన పట్టలేక బుద్ధునిగా వానిని, నందుని కోటికి వచ్చినట్లు తిట్టేతిట్టి అలసి నిద్రపోయింది. ఆర్తరుడు కలలో కనుపడినాడు. ఆమెకేమో వుపదేశిస్తాడు. ఆ సాన్నిహిత్యాన్నే సృష్టి యంతయూ ప్రతి ధ్వనించింది.]

౧

నాథ! నాథా! యటంచు ననాథ పగిది
వచ్చివచ్చి కృశించిన ఏమి ఫలము?
కనులు విప్పుము బయటిలోకమ్ము నలువు
విలయ తాండవమ్మును చూడ తలతువేని.

౨

ప్రియుని హృత్పీఠిపై నిల్చి రేయిపగలు
పూవుతోటల తిరిగెడు ముగ్ధ వగుట
పాపకూపమ్ములో చచ్చు ప్రాణికోటి
చేయు ఆక్రందనమ్ములు చెవిని బడవా!

౩

హస్తగతమైన బంగారుహంస నొకటి
దోచుకొంటి నం చూరక దూరకమ్మ;
మరల నీ కిత్తు అగ్నిలో మైల వదలి
ఇంతపాటి ద్రోహమ్ము క్షమింపలేవా!

౪.

మఱుని మేమములో అట్టె మాసిపోవు
మాయవెన్నెల చూచి మైమఱతు వేల?
చిమ్మచీకటిగుండెను చీల్చి చూడు
నూతనజ్యోతి నొకటి కాంతువు కుమారి.

౫

పరవశవయితి బాహ్యరూపమ్ము చూచి
అదియె పరమార్థ మని నమ్మి అంతరాత్మ
గాలరాచెదు పాపి నంఘమ్ముకొఱకు
పరితపించుటకూన దౌర్బల్య మగును.

౬

వలచి వలపించుకొన్న దంపతులబాధ
ఎఱుగ ననుకొంటివా? యశోధరవిషాద
గాథ లోకమ్ము మఱచిపోగలదె? అట్టి
తుచ్ఛభోగముల్ బ్రదుకును త్రుంచివేయు.

౭

బూదికుప్పను కన్నీటిబొట్ల తడిపి
ఏమి పొందెదు తుదకు రతిమతల్లి?
అమృతమున తేలియాడు హృదంతరమ్ము
ఇసుకదిబ్బగ మారిపోయినది గాని.

౮

మాత్సర్యయావనోద్ధతికి జంతువులు చిక్కి
కనులు గానక ఎన్ని దారుణము లైన
సలుపుచుండునుగాని మీవలపుకథలు
[illegible]

౯

పురుషుని పశుత్వమును మాన్పి ముక్తిపథము
చూపెడు సతీత్వ మిటు సర్వశూన్యమగునె ?
ఆత్మ సాధింప దలచు మహాశయములు
స్త్రీస్వరూపమ్ము: ఆర్యోక్తి తెలిసికొమ్ము.

౧౦

కాలసర్పము వేరు! పూమాల వేరు!
మృత్యువక్త్రము వేరు! యామినులు వేరు!
జ్వలితదావాగ్ని వేరు! భాస్కరుడు వేరు!
మలినకామమ్ము వేరు! ప్రేమమ్ము వేరు!

౧౧

వలపునవ్వులతో విడబారుకొన్న
పెదవిచాపల్యమున చిక్కి పదర నేల?
పుకగుపట్టిన చెక్కులు ముద్దుగొన్న
శాంతి చెందునో! యేమొ అస్ఖలితప్రేమ!

౧౨

క్షణమున నశించు సౌందర్య మనుభవింప
ప్రాకులాడు ప్రాణులకు నిర్వాణపథము
ఎట్లు రుచియింపగలదు ? అదృష్టహీను
లో! మహారాక్షసులో! పల్కవేమి తల్లి!

౧౩

అలల వింతసొబగులు నిత్యమ్ము లనుచు
కలలగూడ నాదృశ్యమ్మె తలచె దేల?
చూతువు నిజమ్ము సాంధ్యరుచులను; కాని
చీకటుల్ మోత అంతలో చెవులు చీల్చు.

౧౪

ప్రేమలో నిండుమున్కలు వేసినావు
పొందవలసిన సౌఖ్యమ్ము పొందినావు
ఇంక ఈ జీవితమ్ము చాలించి, నంద
[illegible]

౧౫

అనదమూలుగు, నిరుపేద ఆలమటింపు,
రోగిహాహారవము, పాపిరోదనమ్ము,
తెందకు విన లేక నందు డార్తులకు సేవ
చేయ భిక్షుకదీక్షను స్వీకరించె.

౧౬

సాంధ్యదేవత కుంకుమాక్షతలు చల్లి
నిన్ను కరుణించుకాల మాసన్నమాయె;
అనుభవనిశీథి నీగర్భమందు వెలుగు
సత్య మను పరంజ్యోతి కాంతిధ్య మిమ్ము.

౧౭

కనబడునదిమాత్రమ్మె లోకమ్ము గాదు
ఇందలిసుఖమ్ముతో ఆత్మ తృప్తిపడదు
ఎన్నిజగముల నేలిన ఏల వచ్చు
కాని లోనిశత్రుల గెల్వగలడె నరుడు ?

౧౮

ముండ్లతీగెలు ప్రాకిన మురికిగుంత
కమలినీకాంత లాట్లాడు అమృతసరసి
పారలి పోవని లోతుచూపులను బఱపి
ఇహమొ, లేక పరమొ నిర్ణయించుకొనుము.

౧౯

సంసరణమహాగ్నిశిఖలు చల్లపడగ
మోక్షలక్ష్మి యురస్థలి మోము వాల్చి
నిండుచందురు చిఱునవ్వు నిదురపుచ్చు
శుభవసంతయామినులను చూడలేవా!

౨౦

రానురాను అగాధమ్ములోన పడెడు
మనుజగతి చూచి పునరుద్ధరణకు మారు
వెచ్చ నూర్పుల కాలమ్ము వెళ్లబుచ్చు
[illegible]

శ్రీనాథుడు - కొన్ని ప్రయోగములు

శ్రీ పోతుకుచ్చి సుబ్రహ్మణ్యశాస్త్రి

కవిత్రయమువారితరువాత నాంధ్రమున భాషా సౌష్ఠవముతో రసపుష్టి యొసఁగ నౌచిత్యభరితముగఁ గావ్యముల రచించిన మహాకవి శ్రీనాథుఁడు. ఇతఁడు రచించిన గ్రంథములు పెక్కులు. అందులోఁ జాల వఱకు మనకు దొరకియున్నవి. ఇతఁడు తన గ్రంథము లని యుదాహరించిన వానిలోనే దొరకకయున్నవియు మఱికొన్ని గలవు. ఈ గ్రంథము లన్నియుఁ జాలవఱకు భాషాంతరీకరణములుగానే యున్నవి. ఐనను గావ్య రచనావిధానమున నీతఁడు చూపిన స్వాతంత్ర్య మన న్యాదృశము. ప్రబంధ వర్ణనాతీతము. శృంగారనైషధ మును సంస్కృతమునందలి శ్రీహర్ష నైషధమును పరిశోధించి చూచువారి కీవిషయము విస్పష్టముగాఁ దెలియును. ఔచితీ నిర్వహణమున నీతనిని మించిన కవి మన తెనుఁగువారిలోఁ గానరాఁ డనుట యత్యుక్తి గాదు. ఇట్టి కవిసార్వభౌముని గ్రంథములలోఁ బరిష్కర్తల పరిష్కరణములవలనను, ముద్రాపకుల యజాగరూకతచేతను, వ్యాఖ్యాతల బుద్ధి వైచిత్ర్యమునను కొన్ని దోషములు పొసఁగియున్నవి. పరిశోధకులలో నగ్రగణ్యులుగఁ బేరువడసిన మహాపండితులు సైతము నీ ప్రమాదములు కవిప్రయుక్తములుగానే యభిప్రాయపడి వీనిఁ బ్రమాణముగాఁ గొని విమర్శించుచుఁ గ్రొత్త క్రొత్తసిద్ధాంతముల చేర్పఱచుకొనుచున్నారు. అట్టివి కొన్ని శ్రీనాథుని కాశీఖండమును సరిగాఁ బరిశోధించి ముద్రింపించు తలంపుతో గ్రంథాన్వేషణ మొనర్చు నా కగపడినవి. ఇప్పుడు వానిలోఁ గొన్నింటిని మాత్రము యథా మతిఁ బరిశోధించి గుణదోష నిర్ణాయకములగు పండితలోకమున కెఱుకపఱచుకొనఁదలఁ బెట్టితిని.

౧

"శా. ప్రాతఃకాలమున వాయసంబు పలికెన్
పత్యుక్త శాస్త్రంబులోఁ
దాతజ్ స్థానలు చెప్పఁ జెల్వి యనువం
దం బొప్పఁగా కాయనం
జాతుర్యం బలరార నుత్తరము వి
స్పష్టంబుగాఁ గోకిల
వ్రాతం బిచ్చెఁ దుహీతుహీ యని గృహా
రామప్రదేశంబులన్."

—శృంగారనైషధము, [illegible]

ఈ పద్యము వైతాళికులు నల మహారాజును నిద్రమేల్కొలుపు సందర్భములోనిది.

"ఓ నల మహారాజా! కాకు లఱచుచున్నవి. కోయిలలు కూయుచున్నవి. తెల తెలవాఱ వచ్చినది. నిద్ర మేల్కొనుము" అని దీనిభావము.

ఈ భావమునే కవి యిట్లు క్రిందిరీతిని జమత్కరించెను. ప్రాతఃకాలమున 'కా, కా' యని కాకు లఱచుటయు, 'తుహీ, తుహీ' యని కోయిలలు కూయుచుండుటయు సుప్రసిద్ధము. 'కా' అనునది ప్రశ్నార్థకమగు 'కిం' శబ్దమునకుఁ బ్రథమా ద్వివచనరూపము. అట్లగుటచేఁ దమ జాతివైరమును బురస్కరించుకొని వాయసములు పికములను వ్యాకరణశాస్త్రమునఁ బరీక్షించుచున్నవి. 'కా, కా' — 'తాతజ్' ఆదేశము వచ్చుస్థానము లేవి? కోయిలలు ప్రశ్నానుగుణముగ సమాధానము నిచ్చుచున్నవి 'తుహీ, తుహీ' అనునవి అని. వ్యాకరణశాస్త్రమున 'తాతజ్' అను నొక యాదేశము విధింపఁబడినది చూ. ౧. ధూ + అ + తు. ౨. ధూ + అ + హి. ఇట 'ధూ' అనునది ధాతురూపము. 'అ' అనునది వికరణప్రత్యయము. 'తు,' 'హి' అను

నవి లోడర్థమున వచ్చిన ప్రత్యయములు. ఇందు వికరణప్రత్యయమును నిమిత్తముగాఁ గొని గుణము— 'ఓకారము' 'అవ్' ఆదేశమును వచ్చి 'భవ' అని యగును. తరువాత నాశీరర్థమున "తుహ్యోస్తాతఙ్ఙాశిష్యన్యతరస్యామ్" అను సూత్రముచే 'తాతఙ్' అను నాదేశము వచ్చి, ౧. "భవతాత్," ౨. 'భవతాత్' అను రూపము లేర్పడినవి. ఇందు మొదటి రూపము 'లోట్' ప్రథమపురుషైకవచనము. రెండవది మధ్యమపురుషైకవచనము కావున 'తాతఙ్' ఆదేశము, 'తు' 'హి'— స్థానులు. పై పద్యమున 'ఫణినాపత్యోక్త శాస్త్రము = పాణినీయము— వ్యాకరణ శాస్త్రము అనునర్థము చెప్పవలసియున్నది.

పై పద్యమునకు సంస్కృతమున మూల మిట్లున్నది.

శ్లో. ఇహ కిముమసి పృచ్ఛ్యాశంసి కింశబ్దరూప
ప్రతినియమితవాచా వాయసే నైవ పృష్టః,
భవ ఫణిభవశాస్త్రే తాతఙః స్థానితా కా
వితి విహితకుహూవాసుత్తరః కోకిలో ఒభూత్.

— నైష. ౧౯. ౬౦

ఒక వ్రాఁతప్రతిలో "ఫణినాంపత్యుక్తశాస్త్రం బుధే" అని యున్నది. ఈ పాఠము యుక్తముగాఁ గనఁబడుచున్నది. 'ఫణిభవశాస్త్రము' అను మూలమునకు ఫణినాంపత్యుక్తశాస్త్రము అను నాంధ్రీకరణము సరసముగా నున్నది. రెంటికిని పతంజలిశాస్త్రమను నర్థ మొకటియే. కొందఱువిమర్శకులు "పణినాపత్యోక్తశాస్త్రంబుధన్" అను పాఠమును గ్రహించి పణినాపత్యము=పాణిని అను నర్థము చెప్పియున్నారు. కాని అది యుక్తముగాఁ గనఁబడదు. పణి యనువానిగోత్రాపత్యము పాణినుఁడు అనియును, పణియనువాని యువాపత్యము పాణిని యనియును వ్యాకరణములో నిర్వచింపఁబడి యున్నదే కాని పణినుఁడు అనువాఁడొకఁడు కలఁ డనియు వానియపత్యము పాణిని యనియు నెక్కడను చెప్పఁబడి యుండలేదు. చూడుఁడు. "పణనం= పణః. సోఽస్యాస్తీతి పణీ. తస్య గోత్రాపత్యం పాణినః. తస్యయువాపత్యం పాణినిః" అని కౌముదిలోఁ గలదు. ఇఁక ముగ్ధబోధవ్యాకరణమునుబట్టి పణినశబ్దము సాధితమైనను ఆ శబ్దమునకు పణిమహర్షి యనునర్థము చెప్పుటకుఁ బ్రమాణ మేమియును లేదు. ఇఁక "పణినసూనుకణాదబాదరాయణసూత్రభక్తి విద్యాంసు లుపన్యసింప" అను మనుచరిత్రలోని పణినసూనుశబ్దమునుబట్టి పణినశబ్దమునకు పణి యనునర్థము వచ్చు ననుకొన్నచో నదియును సంగతముగాఁ గనఁబడలేదు. పణినుని యువాపత్యమగు పాణిని పణినసూనుఁడు (పణినుని పుత్రుఁడు) ఎట్లు కాఁగలఁడు? కావున మనుచరిత్రలోని పణినసూను శబ్దము ప్రామాదిక మనవలసియున్నది. లేదా దానికిని పాఠాంతర మేదైన నుండినను నుండవచ్చును. ముగ్ధబోధమునుబట్టి పణినసూనుశబ్దమును తను చింతామణి విమర్శపరిశోధనములో సాధించిన శ్రీవజ్ఝల చిన సీతారామస్వామిశాస్త్రిగారి వాదముగూడ దీనివలన పరాస్త మనవలసియున్నది. మఱియును శృంగార నైషధ వ్యాఖ్యానకర్తలలో నొకరగు శ్రీ వేదము వేంకటరాయశాస్త్రిగారు

"పణి – పణియొక్క, నః – నప్త – మనుమఁడు (పాణినుఁడు) కావున 'పణినాపత్యము' పాణినియగు" నని సమర్థించి, భారవిలో 'తవాభిధానాద్వ్యథతే' (౧-౨౪.) అను శ్లోకవ్యాఖ్యాన సందర్భమున నామైకదేశే నామగ్రహణ మితిన్యాయాత్ తక్ష్ణ + వక్ష్ణ-తవా, త - తార్క్ష్యుఁడు, వ-వాసుకి అని శ్లేషసంఘటనార్థముగా వ్యాఖ్యానించిన మల్లినాథసూరిగారి నాదర్శముగాఁ గొని స్థితగతిచింతనముగాఁ బ్రక్రియ చేర్పఁజిరి. ఈ సమర్థనము సహృదయహృదయంగమము కాదనుటకు సహృదయులే ప్రమాణము.

ప్రకృతము ననుసరింతము. "ఫణినాంపతి" అనునది 'తత్పురుషే కృతి బహులమ్' అనుసూత్రములోని బహుళగ్రహణముచే సిద్ధించిన అలుక్సమాసము. అహంపతివంటిది. ఇఁక పతంజలి రచించినది భాష్యమే కాని వ్యాకరణశాస్త్ర మంతయుఁ గాదుగదా! అట్టిచోఁ బాణినీయము — ఫణినాంపత్యుక్త మెట్లగు ననుసంశయము గలుగవచ్చును. కాని సూత్రార్థమును వార్తికార్థమును మహాభాష్యముచేత నిర్ణీత మగుచున్నది. అట్టి శాస్త్రమును రచించినవాఁడు పతంజలి.

ఈ శాస్త్రమున నీతని మించిన ప్రామాణికుఁడు లేఁడు. కనుకనే 'యథోత్తరం మునీనాం ప్రామాణ్యమ్' అని యందఱు నేకముఖముగాఁ 'ప్రామాణికశిరోమణి' యని యాతని నంగీకరించిరి. ఇట్టివాని పేరితోనే శాస్త్రము (పతంజలి శాస్త్రముగా) వ్యవహరింపఁబడుటయుఁ దప్పు కాఁజాలదు. కావుననే యిక్కడి మూల శ్లోకమును వ్యాఖ్యానించుచు నారాయణభట్టు 'ఫణిభృత శాస్త్రే' అనుపదము నుదాహరించి తన వ్యాఖ్యానమున నిట్లు వ్రాసెను.

"ఫణిన శ్శేషాత్ భవ ముత్పన్నం మహాభాష్య లక్షణశాస్త్రమ్ పాణినీయ మితియావత్. సూత్రవార్తికయో ర్మహాభాష్యేణ వార్థసంపాదనాత్ ఫణి భృతేత్యుక్తమ్"

౨

విలసితకీర్తిశాలియగు
వీరమహేశ్వరు దేహరంబు శ్రీ
నిలయమునం ద్రిసంధ్యమును
నిర్మలసౌధసువర్ణజాలకం
బుల వెడలున్ గిరీశగళ
మూలహలాహలకాంతిఁబోలి గు
గ్గులు మహిషాక్షువాసనలఁ
గ్రొవ్విననుంగళ ధూపధూమముల్.

—కాశీ. ౬ఆ, ౭౮ప.

ఈ పద్యము శ్రీనాథుని కాశీఖండములోనిది. ముద్రితప్రతు లన్నిటను పాఠ మేక రూపముగానే కానవచ్చినది. వావిళ్లవారి ప్రతిలోఁ బరిష్కర్త లీ పాఠము నిట్లే చూపి "ఈ పాఠ మన్ని మాతృకలలోను నిట్లేయున్నది కాని యర్థము చింత్యము." అని క్రింద వ్రాసిరి. నే నీసందర్భమున 'మదరాసు ఓరియంటల్ లైబ్రరి'లోని వ్రాఁతప్రతుల నెల్లఁ బరికించితిని. అన్నిటను నిట్టిపాఠమే కానవచ్చినది. D.3309నెం. ప్రతిలో మాత్రము 'దేహర'మునకు బదులుగా 'గేహర'మని కలదు. కాని సందర్భానుగుణముగ నర్థ మేమియుఁ గాన్పింపమిచే నదియుఁ బరిగ్రాహ్యముగాఁ దోఁపలేదు.

లలో నెక్కడనైనఁ బ్రయోగించెనా? యని పరిశోధింప హరవిలాసములో నొకచోఁ గానవచ్చినది.

"శ్రీనిధినంబి పెట్టె తన దేహరమింటి విభూతి..."

—హర, ౨ ఆ. ౩౭ ప.

వావిళ్లవారి ప్రతిలోఁ 'దేహమునిండ' అని యచ్చొత్తింపఁబడియున్నది. ఓరియంటల్ లైబ్రరిలోని 'హరవిలాసపుఁబ్రతులు రెండు గలవు. రెండుప్రతులందును దేహర మనుపాఠమే విస్పష్టముగా నున్నది. ఈ పాఠమును వావిళ్లవారు ప్రధానముగా గ్రహింపక పోయినను గ్రింద నప్రధానముగానైన యుదాహరింపరైరి. ఇఁక నీపదమునకుఁగల యర్థ సందర్భ మేమియో విచారింతము. ఈ రెండు పద్యములలోను 'దేహరము= దేవాలయము'అనునర్థము సందర్భానుగుణముగా సరిపడు చున్నది. పై కాశీఖండములోని పద్యము వీరభద్రారెడ్డి దేవపూజాగృహమును వర్ణించు ప్రకరణము లోనిది. లక్ష్మీకి నాటపట్టగు వాని దేవపూజా గృహమునుండి నిచ్చలును గుగ్గులు మహిషాక్షు ధూపధూమములు గవాక్షముల వెడలుచుండు నని సమన్వయము.

ఈ పదమున కిట్టియర్థము నిర్ణయింపఁదగు ప్రమాణ మేమైనఁగలదా? యని పరిశోధింపఁగా నిట్లు తోఁచుచున్నది. దేహరము - ఇది హిందీభాషలోనిది. అన్యదేశ్యపదము. అన్యదేశ్యముల విరివిగాఁ బ్రయోగించు నలవాటుకల మన కవిసార్వభౌముఁ డీ పదమును హిందీభాషనుండి కొనివచ్చెను. ఈ పదము — దేవ + ఘర్ గా నేర్పడి యుండును. ఘర్ - అనఁగా హిందీభాషలో గృహ మని యర్థము. తరువాతఁ గ్రమముగా దేవ + శబ్దములోని వకారము లోపించి ఘర్ శబ్దములోని ఘకారము హకారముగాఁ బరిణమించి యిట్టి వికృతితో నీ పదము వెలసియుండును. కనుకనే హిందీ నిఘంటువగు శబ్దసాగరకోశమున నీపద మిట్టి వ్యుత్పత్తితోడనే యీ యర్థమున బ్రదర్శింపఁబడినది. కబీరును హిందీభాషలో రచించిన తన గ్రంథమున నొకచో నీపద మిట్టియర్థముననే ప్రయోగించినాఁడు. చూ. 'బిహూనా దేహరా దేవ బిహూనా జేవ' (కబీరు). ప్రాకృతమునను 'దేహుర' అనురూపముతో నిట్టి

౩

వసియింప...,

గీ. స్నానమహిమంబు భక్తితాత్పర్యగరిమ.

—కాశీ, ౩. ఆ. ప. ౧౧౫.

ఇక్కడి వ్రాతప్రతులలో ననేక విధములగు పాఠాంతరములు గానవచ్చుచున్నవి. D. ౩౩౦ నెం. ప్రతిలో 'స్తాన' అని కలదు. ౩౩౪ నెం. 'స్థాక' అనియున్నది. డి. ౩౩౫ నెం. ప్రతిలో 'స్థాన' అని కానవచ్చినది. వెం ప్రా తి వా రి ముద్రితపుఁ బ్రతిలో 'స్నాన' అనియుఁగలదు. వావిళ్ళ వారి ప్రతి ననుసరించిరేమో కాఁబోలు తాము పరిష్కరింపించి ముద్రించిన ప్రతిలో నిట్టిపాఠమునే గ్రహించినారు. ఇదిచూచియే కావలయును స్నానశబ్దమును విమర్శించుచు భారతి సంచికలో శ్రీ నడకుదుటి వీరరాజు గారివంటి విమర్శకచూడామణులును స్నానశబ్దములోఁ దకారము గల దనుటకు నిదర్శనముగాఁ దా ముదాహరించిన ప్రయోగములతోఁ బాటు దీనినిఁగూడఁ బ్రదర్శించిరి. శ్రీ శేటూరి ప్రభాకరశాస్త్రి గారివంటి పరిశోధకులు గూడ "ఇదిగూడఁ దిమ్మకవి చూపిన ప్రయోగములకంటె ప్రామాణిక ప్రయోగమే" యని యనుమతించి సమాధాన మొసఁగిరి. కాని యిక్కడ విమర్శింపఁగా ౩౩౫ నెం. తాటియాకుల ప్రతిలో దొరకి యున్న 'స్థానమహిమంబు' అనుపాఠమే సాధుపాఠమై సర్వవిధములఁ బరిగ్రాహ్యముగా నున్నది. స్థానమహిమంబు = క్షేత్రమాహాత్మ్యము అని యర్థము. స్థానశబ్దమును క్షేత్రమను నర్థమున నీ గ్రంథములోనే యాతఁ డెన్ని స్థలములలోనో ప్రయోగించినాఁడు. నిఘంటువులలో సయితము నీయర్థము సుప్రసిద్ధముగానే యున్నది. ఇఁక నిక్కడి సంస్కృతమూలమును బరిశీలించుచో మన కీవిషయము సుస్పష్టముగా దెలియఁగలదు. చూడుడు:

మూలము

'చక్రపుష్కరిణీతీర్థే స్నాతవ్యం ప్రతివాసరమ్'

ఆంధ్రీకరణము

మూలము

'అర్చ్యైఃపత్త్రైఃఫలైస్స్తోత్రైః రర్చ్యేత విశ్వేశ్వ
రస్సదా'

ఆంధ్రీకరణము

అర్చింపవలయు గంధాక్షతంబులఁ బుష్ప
ఫలపత్త్రముల విశ్వపతి మహేశు

ఇక్కడ వావిళ్ళవారిప్రతిలో 'పత్త్రి'శబ్దము సత్రిశబ్దముగా మాఱినది.

మూలము

'స్వవర్ణాశ్రమసద్ధర్మో త్యక్తవ్యో న మనాగపి'

ఆంధ్రీకరణము

నిలుపంగవలయును నెఱసు వాటిలకుండ
వాత్మధర్మ స్వవర్ణాశ్రమముల

మూలము

'ప్రత్యహం క్షేత్రమహిమా శ్రోతవ్యశ్శ్రద్ధయా౽
సకృత్'

ఆంధ్రీకరణము

గీ. స్థానమహిమంబు భక్తితాత్పర్యగరిమ
వినఁగవలయుఁ బురాణార్థవిదులవలన

కావున నిది స్థానశబ్దమే కాని మనపరిశోధకు లభిప్రాయపడినట్లు 'స్నాన'శబ్దము కానేరదు. వీరు చక్కగా నిచ్చటి యర్థసందర్భ మావంతయేని గుర్తింపకయే వాద ప్రతివాదములు సలిపిరి. ఇట్టి వన్నెన్నియో వావిళ్ళవారి కాశీఖండములోఁ జేరి సుప్రసిద్ధ విమర్శకులనయితము భంగపెట్టుచున్నవి.

౪

పటములందు నాగరలిపి ప్రస్ఫుటముగ
వరమణీతూలికారేఖ వ్రాసినట్టి
యార్హతాగమగ్రంథ మత్యాదరమునఁ

పై పద్యమున వావిళ్లవారు ముద్రించిన ప్రతిలో 'జట్టుగా' నీ పదమును గ్రహించి యుచ్చాటించిరి. ఈ గ్రంథమును పరిష్కరించిన వారు వ్రాసిన వ్రాతల వరుసయిది.

"ఇచట 'సరసఁబతియింప' అని పూర్వపూర్వ తర ముద్రిత పుస్తకముల పాఠము. ఆంధ్రసాహిత్య పరిషత్తులో లభించిన తాళపత్రి పుస్తకమునందును మఱి కొన్ని వ్రాతపుస్తకములందును 'జట్టు' అనియే కనఁబడుచున్నది: ఈపదమే యిచటఁ బొంకముగఁ గుదిరి యున్నది. ఈపదము తప్పను నభిప్రాయమునఁ గాఁబోలు 'సరస' అని దిద్దిరి. శబ్దరత్నాకరములో "జట్టు = జనసమూహము - ఇది విచార్యము" అని యున్నది. ముద్రితపుస్తకమున నీపదము మార్పఁబడినందునఁ బ్రయోగము లభింపక యట్లు వ్రాసియుందురని తోఁచుచున్నది." (ఇవి పరిష్కర్తల వ్రాతలు.)

పరిష్కర్త లభిప్రాయపడినట్లు 'సరసఁ బతియింప' అను ముద్రితపాఠమునఁ బతియించువా రెవరో తెలియరాకుండుటచేతను 'సరస' అనునది ఈ సందర్భమున కంతగా నవసరము లేనిదేయగుటవలనను నిది సరియగు సాధుపాఠముగా గ్రహించుటకు వీలు గాన్పింపదు. వ్రాతప్రతులలోఁ గైస్థలమున '...త్యాదరమున జట్టు పతియింప' అనికాన నచ్చుటయు యథార్థమే. (చూ. D 330సెం, 33౪. సెం, —ఓరియంటల్ లైబ్రరి) కాని యిది వీ రభిప్రాయపడినట్లు జనసమూహార్థకమగు 'జట్టు' శబ్దమున్నాత్రము కాదు. ఇక్కడ బాగుగాఁ బూర్వాపరములఁ దగురీతిఁ బరిశోధించుకొనక పరిష్కర్తలు పొరబడిరి. వీరి వ్రాతలప్రకారము 'ఆర్త జాగము గ్రంథమును బతియించునది జనసమూహ' మని యేర్పడుచున్నది.

ఈ పాఠము గ్రంథకర్త వ్రాసినతరువాతి వచనము వలనఁ దెలియుచున్నది. ఈ పద్యము — ఈశ్వరుఁడు మంథరాచలమునుండి కాశికాపురంబుఁ జేర నసాయంబుగానక దివోదాసుఁ డెల్లని ధర్మవిముఖుఁగానొనర్పవేఁడి విష్ణుఁగాశికిఁ బంపఁగా నాతఁడు బౌద్ధవేషము ధరించి బౌద్ధమతధర్మముల నుపదేశించుచుఁ బురజనును వంచింపఁ గడంగు సందర్భములోనిది. దీనికి మునుముందటి వచన మిట్లున్నది. "పుణ్యకీర్తినామంబు వహించి తన పేరు పెట్టి యుకని శిష్యునింగాఁ బరిగ్రహించి...నేలు నేలు మార్గంబులఁ గాశికాపురంబుఁ బ్రవేశించి"

తరువాతి వచన మిట్లున్నది:

"...ఎల్లసాధునుం దమతమ ధర్మంబుల విడిచి సుగతధర్మంబు చేపట్టునట్లుగాఁ బుణ్యకీర్తినాముఁడే యుండెను మధ్యమాదమందు వినయకీర్తినాముఁడేయుండెను శిష్య గరుత్మంతు బోధించుచుండెఁ' అని యున్నది. 'గరుత్మానపి తచ్ఛిష్యః' కావున గ్రంథమును జదువువాఁడు గరుత్మంతుఁడు అని(మూలము). వినువారు జనులు. బోధించువాఁడు సద్గురుఁడగు మాధవుఁడు. కనుక నీ సందర్భమునఁ బరిష్కర్త లొనర్చిన వ్యాఖ్య సరిగా దనవలసియున్నది. జనులు వినువారే కాని చదువువారు కారుగదా? కనుక నిది జట్టుశబ్దము కాదు. శిష్యార్థకమగు చట్టుశబ్దము. ఈకవి యీచట్టుశబ్దము నీ గ్రంథమున నెల్ల వాడియేయున్నాఁడు. చూ. ఈ. "కైటభదైత్యవైరి యధికంబగు నేర్పున మున్న చేని కుచ్చాటన మాచరించి తనచట్టు ఖగేంద్రుని..." అని యున్నది. పరిష్కర్త లిచ్చట యతిభంగము చేసి గమనింపక యీ ప్రతిలో "...కు చ్చాటన మాచరించి తన బంటు ఖగేంద్రుని" అని యుచ్చాటించినారు. ఇట్టి యతిభంగము లీ ప్రతిలో నెన్నియో కలవు. వ్రాతప్రతులయం దంఱసున్న లవసరమగు స్థలములలో లేకుండుటయు ననవసరమగు స్థలములలో నుండుచుండుటయుఁ బరిశోధకులకెల్ల విదితమే. అట్టివాని వ్రాతప్రతులు సంస్కృతమూలము మున్నగు సాధనసంపత్తులచే సవరించుకొనవలయునుగాని యట్టిలేఖకప్రమాదముల నాధారముగాఁ గొని శబ్దములకే తాలుమూ ళ్లొనరింపఁ గడఁగుట పరిష్కర్తల లోపమనిపింపకతప్పదు.

ఇఁక శబ్దరత్నాకరము వాని 'జట్టు' శబ్దమునకుఁ బ్రమాణముగా గ్రహింప కుండుట యుచితమే. ఇట్లు ముద్రితములను బ్రతు లనేకప్రమాదములతో నిండియుండుటచే నివియే ప్రమాణముమనకొనక తగురీతి విమర్శించుకొనియే తమతమ సిద్ధాంతముల స్థాపించుకొనవలసి యున్నదని పరిష్కర్తలకును, నా ర్యజనులకే ప్రధానముగాఁ జూచుకొనక తగిన పండితులచేఁ బరిష్కరింపఁజేసి యుద్గ్రంథములను ముద్రింపించి భాషాసేవామహాఫలమునకుఁ [illegible]

ఒకటా!

శ్రీ విశ్వనాథ సత్యనారాయణ

చిక్కని జాలితేనియల చెమ్మలుతీరిన గుండెతోడి నీ
వెక్కడ? ఇట్టె ముక్కుపయి కెక్కెడు కోపముపొంగుతోడి నే
నెక్కడ? నీవు నేను నొకటే యని పెద్దలు చెప్పువారటం
చెక్కడిమాట లాడెదవొ, యే నవునంతటి మూఢబుద్ధినో!

పసిమిబాలెంతావు పాలసంద్రము లోని
    జున్నులంకలమీఁద నున్న నీవు
చిన్నిలేఁగటియావు క్షీరవారాశిలో
    వెన్నలంకలమీఁద నున్న నీవు
ముఱుగుకాలువనీరములు నొడలకు నిండి
    మన్నుదిబ్బలపైని నున్న నేను
స్నానమాడిన నీరురాని సోగణగండ్ల
    కన్నాలలోఁ జూచుచున్న నేను
నీవు నే నొక్కఁడో మహనీయమూర్తి!
అశ లడుగంటిపోదునంచా భయంబు?
ఫలముమాలిన వ్యాపారభావ ముఱక,
యంటఁగట్టంగఁ జూతువే లయ్య! స్వామి!

జిమ్మనిపించు నీపలుకు శీతలభావము! నీవు నేను ని
క్కమ్ముగ నింతయే నొకటిగాఁ గను నక్కఱ లేదు; నీతలన్
క్రొమ్ముడిలోన నందములకోసము తాల్చిన మల్లెపూ సమీ
పమ్మునఁ బాదులోఁ దిరుగు పాటిది పుర్వును నైనఁ జాఁడదో!

ఇవి యొక మ్రొగ్రపూలు నిటులే మలుసంజలవేళ విచ్చు, రే
పవు తొలిప్రొద్దువేళ భవదర్థము తెత్తు నటంచుఁ జూడఁగా
నవునవుఁ గోడికూఁతకు భయంపడి వాడును, రాలిపోవు, నా
దవు తొలిజన్మ కర్మవికలాత్ముఁడ; నాకును నీకు సామ్యమో!

కొంచెము మోసగింతు వనుకొంటకు వీ లగుపించనట్టి నీ
మంచితనమ్ము నిట్టి విషమస్థలిఁ బోలిక నూది చెప్పలే
మంచని చెప్పవచ్చు, నెవరైనను లచ్చియు వాణి చల్లనౌ
పంచలఁ జేరి బోర్లపడువారికిఁ జెప్పవె యిట్టిమాటలన్.

బాలింతరాలు

శ్రీ రా. సీ. ఆంజనేయశాస్త్రి

౧

శ్మశానమే వాళ్ళకి అవతల ఒడ్డున. దానికి ఆను కునే వుంటుంది ఆ మఱ్ఱిచెట్టు. వాళ్ళకి యివతల ఒడ్డున వున్న ఆ వూళ్ళో చచ్చిపోయినవాళ్ళందరినీ ఆ శ్మశానం లోనే దహనంచేస్తారు. ఎంతకాలంనుంచి వుంటున్నారో, యింకా ఎంతకాలం వుంటారో ఆ ముసలి చెట్టుకే తెలియాలి కాని, ఎప్పుడు చూసినా దానికింద సాధారణంగా పది పదిహేను కుటుంబాలికి తక్కువ వుండవు. చెట్టుమీద కొంపనిగబ్బిలాలుకూడా వున్నాయి ... ఇనకీ ఇనకీ మధ్య ఏ వానముక్కలో, చెట్టు కొమ్మలో రెండు చేగేసి వాటికి పేటికి కలిపి తాడూ తంకరాకట్టి, వాటిమీద పీతాటాకుముక్కా, పీగోని సన్నెకలికా, చాపముక్కా యిలాంటి శిథిలావస్త అతుకుపెట్టి కట్టి పందిరిలాగా వుండే ఏ సదికలాంటిదో తయారుచేస్తారు. వాటిల్లోకి నీళ్ళక్కకుండా కొత్త మెరక చేసుకుంటారు. ఇదే వాళ్ళ నివాసభవనాలు...

చెట్టుక్కొగట్టూ, ఆ శ్మశానం తప్పితే మిగతా ప్రదేశమంతా పొలాలే... చెట్టుక్రింద వాళ్ళుండటానికి శ్మశానంలో చచ్చినవాళ్ళని మోసిన చెయ్యటానికి వీలుగా వుండటానికిగాను పాడుచెయ్యకుండా విడిచి పెట్టారు ఆ ప్రదేశాన్ని... అక్కడుండేవాళ్ళు ఫలాని తెగవాళ్ళనిగానీ వాళ్ళది ఫలానావృత్తి అనిగాని చెప్పటానికి వీల్లేదు. సాధారణంగా ముసలివాళ్ళూ, చిన్నపిల్లలూ ఊళ్ళో ముష్టెత్తుకుంటారు. కొంతకాలే కూలికెళుతారు పడుచువాళ్ళు. ఆడవాళ్ళు కొంతమంది పాచి చేయుతారు. పాముల్ని పట్టేవాళ్ళుకూడా ఒకరిద్దరున్నారు. కుమ్మెన్నలూ, నమ్మలక్కలూ, దారవుండలాలాంటివి యింటింటికీ తిరిగి అమ్ముకునే ఆడవాళ్ళు కూడా కొంతమంది వున్నారు. పొలాలోకి ఆలస్యంగా నీళ్ళక్కినా లేకపోతే ఏదన్నా ఎద్దకి వచ్చినా ఎప్పుడన్నా రైతులు వీళ్ళని ఊడ్పులికి కోతలికి పిలవటం కూడా కద్దు. పంటకోసి కుప్పవేసినా, కుప్పలునూర్చి రాసిపోసినా అక్కడనే మెతుక్కు వెతికిపోవాలి, తప్పితే బక్కగడ్డిపరకన్నా పోదని ఆ చుట్టుపట్ల మహా ప్రఖ్యాతి. అంతనమ్మకం ఆ చెట్టుక్రిందవాళ్ళంటే. అంతకన్నా విచిత్రం: ధాన్యపురాసులికి కాపలాకాసే దే వాళ్ళు!! ఊళ్ళో పెద్దమనుష్యులు షికారొచ్చినప్పుడు చెట్టుకింద వాళ్ళని చూసి "వాళ్ళదే హాయైన బతుకు, చీకూ చింతా లేదు" అంటారు.

౨

అతనికి ముప్ఫైఅయిదేళ్ళుంటాయి. కొత్త తరతరయస్సులోనే పెళ్ళి చేసుకున్నాడు. పెళ్ళైన రెండో ఏటే, ఓపిల్లాడు పుట్టి నెల తిరక్కుండానే పోయాడు. తరవాత మళ్ళా సంతానమే లేదు పది పదిహేనేళ్ళవరకూ... ఇప్పుడు భార్యకి పురుడొచ్చే రోజులు. ఇద్దరికీ అబ్బురంగానే వుంది. రోజల్లో నాలుగు డబ్బులు మిగుల్చుకుని పెళ్ళానికి కొరబ్బాయింది పలుకులూ అవీ కొనిపెడుతూ ఒచ్చాడుకూడాను ... ఇవాళో రేపో పురుడొస్తుందన్నా పొట్ట గడవదు గనక పాపం అతను పెద్దరైతు రాసిమీద నాలుగు రోజులు కాపలాకి కుదురుకున్నాడు. బంధువులు సాయం రావటం మామూలైనా రైతురాసి అంతా రెండు రోజుల్లోనే కొట్లల్లోకి చేరింది. కాపలాకాసే నిర్వాహకుడికి సంగతి ముందరే తెలిసి ఆ తెల్లారికల్లే మనిషిని దిక్కుల్లో రాసిలోంచి, రెండు మరకాలొంటెం మూల కట్టుకు చక్కాపోయాడు. నాలుగురోజులు కాపలా వుంటే ఆ కూలి గింజల్లో పురుడు వెళ్ళేదాకా ఎలాగో

...ాని రెండు రోజుల్లోనే పని అయి పోవటం చేత ...క్కు త్రిపడి సాహసం చేశాడు యింత పెద్ద రాశిలో ...ండు మరకాలు తక్కువాలే కమకొక్క ఒచ్చారా ...ని. దొంగతనం యింకోతనం బయట పడక మానదం ...ుంది ప్రపంచం. ఆ చెట్టుకింద వాళ్లే ఎవరో ...ిదారు రైతు చెవిలో. పట్టుపట్టని అతన్నిలాక్కొచ్చి ...స్తంభానికి రెక్కలు విరిచికట్టి, ఆ చెట్టుక్రింద వాళ్ల ...దేతనే కర్రలతో బాదించారు పెద్దలు. "తరత ...ాల్నుంచీ ఎంతో నమ్మకంతో కాపలాకాస్తున్నారు. ...ఈ నాటికి పుట్టాడు. ఈ చిత్త కార్తె కుంకా కొడు ...కు......" అన్నారు అంతానూ... భార్యస్థితి తెలుసు ...ోటంచేత దిగజారిన అతనికుండే లా దెబ్బలికి తాళుకో ...లేక పోయాయి. మొన్నాటికి ఒళ్లంతా ఉబ్బినట్టైంది. ...మూడోనాడు తెల్లారేసరికి శరీర మంతానల్లపడింది... ...ిరుడు పుట్టసంచేత పోయా డన్నారు అంతాను. అప్పుడే ప్రసవించిన భార్యకి తెలుసు ఎందుకు ...పోయాడో... ఆ చెట్టు క్రిందున్న వాళ్లని శాశ్వతంగా దారిద్ర్యంలో వుంచే శుద్ధ సత్యానికి ౩౫ ఏళ్ల యువ ...డి వేడి నెత్తురు బలిధారలు!

3

భార్య యిప్పుడు బాగా ముసలిదైపోయింది ...రుట్లో సూతికజ్వరం రావటంచేతా, తరవాత తర ...త మనోవ్యాధితోనూ బాగా క్షీణించిపోయి, పిల్లకి ...ూడోఏడు వచ్చేసరికి తల్లికి పక్షవాతం వచ్చింది. ...ంతోటే మూతి ఎడంవేపుకి బాగా వంకర తిరిగి ...ోయింది. ఎడం కాలు భూమిమీద అసలు ఆననే ...నదు. ఎడం చెయ్యి ఆఖరికి పైట సవరించుకుంటాని ...క్కూడా పనికి రానంతగా పడిపోయింది. ఓ కన్ను ...ూడా కిందికి వాలిపోవటం మూలాన చూసే వాళ్లకి ...హా వికృతంగా కనిపిస్తుంది. నోట్లో పైవరస నో ...ున్నా, కిందివరసను రెండుపళ్లూ మాత్రం ఉన్నాయి. ...ంతా జారిపోయినట్టే. పైట వేసుకుంటే మొలకి ...చుట్టుకుంటానికి సరిపోదు గనకనూ, ముసలిదీ, అందులో ...ళ్లంతా ఎండిపోయింది కనకనూ మొలకిమాత్రమే ఓ ...గుడ్డచుట్టే వుంటుంది. ౪౦ ఏళ్లకంటే ఎక్కువ వుండక ...ోయినా ఆమె మాయదారి రోగంవల్ల ౬౦, ౬౫ ఏళ్ల దల్లే కనిపిస్తుంది. ఆ వెదురు కర్ర ఎంతబలం కలదైనా ముసిల్దాని చేతిలోనే ఎంతకాలం నుంచో అణిగి వుంది...

కూతురు కిప్పుడిరవై ఏళ్లుంటాయి. పుట్టినప్పుడు పచ్చగానే వుండేదట. రానురాను చామన చాయైంది. ఇప్పుడు నల్లగా వుంటుందనే చెప్పాలి. కొంచెం పెద్ద కళ్లు. ముక్కు మూలం ఆట్టే నిడివిగా వుండదుగాని, చివరమాత్రం కాస్త కొస తేలి వుంటుంది. గడ్డంమధ్య చిన్న సొట్ట. పసివాడిన ముదురు తమలపాకులల్లే చెంపలు అదోమోస్తరుగా వుంటాయి. చిన్నప్పుడే పాడిపించిన పచ్చ, మడ్డి పట్టిన మొహంమీద బాగా కనిపించదు. జుట్టు ముడేసినప్పటికీ కొన్ని వెంట్రుకలు లేచి, గుబురుగా చెవుల్ని కప్పేస్తూ వుంటాయి. తల్లిమాదిరిగానే మోకాళ్లవరకూ వచ్చేది మొలలో గుడ్డ చుట్టుకుంటుంది. ముసలితనం రాలేదుగనక, ఒళ్లుదాచుకునేందుకు ఇంకో గుడ్డ పేలికలాంటిది మొలలోంచి దోపి, గుండెలమీదుగా, ఎడమభుజంనుంచి మెడచుట్టూ తిప్పి మెళ్లో వున్న గోనునార తాడుకి ముడేసుకుంటుంది. చేతులికి రంగుతోళ్లు గాజులు మాదిరిగా చుట్టుకుంటుంది. కుడిచేతిలో కుండపెంకు పట్టుకుని ఎడం చెయ్యి అమ్మభుజంమీద వేసి, తన ఊరోభాగాన్ని అమ్మ శరీరానికి చాటు చేసుకుని నెమ్మదిగా యింటింటికీ అడుక్కుంటూ వెడుతుంది......కాలూ చెయ్యి ఉన్ననాటి తల్లిగుర్తు ఆ అమ్మాయికి లేనేలేదు. తల్లంటే మహా ప్రేమ కూతురికి. అమ్మ గనకనే కాకుండా అవిటిదనీ, తనుతప్ప వేరే దిక్కు లేదనీని. ముష్టిగింజల్తో ఎలాగో ప్రాణం నిలుపుకుంటున్నా గుడ్డకి మాత్రం మహా యిబ్బందిగా వుండేది. అందులో చలికాలంలో మరీని. పగలు అడుక్కున్న బియ్యపుగింజలు కవాల్సి కాల్చగా మిగిలిపడున్న కట్టెలతోనో, పిడకల్తోనో ఓ బొచ్చెలో కాస్త ఉడకేసుకు తింటారు రాత్రిళ్లు. ఎత్తుకున్న మధూకరపు మెతుకులు, చెరో రెండూ నోట్లో వేసుకొని, యిన్ని నీళ్లు తాగి, మఱ్ఱిచెట్టుకి తూర్పువేపున వున్న ఆ రెండున్నర గజాల మెరకమీదా అమ్మని కౌగిలించుకొని తన పమిటగుడ్డ తీసేసి, చాలీ చాలకుండానే, యిద్దరికీ కలిపి కప్పుకుని, ఆ ముసుంగులోకి తలదూర్చి పడుకుంటుంది కూతురు....

అప్పుడప్పుడు ముసిల్ది చెబుతూవుంటుంది తన చిన్నప్పటిగాథ. వాళ్లమ్మ పుట్టినప్పుడు కూడా అక్కడేట. ఓరోజు, చెట్టు నరుకుతూండగా పిడుగుపడి అకస్మాత్తుగా చనిపోయిన్నాళ్లోనే నచ్చిపోయాడుట మొగుడు. పిల్లలు లేకపోవటం మూలాన, ఏవాయి కల్లుకుక్కున్నా, లేకపోతే, ఏ కోతగింజలు దాచుకున్నా, ఓమోస్తరుగా వెళ్లిపోతోంది. ఓరోజు, దూర్భార పొయ్యిటానికి ధాన్యం అందిచ్చి, పొద్దూకువేళకి, చెంగు మాయటంచేత, కొత్త అలస్యంగా, చెట్టుక్రింది కొస్తుంటే, దార్లో పొలంఖామందు, అటకాయించి బలవంతపెట్టాడుట. కాళ్లావేళ్లా పడి ఎంతోబతిమాలుకున్నా, భయపెట్టినా, ఏంలెక్క చెయ్యకుండా, నువ్వి పసుకల్లే, మీద పడబోతుంటే చెంగుమాసిం దన్నా... 'నీళ్లపోసు కొస్తా'...నంటు తప్పించు కుంటానికని. ఆయనా కొత్త ఆలోచించి......'నిజమేనా!...సరే ...నీమాట నమ్ముతున్నా. మావాళ్లల్లో అబద్ధమాడటం యింతవరకూ లేదు'... అని విడిచిపెట్టాడు. వాయిగో రోజు పాయింత్రానికి, రాసిలోచెప్పి ఏంలని ప్రత్యేకంపని పెట్టి పిలిపించాడు. నిజమే ననుకుని వెళ్లింది. తీరా చూస్తే పొలంమీద రాసీ లేదు. దిక్కు దిక్కుమంటూ, జనక్క తిరిగేసరికి, మాపాలు దువ్వకుంటూ, వామి పక్కనుంచి, పొలంఖామందు..."నేను కూడా ఏరుకుందామని వచ్చా..." నంటూ నవ్వుతూ అమాంతం కుడిచెయ్యి పట్టుకున్నాడు. గుండె ఝల్లుమంది పాపం. చెయ్యి విదిలించుకుని పరిగెత్తి కళ్లంజనక్క, తప్పుకుంది. చెంగున మాకొచ్చు మీదికి, 'నీళ్లనా దొస్తావని మస్నే చెప్పావుగా మరి!...' అంటూను. ఆరవటానికన్నా వీల్లేకుండా నోట్లో గుడ్డలు కుక్కాడు. చేతులూకాళ్లూ బిగించికొట్టింది. ఏంచేస్తే ఏంలాభం? ఏనుగంత మగమనిషితో, పిట్టలాంటి ఆడది ఎంతసేపని పోట్లాడగలదు? అలిసిపోయి మొహం వేలవేసింది. తన మానరక్షణ కేమీ అవకాశం లేదు. ఒక్కక్షణం ఆలోచించి, నోట్లోగుడ్డలు తీసెయ్యమని సంజ్ఞ చేసింది. 'అల్లారా...బాస్లోకి...' అంటూ తీసేశాడు. లేచి అతనిచెయ్యి పట్టుకొని గొడ్లపాకల్లోకి తీసుకు పోయింది. అతనికి ఆశ్చర్యంగానే వుంది. అప్పు ఒక్కుమ్మ గొర్రెల్లోకొత్త పదకపక్క అరుబయట కొత్త మలకమంచం వుంది..........!! ఇదివర తప్పేనా అబద్ధమాడలేదు ఆమె. ఇప్పుడూ ఆడవల్సే! అదే తృప్తి......

మొదట్లో ఒకటిరెండు నెలలు, మానేసినా, అడ్డదిగా గింజలు కొలుస్తూ వుండేవారు. తరవాత తరవాత అసలు మొహం చూపటమే మానేశారు,... కార్తీకమాసంలో పురుడొచ్చింది... కోతవ వాన కురుస్తుండగా పిల్ల కైటపడటం, తల్లి పరమపదించటం ఒక్కమాటే జరిగిపోయాయిట....

ముసల్ది చెబుతూంటే చెవులు దోరపెట్టుకుని వింటూ, తల్లిచెబుతున్న గుర్తులతో అమ్మమ్మ రూపాన్ని తనమనస్సులో చిత్రించుకుంటానికి ప్రయత్నిస్తూ, ఏవో దీర్ఘాలోచనల్లో మునిగి మునిగి, ఆఖరికి నిద్రపోలేక, చెమర్చినకళ్లు తుడుచుకుని అ అమ్మమ్మ... అమ్మమ్మపోలికలాంటి పోసుకుని అమ్మ పుట్టింది ... కదో!...

"వాస్నోడే!" అని చిన్నతనంలో, మాటలొచ్చి రావటంతో తిరిగే "సముద్రంబాటి వెళ్లాడని...తరవాత వస్తా"డనీ చెప్పేది తల్లి. రానురాను పిల్లకికూడా తెలిసింది పెద్దకైతు పొలానికి కాపాలా పెట్టటం, రెండు మరకాల గింజలు చెప్పకుండా తీసుకురావటం, రెక్కలు విరిచి స్తంభానికి కట్టి కొట్టించడం, పురుగు ముట్టుకుంచేత చచ్చాడని అందరూ అనడం అదీని... ఇప్పుడా రైతు పెద్ద షావుకారై పోయాడు. మొన్న మధ్యే రెండు డియ్యపుమరలు కూడా కట్టించా డాయన పెద్దకొడుకు. ముసిల్దికళ్లేటప్పుడు వాళ్లింటిదగ్గి రాగేది కాదు ముసిల్ది. మొదట్లో కూతురికి తెలిసిందికాదు కారణం. "వాళ్లు వెయ్యరమ్మా" అంటూ వుండేది తల్లి నవ్వితే. విషయం తెలిసిన తర్వాత రోజే ఆగేది కాదు. ఎదోపిచ్చిగాని యీ ముసిల్ది ముండ లా యింట్లో ముష్టి తీసుకోకపోతే వాళ్లకొచ్చిన నష్టమేమిటి!...

౪

పుష్యమాసం కావటా చలిగాలి వేస్తోంది విక్క

[illegible]

౫

[illegible]

[illegible]

[illegible]

౬

[illegible]

తున్నాయి. మబ్బుతునకలు నల్లముసుగుల్లో కప్పేస్తే, అంచుల్లోంచి తొంగిచూస్తూ, ముసుగులు తీసేసినపుడు కిలకిలా నవ్వుతూ, యవ్వనమదంతో తల లూగిస్తున్న చేలకి చక్కిలిగింతలు పెడుతూ ఆడుకుంటున్నాడు చంద్రుడు. ఎదట వున్న ఊరు, కృత్రిమదీపాల మూలాన అసలు కనిపించటమే లేదు. కొంతదూరంగా అవతలి ఒడ్డున వున్న ఆ మర్రిచెట్టు వెన్నెల వెలుగుల్లో విస్పష్టంగా కనిపిస్తున్నా, కొమ్మల నీడల్లో మనుష్యులు మాత్రం కనపడీ కనపడకుండా వున్నారు.

వాగులో మొహం కడుక్కుని పైటచెంగుతో తుడుచుకుంటూనే నడుస్తోంది గట్టంబటే ఆ అమ్మాయి. ఏమిటో అనేక భావాలు! మనస్సుమాత్రం నిశ్చలంగా లేదు. ఓనాడు ఆ పాపాయిని ముద్దెట్టుకుంటుంటే పని కుదురుకున్న యింటావిడ చటుక్కున వచ్చి "అల్లా నలిపేస్తావేమిటే పిల్లాడిని?" అంటూ పిల్లాడిని లాక్కుపోవటం తను గుడ్ల నీళ్లు గుడ్ల కుక్కుకుని "నాకుమాత్రం తెలీదుటండీ" అనడం, ఆ అమ్మాయి కళ్లల్లో మెదుల్తున్నాయి. తనది కానప్పుడు ఒచ్చేదిక్కే అది... చంద్రుడికేసి చూస్తూ యిందాకటినుంచీ తుడుచుకుంటూనేవుంది మొహం పరధ్యానంగా. మరీ తుంటరిగా, పమిట తొలిగిన ఆమెవక్షంలోకి తొంగి తొంగి చూస్తున్నాడు చంద్రుడు మబ్బుతెరల్ని చాటు చేసుకుని. వాగుమీదినుంచి ఒచ్చేలేతగాలి సందులుచేసి చంద్రుడికి తోడ్పడుతోంది... సౌందర్యం చాటున తెలీకుండానే హత్యలు జరుగుతూంటాయి... చంద్రుడి పక్కనుంచే కేతకళతో దిగిపోయిన నక్షత్రం వెన్నెలమూలాన ఆమెకి కనిపించనేలేదు.

ఎదురుగుండా ఒస్తున్న షాహుకారుగారి రెండో అబ్బాయి నామె అసలు చూడనే లేదు. అతనుమాత్రం దూరంనుంచే గమనించాడు ఎవరో వస్తున్నట్టు. వెన్నెల పరుగుల్లో విస్పష్టంగా కనిపిస్తున్న ఆమె తీరు, యవ్వనం లోవున్న అతణ్ని మోహపెట్టింది. అతన్నే కాదు, ఉప్పుపులుసూ తింటున్న ఎవరినైనా మోహపెట్టేదే ఆదృశ్యం. అకస్మాత్తుగా గజంన్నర దూరంలో పర్రాయి పడుచువాడిని ఎదురుగా చూసేసరికి ఆ అమ్మాయిగుండెలు ఝల్లుమన్నాయి. చచ్చి

పోయిన తల్లీ, తల్లి చెప్పే అమ్మమ్మకథా, అర్థం కాని ఆవేదన పొందుతూన్న తనహృదయం, తాను పని చేస్తున్న యింట్లో, ఆ పాపాయిని తను ముద్దెట్టుకుంటుంటే ఆవిడ కోప్పడటం, తన యవ్వనం, పేదరికం, వెన్నెలలో ప్రకృతిశోభ, రాత్రివేళ, ఎదట డబ్బుగల అందమైన యువకుడూ, ఏకాంతం.... ఏమిటో భావాలూ ఎన్నో దృశ్యాలూ, ఒక్కమాటుగా ఆ అమ్మాయి కళ్లనీ హృదయాన్నీ ముంచెత్తి కలవర పరిచాయి. ఆ కలవరపాటుని ప్రతిఫలింపజేస్తున్న ఆమె నల్లకళ్లు, అతణ్ణి మరీ ముగ్ధుణ్ణిచేశాయి. తను ధనికుడూ, ఆమె పేదదీ, ఆమె నేం చేసినా సంఘం నోరుమూసుకునే మార్గంటుందని అతనికి బాగా తెలుసు. నిర్భయంగా మీదికొచ్చి, పమిటలేని ఆమె కుడిభుజంమీద చెయ్యి వేశాడు... ఇంతవరకూ నెగళ్లుగా మండు తున్న ఆమె హృదయకుండంలో ఓ అమృతపుచుక్క వేసి నట్టుయింది... ఆమె ప్రతిఘటించ లేదు... దిన్నంతైన మీదుగా వాగుదాటారు. దక్షిణంవేపు చేలో పాతగడ్డి వామి యింకా అయిపోలేదు. నీళ్లుతాగిన పచ్చిక సువాసనలతో కలిసిపోయిన ఎండుగడ్డి గుమాయింపుల్లో ఎన్నిగంటలు గడిచిపోయాయో...

కావిలించుకుంటూ వని చెప్పుతూ, తన కౌలహాస్తాల్తో చంద్రుడి గొంతు ఓ మాటు నులిమేసి విడిచి పెట్టింది మేఘం.

౨

తిరణాల ఊళ్లో అతను రెండుసార్లు కనిపిస్తే, సిగ్గుచేత తలొంచుకు వెళ్లిపోయింది. మూడోమాటు ఓ రోజు, మసిమసకచీకట్లో పని కెళ్తున్నప్పుడు, పెద్ద వీధిపక్క సందులో, అతను కనిపించాడు ఒక్కడూను. ఇదివరకు పలకరించకపోయినందుకే అనుమానపడుతున్న ఆ అమ్మాయి, యిప్పుడైనా మాట్లాడిస్తాడేమోనని కొంత నిమ్మదిగా అడుగు లేసింది. దులపరించుకు వెళ్లిపోయాడతను. అవమానం భరించలేక, సిగ్గుమల్లించుకుని, రెండడుగులు వెనక్కి వేసి, ఆవేదనతో తడబడుతూ... 'దొరగారూ' అంది. అతను వెనక్కి తిరిగనా చూడలేదు...

౮

అక్కడ పని మానుకున్న తరవాత, వేరే దొరక లేదు. అదీగాక నెలలుకూడా వచ్చాయి. రెక్కలాడ టం మానగానే డొక్కలు మాడటం మొదలెట్టాయి. పైగా ఆవమానభారం. క్రమంగా నీరసించి క్షీణించి పోయింది. అందులోనూ వేసంకాలం వూలాన మరీ ఒచ్చింది. ముష్టి అడుక్కునే ఓపికకూడా సన్నగిలింది. ఓపూట తినీ, ఓపూట తినకానూ. శారీరకంగా ఎంత కష్టపడుతున్నా, మానసికక్షోభమటుకు లేదు. తాను చేసిన పనికి మొదట్లో చింతించింది, తన నిమ్మళంక హృదయం ఓమాటు, ఓ స్వార్థపరుడైన పాశవికకాముకుడి కళోరస్పర్శకి ఆకరం అయినందుకుగాను. కాని తాను శాశ్వతంగా ప్రేమించ దగిన వస్తువుని, తన వినిర్మలమాతాన్ని బలిచ్చి నిర్మించుకో గలిగినందుకు, ఆమె తన అమాయకత్వాన్నే మెచ్చుకుంటూ ఒచ్చింది తరవాత తరవాత. ఆ వస్తు సందర్శనంకోసం ఆమె మనస్సు తహతహలాడిపోతోంది. కుతహాతహాలో ఆమె దారిద్ర్యం బాధించ గలిగినంత ఎక్కువగా వేధించలేకపోయింది.

౯

జ్యేష్ఠమాసం సగం వెళ్లిపోయింది. బహుళ పాడ్యమినాడు అరుణోదయం అవుతుండగా ఒచ్చింది పురుడు. మొగపిల్లాడు. దువ్వెన్నలూ, సబ్బులూ అమ్ముకునే ఓ ముసలమ్మ, బొడ్డుకోసి వెళ్లింది. రెండురోజుల్నించీ పడిన మరణవేదన ఆమె కేమీ లెక్క అనిపించలేదు. తన ప్రేమనిధానాన్ని చూసుకుని స్వర్గసుఖం అనుభవించింది. నీరసించిన గుండెల్లో, తన ఆశాజ్యోతిని అదుముకుని... నా... నాన్న... అని ఎండు పెదిమెల్తో గొణుక్కుంటూ, పొంగులుపోయే తీపిచూపుల్తో పిల్లాడిని ఒక్కమాటు ముంచేసి, తలనిమురుతూ, బలహీనం చేత కళ్లు మూసుకుంది... పాలివ్వటానికి పిల్లాడిని యింకా దగ్గిరికి తీసుకుని, తాగటం వాడికి చేతకాకపోతే, తనే రెండుచుక్కలు పిండింది నోట్లోకి. ఏమిటో ధన్యత! ఎంతో ఆనందం!! అమ్మతనప్పుడు, అమ్మ తనూ ఒకళనొకరు కావిలించుకుని అమ్మమ్మకథ చెప్పుకుంటూ పడుకునే నాటి దివ్యానందానుభూతి మళ్లా జ్ఞప్తికి వచ్చింది...

౧౦

ఉదయంపూటే పెచ్చుదనం కనిపించింది గాలిలో. పొద్దెక్కిన కొద్దీ గాలిలో వుండేనీళ్లు తీదవాడి ఒంట్లో నెత్తురు మాదిరిగా ఇగిరిపోవటం మొదలెట్టింది. పదకొండుగంటలు దాటిపోయింది. వడగాడ్పు ఝుమాయించి కొడుతోంది. మూడోరోజు పురుడొచ్చి. బాలింతరాలి గొంతులో యిన్ని పచ్చి మంచినీళ్లు పోసిన పాపానన్నా పోలే దెవరూను. పాపం, ఆ ముసలమ్మ పుణ్యమా అంటూ బొడ్డుకోసి వెళ్లింది. తప్పితే ఏంచెయ్యగలదు? తనకుంటేగదా యితరుల మాట చూసేది? ఆకలి నకనకలాడిపోతోంది బాలింతరాలికి. పిల్లాడిపని మరీ యిదిగా వుంది. మొదటి రెండురోజులు నాలుగుపాలచుక్కలతో వెళ్లమారి పోయింది కాని యివాళ ఆ చుక్కలుకూడా లేవు తల్లిదగ్గిర. ఊహూ కక్కటిల్లి పోతున్నాడు. కోప. ఒస్తుందేమోనని భయంగా వుంది. కొస్త అలవాటువడంచేత తల్లి ఎదురొమ్ములో తన బుల్లి మూతితో వెతుక్కుని చన్నుకరిచాడు. కాని ఏంప్రయోజనం? ఏడ్చేడ్చి సొమ్మసిల్లిపోయాడు. తల్లిగుండె చెరువైపోయింది. ఆదుర్దాగా లేచి, పిల్లాడిని ఒళ్లో తీసుకుని, వాడినోట్లో ఎడంరొమ్ము పెట్టి నొక్కింది దారుణమైన బాధసహిస్తూ. ఆమెప్రాణాలవిసిపోయాయి. ఇంకో నొక్కు... చనుమొనను నెత్తురు చిమ్మింది... వనబాధకేంగాని పిల్లాడింకా సొమ్మసిలే పడున్నాడు. శరీరభూమాలలో ఎక్కడోవున్న కొస్తప్రాణాన్ని మాదదీసుకు చిక్కబట్టుకుని పక్కకెళ్లి అప్పుడే ముస్తైకుని తిరిగి ఒచ్చిన ఓ గుడ్డివాడిబొచ్చెలోంచి రెండు చద్దిమెతుకులు అడిగితెచ్చి యిన్నినీళ్లల్లో పిసికి పిండి, పిల్లాడినోట్లో పోసింది. వాడుకొస్త యిటు కదిలేసరికి ఆమెప్రాణాలు లేచొచ్చాయి. 'నాతండ్రే' అంటూ ఒక్కమాటు గుండె కదుముకుని పడుకోబెట్టింది.

రెండు ఝాములు తిరిగింది. అపరహాదులు కాలి, గుమ్మతున్నట్టుగా వున్నాయి నూర్యకిరణాలు.

కవకవలాడే నిప్పుబొగ్గులు నోట్లో పోసుకుని యముడు ఊదుతున్నాడా అనిపిస్తోంది వడగాడ్పు. మచ్చుకైనా లేవు ఆకాశాన ఆఖరికి తెల్లమబ్బు ముక్కలైనా. నీలాంబరంలో కాలపాశపు మట్టల్లే కూచుని చూస్తున్నాడు సూర్యుడు, తన ప్రతాపానికి ప్రపంచం ఏమంటోందో అని. రెండర్యేసరికి చెట్లాకులన్నీ మలమలా మాడిపోయాయి. లేతరెమ్మలు కాలిపోయినట్టుగా నల్లబడ్డాయి కూడాను. చెట్లమీదినుంచి ఉడతపిల్లలు చచ్చి తపీమని తెల్లగిత్తలుగా కింద పడిపోతున్నాయి. కొమ్మల సందుల్లో యిరుక్కున్న పక్షుల శవాలికి అంతే లేదు...

పిల్లాడు మళ్లా ఏడుపు సాగించాడు. తన ప్రాణం కూడా యిటా అటా అన్నట్టుగా వుంది. ఏం చెయ్యటానికీ తోచక గాభరాగా వాడిని ఒళ్లో వేసుకుని చరచరా బయలుదేరింది వూళ్లోకి, మళ్లీ శోష రాకముందు రెండు మెతుకులెక్కడున్నా అడుక్కొచ్చి నీళ్లల్లో పిండిపోద్దామని. కాల్చిన యినపపాడి మాదిరి ధగధగమంటున్న ఆ గంధ్ర యిసకలోంచి వెళ్లి వాగు దాటి వూరుమొగదలలోకి వచ్చింది... ఎదురుగానే నాలిక వెళ్లబెట్టుకుని మూతి నేలకి కొట్టుకుని చచ్చిపడుంది ఓ తెల్లకుక్క పిల్ల వీధిముఖ్యగా. బాలింతరాలి గుండెలు గుభేలుమన్నాయి. మాటిమాటికీ పిల్లాడిని స్పృశించి చూస్తూ బాగా గుడ్డ కప్పేసి తనపైకి సమిటకూడా లేకుండా, పిచ్చెత్తినదాని మాస్తరుగా అంగలు జాస్తూ ఒక్కయింటి తలుపన్నా తీసేవుంటుందేమో నని బహు ఆత్రంగా వీధికి రెండువేపులా పరికిలిస్తూ తొందరపాటుతో పడిగజాలు నడిచింది. ఓ యింట్లోంచి యింకో యింట్లో కెడదామని ప్రహారీగోడ తూములోంచి బయటికొచ్చిన ఓ మచ్చల పిల్లి కొద్దు అవతలి కళ్లకనుండే గిర్రున తిరిగి పడిపోయి గెస్తురు కక్కుకుంది.

బాలింతరాలికళ్లు చీకట్లు కమ్మాయి అంత తెలుసున్నా. కన్నీళ్లు కార్చటానిక్కూడా శక్తిలేదు. మృత్యుముఖంలో బిసుకుపోయిన ఆ శీవాలికి అదృష్ట మాత్రం ఓ యింటితలుపు ఓరవాకిలిగా వేసేవుంది. మొహం యింత చేసుకుని, ఆ అమ్మాయి ఆ ఇంటిముందు కెళ్ళి, ఎండిన నాలుకతో, ఆరిపోయిన పెదిమల్ని తడుపుకుంటానికి ప్రయత్నం చేస్తూ, ఒణికిపోతున్న బలహీనస్వరంతో "బాలింతరాల్ని తల్లీ, ఒక్క మెతుకేయించు మా అమ్మా!" అని కేకేసింది. నాలుగేళ్ల పిల్లాడూ, ఆరేళ్లపిల్లా ఆ యింటిసావిట్లో ఆడుకుంటున్న వాళ్లల్లే యీ కేక విని, గుమ్మందగ్గిరకొచ్చి, తలుపు యింకా కాస్త తెరిచి కమ్మలు పట్టుకునే నుంచుని..."పాపాయేదీ? చూపించు" అన్నారు.

...చూపిస్తాతల్లీ! 'యింత ముద్దెయ్యమని అమ్మగారితో చెప్పమ్మా...పాలులేక చచ్చి—' ఆ మాటనలేక "పాలు లేవు నాయనా మూడురోజులైంది" అంది బాలింతరాలు ఆత్రంగా.

"జొలే మరి అన్నం ఎందుకూ?" అందాపిల్ల.

"...చూడు...చూడు. మరీ నీ... చెవుల్లో దూరిలేదేం? మా బుల్లక్కయ్యకూడా పెట్టుకుంది పాపాయి పుట్టినప్పుడు" అన్నాడా అబ్బాయి.

"...ఛీ! ముష్టివా ళ్లెక్కడన్నా చెవుల్లో దూది పెట్టుకుంటా రుట్రా?" అం దాపిల్ల. చిన్నప్పుడే తెలుస్తుంది కామాలు వాళ్లకి, ముష్టివాళ్లు మనుష్యులు కారని. మళ్లా ఆపిల్లకే సందేహం వచ్చి "జొలే, మరి నడికట్టేసుకో లేదేం?" అని ప్రశ్నించింది.

ఈ ప్రశ్నలికి సమాధానం చెప్పేమనస్థిమితం ఎక్కడిది బాలింతరాలికి?

"గుడ్డలేదమ్మా"అని ఏదో సమాధానం చెప్పతూ ఎక్కడో వున్న కాస్త ప్రాణాన్ని చెదిరిపోకుండా మళ్లా కూడదీసుకుని, లోపలివాళ్లకి వినబడేటట్టు కొంచెం బిగ్గిరిగా..."బాలింతరాల్ని తల్లీ... ఒక్క చద్దిముద్దే యించమ్మా..." అంది గొంతుకోసిన నల్లమేక చివరి అరుపుమాదిరిగా. ఈ అరుపుకి, లోపలున్న యిల్లాలు చర్రున లేచి సావిట్లో కొచ్చి చూసేసరికి, ఆపిల్లలిద్దరూ బాలింతరాలితో రాచుకుంటున్నంత

చివరగా మంచుని బాలింతరాలి ఒళ్లోకి తొంగి చూస్తూ..."అదిగో నేవ్ అక్కయ్యోయ్! పాపాయి చెయ్యి... వెంకబుల్లితో చూడు, చూడు... పిలుస్తున్నాడే నిన్ను...రమ్మని..." అంటున్నాడు. తమ్ముడున్న స్థానంలో నుంచుంటే గాని పాపాయి కనబడదు గనక "నువ్వు కొంచెం వెనక్కి రారా... నేను చూస్తాను" అని తమ్ముడితో అంటోంది చెయ్యి లాగుతూను ఆడపిల్ల. ఆ చల్లనితల్లి పిల్లల్నిద్దర్నీ చెరోచరుపూ చరిచి, "ఛీ... భడవాయిలూరా! పురిటిలంజవి నావాకిట్లో కొచ్చావా? ఛో! నిక్షేపంలాగా ఆడుకుంటున్న పిల్లల్ని ఎండలోకి రప్పించావ్!" అని పిల్లల వేపు తిరిగి "అయ్యో! అయ్యో! ఎంత ఎండ! ఎంత ఎండ! మాడి కెరలుపు తీశారుటే? పోండి లోపలికి అంటూ వాళ్లని లోపలి కీడ్చు కెళ్లింది. భగ్నహృదయంతో "తల్లీ నీ పాదాలికి మొక్కుతా నాయమ్మ ... నీకడుపు చల్లగా, పిల్లలగన్న మాతల్లీ! మూడు రోజుల్నుంచీ తిండిలేదు... రెండు మెతుకులేయించి ప్రాణాలు నిలుపు మా రాణీ... నీ చెప్పులు మోస్తా... పిల్లాడినాలిక పిడచకట్టి పోయింది నాయమ్మ..."అని చెయ్యి చేల కొనించి, మొహాని కద్దుకుంటూ అడిగింది బాలింతరాలు.

"ఛీ...రంకుగుంటా, ఒళ్లు మదించి, అడ్డమైన వాళ్లతోనూ పోయి, పిల్లల్ని కని, ఊరుమీద పడుతారు మహా తాతసొమ్మేదో దాచుకున్నట్టు. నీతా? జాతా?...ఛో..." అంటూ ఆ యిల్లాలు తలుపు ధఢీ మని వేసింది. ఇంటినిండా గంపెడు పిల్లలు. వేసే వెయ్యకుండా యింత వుండిపోదాను. ౪౫ ఏళ్లుంటాయి. పోయినవాళ్లు పోగా నలుగు రాడపిల్లలూ ఆరుగురు మొగపిల్లలూను. కడసారి వాడికి మొన్ననే మూడో ఏడొచ్చింది...

ధఢీమని వేసిన తలుపు వడగాలివిసురుకి, మళ్లీ వెనక్కి తన్నడంమూలాన, పాపం ఆ యిల్లాలి మొహానికి బొగిలి కాస్త బొప్పి కట్టింది. దాంతోటి ఆవిడ మహాంకాళి అయిపోయింది. ఆ గాడ్పుకి బాలింతరాలి ఒళ్లోవున్న పసివాడు కెవ్వున కేకేశాడు. గాలి సూటి చేత, బాలింతరాలు తూలిపోయింది. కాని ఎలాగో అరుగుమెట్టు పట్టుకుని, నిలదొక్కుకుంది. అరిచిన పసివాడు, మళ్లీ కదలకపోయేసరికి, తల్లి ప్రాణా లెగిరిపోయాయి..."కాసిని మంచినీళ్లన్నా పోయించు తల్లీ, పిల్లాడు...కదలటంలే దమ్మా..." అని బావురుమంది పాపం!

"నీ మొహం మండ! ఏమి వగలే? పొద్దున్నే ఎవరి మొహం చూశానోగాని, మొహమంతా బొప్పి కట్టింది—నీమూలాన. నీపిల్లాడూ, నువ్వూ పెద్దగంగలో పడి అణగారిపోనూ! చావండి, నాశనం కండి ఎండలో పడి..."అని, తలుపు జాగ్రత్తగా నొక్కి, మళ్లీ వెనక్కి రాకుండా గడియవేసింది. కిటికీల్లోంచి అక్కాతమ్ముళ్లా పాపాయికోసం యింకా చూస్తునే వున్నారు.

ఎండించి, కాల్చి, మాడ్చేసి, చిత్రవధ చెయ్యటం జరుగుతూంటుంది సంఘంలో, ఓవ్యక్తిని సంఘమంతా కలిసో; ఓ వ్యక్తి సంఘాన్నంతానో; లేకపోతే ఓ తెగ యింకో తెగనో. కృశించి కాలిపోయే గుండెల పొగలూ, నీరసించి ఎగిరిపోయే ప్రాణాల అరుపులూ ఏమి ఆనందాన్నిస్తాయో ఆ వ్యవస్థకి!

మళ్లా అల్లాంటిదే యింకోగాడ్పు...ఒళ్లో ఉన్న పసిపాప, చిట్టచివరిమాటుగా యింకో ప్రళయనాదం పలికించాడు... దానికైనా జవాబు లేదు. చెవిటి సంఘంయొక్క రాతిగుండెల్లో చొరబడే శక్తి ఆ ఆర్తనాదానికి లేదు... మరుక్షణంలో ఒళ్లో ఉన్నబిడ్డ మంచు గడ్డయిపోయాడు. అప్పటికే మహాప్రస్థాన సన్నాహంలో వున్న బాలింతరాలిప్రాణాలు ఆ చల్లదనాన్నిమాత్రం గ్రహించ గలిగాయి. "నాయనోయ్"... అన్న ఆమె అంతిమనినాదం వీధంతా ప్రతిధ్వనించింది. సుడితిరిగి గిర్రున పడిపోయిన ఆమెశిరస్సు వీధి అంచున కంకరముక్కలమీద ఆనింది. ఒళ్లో ఉన్న పిల్లాడితలా, ఓ చెయ్యిమాత్రం దుమ్ములో దొర్లుతున్నాయి. మిగతా శరీరభాగం యింకా తల్లిఒళ్లోనే

ఆ యింటి రెండో అంతస్తులో అప్పుడే భార్య యిచ్చిన చల్లటి పానీయాన్ని సేవిస్తున్న సాహుకారుగారి రెండోకొడుకు బాలింతరాలి ఘోషకి అదిరిపడి లేచి, వెండిచెంబా చేతులో పట్టుకునే, కిటికీ తెర ఒత్తిగించి క్రిందికి చూశాడు. భార్యకూడా... "ఏమిటీ అరుపు?..." అంటూ భర్తని అనుసరించింది. తలదిమ్ము కాస్త తిరిగి కళ్లు తెరిచిన బాలింతరాలికి, కిటికీలోంచి చూస్తున్న భార్యాభర్తలు కనిపించారు. ఆమెకళ్లల్లోంచి సాహుకారుగారి రెండో కొడుకు కళ్లల్లోకి బలవత్తరమైన ఓ, అదృశ్యప్రవాహం పరిగెత్తింది. దాంట్లో సర్వసృష్టినీ ధ్వంసపటలం చేసే కాలాగ్నులున్నాయో? ప్రేమాంబుధిలో నుంచి లేవనెత్తే పీయూషధారలున్నాయో? కాని అతడు తనకళ్లకి వెండిచెంబా అడ్డం పెట్టుకుని ప్రవాహాన్ని కట్టెయ్యడం మూలావ, అది బాలింతరాలి కళ్లల్లోనే యిదర్చుకు పోయింది. ఆమె నేత్రాలికి అమరాస్వాదనం చేసిన వెండిచెంబాని భార్య కిస్తూ, చెమటలుపట్టిన దేహంతో నీళ్లుకమ్మిన కళ్లల్లోంచి, కాకికాలిన పసిపిల్లాడి మొహంలోకి చూశాడు సాహుకారుగారి రెండో కొడుకు!

రిక్తగీతి

శ్రీ అబ్బూరి వరద రాజేశ్వరరావు

అచట నెత్తుటఁ బడిన దే యధమజనుని
చివికి చిల్లులు వడిన దస్థికల బోను ?
అచటి నెత్తుటిలోన యే హస్తముద్ర
మూగినజనమ్ము గుండెల ముద్రపరచె ?

ఎవరి దీయాకృతి ? తను నశించె; ఈ య
గాధలోకమ్ము చెరసాల గడచి పోయె
తనకు నా యనువా రున్న దరికి రారు
ఎట్టి పాపిష్ఠిజన్మ జీవించినాడొ ?

అతని మోము నెత్తుటిముద్ద; ఆ యభాగ్య
జీవనమ్ము నెవరిపాలు చేసి చనెనొ ?
ఏ మధురస్వప్నభూముల నెవరికొరకు
చెదుగు రాచరికపు కళ్లబడి నశించె!

మనవి పేదగుండలు; ఝల్లు మనును; చూచి
చూచి నిల్చిన నేను చచ్చువడిపోయి
కాలు కదపని యాపాపఘడియలోన
ఆతపత్రమ్మువోలె నల్లాడినాడ!

ఏ యనంతాశయఫలిత మిమ్మా యఖండ
త్యాగశీలమ్ము? ఏపవిత్రానుబంధ
మేచికొన్నదో యితని దిక్కేని లేని
చావు, మా మానవత్వమ్మె నడలిపోవ!

అవీ - ఇవీ

శ్రీ విశ్వనాథ సత్యనారాయణ

౧

పూర్వాంధ్రకవులు చంపకమాలాది వృత్తములతోఁబాటు జాతికందము, ఉపజాతిసీసము బాహుళ్యము మీఁద వాడినారు. ఈ యన్నింటిలో సీసరచనము సులభము; ఎక్కువ విషయము చెప్పుటకు వీలైనది. మొదట నాల్గుపాదములు, తరువాత గీతపద్యము - ఈ పద్యముయొక్క నిర్మాణపద్ధతిలోననే రచనలో ప్రక్రమభంగదోషము ప్రాప్తించుటకు వీలున్నది. దీనిని నన్నయ్యగా రొక యొడుపుగాఁ బట్టుకొని వచ్చిరి. ఏపాదమున కాపాదమునందు అర్థవిరతి కల్పించుచు వచ్చినచో నాల్గుపాదములు నొక్కటియే రీతిగా నుండి విసుగుపుట్టించును. నన్నయ్యగారు మొదటిపాదముగాని నాల్గవపాదముగాని కథాసీసమువలెఁ జేసి యావిసుగు లేకుండఁ జేయును. నాల్గుపాదము లొక్కపోతగాఁ బోసినవాడు తిక్కన. ఆయన తెలుఁగుమాటలు పొదిగి భావముచేత నిండించుచు సీసపద్యరచనయందు విసుగుపుట్టకుండఁ జేసికొనెను. ఇది యాయనపద్ధతిలోని నేర్పు.

శ్రీనాథుఁడు తిక్కన్న సీసమును నన్నయ్యగారివలె సంస్కృతపదభూయిష్ఠముగ వైదర్భీరీతితోఁ దీర్చి దిద్దెను. ఈయనయందు సీసపద్యము క్రొత్తదైన నిండుతనమును దెచ్చుకొన్నది; తన నిర్మాణపద్ధతియందే సన్నిహితమైయున్న దోషమును బాహిరింపించుకొన్నది. "కాలకంఠ కఠోర కంఠహుంకా" రాది పద్యమును చూడుఁడు. రచనయొక్క బిగువులో శయ్యయొక్క పుష్టిలోఁ బోనుపోను పద్యచరణములు పలుచఁబడుచున్నవి. ఆనాఁటి నుండి యీనాఁటి వఱకు సీసపద్యమున కీదోషము తప్పలేదు. ప్రథమచరణము నందలి భావమువంటి భావమే తక్కిన మూఁడు చరణములయందును సమకూర్పఁ బ్రయత్నించుటయు నట్టి ప్రయత్నము బహుధా విఫలమగుటయు నిందున్న దోషము.

తెలుఁగు కవిత్వములో భావపటుత్వము తగ్గుటకీ సీసపద్యము చాలవఱకు సానుకూలపడినది. ఒకవేళ నాల్గుచరణములును జక్కఁగఁ దీర్చుకొన్నను గీతపద్యమునందు బిగువు చెడిపోవును. పద్యమునందలి ప్రధానచమత్కారము గీతమునందే చేసి యాచమత్కృతి యాపేక్షముచేతఁ బైనాల్గుచరణములను వెలిఁగించుకొన్న కాసుల పురుషోత్తముగారి వంటివానిఁ దప్ప యీదోషము చాలమందికిఁ దప్పలేదు. ఉపమానములు చెప్పఁ దొడఁగొన్నచో నాలుగుపమానములు రావలసినవే. బ్రహ్మవిష్ణుమహేశ్వరులను లక్ష్మీపార్వతీ సరస్వతులను మూఁడు చరణములందు నింపినచో నాల్గవచరణమున మరెవ్వరో పడవలెను. అప్పుడు నలుగురికిని

గదు. ఈ యిబ్బంది వసుచరిత్రకర్త యెన్ని సారులు పడెనో చూడవచ్చును. ఈదోష మనేకపద్ధతులు గావచ్చును సహృదయులు పరిశీలించియే యుందురు. నూటికిఁ దొంబది మంది కవు లిందుఁ బ్రక్రమభంగదోషము చేసినవారే. ప్రక్రమభంగము సీసపద్యము నందు దోషము కాదు; గుణమే.

౨

ఈ నడుమ గోదావరిజిల్లా పెనుగొండ నుండి నాకొకాయన యుత్తరము వ్రాసినాఁడు. ప్రజామిత్రిలో వెనుక చెలియలికట్టమీఁద విమర్శన పడినది; మీరు దానికి సమాధానము వ్రాసినచోఁ బంపవలె నని. నేను దానికి దీనికి దేనికి సమాధానము వ్రాయ లేదు. ఔచిత్యము, కథాస్వాప్తి, స్ఫూర్త్యాదు లయందలి ప్రతిపత్త్యప్రతిభాదులు వ్యక్తిగతేష్టానిష్టములతోఁ గూడినవి. కాని యావిమర్శకుఁడు చెలియలికట్టలోని భాష నన్నయభట్టుకాలమునాఁటి ప్రాఁతభాష యని వ్రాసినాఁడు. ఇది యవిచారితము. ఆంధ్రభాష యీ వేయియేండ్లుగా పలుకుబడిలో నొక మహాసామ్యమును నిలఁబెట్టుకొన్న దనుటకు సర్వాంధ్రగ్రంథములును సాక్ష్యభూతములు. కాని భాషలో వచ్చిన మార్పు ప్రధానముగా ననేకశబ్దముల నాశ్రయించి యున్నది. "గోచరింపన్" ఇందలి పుగాగమము నన్నయనాఁటిది. "గోచరించన్" అని గూడ నిప్పు డనుచున్నాము. ఇది గ్రామ్యమని గ్రాంథికవాదులు. "నాఁడుఁ నారు, నావు" ఈ భూతకాలిక క్రియాధాతురూపప్రత్యయములు నన్నయనాఁడు లేవు. "వనమునుండి" ఈ రూపమే ప్రాఁతది. "వనమునుంచి" ఇది క్రొత్తది.

ఈ క్రొత్తరూపములు చెలియలికట్ట నిండ తండోపతండములుగా నున్నవి. నన్నయగారిభాషలోని యనేకశబ్దరూపములకుఁ జెలియలికట్టలోని తచ్ఛబ్దరూపములకు నీ వేయియేండ్ల వ్యత్యాసము నున్నది. నన్నయగారు వ్రాసిన వచనశైలికిఁ జెలియలికట్టలోని వచనశైలికి శబ్దరూపములందుఁ గాని వాక్యనిర్మాణమునందుఁగాని మఱేయే విషయమునందును బోలిక లేదు.

3

సర్వభారతవిఖ్యాతుఁ డైన శిల్పవేత్త ఆనంద కే. కుమారస్వామిగారి యొక్క శిల్పగ్రంథములు, రసచిత్రము, ధూళిచిత్రము విద్ధచిత్రము ఈమూఁడు పారిభాషికపదములకు నర్థము తప్పు వ్రాసెనని యొకపండితుఁ డొక యుపన్యాసవేదికనుండి చెప్పెను మఱియొక తీవ్రవాది (ఈయనయుఁ బండితుఁడే) దీనిని మఱలఁ జెప్పి యుపన్యాసవేదికనుండి సర్వపాశ్చాత్యులు నిట్లే సర్వమును దోషములే వ్రాయుదు రని చెప్పెను. సభలో నుండి యొక్కరు "అయ్యా! పొరపాటు లెవరికైన రావచ్చును. ఏకవిషయమునందలి యిట్టి దోషమును బురస్కరించుకొని సర్వము దోషయుత మనుట న్యాయ్యము కాదు." అనఁగా నా పండితుఁడు "యథైకేన మృత్పిండేన విజ్ఞాతేన సర్వం మృణ్మయం విజ్ఞాతం భవతి" అని యుపనిషత్తు పఠించినాఁడు. సభికుఁడు "అది జ్ఞానవిషయము; పిడుగునకు బియ్యమునకు నొకటే మంత్రమా?" యనఁగా "అంతియే" యని పెద్ద యరపరచినాడు. ఈ పండితుఁడే ఆ యుపన్యాసములో ననే "అసాయమ్మును నానిశాత్యయముగా నామ్నాయముల్ క్రోల్చువో నాసీనప్రచ

లాయితంబయిన లే దాహో విశర్కింపఁగన్" ఇందు "క్రోల్చుచో" బదులు "క్రోలుచో" యని రెండు మార్లు చదినారు. ఏకమ్ము త్రిండ విజ్ఞానవాద మిచ్చటఁగూడఁ బట్టునా? పొరపాటుపడుట మానవసహజముగదా !

౪

"ప్రభాకరచరణంబు లాన" యని యొక పద్యములో నున్నది. ఇది చదివినంతనే కలుగునర్థస్ఫూర్తి యెట్టిది? "ప్రభాకరుఁ డను పేరుగల యొకపురుషుఁడు కలఁడు; అతని చరణములు ప్రమాణము" అను స్ఫూర్తి కలుగును. కాదా, ప్రభాకరుఁడు సూర్యుఁడు; ఈ యర్థమునకుఁ బ్రసక్తి లేదు. కాఁగాఁ బ్రభాకరుఁ డనగాఁ వెలుఁగు చేయువాఁడు. గురువు జ్ఞానమను వెలుఁగు నిచ్చునుగావున, బ్రభాకరుఁ డనఁగా గురువని యర్థము చెప్పుటవలన నేయార్థ మను కావ్యదోషము ప్రాప్తించును కొందఱు పండితులు వాదవేగములో నిట్లు చెప్పుదురు; మఱికొందఱు బాలురు పొరపడుదురు.

భారతీ! యివె గొనుమమ్మ ప్రణుతిశతము

శ్రీ దంతులూరి సత్యనారాయణరాజు

సత్కవిరచితమై - శ్రవణహృద్యంబునై
దీపించుచుండు ప - ద్యములతోడ
నురుతరప్రౌఢిమ - నూహించి చేకూర్చి
నట్టి గ్రంథవిమర్శ - నంబుతోడ
నాదరణీయమై - యాంధ్రభాషావృద్ధి
నమకూర్చు సద్వ్యాస - చయముతోడ
జదపరలోకంబు - సమ్మోద మందంగ
ఘనతతో గూర్చిన - కథలతోడ
కరము దేదీప్యమానమై ఘనతగాంచి
తెనుగుమాతల్లి దీవన - ల్గొనుచు సతము
బండితాదరముల గిడు - బడయుచున్న
భారతీ! యివె గొనుమమ్మ - ప్రణుతిశతము.

మనుష్యావయవములు గల జంతువులు

శ్రీ ఒంగోలు వెంకటరంగయ్య

అమరసింహుడు కిన్నరులను దేవ సంభూతులలో జేర్చినాడు.

"విద్యాధరోఽప్సరో యక్షరక్షో గంధర్వ కిన్నరాః
పిశాచో గుహ్యకః సిద్ధో భూతోఽమీ దేవయోనయః."

కుబేరుని కిన్నరేశునిగ జెప్పియున్నాడు. మరియు స్వర్గమునందే "స్యాత్కిన్నరః కింపురుష స్తురగవదనో మయుః" అని యొకగణమునుగూడ జూపినాడు. కిన్నరశబ్దమునకు లింగాభట్టీయమున (గురుబాలప్రబోధికమున) కించిన్నరః అనగా కొలదిగ నరాకారము గలవారని వ్యుత్పత్తి వ్రాయబడియున్నది. కిన్నరులకు గుఱ్ఱపు ముఖమును మనుష్య దేహమును ఉండునట. కిన్నరులకు కింపురుషులకును దేహవిన్యాసమున భేదముండెనో లేదో ఈ రెండు శబ్దములును ఏకవస్తుద్యోతకములో తీర్మానింపవలసియున్నది. అమరుడు ఈ రెంటిని పర్యాయపదములుగనే ఉదాహరించి "స్యాత్కిన్నరః కింపురుష" ఇత్యాది వాక్యమునందు జేర్చినటు లున్నది. కుమారసంభవము ౧-౮ లో "కిన్నరాణాం" అను ప్రయోగమున్నది. ఈ శబ్దమునకు మల్లినాథుడు "దేవగాయకానాం" అని వ్యాఖ్యానమును జేసియున్నాడు. ఆ కావ్యముననే ౧-౧౪ లో "కింపురుషాంగనానాం" అను

"కిన్నరస్త్రీణాం" అని అర్థము వ్రాసియున్నాడు. ఈ రెంటిని బట్టిచూడ కాళిదాసుడును మల్లినాథుడును ఈ కిన్నరకింపురుషశబ్దములను పర్యాయపదములుగనే భావించినటులున్నది.

మాఘకావ్యమునందలి (౪-౩౮) ఈ క్రింది శ్లోకమువలన ఈజాతిలో తురంగవక్త్రులు కొందరు తురంగదేహులు కొందరుండునట్లు స్ఫురించుచున్నది.

"బింబోష్ఠం బహు మనుతే తురంగవక్త్ర
శ్చుంబంతం ముఖ మిహ కిన్నరం ప్రియాయాః,
శ్లిష్యంతం ముహు రితరోఽపి తం నిజస్త్రీ
ముత్తుంగ స్తనభరభంగభీరుమధ్యామ్."

ఈ శ్లోకమునందలి పూర్వార్ధములోని "కిన్నర" శబ్దమునకు "మానుషముఖం అశ్వాంగం" అని మల్లినాథుడు వ్యాఖ్యానముచేసి యుత్తరార్థములోని తురంగవక్త్రుని ఊరక దేవయోనివిశేషునిగ జెప్పి దాటిపోయినాడు. కిన్నర కింపురుషుల యవాంతర భేదమును జెప్పలేదు.

వాల్మీకిరామాయణ కిష్కింధాకాండలో ౪౨-వ సర్గ, 33-వ శ్లోకమున "స్త్రీణా మశ్వముఖీనాం" అను మాటలకు "కింపురు

యున్నది. దీని వలన కింపురుషులు తురంగవక్త్రు లని యూహింప నలవి యగుచున్నది.

కిన్నరకింపురుషులు ద్విపాత్తులా లేక చతుష్పాత్తులా ? ఈ యిద్దరిలో గుఱ్ఱపు దేహము కలవాడు కిన్నరుడగుగాక కింపురుషుడగుగాక- శిల్పులు చిత్రకారులు (Sculptors and Painters) ఈగుర్రపు దేహభాగము కలవాని వెనుకటి రెండు గుర్రపుకాళ్లపై నిలుచుకొనునట్లును ముందరి రెండు కాళ్లను పైకి యెత్తికొనియుండునట్లును జూపుదరు. దేవాలయ గోపురముల మీదను తేరుల మీదను వీని ప్రతిమ లుండును.

కిన్నర యనునది వీణవంటి యొక వాద్యవిశేషము కిన్నరులు దీనిని వాయించుదురని కవిసమయ మై యున్నది. "కీరమనోజ్ఞవాణి యొక కిన్నరి కిన్నర మీటి మీటి" ఇత్యాది మనుచరిత్రమున ౫-౬౨ లో కలదు. గుఱ్ఱపుకాళ్లు కలదగునెడ కిన్నరి కిన్నర నెట్లు వాయింపగలుగును ?

ఇది యటు లుండ, కిన్నరజాతి దేవయోనియా లేక సామాన్యమగు తిర్యగ్జంతువా యను సందేహమున కవకాశమును కలదు. పక్షులలో కోకిలస్వరము మనోహరముగ నుండునట్లు మృగములలో కిన్నర కంఠధ్వని శ్రవణానందిముగ నుండునా ? అట్టి జంతు విపు డున్నదా ? వాల్మీకి రామాయణమున "కిన్నరశబ్దము పలుమారు తగులుచుండును. అయోధ్యాకాండ ౧౦-౧ లో "దగ్ధవిద్ధేవ కిన్నరీ" యని యున్నది. దీనినిబట్టి చూడ కిన్నరులు వేటాడబడు జంతువులుగ నుండవచ్చు నని తోపగలదు. "దిగవిద్యా విద్యాధరేణ ప్రహృష్టా" యని

వ్యాఖ్యాతము. మరియు సుందరకాండ ౨౦-౫౫ లో "సుతమివ బద్ధా మవేక్ష్య కిన్నరీ" యని యున్నది. కిన్నరి యెదుట దాని శిశువును కట్టివేయుట ఈవాక్యభావము. బహుశః పికారీలు ముద్దుకొరకు జింకపిల్లలను, నెమళ్లను, చిలుకలను పట్టుకొని పెంచుచుండునట్లు కిన్నరశాబములగూడ పట్టుకొనుచుండిరా? అటులు గాక ఇట్టిపాట్లకు లోనగు కిన్నరులు విద్యాధరాది దేవయోనిగణములలోనివారే యగునెడల గానమాధుర్యముచే గంధర్వకూనలను, మణిమంత్రౌషధసిద్ధులకై సిద్ధసాధ్యవిద్యాధర శిశువులను పట్టి తెచ్చి నటుల యెచటను కనుపడదు.

ఇంగ్లీషులో Mankin, Lambkin (మాన్కిన్ - లాంబ్కిన్) ఇత్యాదులలో "కిన్" (kin) ప్రత్యయము అల్పార్థమున (Diminutive sense) కనుపడుచున్నది. ఈ ప్రత్యయము కిన్నరలోని "కిం" అనుదానికి సజాతీయముగ నుండునా ?

మనుష్యావయవములను పశుపక్ష్యాదుల యవయవములను సమ్మేళమును జేసి యొక వ్యక్తిని యూహించుట అనాదిగ అన్ని దేశములందును, అనేకమతములందును కనుపడుచున్నది. ఉదాహరణములు :— హయగ్రీవుడు, నరసింహుడు, గజాననుడు, మహిషాసురుడు, పురుషమృగము. గ్రీకుల గాథలలో పాన్ (Pan) అను దేవతకు మేకతలయు మనుష్యదేహము. గ్రీకువారికిని హయగ్రీవునివలె సర్వవిద్యాపారంగతు డగు ఖిరాన్ (Chiran) అను దేవతావ్యక్తి యుండినది. ప్రాతకాలపు ఈజిప్టువారికి అన్యూబిస్ (Anubis), థాత్ (Thoth) ఇత్యాదు లనేకము లుండి

దేహము, తలమాత్రము కుక్కతలవలెనో నక్కతలవలెనో యుండును. థాత్ అను దేవతకున్ను మనుష్యదేహము, తల పక్షి తలవంటిది. అందులో ముక్కు పెద్ద కొంగ ముక్కువలె నుండును. వారిగాథలలో వీరు క్షుద్రదేవతలు గారు. మొదట జెప్పిన అన్యూబిస్ చనిపోయినవారి జీవాత్మలను యమధర్మరాజుసన్నిధికి తీసికొనిపోవు అధికారి. థాత్ అను దేవత వారి తత్త్వశాస్త్రప్రవర్తకుడు. బహుశః ప్రాతకాలపు ఈజిప్టువారి వేదాంత సూత్రకర్తగ నుండునేమో? పౌరాణిక (Mythological) గ్రంథమున కేమాత్రమును అవకాశమియ్యని ఇస్లాములో నొక వింత యగు బురాఖ్ (Buraq) అనునది గలదు. ఒకపుడు అల్లాహుతాలా (సర్వేశ్వరుడు) గారు తమ సందేశహారులగు మహామ్మదు రసూలిల్లా ప్రవక్తగారిని తమ సన్నిధానమునకు రమ్మని ఆజ్ఞాపించినట్లును, ఆసందర్భమున మహామ్మదుపైగంబరువారు బురాఖ్ అనునొక దివ్యచతుష్పాత్తు నెక్కి అల్లాసాహెబుగారి సన్నిధానమార్గమున కొంత వడిపోయినట్లును వారిలో నొకగాథ కలదు. దీనికి వారికి వేదతుల్యగ్రంథమగు ఖురానులో ఆకరమున్నట్లు అగపడదు. వాడుకలో నీగాథయున్నది. ఇది యొక రూపకభావముగ (Metaphorical conception) నుండునేమో. బురాఖ్ యొక్క చిత్రపటములు అమ్మబడుచున్నవి. కొంచెమించుమించుగ పురుషమృగము లేక కామధేనువును పోలియుండును. సుందరమగు స్త్రీముఖము, మిగిలినభాగము ఆవును పోలియుండును. నెమలికివలె చిత్రవర్ణములుగల రెక్కలును గలవు. గుఱ్ఱపుగిట్టలు. ఇప్పటికిని మహమ్మదీయులలో [illegible]

చేయునపుడు హిందువులు "పిల్ల రంభవలె నున్నది" యనునట్లు వారు "బురాఖ్ వలె నున్నది" యందురు. ఈ అరబ్బీమాట వృషభశబ్దసాజాత్యముగ నుండునా యని యోజింపదగి యున్నది. ఈ గాథను మహమ్మదీయులు "మేరాజ్" అని చెప్పుకొనుదురు. మేరాజ్ అనగా నిచ్చెన- స్వర్గసోపానములు అని భావము. క్రైస్తవుల మతగ్రంథమగు బైబిలులో నిట్టివింతలు లేవు గాని నెంబర్సు (Numbers) అను కాండయందలి ఇరువది రెండవ యధ్యాయమున బలాం అను నాతడు ఎక్కివచ్చుచుండిన గాడిద వానితో మాటలాడినదని యున్నది. అది యెట్టి గాడిదయో గదా?

పురుషమృగ మొక విపరీతస్వరూపము గలిగియున్నది. ఈ వ్యక్తికి వైదికప్రశస్తి గలదు. కృష్ణయజుర్వేద పంచమకాండ పంచమప్రపాఠక పంచదశానువాకమున నీ శబ్దము తగులుచున్నది:—

"పురుషమృగశ్చన్ద్రమసే గోధా కాలకా
దార్వాఘాటస్తే వనస్పతీనా మేణ్యాహ్నే"
...................ఇత్యాది.

ఈ యనువాకభాష్యమున సాయనాచార్యుల వారు "పురుషమృగో నరముఖో మృగవిశేషః" అని నిర్ణయించియున్నారు. వేదములోని ఈపురుషమృగ వ్యక్తిగతభావన యెట్టిదో యూహింప నలవి కాదు. ఈ పురుషమృగము పరమశివభక్తుఁడట. శైవాగమమున ఈశ్వరునికి ధూపము సమర్పించునపుడు ఈ మంత్రమును చెప్పుదురని తెలియుచున్నది. ధర్మరాజ రాజసూయమున దినదినము భోజనములు చేసినవారిసంఖ్య యత్యధికమై [illegible]

నసాధ్యమై శ్రీకృష్ణుల నుపాయ మడిగి నంతట పురుషమృగ మీ భోజనశాలం బ్రవేశించినమాత్రాన మెంగిలి పోయి స్థలశుద్ధి యగు నని యుపాయ మ చెప్పె ననియు, అందు మీద జాడ వెదకికొని పోయి భీము డెట్లో ఆపురుషమృగమును యజ్ఞవాటికకు దెచ్చి నట్లును యొకగాథ గలదు. ఈకథ కాకర మెం దున్నదియు తెలియలేదు. సంస్కృత భారతమున మృగ్యముగ నున్నది. తెలుగున పుష్పగిరి తిమ్మకవి కృత "సమీరకుమార విజయము"న నీ కథ యున్నది.

శివునివాహనములలో పురుషమృగ మొకటిగ నున్నది. నెల్లూరులో నెలకొని యుండు శ్రీ మూలస్థానేశ్వరస్వామి వారి యాలయములో పురుషమృగాకృతి వాహనము కలదు. శ్రీ కాళహస్తీశ్వరుని యాలయముఖద్వారసమీపమున పురుషమృగరూప శిల యొండు గలదు. స్నానాదుల జేసి శుచిగ నుండువారే గాక సామాన్యముగ నందరును దర్శనమునకు పోవుచుందురు. మహాదేవసాన్నిధ్యార్హమైయుండు ఈ పురుషమృగస్వరూప మచట పైకమైయున్నది.

కామధేనువును స్త్రీముఖము గల గోరూపమున జిత్రింతురు. దీనికిని పురుషమృగమునకును పురుష చిహ్నములగు గడ్డములు మీనములు దప్పి మిగిలిన దంతయు రెంటికిని సమానముగనే యున్నట్లు కనుపడుచున్నది. సకల సంపత్స్వరూపముగు కామధేను స్వరూపము మద్రాసులో ప్రకటింపబడు "హిందూ" పత్రికాముఖపత్రపు లలాట స్థానమున భారతమహేంద్రపదవీ సూచకముగు నైరావతము నెదురుచూచుచున్నట్లు ఆ మహాపత్రిక నలంకరించుచున్నది.

ఇట్టి మనుష్యావయవ విశిష్టములగు తిర్యగ్జంతు సంకేతములు వాఙ్మయమునను శిల్పమునను అసంఖ్యాకములుగ గలవు. వీని తత్త్వములను, ఉద్దిష్టప్రయోజనములను దెలుపు గ్రంథసహాయము మన దేశ వాఙ్మయమున మృగ్యముగ నున్నది. ప్రాచీనగ్రీసులోనగు దేశములలోని ఇట్టి భావముల తత్త్వమును కొంతవరకు ఆంగ్లేయ మహాశయుడు బేకన్ ప్రభువు (Lord Bacon) ప్రాచీనుల తెలివి (Wisdom of ancients) అను గ్రంథమున వ్యాఖ్యానించి యున్నాడు. పౌరాణిక గాథలకు శాస్త్రసాక్ష్యములకు సమన్వయముల జూపలేకుండుట హైందవపాండిత్యకి న్యూనత యగును. శాస్త్రజ్ఞు లీ విషయమున పరిశోధనలు చేసి శాస్త్రపురాణ సామరస్యమును సాధింపవలయును.*

---

* ఈ వ్యాసమునందలి యంశములలో కిన్నరకింపురుషవిషయము మాత్రము గూర్చిన జాబునుండి [illegible] (పదేండ్లకు ముందు కొన్ని పత్రికలలో [illegible]) [illegible] ఆంధ్ర పండితులు, లౌకికులు, విమర్శకులు, గ్రంథప్రకాశకులు నగు బ్రాంప్లె రామకృష్ణయ్య పంతులుగారి యాజమాన్యమున ప్రకటింపబడిన [illegible] గ్రంథావళి [illegible] మాసపత్రికయందు [illegible] సంపుటముల [illegible] ఖములలో నందంద వర్ణింపబడి యుండెను. అయితే ఆ దర్శ [illegible] విద్యావిషయక [illegible] గారి ఈ వ్యాసమున [illegible] కాదు. అయినను ఆ [illegible] ఈ విషయమున [illegible]

ఈ రాత్రి

శ్రీ అబ్బూరి వరదరాజేశ్వరరావు

నలుమూలలా నల్ల
నల్లనివి కారుమే
ఘాలు అటై ఇటై ఆ
కాశ మంతా నిండి
నాలోని రక్తవాం
ఛలు నింగి కెగిరించు!
చీకట్ల రాసులలో
చిరార్జిత ఫలితాల
కనుల గట్టించి నా
క పథాల నడిపించు!

విన్నది విదేశవా
ర్తాసంగ్రహమై నా
పుడమి మొంగిసాలలో
పున్నామ నరకపు
దృశ్యం!
కాళ్లు చేతులు లేని
కంకాళ నృత్యవి
న్యాసం - ప్రళయ భేరి!

నా బతుకు పొలాలే
నానావిధాల దు
మ్మెగబోసి చూస్తే
జగత్తంతా అదే
నంటూ భ్రమించాను!
దూర దూరాన రే
దారిదోపిడిదార్లో!
నరజాతి కళేబర
విరాళం ప్రపంచన
మాధికి బహూకృతం!

త్రియంబకము

(శ్రీ) మూర్తి వాసకా

ఒకానొకసమయంలో బ్రాహ్మణసన్యా
సులు గౌతమమహర్షిమీదా, ఆయనభార్య
అహల్యమీదా ఈర్ష్య వహించి వారిని
ఆశ్రమాన్నుంచి తరిమివేయా లనేయుద్దే
శంతో వినాయకునిసహాయము నపేక్షించి
మహాఘోరమైన తపస్సుచేయటానికి బూను

కోడానికి వేరొకమార్గ మేమీ దొరికింది
కాదు వినాయకునికి. ప్రత్యక్షమై వాళ్లు
కోరినవరం ఇచ్చాడు. దానిని తీర్చడానికి
గాను గణేశుడు స్వయం గోరూపం ధరించి
గౌతముని పరిపొలాలమీదా, యవక్షేత్రా
ల్లోనూ బడి మేయడం సాగిస్తే దయాళువు



గోదావరి స్రోతస్సు

పూరక అదలించాలని పరిగడ్డిపరక తీసికొని ఆ గోవుమీద వేసేసరికి అది చచ్చి భూమి మీద పడిపోయింది. బ్రాహ్మణు లందరికీ మహానంద మైంది. కాని ఈ అనర్థపుఘటన వల్ల మహర్షికి అమితమయిన దుఃఖం కలిగి ఆపాపం పోవడానికి దారి ఏమిటని ఆబ్రాహ్మణులనే అడిగాడు. భూమికి ప్రదక్షిణం



త్రియంబక్ సునందలో గోదావరి

చేయడంవల్లా, శివుని అత్యంత భక్తితాత్పర్యాలతో పూజించటంవల్లా ఆపాపం పోతుందని సెలవిచ్చారు బ్రాహ్మణప్రభువులు. సరే నని గౌతముడు ఆశ్రమం వదలిపెట్టి వెళ్లి భూప్రదక్షిణం చేసి మరలివచ్చి బ్రహ్మగిరి మీద అత్యుత్తమమైన వ్రతానుష్ఠానము లతో శివార్చనం మొదలెట్టాడు. శివుడు సాక్షాత్కరించి ఏం కావాలో కోరుకో

మంటే గౌతముడు తనకు గోహత్యాపాప విమోచనం కావా లన్నాడు. అప్పుడు ఈశ్వరుడు నిజవృత్తాంత మంతా అతనికి తెలియపరచాడు. విస్మయాశ్చర్యాలు కలిగాయి గౌతమునికి కాని బ్రాహ్మణులపై క్రోధము కలుగలేదు. మీదుమిక్కిలి వారి యెడల కృతజ్ఞతాభావం కలిగింది. ఎందుచేత నంటే తనకు ఈశ్వరసందర్శనం కల్గడానికి వారే కారకులు. ఈహేతువుచే పరమేశ్వరుడు మరింత సంతోషించి మరోవరం కోరుకోమనగా గంగ యచ్చోట ప్రత్యక్షమైనయెడల తా నందులో మునిగి పవిత్రశరీరుడ నౌతానని కోరగా సరే యని మహాదేవుడు గంగాజలపూర్ణమైన వరిజటను తీసి ఇచ్చాడు. గౌతముడు దానిని తీసికొని

దానితో గోవును తాకేసరికి అది ఆక్షణం తేచి నిలుచుంది. అంతవరకూ అది పడి వున్న ప్రదేశంలోనుంచి ఒక జలధార ఉబికి పైకి వచ్చింది. అందువలననే అది గోదావరీ అనేపేరును గాంచింది.



త్రియంబకములోని త్రియంబకేశ్వరాలయము

త్రియంబక గ్రామాన్నుంచి నదీస్రోతస్సు చేరటానికి కిప్పుడు ౬౯౦ మెట్లున్నాయి. మెట్లమీాద కొండ కంటుకొని ఒకవేది. దీనికి ముందరి మూడుప్రక్కలా పోటీగోడలు, వెనుకవైపున కొండభాగమూను. ఈ పర్వత పార్శ్వము నిట్టనిలువున ౩౦౦ల అడుగుల

ఒకమంటపం, అందులో రాతిమీాద చెక్కిన గోముఖమూనూ ఉన్నాయి. నీళ్లు ఎక్కడ నుంచి వస్తాయో తెలియదు గోముఖంలో నుంచి అడుగునవున్న కుండంలో పడుతుంటాయి. అక్కడనుంచి మళ్లీ ఎటు మాయమైపోతాయో తెలియదు. ఇక్కడ ఎల్లప్పుడూ వకపూజారి హాజరుగా ఉండి గోముఖానికి పూజాపుష్పాలు సమర్పిస్తూ ఉంటాడు. ఈ దివ్యనదీ స్రోతఃప్రదేశాన్ని దర్శించడానికి వచ్చే అపరిమితమైన తైర్థికజనసమూహాలద్వారా ఆయనకు మంచి ఆదాయం

ప్రసిద్ధమైన ఈ త్రియంబకతీర్థం గ్రేటు ఇండియన్ పెనిన్సులా రైలుమార్గంమీద నాసిక్‌కు ౨౦ మైళ్లదూరంలో వుంది. గోదావరీస్రోతమే కాక ఇక్కడి ముఖ్యాకర్షణీయ స్థానం త్రియంబకేశ్వర దేవాలయం. పూర్వకాలంలో అక్కడ ఒక సామాన్యమైన గుడి వుండేది. దానినే విస్తరింపజేసి రెండువందల

హిందూదేశపు నాలుగుప్రక్కలనుంచీ తైర్థికులిక్కడికి తరుచుగా వస్తూనేవుంటారు కాని పుష్కరసమయంలో అమితంగా వస్తారు. సాధారణంగా తైర్థికులు—విశేష కార్యాలేమీ చేయవలసిన అవసరం లేనివారు—మొదలు కుశావర్తకుండంలో స్నానంజేసి—ఈకుండంలోనిది గోదావరీజలమే—



నాసికవద్ద గోదావరి

ఏండ్లక్రిందట మహారాష్ట్రపాలకులు వక బ్రహ్మాండమైన ఆలయం కట్టించారు. గర్భగుడిమీద మహావిశాలమైన గోపురం, మహాశోభాయమానంగా వుంటుంది. ద్వారాలూ మండువాలనిండా రుచిరాలంకరణాలూ, రాతిలో చెక్కిన బొమ్మలూ అమితంగావున్నాయి. త్రియంబకేశ్వర మహాలింగం భారతవర్షపు ద్వాదశజ్యోతిర్లింగాల్లోనూ ఒకటి

త్ర్యంబకేశ్వరుని పూజిస్తూంటారు. తరువాత కొండమీది స్రోతస్సును దర్శిస్తారు. తీర్థవిధులూ మొదలయిన విశేషకార్యాలు చేయవలసివుంటే పురోహితులను కుదుర్చుకోవాలి. ఏ రిక్కడ కావలసినంతమంది. ఆచారంవుంటే శిరోముండనాదులను చేయించుకొని బియ్యపుఅన్నముతోనో గోధుమపిండితోనో తీర్థవిధులను జరుపుకుంటారు

పిండప్రదానాలను చేస్తారు. ఈప్రకారం ఇతర విధికర్మ లన్నింటినీ నెరవేర్చుకొంటారు.

త్రియంబకానికి నకచారిత్రక ప్రాముఖ్యతకూడా వుంది. ఒకప్పుడచట దుర్భేద్యమైన దుర్గం వుండేది. ౧౮౧౮-వ సంవత్సరం, ఏప్రిల్ ౨౫-గో తారీఖున కల్నల్ మెక్—డోవెల్ అనునతడు ఆదుర్గాన్ని మహాతీవ్రంగా ముట్టడించి ఆక్రమించుకొన్నాడు. ౧౮౫౭లో జరిగిన సిపాయికలహాంలో గూడా ఈపట్నం కొంత ప్రాముఖ్యం సంపాదించుకొంది. ఇక్కడి కొండజాతులవారు డిశంబరు ౫-వ తేదీరాత్రి సర్కారుఖజానాను ముట్టడించి కొల్లగొట్టి మద్దతు రాకముందే పారిపోయి త్రియంబకేశ్వరపర్వతాల్లో దాక్కున్నారు. కాని గాలించి గాలించి కొందరు విద్రోహులను పట్టుకొన్నమీద వారే ఈ ఠికారీకి అసలు కారకు డెవరో తెలియచేశారు. ఆయన ఇచటి పురోహితబ్రాహ్మణులలో వకరు. దోషియని నిర్ధారించి ఆయనను ఉరి దీయించారు.

శాంతి

శ్రీ దిగుమర్తి సీతారామస్వామి

"అమలకౌసుమతారకోత్క్రమణవేళ
స్థవిర హేమంత పాలిత స్థాణు జగతి
ప్రోషిత ద్విజ నీడ సంపుటములందు
రెక్క ముడిచి యొకింత నిద్రించు శాంతి"

"వెలుగు పొదరిండ్లు బలిసిన విపిన కేలి
నడవి యూసలు దగ్ధమైనట్టి పిదప
ఎండిపోయిన సెలయేటి యిసుకలందు
గూండ్లు నిర్మించుకొను చాడుకొనును శాంతి"

"జీర్ణ భైరవ దారిద్ర్య సేద్యమందు
ఇసుక కుప్పలుగా పండి విసువు గొల్ప
క్షామపోషిత మృత్యు సంసారమునకు
ఎమ్ముకలు కట్టెపుల్లల క్లేరు శాంతి"

"అపజయ క్షుబ్ధమైన మదాత్మకొరకు
శాంతి సందేశ మిచ్చు విజ్ఞాని వీవు
వలతువా యిట్టి శాంతిని? వలతు వేని
వెంట గొంపోదు సర్వము విడిచిరమ్ము"

"హాయిగా పుష్పపర్యంక మధివసించి
తృప్తి శాంతి యటంచు బోధింతు వీవు
తృప్తికా కింక చేయున దేమి కలదు?
శృంఖలా బద్ధకాల వంచితుడ నేను"

"శాంతి మృతిచిహ్న; జీవితోజ్జ్వలవిభాత
వేళ కోలాహలానంద విపణివీథి -
యానతా దుస్తరమ్ము హేమంతరాత్రి
మధువు మధుకర గీతావ మధువు సుమ్ము"

భిక్షు

శ్రీ పుట్టపర్తి నారాయణాచార్యులు

చిమ్మచీకటు లాడు నిశీథమందు
ఎవరు పిలచెద రిటు నన్ను!
అంతకంతకు సుఖకర మగుచు నార్ద్ర
భావముల నొల్కబోసెడి పలుకుతోడ—

తల్లిరో నీవు నన్ను ఓదార్చకమ్మ
మధురమైన విషాద సమాధినుండి
మేలుకొలుపకు నేను జన్మించినాను
దుఃఖమునకె, కష్టమే నాదు తోడునీడ—
పాడుకొందును—అవిదితాంబరము నందు
నన్నె నేను రచియించుకొన్న గీతి—
అడ్డురాకుము — ఓదార్చకమ్మ నన్ను

"మొండి వాడు"

శ్రీ కొడవటిగంటి కుటుంబరావు

౧

ఆ సాయంకాలం మూడుగంటలకు, డ్రాయింగు పరీక్షతో, ఆ సంవత్సరానికి స్కూలు మూయబడుతుంది. డిసెంబరు శెలవులు ప్రారంభ మవుతై. ఇది స్కూలువారి లెక్క ప్రకారం.

సరిగా రెండుగంటల పదిహేను నిమిషాలకు పరీక్షలు జరుగుతూన్న హాలులో ఒక పన్నెండేళ్ల విద్యార్థి లేచి నిలుచున్నాడు.

"ఏం కావాలి?" అన్నాడు వాచరు ఆవలిస్తూ. డ్రాయింగుపరీక్ష లంటే వాచర్లకూ నిద్రవస్తుంది.

"నేను బొమ్మ వెయ్యటం అయిందండి" అన్నాడు విద్యార్థి.

"అప్పుడే! పదిహేను నిమిషాలన్నా కాలేదింకా."

"నేను బొమ్మవెయ్యటం అయిందండి."

వాచరుగారు మళ్లీ ఆవలించి, కుర్చీలోనించి లేచి, విద్యార్థిదగ్గిరికి వచ్చి "ఏదీ? చూడనీ!" అని కాగితం తీసుకున్నాడు. ఆయనకు నవ్వు ఆగలేదు. ఇదేమిటో నీకైనా తెలుసునా?"

"నాకూ తెలియలేదండీ. పెట్టెబొమ్మ గీయబోతే నవారుమంచం మాదిరిగా తయారయిందండీ. బాగుచెయ్యబోయినకొద్దీ ఇంకా నవారు అల్లినట్టయింది కాని పెట్టెమాదిరిగా కానేలేదండీ!"

"నువ్వు కొంచెం అతిగా మాట్లాడుతావు కాదూ?" అన్నాడు వాచరుగారు నవ్వటం మానేసి.

"అవునండి!"

వాచరునోట మాట రాలేదు. చివరకు ఆయన ఉగ్రంగా "అరగంటదాకా నువ్వు హాలులోనించి

"నే నెవరికీ కాపీ అందివ్వనండి!" అంటూ విద్యార్థి పెనసలు జేబులో పెట్టుకుని ప్రయాణమైనాడు.

మళ్లీ కుర్చీలో కూర్చుని దబదబ పడిపోయేట్టు ఆవలించే సంకల్పంతో వెనక్కు తిరిగిన వాచరుగారు "ఏయ్!" అని అరిచాడు. హాలంతా మారు పలికింది.

విద్యార్థి ఆగి, "నన్నేనండీ?" అన్నాడు.

"కూర్చో, అట్లా!"

"నేను పోతున్నానండీ!"

"నేను వద్దని చెప్పలేదూ?"

"నేను పోతున్నానండీ!...నన్ను ఆబ్సెంటు రాసుకోండి!"

వాచరుగారికిఏటూ పాలుపోలేదు, వెళ్లికుర్చీలో కూర్చుని ఆవలించటమో, వచ్చి పిల్లవాడి గూబ పెలి వెయ్యటమో! ఆయన్ను ఈసమస్య బాధిస్తూండగానే విద్యార్థి హాలు దాటి బయటికి వెళ్లిపోయినాడు.

బయట వరండాలో ఒక బెంచీమీద కూర్చుని ఒక మాసపత్రికలో పద్యాలు చదువుకుంటున్నాడు డ్రాయింగుమేష్టరుగారు చకా చకా జరుగుతున్న విద్యార్థివంక ఆయన కళ్లజోడు మీదిగా చూసి, "ఏంరా, రామునీ? అప్పుడే అయిందీ?" అన్నాడు.

విద్యార్థి ఆయన ఎదురుగా ఆగి "కాలేదండి!" అన్నాడు.

"ఎక్కడికి పోతున్నావు?"

"ఇంటికండి!"

"ఓరి వెధవా! నేను సంతోషించేటందుకయినా ఇంకాస్సేపు బొమ్మ వేస్తున్నట్టు నటించ కూడదూ? అప్పుడే ఇంటికి పోయి ఏం చేస్తావు?"

"ఇవాళ కాలవకు పోయి ఈత నేర్చుకోవాలండి!"

"ఈతా? జానెడు వెధవ్వి నీకీత ఏమిట్రా? పోబోకు కాలవకు!"

"కాలవకు పోతానండి!"

"మొండి వెధవా!... ఎవరినన్నా పెద్దవాళ్లను వెంటతీసుకుపోసుమా! కాలవ లోతుగా ఉంటుంది! భద్రం!"

ఠీవిగా తల ఎత్తుకుని పోతూన్న రాముడివంక డ్రాయింగు మేష్టరుగారు ఆశతో చూశాడు. ఆయన కూతురు సావిత్రి ఆరేళ్లది. ఇద్దరూ ఎంత ఈడు జోడుగా ఉంటారు!

౨

రాముడు కాలవకట్టకు వెళ్లి, అక్కడ ఒక ఎత్తయిన కానుగ చెట్టుయొక్క చిటారుకొమ్మకు ఎక్కి, ఒక పంగలో కూర్చుని, ఉయ్యాల ఊగటం మొదలు పెట్టాడు. ఇంకా కుర్రాళ్లు ఎవరూ రాలేదు. రాముడు గొంతెత్తి పాడటం మొదలు పెట్టాడు.

"అబలా—యిటులా—వనిలా—వెడలా—అతిసుల—భంజని—రొంచితి—వా"

బాసుంది, మైలవరంవాళ్ల "సావిత్రి"! ఆ యముడు!

"పో, బాల—పోమిత్రకన్—ఓహో బాల—పోమిత్రకన్!" దీనికి తాళప్రకారం కూపు రావటం లేదు, "అబలా—ఇటులా—" అంటే వచ్చినట్టు.

"ఈ యుగ్రా—రణ్యమున—రా, వలదు—రా, తగదు—(రా, చనదు?)—నీకు గిలదు—నాశ నిడి—పో, బాల—పో, బాల—పో, బాల—ఓహో బాల—ఓహో బాల!—"

సావిత్రి అంత పిరికిదనా, యముడి నమ్మకం? సావిత్రి మొండితనానికి!... తన్ను కూడా అంతా మొండివాడనే అంటారు—తన మొండితనానికూడా దేవతలు మెచ్చుకుంటారేమో!...

"ఓ కొట్టువిూది యమధర్మరాజా! పాట ఆపావేం?"

రాముడు కొమ్మల సందునించి కిందనుంచుని ఉన్న సుబ్బారావును చూశాడు.

"సుబ్బారావు!"

"ఏంరా, రామనాథం!"

"ఇంకా ఎవరూ రాలా?"

"వచ్చారు. వాళ్లంతా వెనకపడి బొమ్మకెముడుపళ్లు కోసుకు తింటున్నారు."

"ఎందుకూ?"

"ఎందు కేమిటి? నోళ్లు నెత్తురుతాగినట్టుఉండటానికి"

రాముడు కాస్సేపు ఆలోచించాడు.

"చూశావా, చిత్రం?"

"ఏమిటి?"

"నెత్తురు తాగినవాడినోరు ఎర్రగా ఉండక పోవచ్చు."

"ఎందుచేతనో!"

"మనం పాలు తాగితే నోరంతా తెల్లగా ఉంటుందీ? గోంగూర తింటే నల్లగా ఉంటుందా?"

"ఏడిచావులే, కిందికి దిగిరా."

రాముడు లాగుజేబులోనించి గోచీగుడ్డతీసి చూసుకున్ని, తృప్తిపడి మళ్లీ జేబులో పెట్టి, మెల్లిగా చెట్టుదిగటం మొదలు పెట్టాడు.

కొద్దిసేపట్లో కాలవకట్టన ఏడెనిమిదిమంది కుర్రాళ్లు చేరారు. ఒకరితరవాత ఒకరు చొక్కా లాగులు విడిచేసి గోచీలు పెట్టుకుని ఎగిరి కాలవలో దూకటం మొదలు పెట్టారు. ఈత రానివాళ్లు కొంచెం పైకి వెళ్లి లోతులేనిచోట దిగి నడుములోతునీటిలో నుంచుని, ఈతవచ్చినవాళ్లకంటె ఎక్కువ చప్పుడు

రాముడు గోచీతో తయారై ఈత వచ్చిన వాళ్లు దిగిన రేవుదగ్గిర నిలబడ్డాడు.

"నీవుకూడా పైకి వెళ్లి గడ్డపార ఈత ఈదరాదుట్రా?" అన్నాడు సుబ్బారావు.

"ఇక్కడ చాలాలోతా?"

"చాలా! నీకు రెండింతలుంటుంది మడుగు".

"ఏదీ, ఇటునించి అటు చెయ్యి పైకెత్తి ఈదకుండా నడిచి చూపించు."

"ఓ!" అంటూ సుబ్బారావు ఒకచెయ్యి పైకెత్తి కాలవను ఇటునించి అటు దాటటం మొదలుపెట్టాడు. మూడోవంతు దూరం వెళ్లగానే సుబ్బారావుముక్కు నీటి అడుక్కిపోయింది. సుబ్బారావు ముక్కుమునగగానే రాముడు చేత్తో తన ముక్కు మూసుకున్నాడు. అవతలి ఒడ్డుకు సామీప్యంలో సుబ్బారావుతల మళ్లీ నీటిపైకి వచ్చింది.

"చూశావా?" అన్నాడు సుబ్బారావు రొప్పుతూ.

"చూశాను" అన్నాడు రాముడుకూడా ముక్కును వదిలిపెట్టి రొప్పుతూ. రొప్పు తగ్గిపోగానే రాముడుకూడా మెల్లిగా కాలవలో దిగటం మొదలుపెట్టాడు.

"వాడు చస్తాడ్రా!" అని ఎవరో కేక పెట్టారు.

"రాముడూ!" "రామనాథం!" "రామాయ్!" అని అందరూ తలా ఒక పెడబొబ్బ పెట్టారు.

రాముడు మోకాలులోతునీళ్లలో ఆగి "ఏమిటోయ్, అట్లా ఉలిక్కిపడతారూ?" అన్నాడు.

"ఎందుకా? చస్తావు!"

"నువ్వు చచ్చావా?"

"నే నెందుకు చస్తానూ? నా కీతవచ్చును!"

"నువ్వు ఈదావా? నీమాదిరిగా నీళ్లల్లో నడిచి నేనుమాత్రం కాలవ దాటలేనూ?

సుబ్బారావు నిర్ఘాంతపోయి రాముడివంక చూస్తున్నాడు. ఈలోపల రాముడు గబగబా కాలవలో, దిగిపోతున్నాడు. అతనితల మునిగిపోయింది. అతనిగుండె దడదడ లాడటం మొదలుపెట్టింది. వెధవ గుండెకు ఎంతభయం! ఉత్త పిరికిగుండె! ఏముంది? ఇట్లాగే ఇంకా నాలుగడుగులు పోతే తనకు కాలవ అందుతుంది. రాముడు నాలుగడుగులు వేశాడు. అందలేదు. అయిదు, ఆరు. ఇంకా అందటంలేదు. ఇక ఊపిరి ఆగదు! తల పగిలిపోతున్నది. ముక్కు వదిలిపెట్టాలిసిందే. ఇంకొక్క రెండడుగులు! ఒకటి, రెండు! రాముడి అవస్థ వర్ణనాతీతం. ఇక తనప్రాణం పోయిందను కున్నాడు. చేతులూ కాళ్లూ వణుకుతున్నై—గిలగిలా కొట్టుకోవాలని ప్రయత్నం చేస్తున్నై. ఆశ్చర్యపడితే లాభంలేదు. ఒకచెయ్యి పైకెత్తాడు. చెయ్యి నీళ్లమీద ఎంత ఉందో తెలియలేదు. చేతిని ఊపాడు. గాలిలో ఆడినట్టే ఆడింది. చల్లగాలి చేతికి తగిలింది. అమ్మయ్య! ఒక్కసారిగా అతని ముక్కుల్లోకీ నోట్లోకీ మూసెడు నీళ్లు పోయినట్టు పోయినై. ఇంకా పోతున్నై! అతనికి స్మృతి తప్పింది. ఎవరోవచ్చి తను పైకెత్తిన చెయ్యి పట్టుకోవటంకూడా అతనికి తెలియదు!...

"ఏమండోయ్! ఇవాళ్ల మీవాడికి పెద్దగండం తప్పిందండీ! మేం వద్దని కేకలు పెడుతున్నా వినిపించుకోకుండా ఈత రానివాడు కాలవలో దిగాడండీ! మేం ఎంత వెతికినా ఎక్కడా కనపడలేదు. అవతల ఎక్కడో తేలి చెయ్యి పైకెత్తాడండీ! అప్పుడు మేం వెళ్లి వాణ్ణి బయటికి లాగి, పొట్టమీద కూచుని నీళ్లు కక్కించామండీ!" అన్నారు స్నేహితులు, రాముణ్ణి ఇంటిదగ్గిర దిగవిడుస్తూ!

"గుండంలోనించి సరిగానే నడిచి వచ్చినవాణ్ణి, మోకాటిలోతు నీళ్లల్లో చచ్చేటంతపని అయిందమ్మా! తమాషా! ... ఎటు పోతున్నానో తెలీక కాలవలో ఉత్తర దక్షిణాలుగా నడిచిఉంటా! లేకపోతేనా!..." అన్నాడు రాముడు తల్లితో.

ఆవిడ తెరిచిన నోరు తెరిచినట్టుగానే ఉండిపోయింది.

3

స్కూలుఫైనలు క్లాసులో సైన్సు మేష్టరుగారు ఉత్సాహంకొద్దీ పిల్లకాయలకు అనవసరమైన

"పదార్థములయొక్క చర్య మహా విచిత్రంగా ఉంటుంది!... రెండు అద్దపు ముక్కలు తీసుకొని, అందులో ఒకదానిమీద ఒక నీటిబొట్టు వేసి, రెండవదాని మొదటిదానిమీద పెట్టి ఒత్తి, రెంటిమధ్య అణుమాత్రమైనా గాలిలేని నీటిపొర ఒకటి కలిగించినట్టయితే, ఆ రెండు అద్దపు ముక్కలనూ పగలదీయటానికి అనేక వీసెల బలం కావాలి; కాని ఒక దాని మీద ఒకటి సులభంగా జారి వస్తుంది!......

"చిన్న పిల్లలను కొంచెం పెద్ద పిల్లలు 'దూది ఎక్కువ బరువా? దూది ఇనుము ఎక్కువ బరువా?' అని అడుగుతూంటారు. చిన్నపిల్లలు దూది ఇనుమే ఎక్కువబరువు అనుకుంటారు. పెద్దపిల్లలు రెండూ సమాన మనుకుంటారు. నిజం వీరిలో ఎవరికైనా తెలుసునా?...దూదిలోనే ఎక్కువ బరువు; దానిలోనే ఇనుములోకంటె 'మాస్' ఎక్కువ ఉంది! అయితే రెండూ సమంగా ఎందుకు తూగుతై? గాలి దూదిని ఎక్కువగా తేలికచేస్తుంది, ఇనుముకంటె! ఎందువల్ల? దూదిపరిమాణం ఎక్కువ కనక. మనిషిపరిమాణం ఏదో ఉపాయంచేత ఉన్నదానికి అనేక రెట్లు చేసి మనిషి బరువు మాత్రం మార్చకుండా ఉంచితే, మనిషి గాలిలో తేలిపోతాడు...ఇప్పుడిప్పుడు విమానాల మీదనుంచి పెద్దపెద్ద గొడుగులంటివి ఉపయోగించి గాలిలో దిగి వస్తున్నారట! ఆ గొడుగునుపట్టి తెరుచుకుని మనిషియొక్క పరిమాణం పెద్దది చేస్తుం దన్నమాట!..."

రాముడు సైన్సుమేష్టరు చెప్పే విషయాలు ఎంతో శ్రద్ధగా వింటున్నాడు. రెండు అద్దాలమధ్య సన్నని నీటిపొర ఒకటి కల్పించి కేవలం దానిపట్టు మీద అడుగు అద్దపుముక్కను పట్టుకుని ఆకాశంలో మూడుమైళ్ల ఎత్తున తను వేళ్లాడుతున్నట్టు, క్రమేణ ఆ నీటిపొర ఇగిరిపోతూండటంచేత తను అంత ఎత్తునించీ భూమిమీదికి పడటానికి సిద్ధంగా ఉన్నట్టు, ఇంతలో తనచేతికి ఎవరో పెద్దగొడుగునొకటి ఇవ్వగా దానిసహాయంవల్ల తను నెమ్మదిగా, చిన్న ఈకమాదిరిగా, దిగి వచ్చినట్టు — ఆచివర నాలుగంగుళాలు దిగటానికే నాలుగు నిముషాలు పట్టినట్టు! — అతను ఊహించుకుంటున్నాడు.

అనుకున్న దంతా ఆచరణలో పెట్టటం ఎవరి తరమూ కాదు; కొంతవరకైనా చేసిచూతా మనుకున్నాడు రాముడు.

ఇంట్లో తనగొడుగు ఒకటుంది. అదికాక, వాళ్ల నాన్న ఎన్నడో కొని మూల పారేసిన పాత గొడుగు మరొకటుంది. ఆ రెంటిసహాయంతో తను ఇంటికప్పుమీదనించి నేలమీదికి అవతరించుదా మనుకున్నాడు రాముడు. ఆ రెండుగొడుగులూ చంకన పెట్టుకుని నిచ్చెనమీదిగా అతను ఇంటికప్పెక్కాడు. రెండుగొడుగులూ తెరిచి చెరొక చేత్తోనూ పట్టుకుని, వాటిని గాలిలో అటూ ఇటూ ఊపాడు. మంత్రంమీద గొడుగులు గాలిని "పట్టుకో" గలుగుతున్నై, కాని బరువును మోయగలవా?

అతను రెండోఫారం చదువుతూ ఉండగా అతనికి పరీక్షలో తెనిగించటానికి ఒక ఇంగ్లీషుపద్యం ఇచ్చారు. అందులో, ఒక కుర్రవాడు గొడుగు వేసుకుని పెద్ద గాలివానలోకి పోగానే ఆపిల్లవాణ్ణి వాయుదేవుడు ఎక్కడికో ఎత్తుకుపోతాడు - ఆ గొడుగుసహాయంతో!

తన్ను వాయుదేవుడు ఎక్కడికీ ఎత్తుకు పోనక్కర్లేదు. పేడకి పడ్డట్టు కాకుండా, తను ఉపాయంగా, ఈకప్పుమీదనించి ఆ నేలమీదికి గద్ద వాలినట్టు వాలితే చాలును, ఒకగొడుగు కాదు, రెండుగొడుగుల సహాయంతో!

రాముడిగుండెలు "వద్దు, వద్దు; వద్దు, వద్దు!" అని కొట్టుకుంటూనే ఉన్నై. కాని వెధవ గుండెలను లెక్కచేసే దేమిటి? ఊపిరి బిగబట్టి, రెండు గొడుగులూ రెండు చేతుల్లోనూ గట్టిగా పట్టుకుని, ఇంటికప్పు చివరనించి రాముడు గాలిలోకి ఒక్క ఎగురు ఎగిరాడు!

పడటానికి సంసిద్ధుడై ఉంటే అంత దెబ్బ తినేవాడు కాడు రాముడు! కాని ఏం జరిగిం దంటే, వెధవది, ఒక్క రవ్వకూడా అనుకున్నట్టు జరగలేదు, ఏం చెయ్యాలి? . . . ఆ వెధవపాతగొడుగు టప్పుమని విరిగి, పైభాగం గాలిలో తేలిపోయి, చేతులో కర్ర మిగిలింది. రెండోది పటుక్కున వెనక్కు ముడిగింది. . . .

"అట్టే దెబ్బ తగల్లేదు. ఉత్త బెణుకే! ఎక్కడా ఎముకలు విరగలేదు . . . వారం రోజులు మంచంలో కళ్లు మూసుకు పడుకుంటే అదే సరి అవుతుంది" అన్నాడు డాక్టరు.

పాపం, డ్రాయింగు మేష్టరుగారు ఆకస్మాత్తుగా పోయినాడు.

"నా సావిత్రికి సంబంధం నీకనురా, రాముడూ! అదినీకు రాసి పెట్టిఉంది. చేసుకుంటావా?" అనేవాడు ఆయన తనతో.... తమాషాకు!

అందచందాల విషయం తనకేం తెలుసుగాని, సావిత్రి తనకళ్లకు బాగానే ఉంటుంది. సావిత్రిని చూస్తే తనకు చాలా సంతోషంగా ఉంటుంది—ఏదో ఇదిగా ఉంటుంది మనస్సులో!

సావిత్రికి పదోయేడు — పెళ్లి యీడు. ఇంకా తనకు పదహారేగా! నాలుగు సంవత్సరాల దాకా తనకు పెళ్లిగొడవే ఉండదు. ... అప్పటికి సావిత్రి కాపరాని కెక్కడా పోతుంది! ... సావిత్రివంటి పిల్లలకు మంచి మొగుళ్లు దొరుకుతారు — చాలా మంచిమొగుళ్లు!...

చిత్రంగా, ఆ రాత్రే అతని తలిదండ్రులు అతని ఎదుట అతని పెళ్లిని గురించి చాలాసేపు మాట్లాడారు. అతని నోటిదాకా వచ్చింది, "పోనీ, నేను డ్రాయింగు మేష్టరు గారి అమ్మాయిని పెళ్లిచేసుకోనా, అమ్మా" అందా మని. కాని ఏంలాభం? పెళ్లి కి బోలెడు గ్రంథం ఉంది; బోలెడు డబ్బు కావాలి, బోలెడంత చాకిరి, చుట్టా లందర్నీ పిలవటం, పురోహితులనీ, భజంత్రీలనీ పిలవటం, అయిదు రోజులా ఎప్పుడేది చెయ్యాలో అది చేయించటం — ఓ! అది పెద్ద వాళ్ల పని. అందులో తనవంటి చిన్నపిల్లకాయలు, అజ్ఞానులు, కల్పించుకోరాదు. "నాకు ఆ పిల్లకావాలి!" అంటే సరా, కష్టసుఖాలు తెలియకుండా?

రాముడి ఈ ఆలోచనల్లో ఇమిడిఉన్న "ట్రాజెడీ" అందరికీ సులభంగానే అర్థ మవుతుంది. అయితే అందులో కొంత నిజంహూడా లేకపోలేదు. ఒకపిల్లకూ పిల్లవాడికీ ముడిపెట్టాలంటే ఎన్ని సందర్భాలు కలిసి రావాలో అతని కేం తెలుస్తుంది? అతనికి సావిత్రికంటె మంచిపిల్ల కనిపించలేదు పెళ్లాడటానికి. ఆమాట అతను తలిదండ్రులకు చెబితే వాళ్లు పొట్ట చెక్క లయ్యేటట్టు నవ్వి ఉండేవాళ్లు. వాళ్లు అట్లా నవ్వనినాడు మనవాడి పెద్ద సాంఘికవిప్లవానికి సిద్ధంగా ఉన్న దన్నమాటే!

చచ్చిపోయిన డ్రాయింగు మేష్టరుది పురోహితుల వంశం. ఆయనతండ్రి యాచవృత్తిలో కాలం వెళ్లబుచ్చాడు. సావిత్రిమాతామహుడు ఇంకా తద్దినాలూ అవీ పెట్టిస్తూ ఉన్నాడు. మనవ్యమాత్రుడికి తెలిసినంతవరకూ సావిత్రితలిదండ్రుల వేపువాళ్లకు ఆస్తిపాస్తు లుండటమూ, ఏదోవిశిష్టమైన యోగ్యత లేకుండా ఉండటమూ లేవు. రాముడు వ్యాపారి పిల్లను చేసుకుంటానంటే ఎంత హాస్యాస్పదంగా ఉండి ఉండేదో, సావిత్రిని చేసుకుంటా నన్నా అంత హాస్యాస్పదంగానే ఉండేది.

మరి రాముడి పితామహుండి ప్రపితామహుడు రెండువేల ఎకరాలభూమి తాంబూలంతో పుచ్చుకున్నాడు, తన అసమానపాండిత్యానికి బహుమానంగా. రాముడి పితామహుల్నికూడా జమీందారుగా తనే పిలిచేవారు!

తరవాత కొద్దికాలానికే రాముడికి పెళ్లి కుదిరింది. ఏటి అవతలనించి వెంకటేశ్వరశాస్త్రిగారు పిల్లనిస్తా నంటూ వచ్చాడు. రాముడికి మూడుపంచులు కట్నం కరిపించి, తదితర లాంఛనాలకింద మరో రెండు పంచులు ఒలకబోసి, పెళ్లిఖర్చులకింద మరి రెండుపంచులు ఖాళీచేసి తనకూతుర్ని, మహాలక్ష్మిని, రాముడికి కన్యాదానం చేసి, పల్లెటూరిలో అయినప్పటికీ పెళ్లి మహా వైభవంగా చేసి ఆయన తరించినవా డయినాడు. ఉభయపక్షాలవారికీ పరిపూర్ణమైన ఆనంద మయింది.

పెళ్లి అయిన కొద్దిరోజులకే కాలేజీలో ప్రవేశించటానికి రాముడు పట్నం వెళ్లిపోయినాడు.

ఆ డిసెంబరు శెలవులకు అతను అత్తవారి ఊరు వెళ్లి, ఆ మట్టికొంపల మధ్య, ఆ పసువుల మధ్య, ఆ చొప్పా, కుక్కలీ, పేడా వగయిరాల మధ్య తనమహాలక్ష్మిని చూసుకోగానే అతని మనోవైకల్యం మొదటి

సారి తెరుచుకున్న ట్టయింది. తన భార్య సాక్షాత్తూ పశువు కాదేమోకాని, అంతకంటె అతే ఎక్కువ స్థితి లో లేదు...... సావిత్రి? చూడటానికి కళ్లే కావాలి కాని, సావిత్రిలో దేవత్వం ఉంది! ఉన్నదని తెలుసు కోటానికి నిదర్శనాలూ, పరీక్షలూ అవసరంలేదు...

ఇంకా సావిత్రికి పెళ్లి కాలేదనీ, ఒక పింఛను పుచ్చుకొన్న తాశీల్దారుగారు (షష్టిపూర్తి కాలేదు) ఆ పిల్లను చేసుకోటానికి కుతూహలపడుతున్నా డనీ, బహుశా త్వరలోనే వివాహం జరగవచ్చుననీ తెలియ వచ్చింది.

పట్నం బయలుదేరే రోజున రామనాధం డ్రాయింగు మేష్టరుగారి ఇంటివేపు వెళ్లాడు. వాకిలి తలుపు వేసి ఉంది. అతను కొంతదూరం పైకి వెళ్లి మళ్లీ అటే వచ్చాడు. వాకిట్లో అదృష్టవశాత్తూ సావిత్రే నుంచుని ఉంది. అతను లోపలికి వెళ్లేవాడల్లే ఆగాడు. సావిత్రి అతన్ని పలకరించబోయే దానల్లే నోరు తెరిచింది. తీరా ఆమెనోటివెంట మాటా రాలేదు, అతను లోపలికి వెళ్లాలేదు— సాగిపోయినాడు తన ఇంటి వేపు......

అదివరకు బయలుగాఉన్న చోటఇప్పుడు పెద్దగోడ నిర్మించిన ట్టయింది. ఒకప్పుడతను డ్రాయింగు మేష్టరుగారింటికి సొంతయింటికి పోయినట్టు పోయేవాడు! ఒకప్పుడు సావిత్రి తనతో ఎంతో స్వేచ్ఛగా మాట్లాడేది. అతనికాళ్ల కేదో అడ్డం పడ్డట్టయింది. బహుశా అదే సావిత్రినోటికీ అడ్డం పడిఉంటుంది!...

అంతలో అతనికి ఎక్కడలేని ఆగ్రహమూ వచ్చింది—ఆకనపడని గోడమీద, తనకాళ్లనూ సావిత్రి నోటినీ కట్టేసిన ఆ ప్రతిబంధకం మీద. అతను చప్పున ఆగి, చక్రున వెనక్కి తిరిగి, తిరిగివచ్చి యెకాయెకీని డ్రాయింగు మేష్టరుగారి ఇంట్లో ప్రవేశించి, "సావిత్రీ!" అని పిలిచాడు.

అతని హృదయం తన అసమ్మతిని సూచిస్తూ గిలగిలా కొట్టుకున్నది. కాని రామనాధం తన పిచ్చి హృదయాన్ని—పిరికిసందెను—లక్ష్యపెట్ట దలుచుకో లేదు.

సావిత్రి అతను నిలబడ్డ వసారాలోకి వచ్చి అతన్ని చూసి నవ్వింది. ఆమెనవ్వు అర్థమై అతనూ నవ్వాడు.

"రా! లోపలికి రావోయి మానేశావేం?" అన్నది సావిత్రి, అతనికి ఏవిధమైన బాధా కలగటానికి వీలులేని గొంతుతో.

అతను ఆమెను మళ్లీ అటువంటిప్రశ్న వెయ్యక, "నువు పలకరిస్తే వద్దా మనుకున్నాను" అన్నాడు. ఇద్దరూ మళ్లీ నవ్వారు.

"నేను మేష్టరుగారు పోయిన తరవాత ఈ ఇంటో అడుగు పెట్టలేదు. ఏదో బంధం తెగిపోయి నట్టు భావించుకున్నాను — పొరపాటున ... సంవత్సరం! నిండా ఒక్క సంవత్సరం!" అన్నా డతను, ఒకనులకమంచం వాల్చుకుని కూర్చుని.

"అవును! వారంరోజు లయింది మా నాన్న ఏటూరి వెళ్లిపోయి, కిందటి శనివారం!... శలవులకు వచ్చావా? ... నీ పెళ్లి గృహప్రవేశపు ఊరేగింపు చూశాను.

రామనాధాన్ని కొరడాతో కొట్టిన ట్టయింది.

"నిన్నెవరూ పిలవలేదు కాదూ? నేనూ మరచి పోయినాను - పెళ్లి సంబరంలో!" అన్నా డతను, తన్ను తనే గాయంచేసుకుంటూ.

"ఓస్! దీనికేనా?"

"కాదా?" అన్నా డతను, ఇంకా తన్ను తను ఏ మాత్రమూ క్షమించుకో లేకుండా.

"ఒక్కత్తెనే అయిపోయినాను గాని, పిలవకుండా రాకూడదా?"

"అవును సావిత్రీ! ...నీ పెళ్లి ఎప్పుడో తెలియ చేస్తే నేను పట్నంనించి పిలుపు అవసరం లేకుండానే వస్తాను!"

ఆమాట నోరు జారివచ్చిన మరుక్షణం అందులో హాస్యం అతనికి అర్థమై నవ్వాడు. సావిత్రి పరధ్యానంగా ఉండి నవ్వలేదు.

రెండుమూడు నిమిషాలపాటు ఇద్దరూ మౌనంగా కూర్చున్నారు.

"పోయివస్తాను, సావిత్రీ. నేను సాయంకాలం బండికి వెళ్లిపోతున్నాను పట్నం."

అతనూ లేచాడు. ఆమెకూడా తనపరధ్యానం కట్టిపెట్టి లేచింది. ఇద్దరూ బయటికి వచ్చారు, అతను ముందూ ఆమె వెనకా.

ఆమె వాకిట్లో ఆగింది. అతను వీధిలోకి వెళ్లి నుంచున్నాడు.

"వస్తాను!" అన్నాడు రామనాథం. "సావిత్రీ" అనటానికి అతని కంఠంలో నోరు రాలేదు. "ఇక ఈమనిషిని నేను చూడను!" అన్న నమ్మకం ఒకటి అతని అంతరాత్మను కలిగిపోయింది.

సావిత్రి ఏదో అనటానికి నోరు తెరిచింది. ఆమెనోటివెంట ఏమీ రాలేదు. రామనాథం ఒక అడుగు ఆమెవేపు వేసి ఆమెచెయ్యి అయినా చివర సారి పట్టుకుందామనుకున్నాడు. అతనికి కాలుకదల లేదు......

బరువెక్కిన హృదయంతో అతను ఇంటివేపు సాగిపోయినాడు.

మహాలక్ష్మి కాపరానికి వచ్చి రెండు నెలలు కాలేదింకా. ఆపిల్లతత్వం రామనాథానికి ఒక్కరవ్వయినా బోధపడలేదు. కొన్నాళ్ల పాటు, తన భార్య బహు నిబ్బరమయిన మనిషి అనీ, ఆపేక్ష అంతఃకరణలు పైకి కనబడనివ్వని మనిషి అనీ అతను తనభార్యను సమర్థించుకున్నాడు. తనవూ ఆమెవూ మనస్సులు కలిసిన కొద్దీ అవన్నీ, వాటంతటవే బయట పడతాయనికూడా విశ్వసించాడు. కాని రోజులుగడిచినకొద్దీ ఆమెలో ఆపేక్ష, అంతఃకరణలు అసలు లేవనే అనుమానం అతన్ని బాధించసాగింది.

ఆమె పశుతుల్య కావచ్చును. ఒక్క మాటతో, ఒక్క చూపుతో భావప్రకటన, ప్రేమప్రకటన చెయ్యటం ఆమెకు చాతకాక పోవచ్చును — పల్లెటూరి పెంపకం కనక! కాని, కేవలమూ శరీరాలకే సంబంధించిన దాంపత్య సుఖం అనుభవించటానికి పశుత్వంతో సంబంధం ఏమిటి? పశువులు సుఖించగలగటం లేదూ? తన భార్యకు అదయినా ఎందుకు చాతకాదో!

తనకు మొగుడితో ఎటువంటి అవసరమూ లేనట్టూ, అతనే పాపాత్ముడై తన్ను కోరుకున్నట్టూ, అతని పాపాన అతనే పోతాడనే ఉద్దేశంతో తను తన శరీరం అతనివశం చేస్తున్నట్టూ కనపడేది మహాలక్ష్మి. కొత్తగా కాపరానికి వచ్చినభార్యతో సుఖపడటానికి అతను ఘోరమైనపాపం చెయ్యవలసినట్టుగా ఉండటం అతను భరించలేకపోయినాడు.

ఆమెకు తనతో ఎటువంటి నిమిత్తమూ లేదా? తను వంద సంవత్సరాలు కనిపించకపోయినా మహాలక్ష్మి జీవితానికి ఎటువంటి కొరవా ఉండదా! ఆ రోజు కారోజు గడుస్తున్న కొద్దీ ఉండదనే అతనికి తోచసాగింది. అతని ఆట కట్టుపడిపోయింది. ముందెత్తు ఏమిటో అతనికి తోచలేదు... ఈ విధంగానే బతికి ఉన్న నాలుగురోజులూ వెళ్లబుచ్చటం తప్ప!

తనలో ఏదో ఒక రకమైన ఆవేశం ఉందని రుజువు చెయ్యటానికి మహాలక్ష్మి తనతో ఒక్కసారి గట్టిగా పోట్లాడరాదూ? — ఇట్లా మంచుకొండమాదిరిగా ఉండకపోతే!

మహాలక్ష్మికి మనుష్యులయొక్క మంచితనంలో ఏమీ నమ్మకం ఉన్నట్టు కనపడలేదు. ప్రతిమనిషీ అసూయా, క్రోధం, అనృతం మొదలైనవాటితో నిండి ఉన్నట్టుగా ఆమె భావించేది.

ఒకసారి అతను ఆమెతో ఏదో చెబితే మహాలక్ష్మి నమ్మలేదు. ఆమె అనుమానానికి అతను ఆశ్చర్యపోయి, "అయితే ఇంత స్వల్పవిషయానికి నీతో అబద్ధమాడుతానా?" అన్నాడు. "ఓయమ్మో! మీరేం హరిశ్చంద్రమహారాజులా?" అని ఆమె తిరిగీ అడిగింది...

తన అత్తమామలు బాంధవ్యంచేత తనకు శత్రువులని ఆమె నమ్మకం. ఆమె ఆమాట స్పష్టంగా బయటికే అనేది. తన అత్తగారికి తన్ను కొరంటికం పెట్టటానికి మార్గాలు అన్వేషించటం తప్ప వేరే పని ఏమీ లేదని! రామనాథంతల్లి అమాయకురాలు. ఆమె మొద

ల్లో, తన మాటల్లోనించి కోడలు లేని పోని అర్థాలు లాగుతుంటే, నుదురు పెట్టుకు చూసి, కోడల్ని బొత్తిగా ఏమీ అనకపోతే శాసించదని, "సరేలే! ఇహ సరే!" అని కట్టిగా సందడించి తన పని తను చూసుకునేది. రామనాథం తల్లిని చూసి జాలిపడేవాడు.

వాళ్లవంటిది అరుదైనా. నలుగురూ ఒకడి చుట్టూ చేరి, "పిచ్చి, పిచ్చి!" అంటే, నిజంగా మతిపోతుంది. కొంత కాలానికి రామనాథం తల్లిలో పరివర్తన వచ్చింది. కోడలు సన్నగా ఒకటిఅంటే ఆవిడ పెద్దగా పదిఅనటం మొదలు పెట్టింది. పెళ్లాం ఆశించినట్టు ఆడు ఉన్నాడనే నెపంమీద రామనాథంకూడా తిట్లు తినటం మొదలు పెట్టాడు.

కాపరానికి వచ్చిన మూడో నెలలో మహాలక్ష్మి మంచం ఎక్కింది. వారాలూ నెలలూ గడిచినై. ఒకరి తరవాత ఒకరు, ఆరుగురు వైద్యులు మారారు. ఆమె రోగం ఎవరికీ అర్థంకాలేదు, మందులకూ లొంగలేదు. ఆమె మంచంలో ఎండి కరుగ్గా పోయింది. ఎవరో మనిషి పక్కన ఉండి చాకిరీ చెయ్యాలి. అత్తగారు ఆ పని చెయ్యటానికి సమ్మతించలేదు. నిజానికి మహాలక్ష్మి ఆమెకు అవకాశంకూడా ఇవ్వలేదు; ఒకసారి అత్తగారు మందుపోట్లో పొయ్యబోతే, "విషం కలిపావా?" అని అడిగింది!

రామనాథం అత్తవారికి ఉత్తరం రాశాడు. మహాలక్ష్మి మంచాన పడ్డది కనక ఎవరైనా వచ్చి ఆమెకు ఉపచారం చెయ్యవలసిందని. ఆ ఉత్తరానికి జవాబుగా మహాలక్ష్మి తల్లి సౌభాగ్యమ్మగారు వచ్చింది, పిల్లలకోడళ్లే, ముగ్గురు మనమలనూ ఇద్దరు మనమరాళ్లనూ వెంట తీసుకుని.

సౌభాగ్యమ్మగారు ఇంట్లో అడుగు పెట్టగానే రా మ నా థం ఇ ల్లం తా తా రు మా ర యిం ది. రామనాథానికి తెలియకుండా అతను కుదిర్చిన డాక్టర్ను ఆవిడ మార్చటమూ, అసలు వైద్యమే మార్చటమూ మొదలైన పనులు చెయ్య సాగింది. ఒకరిద్దరు డాక్టర్లు అతనిమీద ఎగిరి పడ్డారు కూడానూ! ఆవిడ ఈవిధంగా తనపరపతి పాడు చేస్తుంటే, ఆవిడకు మార్గోత్తరంవాళ్లు అతని చరాస్తికి ఊహించరాని ప్రమాదాలు తెచ్చి పెట్టుకున్నారు. రామనాథానికి రెండువారాల్లో ఎవరి ఇంటోనో తను ఉచితంగా ఉంటున్నట్టుగా ఉండసాగింది!

ఒకనాడు సౌభాగ్యమ్మగారు అల్లుణ్ణి పిలిచి, "చూడు, నాయనా! నేను నిన్న సోది అడిగాను. అమ్మాయి జబ్బును గురించి అడిగితే వెంకటేశ్వర స్వామి వచ్చాడు. వచ్చి, తనకు ముడుపుకట్టుకుని, ఏడు ఊళ్లు జోగి ఎత్తి, తనకొండకు వెళ్లి, పిల్లనూ నిన్నూ తలనీలాలు ఇమ్మన్నాడు," అన్నది.

"అంటే?"

"అంటే ఏముంది, నాయనా? నువ్వు స్వామికి దణ్ణం పెట్టుకుని, దీపారాధన చేసుకుని ముడుపుకట్టుకోవాలి!"

"వీలుపడదు."

"అయ్యో, పాపం! నువ్వు పసివాడివి. నీకు తెలీదు. ముడుపు కట్టుకోవాలి!"

"అవును. మీ రామాట అన్నారు. నేను కట్టుకోనన్నాను."

"ఎందుచేత?"

"కట్టుకోవటం ఎందుకూ?"

"వెంకటేశ్వరస్వామి చెబితే తప్పుతుందా?"

"వెంకటేశ్వరస్వామి ఎక్కడ చెప్పాడు? సోదిమనిషి చెప్పింది! . . . . నేను చెబుతున్నాను, అక్కర్లేదని!"

"దానిరోగం నయం కావటం ఎట్లా?"

"మందు లిస్తే నయ మవుతుంది!"

"కాకపోయినా?"

"వేరేమందు లివ్వాలన్న మాట!"

"నువ్వట్లా చెబితే నే నేంచెప్పను? . . . . . కన్నకడుపు నీదా, నాదా?"

రామనాథం అత్తగారివంక తీక్షణంగా చూశాడు. ఆమెకు అల్లుడి రెండుకళ్లలోనూ మహాక్రోధాగ్నిజ్వాలలు కనిపించినై.

అతనితో తన కేమిటని సౌభాగ్యమ్మగారు వియ్యంకుడితో చెప్పి స్వామికి ముడుపు కట్టించింది. తరవాత వారంరోజుల్లో మహాలక్ష్మి కాస్త పక్కలో లేచి కూర్చోటం మొదలుపెట్టింది.

"అహా! ఏడుకొండల వాడి మహిమ!" అన్నారు ఇంటిల్లిపాదీ.

ఈమాట వినగానే రామనాథం పాలిపోయినాడు.

"వెంకటేశ్వరస్వామి దేవుడైతే కావచ్చు. నేను మొక్కు చెల్లించబోవటం లేదు," అన్నాడతను.

ఈమాట అతను అన్న అయిదు నిమిషాలకే మహాలక్ష్మికి ఒళ్లు తెలియని జ్వరమూ, వణుకూ, మనిషి మంచంలో ఎగిరిఎగిరి పడటం మొదలైనవి జరిగినై. అందరూ లబలబలాడారు. భార్యను చూస్తున్న రామనాథం మొహం మరింత పాలిపోయింది. అతని గుండె తన అసమ్మతిని చాలా గట్టిగా తెలియచేసింది. అతను పళ్లు బిగబట్టి, "నామీదకోపం దానిమీద తీర్చుకుంటావా? తుచ్ఛుడు!... నేను మొక్కు చెల్లించను!" అన్నాడు.

౬

"రాబోయే ఫిలిం ట్రెయిలర్ వేస్తున్నారు. అసలుఫిలిం ఇంకా ప్రారంభం కాలేదు. త్వరగా వెళ్లండి!" అన్నాడు టిక్కెట్టాఫీసుగుమాస్తా.

రామనాథం హాలులోకి వెళ్లాడు. లోపల కటికచీకటిగా ఉన్నట్టుంది అతని కళ్లకు, అప్పుడే వెలుగులోనించి రావటంవల్ల. హాలంతా కిటకిట లాడుతున్నది. అతను కుర్చీలమధ్యగా, మనుష్యుల మధ్యగా దారి చేసుకుంటూ, ఖాళీకుర్చీ ఎక్కడ కనపడుతుందా అని చూసుకుంటూ నడవసాగాడు. కొంతదూరం వెళ్ళినతరవాత ఎవరో పెద్దమనిషి ...

"ఉండు అట్లా!" అంటూ అతన్ని అటకాయించాడు. ఆయన అడ్డంపెట్టినకాలు రామనాథం చూడలేదు. ఆ కాలు తగిలి అతను ముందుకు తూలాడు. పడకుండా ఉండటానికి అతను తనచెయ్యి అవతలి కుర్చీలో కూర్చున్న మనిషిభుజంమీద వేశాడు. మరుక్షణం చెయ్యి తీసి నిదానంగా నడుస్తున్నాడు రామనాథం. కాని అపచారం జరిగిపోయింది. ఈపెద్దమనిషి పక్కన కూర్చున్న ఎవరో ఆడమనిషి! తనకు కాలు అడ్డంపెట్టిన పెద్దమనిషి తాలూకేనేమో! అందుకనే ఆయన అతన్ని అట్లా గదమాయించాడు. ఆడవాళ్లను తెచ్చి మగవాళ్లలో కూర్చోపెట్టటం దేనికి? ఇంతగలభా ఎందుకు?

ఈలోపల ఆ పెద్దమనిషి రామనాథం చేసి దిద్దుకున్న తప్పు గమనించి, "ఏం త్రాగావు? బుద్ధి లేదూ?" అంటూ లేస్తున్నాడు. వెనకనించి "ఊరుకోండి! పోనివ్వండి!" అని అనునయింపులూ, "కూర్చో! కూర్చో!" అని గదమాయింపులూ వినిపించినై. రామనాథం ఆపెద్దమనిషిచెయ్యి పట్టుకుని బలవంతాన కుర్చీలో కూర్చోపెట్టి తను ముందుకు వెళ్లాడు. అది మాటలకు సమయం కాదు.

ఈపాటికి అతనికళ్లు చీకటికి అలవాటుపడినై. ఆ ఆడమనిషి పక్కకుర్చీ ఖాళీగానే ఉంది. హాలు కిటకిట లాడుతున్నా, ఆడదాన్ని గౌరవించి పక్కకుర్చీ ఖాళీగా ఉంచారు. తనకు మరి తప్పదు. అతను ఆమె పక్కన చతికిలబడ్డాడు.

"నువ్వా!" అంది ఆమె ఆశ్చర్యంతో.

"సావిత్రీ!" అన్నాడు రామనాథం. అతనిఒళ్లు జల్లు మన్నది. లైట్లు వెలిగినై.

....

సావిత్రిని ఇంతకాలానికి చూసిన ఆశ్చర్యంలో రామనాథం ఆమెపక్కన ఉన్న పెద్దమనిషిని పూర్తిగా మరిచిపోయినాడు. తను ఆమెతో మాట్లాడటం ఇంకా వందమంది చూస్తున్నారన్న విషయంకూడా అతన్ని బాధించలేదు!

"ఎక్కడుంటున్నావు? నీ అత్తవారి ...

"ఇప్పుడు ఇక్కడే ఉంటున్నాను—మావాళ్లింట్లో. నా అమ్మకు కొంచెం సుస్తీచేసి, ఇప్పుడు నయంగా ఉంది!" మిగతాది సావిత్రి ఒకచిన్న యాక్షనుతో పూర్తిచేసింది, తల ఆ పెద్దమనిషివంక తిప్పి. రామనాథం ఆశ్చర్యంతో ఆయనకేసి చూశాడు. ఆ పెద్దమనిషి సంగతి చెప్పనే అక్కర్లేదు. ఆయన మొదటినుంచీ అతనివేపే చూస్తున్నాడు — తను ఈ సంభాషణలో కల్పించుకుంటే సమంజసంగా ఉంటుందా ఉండదా అని అనుమానిస్తూ.

ఆయన ఆమె భర్త అయిన రిటైర్డు తహసీల్దారుగా రని రామనాథానికి ఒకనిమిషందాకా తట్టలేదు.

"ఓ!" అన్నాడతను అర్థమైనట్టు.

సావిత్రికి ఈ మొగుడేమిటి? అతనికి మొదట నవ్వొచ్చింది. తరవాత తట్టింది, సావిత్రికి ఆ మొగుడు హాస్యకారణం కాకపోవచ్చునని. ఈ పెళ్లేమిటి?—పగకొద్దీ చేసినట్టు! అసురబుద్ధి! అదీ కారణం, ఈ ప్రపంచం ఇట్లా తలకిందుగా జరుగుతూండటానికి కారణం!

పైకి బాగానే ఉంది సావిత్రిపని. ఏదో అందమైన చీర కట్టింది, బోలెడు నగలు పెట్టుకుంది. చక్కగా బంగారపుబొమ్మల్లే ఉంది. అదృష్టవంతురాలే— ఏమో!

తిరిగీ లైట్లు ఆరిపోగానే సావిత్రి తనచేతిని మెల్లగా అతనిచేతులో పెట్టింది! దాంతో కొంపలు అంటుకున్నై!

నీరసంగా ఉన్న అతని జీవితంలోకి సారం వచ్చినట్టయింది. కటికచీకటిలో మతాబా వెలిగించినట్టయింది. అతని ప్రతినరంలోకీ ఎక్కడినించో జీవశక్తి వచ్చి ప్రవహించటం మొదలుపెట్టింది. ఆ చేతిని అతను చాలాసేపు పట్టుకున్నాడు!...

మర్నాడు పోస్టులో అతనికి సావిత్రిదగ్గిర్నించి ఈ ఉత్తరం వచ్చింది.

"నా ప్రాణదాతకు—నిన్న నిన్ను చూడగానే నాకు ప్రాణం లేచివచ్చినట్టయింది. కొంతకాలంనించీ నేను ఒకవిధమైన మత్తులో ఉన్నానని నాకిప్పుడు అర్థమవుతున్నది.

"'ఇది తప్పు, నే నీపని చెయ్యకూడదు!' అని నాకు నేను ఎంతో నచ్చచెప్పుకో జూచాను. లాభం లేకపోయింది. నేను నిన్ను విడిచి ఉండలేను. నువ్వు నాకు కావాలి. నాలో ప్రతినరమూ నీకోసం తహతహలాడుతున్నది. ఇవాళ సాయంకాలం అయిదు గంటలకు రా! తప్పకుండా రావాలి!"

ఇక ప్రపంచం ఎట్లా పోతే ఏం? ఏది ఎట్లా అయితే ఏం? ఎవరు ఏమయితే ఏం? ఇదంతా మాయ. సావిత్రి ఒక్కతే చైతన్యం గల జీవి. ఏ ఇతర పదార్థంలోనూ, జీవం ఉన్నట్టు కనిపిస్తుందే కాని, నిజంగా లేదు!......

అతను దీపాలు పెట్టేవేళ ఇంటికి తిరిగివచ్చాడు. అతని శరీరం దేవతాస్పర్శ చేత పవిత్రమైనట్టుగా ఉంది. అతని కళ్లు మెరుస్తున్నై. అతని మొహం కళకళ లాడుతున్నది. అతను మారిపోయినాడు.

"కాస్త ఒప్పుకుందూ, నాయనా! పిల్లది బాధతో అల్లాడిపోతున్నది!" అన్నది అత్తగారు అతన్ని సావిట్లో పట్టుకుని.

"వెంకటేశ్వరస్వామికి నువ్వుకూడా ముడుపు కట్టి, అపరాధం అను!"

"అట్లాగే చేతాం లెండి!" అంటూ అతను గది లోకి వెళ్లాడు.

౭

రాత్రి పదకొండుగంట లయింది. రామనాథం పక్కమీద డేరా వేసినట్లే కూర్చుని మొహం చిట్లిస్తున్నాడు, అతనికి నిద్ర రావటం లేదు.

ఏదో పొరపాటు జరిగింది. లేకపోతే అతను, మర్నాడు వెంకటేశ్వరస్వామికి ముడుపు కట్టి అపరాధం అనటానికి ఎట్లా అంగీకరించాడు? అతని పట్టు ఏమయింది?......

సావిత్రి తనలో కలిగించిన మార్పు శాంతంగా మంచిదేనా? తను ఇప్పుడు కూత రాకుండా కాలవల్లో

దిగగలడా? గొడుగులు పట్టుకుని ఇంటిమీదినించి దూకగలడా? అటువంటి చిలిపిపనులు చెయ్యాలని కాదు. తనలో ఇప్పుడా సాహసం ఉందా? తనకు ప్రాణం కొంచెం రుచి కాలేదా?— సావిత్రికోసం!

ఇంతకాలమూ తనలో ఒకగొప్పశక్తి ఉంటూ వచ్చింది . . . దానితో అతను సాధించినది ఏమీ లేదు. అయినా ఇప్పు డది నశించిపోతుం దని అతనికి భయంగా ఉంది. ఉన్నశక్తిని వినియోగించకపోవటం తన పొరపాటు. ఇప్పుడు దాన్ని నశించనివ్వటం మరొక పొరపాటు! ఏం చెయ్యాలి తను?

కావాలంటే ఈక్షణంనించి తను సావిత్రిని చూడకుండా ఉండగలడా? ఎందుకు చూడకుండా ఉండా లనేది అనవసరం! పట్టుదలకోసం! . . . ఇతర కారణాలూ లక్ష కలగవచ్చును. తన్ని రానివ్వటంవల్ల సావిత్రికి ఏక్షణమైనా హాని కలగవచ్చును. సావిత్రి రేపోఎల్లుండో చచ్చిపోవచ్చును. తను ఆదెబ్బకు కుంగి పోవలసిందేనా? నూరునోములు ఒక్క రంకుతో పోయిన నట్టు, ఒక్కసారి సావిత్రిదగ్గిరికి వెళ్లి నందుకే తనశక్తి ఇంత క్షీణించిపోతే ఇంకొక నెల రోజుల్లో తనసంగతి ఏమవుతుందీ? . . . ఇప్పటికింకా మించిపోలేదేమో! తాను త్వరగా మేలుకుని కర్తవ్యం ఆలోచించాలి.

ఆరాత్రి అతను నిద్రపోలేదు.

మర్నాడు సాయంకాలం అతను వెళ్లేటప్పటికి సావిత్రి అతనికోసం నిరీక్షించుతున్నది. అతని మొహం చూడగానే ఆమె గ్రహించింది, ఏదో జరిగిం దని.

"ఏమయింది? . . ."

"పొరపాటు జరిగింది, సావిత్రీ!"

"ఏం?"

"నాకు భయంగా ఉంది!"

"ఎందుకూ?"

"కొంతకాలం ఇట్లా జరిగితే నేను నిన్ను కావాలన్నా చూడకుండా ఉండలేనేమో అని!"

ఆడదయినా అముక్క అర్థం చేసుకున్నది సావిత్రి.

"నాలో ఏదో నశించిపోతున్న దని భయం! స్వార్థం! నాకు తెలుసును! కాని, ఏది స్వార్థం కాదు? నేను నిన్ను కోరటం స్వార్థం కాదూ?"

సావిత్రి మాట్లాడలేదు.

"నాహృదయం చాలా దుర్బలమయినది, సావిత్రీ! అది ఎన్నడూ నాతో కలిసి రాలేదు. నే నేది చెయ్యబోయినా అది అడ్డుపుల్ల వేస్తూనేఉంటుంది. చివరకు, దాన్ని ప్రతిఘటించటమే ఒకనియమంగా పెట్టుకున్నాను . . . . . ఎందుకూ? ఇప్పుడు నా హృదయం నన్నెంత నిర్బంధపెడుతున్నది!—నిన్ను నాచేతుల్లోకి తీసుకుని గట్టిగా కౌగిలించుకోమని, నీ లేతబుగ్గలు కందేటట్టు ముద్దుపెట్టుకోమని! . . . ." అతను మొహానికి చేతులు ఒత్తుకుని కొద్దిగా వణికాడు.

ఆక్షణంలో సావిత్రి అతన్ని సమీపించి, తన చెయ్యి మెల్లిగా అతని భుజంమీద వేస్తే ఏమయి ఉండునో! . . . . . సావిత్రి కూర్చున్నచోటినించి కదలలేదు.

ఇద్దరూ అయిదునిమిషాలపాటు మౌనంగా కూర్చున్నారు.

"నా శరీరాత్మలు నీచేతులలో పెట్టటంవల్ల నాకు హానేదీ కనిపించదు, ఎంత ఆలోచించినా! మగవాడికీ ఆడదానికీ అదొక భేదమేమో!" అంది. సావిత్రి.

మొహానికి చేతులు అడ్డంతీసి, ఆమెవంక చాలా సేపు చూసి, రామనాథం "నేను నిన్ను ప్రేమించటంలో, నాకు నాభార్యమీద కల అసహ్యమూ, నీ భర్తమీద కోపమూ—ఈ రెండూకూడా పనిచేస్తున్నై. అట్లా కాకుండా నాహృదయాన్ని నేను జయించగలిగిన తరవాత మనిద్దరం కలిసి ఉందాం! ఏం, సావిత్రీ?"

"అట్లాగే!"

"అందాకా ఒకళ్లనొకళ్లు చూసుకోనైనా వద్దు!"

"వద్దు!"

"నీకీ ఏర్పాటు కష్టంగా ఉండదుకదూ?"

"ఉంటుంది!" సావిత్రి నవ్వింది. "నేను కష్టాలకు అలవాటుపడ్డ ప్రాణాన్ని!"

రామనాథం "వస్తాను!" అని లేచాడు. అతని హృదయం తీవ్రమయిన తన తుది ప్రయత్నం ప్రారంభించింది. రామనాథం దానికి లొంగ దలుచుకోలేదు.

ఎటు పోతున్నాడో, ఏం చేస్తున్నాడో అతనికి తెలియదు. దీపాలు పెట్టేవేళకు ఇల్లు చేరుకున్నాడు. ఎవరితోనూ మాట్లాడకుండా అతను తనగదిలోకి వెళ్లి పడుకున్నాడు.

అతనికి శరీరంలో అస్వస్థతగా ఉన్నట్టు తోచింది. శరీరం వేడిగా లేదు. నాడిమాత్రం విపరీతంగా కొట్టుకుంటున్నది. మతి పెద్దవాళ్లకుమల్లే ఆలోచన ఒక్క క్షణం ఒక్క చోట ఉండక సంచారంచేస్తున్నది. చెవులో ఎవరో గుసగుస లాడుతున్నట్టుంది.

"చాలా ఘోరం! ... అయినా, పాపం, సావిత్రి ఏంపాపం చేసింది? ... స్వార్థం! స్వార్థం! అపరాధం! ... వెంకటేశ్వరస్వామికి మీదుకట్టు! ... నెత్తి అదుస్తాడు! ... సావిత్రిమొహం చూడకు!.... అమృతం విషమయింది, తీర్థం చాలకపోతే! ... పాపం, సావిత్రిని మొహంమీద కొట్టినట్టు—"

రామనాథం మూలిగి, పక్కమీద పొర్లాడు. కాని ఒక్క క్షణం కదలకుండా పడుకోగానే కలవరింత, మగత, చెవుల్లో సంభాషణ!

"నీకే ఉం దనుకున్నావు మొండితనం! .... సావిత్రి నీతల తన్నింది!... చూడు ఎంత సులభంగా నీ మొహం చూడకుండా ఉండటానికి ఒప్పుకుందో!...ఆ మనిషి నీకోసం పుట్టిం దని తెలియటం లేదూ?... ఇట్లాగా ఆ మాట రుజువు చెయ్యటం?...

అతనితల్లి వచ్చి కొడుకును భోజనానికి లేపింది. అతను పలకలేదు. తట్టి లేపినా పలకలేదు. శరీరం వేడిగా లేదు. ఊపిరి బలవంతంగా పీలుస్తూ విడుస్తున్నాడు. ఏమిటా ఈ అవస్థ అని ఆవిడ ఆశ్చర్యపడుతుండగా అతను కలవరించాడు.

"సావిత్రి కిరికి దనా?... ధలే మొండిది!... నా అభిప్రాయం ఎంత బాగా అర్థం చేసుకుంది!... నా ప్రాణం!"

అతనిగొణుగుడు ఆమెకు ఒక్క టవ్వయినా అర్థం కాలేదు. ఆమె వియ్యపురాలిని పిలిచింది. ఆవిడ వచ్చి పరిస్థితులు చూసి వెంటనే వెంకటేశ్వర స్వామికి ముడుపు కట్టించి అపరాధం చెప్పించింది.

నాలుగురోజులైనతరవాత సావిత్రికి తెలిసింది, రామనాథంయొక్క అర్థంలేని జబ్బు సంగతి. ఆమె వెంటనే రామనాథాన్ని చూడటానికి ప్రయాణమయింది.

ఆమెను చూసి రామనాథం అత్తగారూ, తల్లీ ఆశ్చర్యపోయినారు. ఆమె నేరుగా రోగి ఉన్నచోటికి వెళ్లింది. రామనాథం పక్కమీద వెల్లకిలా పడుకుని కప్పువంక అర్థం లేకుండా చూస్తున్నాడు.

సావిత్రి అతని ఒంటిమీద చెయ్యివేసి, "ఇటు చూడు!" అంది.

"అపరాధం!" అన్నా డతను ఒంటికన్నుతో.

"నేను సావిత్రిని. నావంకచూడు, రామనాథం"

"వచ్చిపోయింది! హత్యచేశాను! వెంకటేశ్వరస్వామి చేయించాడు!"

"ఇదుగో, చూడమ్మాయి! మా అల్లుడు సావిత్రి అని కలవరిస్తాడు, నిన్నేనా?" అన్నది సౌభాగ్యమ్మగారు వెనకనించి.

"కావచ్చును!"

"ఎందువల్లా?" అన్నది సౌభాగ్యమ్మగారు మంచి లాయరు ప్రశ్న వేసినదానిమాదిరిగా.

సావిత్రికి ఏంచెప్పాలో తెలియలేదు.

"మా యిద్దరిదీ ఒకటే ప్రాణం!" అన్నది సావిత్రి తెగించి.

"అట్లాగా? అయితే అతని ప్రాణంమీదికి వచ్చింది. ఏంచేస్తావో చెయ్యి!" అన్నది రామనాథం అత్తగారు.

"ఛీ! అవతలికి పో నువ్వు!...పో!"అని రామనాథం ఇల్లు ఎగిరిపోయేట్టు అరిచాడు. సౌభాగ్యమ్మగారు దడుసుకుని పారిపోయింది.

"నాకు కళ్లు తెలిసేఉంది, సావిత్రీ! మళ్ళీ మళ్ళీ మెదడు జారి యిష్టంవచ్చినట్టు పోతుంది. అర్థంలేనిమాటలు అనబుద్ధి అవుతుంది—"

"కాకూడదు!" అంది సావిత్రి.

"లాభంలేదు, సావిత్రీ! ఇట్లా అయితే నాకు పిచ్చిఎత్తిపోతుంది!...నేను నిన్ను విడిచి ఉండలేను!" అతను ఆమెవేపు చెయ్యి చాచాడు. ఆమె అనుమానిస్తూ చెయ్యి అందించింది. అతను ఆమెను ఏనుగబలంతో లాగి ఆమెమొహం తనచేతులతో పట్టుకుని ఆమెకు ఊపిరి సలపకుండా ముద్దుపెట్టుకున్నాడు.

"ఉండండి! మీరట్లా ఇంద్రియ నిగ్రహం పోగొట్టుకోవటం, బాగాలేదు. మీరు ప్రయత్నం చెయ్యటంలేదు, నన్ను మరిచిపోవాలని! ఇట్లాఅయితే—"

రామనాథం ఒక బలమైన ముద్దుతో ఆమె మాటలప్రవాహం ఆపేశాడు. ఎవరైనా వస్తారని కూడా అతనికి భయంలేదు. ఏమిచెయ్యాలో ఆమెకు తోచలేదు. ఈప్రవాహంలో పడి తనుకూడా కొట్టుకుని పోవాలా? అదెంతసేపు పని? అతని ముద్దులు ఆమె రక్తాన్ని ఉడికించటంలేదా? ఆమె కింతకన్న స్వర్గం ఏముంది? అతనికో? . . .

అతనిపట్టు మెల్లిగా విడిపించుకుని ఆమె "ఇంటికి పోవాలి!" అన్నది.

"అప్పుడే పోతావా? నాజబ్బు ఎంత నయమయిందో చూశావా?"

"మళ్లీ సాయంకాలం వచ్చి చాలాసేపు కూర్చుంటాను!"

"ఉగ్రహాలన్నీ—ఇక్కడ కాదు. నేనే మీయింటికి వస్తాను! ఏం, సావిత్రీ?"

సావిత్రి ముక్కుమీద వేలు పెట్టుకుంది. అతను లెక్క చెయ్యలేదు.

"నేను వస్తాను కాదూ? వస్తానని రానా?"

"అయిదుగంటలకు రా! రాకపోతే నేను ఇంత దూరమూ నడిచి వస్తానుసుమా?"

"అట్లాగే!" ఆమె ధైర్యం చేసి, అతన్ని సమీపించి, వంగి, అతని కళ్లు రెండూ ముద్దుపెట్టుకుని, ఇవతల పడ్డది. ఏం చెయ్యాలో ఆమె అప్పుడే తీర్మానించుకుంది.

ఆసాయంకాలం ఆరింటికి ఒకనీరసంగా ఉన్న వ్యక్తి బలవంతాన నడుస్తూ వచ్చి సావిత్రి పుట్టింటివారి ఇంటి అరుగుమీద చతికిలబడ్డది.

ఆ ఇల్లు తాళం పెట్టి ఉంది!

౮

ఆరునెలలు గడిచినై. రామనాథం తనసుద్ది భార్యతో వేరే కాపరం ఉంటున్నాడు. ఈ ఆరు నెల్లలోనూ చాలా గ్రంథం జరిగింది.

మహాలక్ష్మి జబ్బు కాస్త నయమై ఆమెలేచి అటూ ఇటూ తిరుగుతుండగా, ఆమెకు మశూచి కంపోసి రెండు కళ్లూ పువ్వేసిపోయినై.

ఈ లోపల రామనాథంలో పెద్ద పరివర్తన కలిగింది. భగవంతుడు తనకు ప్రసాదించిన మొండితనాన్ని ఉపయోగించటానికి అతను ఒకమార్గం కనిపెట్టాడు.

మంచి అలవాట్లు అభ్యసించినట్టు సద్గుణాలు మాత్రం ఎందుకు అభ్యసించరాదూ? తనభార్య ఎటువంటిదైనా సరే, ఒకకుక్కను, ఒకపిల్లిని దయతో చూసినట్టు దయతో, ప్రేమతో మహాలక్ష్మిని చూడటం అసంభవమా తనకు? ఎంత కష్టమైనా సరే ప్రయత్నం చేసేటందుకు తనకు పట్టుదల ఉంది,— అసంభవం కాకపోతే సరి! లేదా, తనలో అంత మొండితనం లేదని రుజువైనా కావాలి!...

అతను ప్రయత్నంచేసి తనభార్యమీద ప్రేమా, జాలీ, దయా తెచ్చిపెట్టుకున్నాడు. ఇటువంటిపని

మంగా, హాస్యాస్పదంగా తోచింది. కాని అతను పట్టు విడవలేదు. కావా లనేటప్పటికి అతనికి ఎక్కడ లేని ఓర్పూ వచ్చింది. ఆమె అవకతవకమాటలూ, వంకరబుద్ధీ సహించటం మొదలుపెడితే, అందు లోనూ కొంత ఆనందం కనపడ్డది. కాని అతని ప్రయత్నానికి అతని తల్లిదండ్రులు పెద్ద అంతరాయం అయిపోయినారు.

ఏం చెయ్యాలి తను? ఆముసలివాళ్లకు తన అభిప్రాయం అర్థంకాదు. తనతల్లి ఒకసారి అనుకుంటున్నది —బిగ్గరిగా! — "ఇం కేముందీ? అది వాణ్ణి బాగా తనవల్లో వేసుకుంది!" అని. భూతదయ తనభార్యయందు ఎటువంటి మార్పు తెచ్చి పెడుతుందో చూడటం ఎట్లా, అటువంటి తల్లిని ఇంట్లో పెట్టుకుని?

బాగా ఆలోచించి అతను వేరే కాపరం పెట్టాడు. ఈ నాలుగు నెల్లోనూ మహాలక్ష్మి ఎంతో మారి పోయింది.

ఆమెలో కలుగుతున్న మార్పులన్నీ అతను గమనిస్తూనే ఉన్నాడు. మొదట్లో ఆమె అమితంగానూ, అప్రియంగానూ మాట్లాడేది, తనకళ్లు లేన మొగుడే పోనొట్టాడని రోజుకు పదిసార్లు అనేది. వెంక టేశ్వర స్వామిచేత పోగొట్టించా ననేది.

క్రమంగా ఆమెధోరణి తగ్గిపోసాగింది. ఆమె మాట్లాడటం తగ్గించి, ఆరిపోయిన దీపాలవంటి తన కళ్లతో ఆలోచించటం ఎక్కువ చేసింది. అలవాటు చొప్పున మాట్లాడటం మొదలుపెట్టినా మధ్యలో మానేసి ఆలోచనలో పడేది.

ఇంకా రోజులు గడుస్తున్నకొద్దీ ఆమె తన భర్తకు పని ఇవ్వటానిక్కూడా సంకోచిస్తున్నట్టు కనపడటం మొదలుపెట్టింది. మంచంలో లేచి కూర్చుని చాలాసేపు అనుమానించి, "ఏంచేస్తున్నారు?" అని అడిగి, "వీలయితే నన్ను ఒక్కసారి బయటికి తీసుకు పోతారూ?" అనేది. ఇటువంటివి అతను గమనించకుండా ఎట్లా ఉండగలడు? అతని కాలిచప్పుడు గుర్తు పట్టేది. రెండుమూడు గంటలు అతను ఇంట్లో లేకుండా వున్న దానల్లే, అతను వచ్చిన అలికిడి విని మంచంలో లేచి కూర్చుంటుంది. ఆమె మొహాన సంతోషం కన పడుతుంది. ఒక్కరాత్రి అతన్ని తన మంచం మీద కూర్చోమని అతని చెయ్యి తన చేత్తో పట్టుకుని అట్లాగే నిద్ర పొయ్యేది. ఒకసారి అతను తన్ను దగ్గరికి తీసుకుని తన నుదుట ముద్దు పెట్టుకుంటే ఆమె శరీరం గట్టిగా జలదరించింది!...

మనిషి లో ఇంత మార్పా! ఆ మార్పుకలిగించ టానికి ఇదా విధానం? అతను ఆశ్చర్యపడ్డాడు, సంతోషించాడు.

అతనికి పని చెప్పటం ఇష్టంలేక ఆమె ఒకసారి తనంతట తనే దొడ్లోకి పోవాలని బయలుదేరి, దారిలో ఏదో తగిలి పడ్డది. మోకాలు దోక్కుపోయింది. రామనాథం ఆచప్పుడు విని, చేస్తున్న పని విడిచిపెట్టి వచ్చి ఆమెను చేతుల్లో ఎత్తుకుని, మృదువుగా "దెబ్బతగిలిందా, లక్ష్మీ?" అన్నాడు. "మోకాలికి తగిలింది!" అన్నది, మోకాలు అందుకోవాలని ప్రయత్నంచేస్తూ. అతనికి గాయం కనపడ్డది. "అయ్యయ్యో!... నెప్పిగా ఉందా?" "అన్నాడతను గాయం చూసి గాభరాపడి. ఆమె అతని చెంప స్పృశించి, నవ్వుతూ "ఇప్పుడు లేదు లెండి!" అన్నది!......

రామనాథం పూర్తిగా తృప్తిపడ్డాడు. అతని విజయం పూర్తి అయింది. అతని హృదయం ఇప్పుడు ఎక్కడ ఉందో "పతా" లేదు. కుక్కినపేనయి పోయింది. మిన్నువిరిగి మీదపడ్డా ఇప్పుడది కిక్కురు మనదు...... అంతా సావిత్రిప్రసాదం! అప్పుడామె తన్ను విడిచిపెట్టి వెళ్లకపోతే తను ఇంతపని చెయ్యగలిగి ఉండడు! ఎందుకూ? తనకు తనలో నమ్మకం కూడాపోయింది సావిత్రికోసం తను మతిచెడగొట్టు కున్నరోజుల్లో. సావిత్రికి తను యావజ్జీవం కృతజ్ఞుడై ఉండవచ్చును.

ఒకనాడు రామనాథం భార్యతో సావిత్రిని గురించి యావత్తూ చెప్పాడు. ఆమె గంభీరంగా

"పాపం! అప్పుడామెను అట్లా ఎందుకు వదిలేశారు?" అన్నదామె చివరకు.

"నిన్నూ సావిత్రిమొగుడ్లే ఒకచెంప ద్వేషిస్తూ నేను సావిత్రితో సుఖపడటానికి ఇష్టపడలేదు. ఆ స్థితిలో నేను సావిత్రిని వదలలేకపోవటం నా హృదయానికి ద్రోహం చెయ్యటం అయింది. నా హృదయం అప్పటినించీ నా పట్టుదలమీద కన్ను వేసి ఉంది!.. అందుకని!" అన్నాడతను భార్యతల నిమురుతూ..

౬

సాయంకాలం అయిదుగంట లయింది. అతను బజారుకు వెళ్లి అప్పుడే తిరిగివచ్చాడు. లోపలికి వచ్చి "లక్ష్మీ!" అని పిలిచాడు. ఇంట్లో ఉన్నట్టు లేదు. ఉంటే తన అడుగుల చప్పుడుకు మెల్లిగా ఎదుర వచ్చేది! మంచందగ్గిరికి వెళ్లి చూశాడు నిద్రపోతున్నదేమో నని. అక్కడా లేదు. ఒంటరిగా దొడ్లోకి వెళ్లిందేమో!

అతను దొడ్లోకి వెళ్లి ఒకటి రెండు కేకలు పెట్టాడు. బొట్లపాదు పక్కనించి మూలుగు వినపడ్డది. అతను అక్కడికి పరిగెత్తి, బొక్కబోర్లా పడి ఉన్న భార్యను చూసి, గాభరాపడుతూ ఆమెను లేవదీశాడు. ఆమెకు స్పృహలేదు. ఏమయిందో అతనికి అర్థం కాలేదు. చుట్టూ చూశాడు. నేలమీద ఏవో పశువుల అడుగుజాడలు కనపడినై. ఏపాగరుబోతు గొడ్డయినా దొడ్లో ప్రవేశించి, ఆమెను వెనకనించి కుమ్మిపడదోసిందేమో!

భార్యను మెల్లిగా లోపలికి మోసుకుని వచ్చి మంచంమీద పడుకోబెట్టాడు రామనాథం. ఆమె ఉచ్ఛ్వాసనిశ్వాసాలు సరిగానే ఉన్నై. గుండె సరిగానే కొట్టుకుంటున్నట్టుంది. ఎక్కడా గాయంకూడా అయినట్టు లేదు. భయంచేతా పాటుకల్లా స్పృహతప్పి ఉంటుంది. అతను కాసిని చన్నీళ్లు తెచ్చి ఆమె మొహాన కొట్టాడు. ఆమె పెద్దనిట్టూర్పు విడిచి కదిలింది. ఆమె గొంతులో కాసిని నీళ్లుపోశాడు. ఆమెకు దాంతో స్పృహ వచ్చింది.

ఆమె జవాబు చెప్పలేదు. అతనికి కారణం అర్థంకాలేదు. ఆమెకు స్పృహ వచ్చిందనీ, మేలుకుని ఉందనీ, విశేషం దెబ్బతగల్లేదనీ అతనికి తెలుసును. అతని మాట వినపడగానే ఆమె మొహంలోకి రావలసిన వికాసం రాలేదు. గుడ్డితనానికి తోడు, పాపం, చెవుడుకూడా రాలేదుకద!

ఇంకా బిగ్గిరిగా పిలిచాడు.

"ఊఁహూ!" అన్నది మహాలక్ష్మి, పలకరించవద్దు అన్నట్టు. ఆమె గొంతుకూడా చాలా విచిత్రంగా, అమానుషంగా ఉంది. అతను ఆమె జోలికిపోక ఎడంగావచ్చి తనపని చూసుకోవటం మొదలుపెట్టాడు. మరి కాస్సేపటికి వంటమనిషి వచ్చి వంట చెయ్యటం మొదలుపెట్టింది.

అతను భోంచెయ్యటానికి లేవబోతుండగా వంటమనిషి "అమ్మాయిగారు కూడా ఇప్పుడు భోంచేస్తుందా?" అని అడిగింది. "తారవాత" అని అతను సమాధానం చెప్పి, వెళ్లి భోజనము చేశాడు. అతను భోజనం పూర్తికాగానే లేచి వచ్చి, నిశ్చలంగా పడుకున్న భార్యను చూసి, ఆమెకోసం ఎదురుచూస్తున్న వంటమనిషితో, "మీరు భోంచెయ్యవచ్చును. లక్ష్మికి తరవాత నేను పెడతాను," అన్నాడు. వంటమనిషి ఏవో ప్రశ్నలు వెయ్యబోయింది కాని రామనాథం ఆమెను నిరుత్సాహపరిచి పంపేశాడు.

పదిగంట లయింది. అతను కుర్చీలో కూర్చుని ఏదో చదువుకుంటున్నాడు. ఇంకా కాస్సేపు చూసి, లక్ష్మి లేవకపోతే ఏమైనాసరే లేపుదా మనుకున్నాడు.

ఏదో చప్పుడు కావటంవల్ల అతని చదువుకు అంతరాయం కలిగింది. అతను లక్ష్మిమంచంవేపు చూశాడు. ఆమె మంచంమీద లేచి కూర్చుని ఉంది. అతను చూస్తుండగానే, ఆమె మామూలు మనిషల్లే లేచి మెల్లిగా తనవేపు నడిచిరావటం మొదలుపెట్టింది.

"అయ్యయ్యో! పడిపోతావు సుమా! అక్కడే ఉండు, వస్తున్నాను!" అంటూ అతను, ఒకచేత్తో లాంతరు పైకెత్తి నిలబడ్డాడు. కాని అతని ఆందోళన

అవి తప్పుకుని నడిచి వస్తున్నది. ఆమెకు సాయంత్రం కలిగిన పాటువల్ల కళ్లు రాలేదుకద! కాని — ఆమె కళ్లుమూసుకునే నడుస్తున్నది! అతని కళ్లను అతను నమ్మలేకపోయినాడు.

అతనికేక ఆమెకు వినపడ్డట్టు లేదు. ఆమె అతని దగ్గిరికి వచ్చి అతని భుజాలమీద చేతులు వేసింది. ఆమె కళ్లు ఇంకా మూసుకునే ఉన్నై!

"లక్ష్మీ!"

"ఊఁ!"

"నీకు-నీకు కనపడుతున్నదా?"

"ఊఁ!"

"నేను కనపడుతున్నానా?" అతని గొంతు చలించింది.

"ఆఁ!"

"ఏం కావాలి?"

సమాధానం లేదు.

"ఫోంచేస్తావా?"

సమాధానం లేదు.

అతనికి ఎన్నో ప్రశ్నలు వెయ్యాల నిపించింది, కాని ఒక్కటీ వెయ్యకుండా ఆమెవంక అర్థంలేని చూపుచూస్తూ, అట్లాగే నిలబడిపోయినాడు.

"సావిత్రి మొగుడు పోయినాడు!" అన్న దామె వినపడీ వినపడని గొంతుతో.

"ఎప్పుడు?"

"నిన్న!"

"నీ కెవరు చెప్పారు?" అన్నా డతను ఉద్రేకం అణచుకోలేకుండా.

సమాధానం లేదు.

"నిజంగా పోయినాడా?"

"పోయినాడు!"

"పాపం!"

"సావిత్రిని తీసుకురండి."

"ఎక్కడికి?"

"సావిత్రికి మీరుతప్ప దిక్కులేదు — ముందు ముందు".

"ఇదంతా నీకెట్లా తెలిసింది?"

మహాలక్ష్మి సమాధానం చెప్పలేదు. ఆమె అతని వంక చూస్తున్నట్టు నటించటం మానేసింది. ఆమె మెడ వేళ్లాడబడ్డది. ఆమె అతనిమీదికి తూలిపడి కిందికి జారటం మొదలుపెట్టింది. ఆమెను అతను గట్టిగా పట్టుకుని తీసుకు వెళ్లి మంచంమీద పరోచ్చ పెట్టాడు.

"దాహం!" అంది మహాలక్ష్మి. ఇప్పు డామె గొంతు సహజంగా ఉంది. ఆమెవాలకం చూస్తే ఆమెకు ఇప్పుడే నిజంగా వళ్లు తెలిసినట్టుకూడా తట్టింది రామనాథానికి. అతను మంచినీళ్లు తెచ్చి ఇచ్చాడు. ఆమె వాటిని ఒక్కగుక్కలో తాగేసి నిట్టూర్చింది.

"ఫోంచేస్తావా, లక్ష్మీ?"

"వద్దండీ!...అబ్బ! వీపులో పోటుగా ఉందండీ!" అతను ఆమెను మెల్లిగా పడుకోబెట్టాడు.

"చల్లగాలికోసం నేను తడువుకుంటూ దొడ్లోకి వెళ్లేటప్పటికి ఏదో వచ్చి నన్ను పడదోసింది!...నేను మిమ్మల్ని చూసినట్టు కల వచ్చిందండీ! దీపం అట్లా చేత్తో పైకెత్తి పట్టుకుని వంచున్నారు!...ఆతరవాత ఏమీ జ్ఞాపకంలేదు."

"అది కల కాదు, లక్ష్మీ! దేవతలు నీకు దివ్యదృష్టి ఇచ్చారు" అని సమాధానం చెప్పాడు.

* * * *

అప్పుడప్పుడూ మహాలక్ష్మి కళ్లుమూసుకునే ఇల్లంతా తిరుగుతూ ఉంటుంది. రామనాథంగాని, సావిత్రికాని ఆమెను చూసి ఆశ్చర్యపడరు, ఆమెకు అడ్డం వెళ్లరు!

జిజ్ఞాస

శ్రీ కొమ్మనమంచి జోగయ్యశర్మ

[తంజావూరి సరస్వతీమహాలుకి ఎదురుగా ఉన్న శర్ఫోజీ శిలావిగ్రహాన్ని ఉద్దేశించి.]

శీతవాతములకుఁ జిక్కి యొంటరిగ నీ
శాల నినుపకటకటాల మధ్య
ఎవరవోయి నృపతి! యిట్లు శిలారూపవయి
నిలిచి నా మనసుఁ గలఁచుచుంటి?

సమదవైరుల కంఠనాళముల నడుమఁ
బలుచ నెత్తుటఁ గత్తికి పదును పెట్టి,
భరతరాజ్యరమాపదబంధములను
గడపిపట్టి శివాజివంగడము వీరాది?

అఖిల కవిరాజ కావ్యామరాంబుజముల
మాలికలుగూర్చి శారదా మందిరంబు
వింత వన్నెలఁ గైసేసి విబుధవరుల
పొగడతలు చూరగొన్న శర్ఫోజివయ్య?

ఎన్నఁడో దిగనారిపోయిన తెనుంగు
నాయకుల రాజ్యవైభవోన్నతిఁ దలంచి!
ప్రథితమహారాష్ట్రరాజన్యపాలనంబు
స్వప్నవృత్తాంత మగుట భావన యొనర్చి!
పూర్వహైందవ శిల్పనైపుణ్య మెల్ల
శిథిలమైపోవుచున్న దుస్థితికిఁ దలఁకి
నాఁడునాఁటికి వన్నెపోనాడు నిచట
నుండ నే లని శిలారూప మొందితయ్య?

కనుల నచ్చెరుపాటు, మోమునను మాన
భావ, మొదలున నిశ్చలత్వంబు దోఁప!
నెవనినో పిలువాని వీక్షించుపగిది
నిట్లు నిశ్శాంతవోయి చూచెద వదేల?

విను ప్రభూ! యీమహాస్థానవేదియందు
ఆ సువర్ణయుగాల నృపాళి కల్ప
పాదపంబులు కవిపుంగవప్రశస్త
శీర్షముల పైఁడిపూలు వర్షించువేళ
మంగళనినాదములు దిశల్ మాఱుమ్రోఁగ
సమితవిభవంబు లందిన యాంధ్రమాత
కనుఁగుబిడ్డఁడ, తెనుఁగుతాతయల మేలు
గంటములు గూర్చు చుట్టఱికంబుకతన
వచ్చి, యిచ్చటి యీ యపూర్వంపుచరిత
తెలుఁగ గాఁగోరి యిటు దోయిలింతు నధిప!
యీవెఱింగినయంత వచింతె నాకు?

పరమహీపాలహృదయస్పందనముగ
విజయడిండిమారవములు వెలయుచుండ,
వెన్న కావేరు లిర్వంక విజయకేత
నములనడుపున వింజామరములు వీవ,
శ్రీసరస్వతు లొక్కటఁ జేయి చేయి
గలిపి నాట్యప్రసంగసంగతు లొనర్ప,
దివిజనాథుని వైభవస్థితితోడ
రాజ్యలక్ష్మికి నిత్యనీరాజనంబు
లిచ్చి మన్నించునాఁటి మహీంద్రు లెల్ల
నెందుఁ బోయిరో తెలిపెదవే మహాత్మ!

'పలుకుపలుకునఁ దేనియ లొలుకునట్టి '
బహుళభాషాప్రబంధపుష్పముల నెల్ల
'దండలుగ నల్లి' వాగ్దేవతాపదాంబు
జము లఁ బూజించుసుకవిరాజన్యరాజి
మండితంబైన యాస్థాన మండపంబు
వన్నెపోనాడి విజనమై యున్న దేల ?

మహితరఘునాథరాయల మణికిరీట
వివిధరశ్మిచ్ఛటలతోడ వియ్యమందు
పచ్చలకడెంపు కేల కవ్వడి విలాస
బీజముల నాటి, పూతకావేరిజలము
కాలువలు గట్టి వేంకటకవివరుండు
సరసశృంగారకావ్య సస్యమును బెట్టు
పంటపొలము లెచ్చట నున్నవయ్య నృపతి ?

మయునినిపుణతఁ బలకజాల్మలిచి ఘన వి
శాల మండప సౌధరాజములఁ గట్టి,
నళితశాత్రవ కంఠ రక్తములతోడ
వీరగాథల నెడనెడ విస్తరించి,
గాఢభక్తిద్రవము కుంచికలకుఁ బొదివి
రామకథలెల్ల కుడ్యచిత్రములు వ్రాసి,
భరతమునిమనీషల నోరవల్లు దిద్ది
యలవుమీఱఁగ నాట్యశాలలు సృజించి,
యుదయరోచుల నులులకుఁ బదును పెట్టి,
నల్లఱాల కాకృతియు ప్రాణమ్ము నొసఁగి,
భారతీయుల శిల్ప ప్రభావ మెల్ల
తీర్చి దిద్దిన దేవమందిరము లునిచి
చిరయశంబును గన్న యా శిల్పివర్య
లెటకుఁ బోయిరో చెప్పెదోయీ నృపాల!

రాచకన్నెల కిలకిలారావములను
మధురవాక్ప్రసంగంబుల మందహాస
ధవళరోచుల కంకణధ్వానములను
నిత్యకల్యాణముల పందిరిసదములను
పొలుపు మీఱెడు నా యంతిపురులయందు
గబ్బిలంబుల రొదలు ఘూకముల రవళి
కీచురారావములు దుష్టకీటకములు
కటికచీకటిగములిట్లు గడలుకొనిన
నేఁటి దురవస్థ గాంచెనేనియు మహీశ!
విడుచు టాలైనఁ గన్నీటిబిందువులను !



నిరుద్యోగము

శ్రీ సి. వి. దీక్షితులు

నిరుద్యోగము యంత్రపరిశ్రమల ఫలితమని చెప్పుటలో కొంత నిజ మున్నది. పరిశ్రమలు విస్తారముగా నభివృద్ధిగాంచిన ప్రతి దేశమునందును నిరుద్యోగసమస్య ఏదో ఒకరీతిని తలయెత్తుచుండును. ఇంగ్లండు జర్మని మొదలగు యూరపియను దేశములలో ఈ సమస్య తీవ్రరూపమును దాల్చి అప్పుడప్పుడు ప్రభుత్వమును సహితము కలవరపెట్టుటకూడ కలదు. అట్లని, నిన్న మొన్నటి వరకును పరిశ్రమాభివృద్ధి విశేషముగా లేని హిందూదేశమున ఈ నిరుద్యోగసమస్యకు తావు లేదని చెప్ప వీలులేదు. మన పరిశ్రమలింకను ముందడుగిడవలసి యుండుటచే ప్రజలలో పని లేకుండుట మన కింకను పెరివిగా చూపట్టుటలేదు. అంతమాత్రమున మన దేశమున నిరుద్యోగులు లేరనిగాని, ఎల్లరకును వలసినంతపని అనువైన వేతనములకు లభించుచున్నదనిగాని చెప్పజాలము.

యూరపునందలి కొన్ని దేశములలో ప్రభుత్వము నిరుద్యోగులకు కొంత సాయము చేయుచుండుటచే అట్టివారినిగూర్చిన లెక్కలా దేశములలో లభించుచున్నవి. ఏమన, అచ్చట ప్రభుత్వసహాయమును పొందుటకును, వీలైనప్పుడు పని సంపాదించుకొనుటకునుగాను నిరుద్యోగులు తమ పేళ్లను లెక్కలలో వ్రాయించుకొను టవసరమై యున్నది. మన దేశమునం దనిసచో పరిశ్రమలవలన జీవించు ప్రజల సంఖ్య తక్కువ; నిరుద్యోగులకు ప్రభుత్వసహాయముగాని పని చూపించుటకు తోడ్పడు సంస్థలుగాని లేవు. తత్ఫలితముగ మన దేశమున నిరుద్యోగవ్యాప్తి సులభముగా పైకి తెలియుటకు తగిన యవకాశములు లేవు. అంతేగాక ప్రజలలో నూటికి డెబ్బదిమందికి పైగా వ్యవసాయమే ప్రధానవృత్తిగాగలవా రగుటచే స్థూలదృష్టికి వా రందరును ఎల్లప్పుడును వ్యవసాయపుపనులు చేసుకొనువారుగానే గోచరింతురు. కాని కొంచె మాలోచించినచో వ్యవసాయికులకు సంవత్సరముపొడుగునను పూర్తిపని యుండ దనియు, ప్రతిసాలునను కొన్ని మాసములు వారిలో కొందరైనను చేయుటకు పనిగానక తమ కాలమును వృథాపుచ్చవలసినస్థితిలో నుందు రనియు మనకు తేటపడగలదు. ఈ వ్యవసాయికులలో ఎందరకు సంవత్సరముపొడుగునను ఖాళీ లేకుండ పని దొరకుచున్నదో తెలుసుకొనుటకు సరియైన ఆధారములు కానరావు. ఈ విషయమున ప్రభుత్వ మెట్టి లెక్కలను మన దేశమున జాగ్రత్త పెట్టుచుండుటలేదు. పరిశ్రమల విషయమునగూడ ప్రతిసాలునను పూర్ణముగువివరములను ప్రభుత్వము సేకరించి ప్రచురించుట లేదు. ఇట్టి పరిస్థితులలో మన దేశమందలి నిరుద్యోగుల సంఖ్య నిర్దిష్టముగా చెప్పుటకు వీలులేదు.

హిందూదేశమున నిరుద్యోగసమస్యను పరిశీలించుటలో కొంతవరకైనను మనకు సహాయపడజాలునవి జనాభా లెక్కలు మాత్రమే యని చెప్పవచ్చును. మన దేశమున ప్రతి పదిసంవత్సరముల కొకసారి కేంద్ర ప్రభుత్వ యాజమాన్యమున జనాభా లెక్కలు తయారు చేయబడుచుండును. గత జనాభా లెక్కలు ౧౯౩౧-వ సంవత్సరమున తీసుకొనబడినవి; తిరిగి ౧౯౪౧-వ సంవత్సరమున ఈ లెక్కలను తీసుకొందురు. ఈ లెక్కలు దేశమం దంతటను ఏకకాలమున తీసుకొనబడుటచే నివి యానాటి స్థితిని తెలుపును; కాని జనాభా లెక్కల కాలము నాటికి అన్ని ప్రాంతములయందును పనికాలము కాకపోవచ్చును; ఒకచోట పని మందగించవచ్చును; వేరొకచోట పనిరద్దీ యుండవచ్చును. అందుచే ప్రత్యేక ప్రదేశములకు సంబంధించినంతవరకు ఈ లెక్కలు సంవత్సరము మొత్తముమీద నుండు సాధారణ స్థితిని తెలుపజాలక పోయినను హిందూదేశము మొత్తముమీద సరియైన స్థితినే తెలుపవచ్చును. అనేక ప్రాంతములలో పలువురచే తీసుకొనబడిన లెక్కలలో ప్రమాదములును పొరపాటులును ఒండొంటితో కొట్టుకొనిపోవును. ఆకారణమున జనాభాలెక్కలనుబట్టి నిరుద్యోగుల సంఖ్య నంచనా వేయుటకు మనము ప్రయత్నము చేయవచ్చును.

అట్లు చేయుటకు ముందు నిరుద్యోగ మనుపదము ఏ అర్థమున వాడబడుచున్నదో కొంచెము చర్చించుట మంచిది. మన ప్రాంతములలో నిరుద్యోగ మనుమాట ఉన్నత విద్యగాని, మెట్రిక్యులేషను వరకుగాని చదువుకొని యుద్యోగ మేదియు దొరకక అల్లాడువారి విషయమున సాధారణముగా నుపయోగింపబడుచున్నది. కాని నిరుద్యోగ మనగా దీనికంటె ఎక్కువ యర్థ మున్నది. ఈ పదము నిర్వ్యాపారముతో సమానార్థ ప్రతిపాదకము. చదువుకొనినవారైనను చదువుకొననివారైనను సరే సరసమగు వేతనమునకు పని సంపాదించుకొనజాలని నాడు ఆ పరిస్థితి నిరుద్యోగ మనిపించుకొనును. ఈ వ్యాసమునం దీపద మట్టి యర్థమునచే వాడబడినది.[1] ఇంతేకాక మరియొక విషయ మీ సందర్భమున గుర్తుంచుకొనవలసి యున్నది. నిరుద్యోగము కేవలము ఉద్యోగాభావము కాదు; నిరుద్యోగ మనగా తగినంత పని లేకుండుట, ఉద్యోగ మనగా తగినంత పని యుండుటే గాక అందులకు సరసమగు వేతనము లభించుట. కాబట్టి పూర్తిపని యున్నవారిలో నెవ్వరైనను తమపనిపోగొట్టుకొన్నచో వారు నిరుద్యోగు లగుదురు; కాని నిరుద్యోగు లందరును పనిలేక కూర్చుందురని చెప్ప వీలుపడదు. స్వల్పవేతనమున కేదో కొలదిపాటిపని లభించినంతవరకు చేసుకొని దానితో వారు పొట్టపోసికొన యత్నించుచుందురు. ఆత్మహత్యవలనగాని క్షుధార్తి వలనగాని మరణించుటకు బదులు వారెట్లో కాలక్షేపము చేయుదురు. ఏదైనను పనిలో నున్నవారు పనిని పోగొట్టుకొనుటయు,

1. ఇంగ్లీషులో Unemployment అను పదమునకు సమానార్థకముగా నిరుద్యోగము అను పదము ఈ వ్యాసమున వాడబడినది.

అంతకు ముందు పనిచేయ నిచ్ఛగించనివారు అప్పుడు మామూలుగా నీయబడుచున్న వేతనమునకు తా మేదియే నొకపని చేయ దలచినచో వారికి పని దొరకకుండుటయు నిరుద్యోగ మనిపించుకొనును. దీనినే ఇంకొక విధముగా చెప్పవచ్చును; చేయుటకు పని దొరకకపోవుటచే తన కనిష్టమైనను సోమరిగా నుండవలసివచ్చుట నిరుద్యోగము.

హిందూదేశమున నిరుద్యోగమును గూర్చి మాటలాడునప్పుడు మనము దానిని రెండురకములుగా విభజించుటలో సౌకర్య మున్నది. మన దేశమున విద్యావంతుల సంఖ్య స్వల్పము; జనసామాన్యమంతయు చదువులేనివారుగానే యున్నారు. అయినను మన విద్యావిధానముయొక్క ఫలితముగా చదువుకొనినవారిలో చాలమంది జీవనోపాయము లేక బాధపడుచున్నారు. నిరుద్యోగ సమస్య విద్యాప్రాప్తి యయిన వెమ్మట వారిని వెంటనే ఎదుర్కొనుచున్నది. దేశమునందు మనకు పైకి విస్పష్టముగా కనబట్టుచున్న దీవిద్యావంతుల నిరుద్యోగమే. ఇక రెండవది సాధారణప్రజలలో నిరుద్యోగము; మన దేశమునం దిది ఇంతవరకును పైకి కనపడుటలేదుగాని క్రమముగా విస్తరించుచున్నది.

సాధారణ ప్రజలలో నిరుద్యోగమునకును విద్యావంతులలో నిరుద్యోగమునకును మూలతత్త్వ మొక్కటే. విద్యావ్యాప్తి విశేషముగా నున్న విదేశములలో నిట్టి భేద మేమియును పరకుగొనబడుట లేదు. మన దేశమునగూడ ప్రాథమికవిద్య విస్తరించిన కొలదిని ఈ విభేదము మాసిపోగలదు. కాని ప్రస్తుతము కొన్నాళ్ళ పాటు విద్యా-వంతులలో నిరుద్యోగము మన దేశమునందొక ప్రత్యేకసమస్యగా పరిగణింపబడవలసి యున్నది. ఒక ఆశతో కొంత ద్రవ్యమును వెచ్చించి విద్య నభ్యసించుటచేతను చదువుకొనినవా రేదియే నొకపని చేసి జీవికను సంపాదించుకొన నిచ్ఛగింపరు. వారు నేర్చుకొనిన విద్యగూడ నూతనపథములను త్రొక్కుటకు వారికేమాత్రమును సాయపడునది కాకపోవుటచేతను, ప్రభుత్వకార్యాలయములు, స్థానికసంస్థలు, వాణిజ్యసంస్థలు మొదలగువానియందు గుమాస్తాలుగా చేరుటకుగాని, ఉపాధ్యాయులుగా పనిచేయుటకు మాత్రమేగాని వారిలో హెచ్చుమంది ప్రయత్నించుచుందురు. పై తరగతుల యుద్యోగము లన్నిటియందును ప్రతిసంవత్సరమును కలుగబోవు నూతనావకాశముల సంఖ్యకంటె, ఏసంవత్సరమున కాసంవత్సరము కృతార్థులై విద్యాసంస్థలనుండి బయటకు వచ్చువారిసంఖ్యయే విపరీతముగా హెచ్చుచున్నది. ఈ కారణమున దేశము మొత్తముమీద విద్యావంతులసంఖ్య తక్కువేయైనను వీరిలో నిరుద్యోగసమస్య తీవ్రరూపమును దాల్చుచున్నది.

౧౯౩౧-వ సంవత్సరమున జనాభా లెక్కలు తీసుకొనినప్పుడు విద్యావంతులలో నిరుద్యోగు లెంద రుండిరో తెలుసుకొనుటకొకింత యత్నించిరి. అయితే తత్సంబంధమగు లెక్కలుమాత్రము ఇతరజనాభా లెక్కలవలె అవశ్యముగా తీసుకొనబడలేదు. కొన్ని ప్రశ్నలుగల ఫారములను ప్రతివారికిని బంపి నిరుద్యోగులు వానిని నింపి పంపవలసిన దనిమాత్రమే కోరిరి. అట్లు చేయవలసి

లలో చాలతక్కువమందియే ఆ కాగితములను నింపి పంపిరి. విద్యావంతు లిట్లు చేయుట కప్పటి రోజులలో శాసనోల్లంఘనోద్యమ సందర్భమున ప్రజలకు ప్రభుత్వ ప్రయత్నములపట్లగల యనుమానములు కొంత కారణము కావచ్చును; అయినను ఈ యత్నమప్పటిలో నెరవేరనందులకు మనము చింతిల్లవలసి యున్నది. మొత్తముమీద నూటికి పదిమంది ప్రభుత్వమునకు తమ్ము గూర్చి వివరముల నిచ్చియుందు రని మన మూహించవచ్చును. ఈలెక్కల నాధారముగా గొని, మన మద్రాసురాష్ట్రమున ౧౯౩౧-వ సంవత్సరమున నిరుద్యోగసమస్య విద్యావంతుల విషయమున ఎంతవరకు వ్యాపించినదో కొంతవరకైనను తెలుసుకొనవచ్చును. గత జనాభా లెక్కలలో ఈవిషయమున చేయబడిన ప్రయత్నముల ఫలితము ౧-వ పట్టికలో పొందుపరచబడినది.

౧-వ పట్టిక

విద్యావంతులలో నిరుద్యోగము

విద్యా యోగ్యతలు	మొత్తము సంఖ్య	వయస్సు			
		౨౦—౨౪	౨౫—౨౯	౩౦—౩౪	౩౫—౩౯
౧. విదేశపు డిగ్రీలు [1]					
బ్రిటిషు డిగ్రీలు ...	౪	—	—	౨	౨
ఇతర డిగ్రీలు [2] ...	౧	—	—	—	౧
౨. హిందూదేశపు డిగ్రీలు					
వైద్యము [3] ...	౮	౩	౫	—	—
న్యాయము [4] ...	౮	౨	౬	—	—
వ్యవసాయము [5] ...	౧	౧	—	—	—
వర్తకము [6] ...	౫	౩	౧	—	౧
యం. ఏ. ...	౧౪	౮	౪	౧	౧
బి. ఏ. ...	౪౩౮	౨౫౮	౧౨౨	౨౦	౧౧
బి. ఎస్. సి. ...	౨	—	౨	—	—
బి. ఇ. ...	౩	౧	౧	౧	—
యల్. టి. ...	౧	—	౧	—	—
స్కూలు ఫైనలు [7] ...	౨౦౨౪	౧౪౧౭	౪౧౫	౧౩౬	౫౬
మొత్తము ...	౨౫౦౯	౧౭౨౦	౫౫౭	౧౬౦	౭౨

1 Foreign Degrees
2 Other Foreign Degrees
3 Medical Degrees
4 Legal Degrees
5 Agricultural Degrees
6 Commerce Degrees
7 S. S. L. C.

నిరుద్యోగులలో నూటికి పదిమంది చొప్పున ప్రభుత్వమునకు వివరములు పంపియుందు రను నూహప్రకారము ౧౯౩౧-వ సంవత్సరమునకే విద్యావంతులలో నిరుద్యోగులసంఖ్య ౨౯,౦౦౦ అని చెప్పవచ్చును.[1] ఒక్కమదరాసురాష్ట్రముననే ఇందరు చదువుకొనినవారు పనిలేక బాధపడుచుండగా దేశము మొత్తముమీద ఈ సంఖ్య ఎంత విపరీతముగా నుండునో వేరుగా చెప్ప నవసరము లేదు.[2] నిరుద్యోగులసంఖ్య పైయుంచనాను మించినను మించవచ్చును. గత పది సంవత్సరములలోను. విద్యావంతులసంఖ్య మరింత హెచ్చినది. ఈ సారి జనాభా లెక్కలలో సరియైన ప్రయత్నము చేసి వివరములు తెలుసుకొనినచో ఒక్కమదరాసురాష్ట్రముననే ౫౦,౦౦౦లవరకు విద్యావంతులగు నిరుద్యోగు లుండవచ్చును. పైపట్టికనుబట్టి విద్యావంతులగు యువకులలోనే నిరుద్యోగము హెచ్చుగా నున్నది. మొత్తము ౨౫౦౯ లో ముప్పదిసంవత్సరములలోపు వారు ౧౯౩౨, అనగా నూరింట ౭౭ పాళ్లు ఉన్నారన్నమాట. విద్యాయోగ్యతలనుబట్టి చూచినచో వైద్యము మొదలగు ప్రత్యేక వృత్తులకై చదివినవారిలో నిరుద్యోగము తక్కువేగాని స్కూల్ ఫైనలువరకు చదివినవారిలోను, బి. ఎ లలోను హెచ్చుగా నున్నది. పైపట్టికలో స్కూలుఫైనలు చదివినవారు నూరింట ౮౧ పాళ్లు; బి. ఎలు నూరింట ౧౭ పాళ్లు; మిగిలిన రెండుపాళ్లును ఇతరులు. ఈమధ్య స్వదేశమున విద్య నేర్చుకొనినవారి సంఖ్యయేగాక విదేశములలో విస్తారవ్యయమునకు లోనై విద్యనేర్చుకొనినవారిసంఖ్యకూడ బాగుగా హెచ్చినది. అట్టివారిలోగూడ నిరుద్యోగము అధికముగు చున్నది.

సాధారణపు ప్రజలలోను పాటకపు వర్ణములోను నిరుద్యోగత ఒకయెత్తు; విద్యావంతులలో నిరుద్యోగ మొకయెత్తు. విద్యావంతులలో నిరుద్యోగము దేశక్షేమమునకును శాంతికిని భంగకరము. పాటకపు వర్ణము కష్టముల కలవాటు పడియుండుటచే కొంతవరకైనను సర్దుకొనగలదు కాని విద్యావంతు లొకరకపు సౌకర్యముల కలవాటుపడియుండుటచే వారికి నిరుద్యోగమువలన అసంతృప్తి హెచ్చుగా నుండును. ప్రస్తుత విద్యావిధానమును మార్చుటచేగాని, విద్యావంతులకు నూతనావకాశములను గలుగజేయుటచేగాని ఈసమస్యను పరిష్కరించుటవసరమైయున్నది. మనరాష్ట్రమున నిరుద్యో

1. ఈ యూహ సరియైన దనియే చెప్పవచ్చును. ఆమధ్య మదరాసుప్రభుత్వపు పారిశ్రామికశాఖవారి (Industries Department) యాజమాన్యమున మచ్చునకు కొన్ని గ్రామములలో వివరములు తీసుకొనబడినపిదప ఆరు జిల్లాలలో విద్యావంతులగు నిరుద్యోగు లెందరుందురో అంచనావేయబడినది. ఈ యంచనాల సందర్భమునగూడ నూటికి పదుగురుకంటె ఎక్కువమంది వివరముల నిచ్చియుండలేదని చెప్పవచ్చును.

2. కొలదికాలముక్రిందట సప్రూకమిటీవారు సంయుక్తరాష్ట్రములలో ఈ సమస్యనుగూర్చి విచారణ సలిపి యొక నివేదికను తయారుచేసిరి. వారిచ్చిన లెక్కలప్రకారము ఒక్క సంయుక్తరాష్ట్రములలోనే ౨౫౮౧౬ మెట్రిక్యులేటులును, ౧౩౬౩౩ ఇంటర్మీడియేటుపరీక్ష ప్యాసయినవారును, ౯౩౦౦ బి. ఎ. లును ౧౯౨౨ యం. ఎ. లును మొత్తము సుమారు ౫౦౦౦౦ లమంది పనిలేకుండ [illegible]

గలుగు విద్యావంతులలో ఎక్కువభాగము వ్యవసాయదారుల కుటుంబములకును చిన్న యుద్యోగుల కుటుంబములకును చెంది యున్నారు; విద్యావిధానమును మార్చిననేగాని యిట్టివారిసంఖ్య పెరుగకుండ నిలుపుచేయుటకు వీలుగాదు. మనపాఠశాలలలోను, విద్యాలయములలోను గరపబడువిద్య ప్రస్తుతము ప్రత్యేకలక్ష్యము లేనిదిగా నున్నది. పరీక్షలలో గెలుపొందుట, పట్టాలు పుచ్చుకొనుట- ఇంతటితో ఈవిద్య పరిపూర్ణ మగుచున్నది; అంతేకాని విద్యార్థుల భావిజీవనాధారముగా నిది పరిణమించుటలేదు. ఈ విద్యయే యుపయోగించవలెననిచో నది వృత్తిప్రాధాన్యము గావలెను. సాధారణ జ్ఞానముతో పాటు ఏదో నొక వృత్తియందు కూడ విద్యార్థులు మంచిప్రవేశము గనవలెను. అప్పుడుకాని విద్య జీవనోపాధికి సహాయకారి కాజాలదు.

విద్యావిధానముయొక్క దృష్టి పైన చెప్పినరీతిని వృత్తులపైకి మరలించిన పిదప, చదువుకొనినవారికి ఇప్పుడున్న యవకాశములను విస్తరింపజేయుటలో కొంత ప్రయోజన ముండగలదు. ప్రభుత్వము ప్రాథమిక విద్య, వైద్యసహాయము మొదలగు ప్రజోపయోగకరములగు విషయములయం దెక్కువ శ్రద్ధ వహించి వానిని విస్తరింపజేయవలెను. గత జనాభాలెక్కలనుబట్టి మదరాసురాష్ట్రమున[1] ౫ మొదలు ౧౫ సంవత్సరములకు లోపగు వయస్సువారు ౫౮,౬౫,౦౦౦ల బాలురును, ౫౬,౭౯,౦౦౦ల బాలికలును ఉన్నారు. వీ రెల్లరకును సరియైన పద్ధతిని ప్రాథమికవిద్య గరపవలె ననిన చో ఇరువదిమంది కొకయుపాధ్యాయుని వంతున ౫,౬౭,౨౦౦ మంది యుపాధ్యాయు లవసర ముందురు. పై నీయబడిన బాలబాలికల సంఖ్యలో ఏకోలదిమంది మాత్రమో ఇప్పుడు విద్య నభ్యసించుచుండుటచే నిర్బంధ ప్రాథమిక విద్యావిధానము అమలులోనికి వచ్చిన చో, ఎంతమందివిద్యావంతులకు నూతనావకాశములు లభించునో మన మూహించుకొనవచ్చును. ఇంకొక విధముగా చూచినచో మనరాష్ట్రమున ౫౦౦౦ ల జనాభాకు తక్కువగల గ్రామములు మొత్తము ౫౨,౩౮౦ ఉన్నవి. ఇందు సగటున గ్రామమునకు ముగ్గురు ఉపాధ్యాయులను చూచుకొనినను సుమారు రెండులక్షలమంది యుపాధ్యాయు లవసర ముందురు. ఇట్లే వైద్య సహాయమును విస్తరించుటవలనగూడ నిరుద్యోగమును కొంతవరకు బాపవచ్చును. ఇప్పుడు వైద్యసహాయము మన దేశము నందలి గ్రామములలో చాలవర కందుబాటులో లేదు. మదరాసురాష్ట్రవిషయ మాలోచించినచో పైగ్రామములలో నైదింటి కొక వైద్యశాలయు, వైద్యుడును ఏర్పరుపబడినను ౧౦,౦౦౦ల వైద్యులును, వారికి తోడింకొక ఇరువదివేలకాంపౌండర్లు, నర్సులు మొదలగు వారును అవసర మగుదురు. ఇట్లే ఇతర విషయములలోగూడ ప్రజాసౌకర్యములను వృద్ధినొందించినకొలదిని విద్యావంతులకు ఉద్యోగావకాశము లెక్కువ కాగలవు. కాని ఒక్కవిషయముమాత్ర మీ సం

---

1. మదరాసురాష్ట్రమునుగూర్చి ఇం దీయబడిన లెక్కలన్నియు ౧౯౩౧-వ సంవత్సరపు జనాభాలెక్కలలోని వగుటచే నిప్పుడు ఒరిస్సాలోచేరిన భాగములుకూడ ఇందు చేరియుండును.

దర్భమున గుర్తించుకొనవలెను. విద్యావిధానమును మార్చనిదే ప్రాథమికవిద్యను విస్తరింపజేయుటవలన చిక్కులు రాగలవు. ప్రాథమికవిద్యతో బాటు వృత్తిసంబంధమగు విద్య గరపబడనిచో విద్యావంతులసంఖ్యతో బాటు నిరుద్యోగుల సంఖ్యకూడ వృద్ధికాగలదు. విద్యావిధానములో మార్పు, ప్రాథమికవిద్యావ్యాప్తి- ఈ రెండును ఏకకాలముననే జరుగుటయు, తన్మూలమున ప్రజలదృష్టి ఉద్యోగములమీదనుండి వృత్తులపైకి మారుటయు అత్యవసరము.

ఇక సాధారణప్రజలలో నిర్వ్యాపారతనుగూర్చి కొంచె మాలోచింతము. ఈ విషయమై మన కాధారములు తక్కువయనియు జనాభాలెక్కలు తప్ప వేరేమియును లేవనియు నిదివరకే చెప్పియుంటిని. జనాభాలెక్కలలోనైనను ఉద్యోగవిషయముకంటె వృత్తివిషయమునకు ప్రాధాన్య మెక్కువ. వృత్తియును, వ్యాపారమును ఒకటికాజాలవు. జనాభాలెక్కలనుబట్టి ఒకవృత్తి నవలంబించుచున్నవారందరకును ఆ వృత్తియందు సంపూర్ణమగుపని లభించుచున్నదియు లేనిదయు తెలియజాలదు. ఈ విషయమై మనకు సరియగు సమాచారము తెలియవలె ననినచో ఇదివరకు జనాభాలెక్కలలో కులము, మతము మొదలగు విషయములకు అనవసరముగా నీయబడుచున్న విశేష ప్రాముఖ్యమును తగ్గించి రాబోవు లెక్కలలో ఉద్యోగమునకును, ఆర్జనకును మంచి స్థాన మొసగవలయును.

పారిశ్రామికాభివృద్ధి మన దేశమున విశేషముగా లేకపోవుటచే సాధారణ ప్రజలలో నిరుద్యోగసమస్య పైకి కన్పట్టుటలేదని పైన చెప్పియుంటిని.[1] అయినను ఆనాటికానాడు పరిశ్రమలవిషయమున మనము ముందునకు సాగిపోవుచుండుటచే కొలదికాలములో ఈ రకపు నిరుద్యోగముకూడ పైకి పొక్కగలదు. పరిశ్రమ లభివృద్ధిపొందు టవసరమే; కాని ఎచ్చట జూచిన నచ్చట గొప్పయంత్ర పరిశ్రమలు దేశమునం దెల్లెడలను అభివృద్ధిపొందుట మన కెక్కువ క్షేమకరము కాదు. ఏమన యంత్రశాలలో పనిచేయుట కొకనికి అవకాశము గలిగినచో పదిమందిపని పోయి వారికూడు పడిపోవుట తటస్థించును. కాబట్టి చిన్న చిన్న యంత్రాగారములవలననే మన పరిశ్రమలను వృద్ధినొందించుకొన జూడవలెను.

సమగ్రమగు లెక్కలు లేకుండుటచే సాధారణప్రజలలో నిరుద్యోగు లెంద రుందురని చెప్పుటకు కొంచెము సందేహించవలసియున్నది. అయినను గత జనాభాలెక్కలలో

1. పారిశ్రామికులలోగూడ మన దేశమున నిరుద్యోగము లేకపోలేదు. కాని మనదేశమున యంత్రాగారములలో పనిచేయుచున్నవారిలో చాలమంది వ్యవసాయముతోను గ్రామములందు సందర్భమను వృత్తులతోను తమకుగల సంబంధమును పూర్తిగా త్రెంచుకొనకపోవుటచే, నిరుద్యోగము ప్రాప్తించినపుడెల్ల వారు పట్టణములను మిల్లులను విడిచి తిరిగి గ్రామములు చేరుచుందురు. ఇందువలన వ్యవసాయికులలో నిరుద్యోగము హెచ్చుటయు పారిశ్రామికులలో నిరుద్యోగము పైకి కన్పట్టకపోవుటయు సంభవించుచున్నది. ఇట్టివా రందరును లెక్కకు వ్యవసాయమే వృత్తిగాగలవా రగుదురు. పెద్ద పెద్ద యంత్రాగారములలో సమ్మెలు వచ్చినప్పుడెల్ల పనివారం

మన రాష్ట్రమునుగూర్చిన వివరములను దీసి కొని కించిద్యత్నము చేసి చూడవచ్చును. ౧౯౩౧-వ సంవత్సరమునందు మన రాష్ట్రమున మొత్తము ౪,౭౧,౯౩,౦౦౦ ప్రజలుండిరి. ఇందు ౨,౩౩,౦౧,౦౦౦ పురుషులు, ౨,౩౮,౯౨,౦౦౦ స్త్రీలు. వీరిలో సాధారణముగా పనిచేయఁగలిగినవారు ౧౫ మొదలు ౬౦ సం॥రముల వయస్సువారై యుందురు. ౧౫ సంవత్సరముల లోపువారిలో కొందరును, ౬౦ సంవత్సరములకు పైబడినవారు కొందరును పనిచేయుట కలదు. కాని సాధారణముగా నట్టి దరుదు. కావున మనము ౧౫-౬౦ సంవత్సరముల వయసు గలవారిని మాత్రమే లెక్కకు తీసికొనినచో నట్టివారు ౧,౩౦,౧౨,౦౦౦ పురుషులును, ౧,౩౬,౨౮,౦౦౦ స్త్రీలును ఉందురు. అందునను పనిచేయుట కసమర్థులగు పంగ్వంధాదులగు దుర్బలుల సంఖ్య తీసివేసిననేగాని పనిచేయుటకు శక్తిమంతులగు వారిసంఖ్య నికరముగా తేలజాలదు. ౧౫-౬౦ లోపుగల దుర్బలులసంఖ్య తీసివేసినచో మన రాష్ట్రమున పనిచేయుటకు శక్తిగల, పురుషులసంఖ్య ౧,౨౯,౫౮,౦౦౦, స్త్రీలసంఖ్య ౧,౩౫,౯౧,౦౦౦ అని తేలును. వీరందరకును పూర్తిగా పనిదొరకుచున్నదా యను విషయము తెలుసుకొనుటకుగాను జనాభా లెక్కలలోని మరియొక వివరము నెత్తుకొనవలసియున్నది. ప్రతిజనాభా లెక్కలందును ఆర్జకు లెందరున్నారో చూపించబడును. తమకుగాను సంపాదించుకొను వారును, తమ్ము పోషించువారికి ఏకొలదియో సంపాదించి ఇచ్చి సాయపడువారును ఈ లెక్కలలో ఆర్జకులుగా నెన్నబడుచున్నారు; ఇందు మొదటిరకమువారు తాము సంపాదించి ఇతరులను పోషింతురు; రెండవరకము వారు తాముగూడ ఏస్వల్పమో సంపాదించి తెచ్చి మొదటిరకమువారిచే పోషింపబడుచుందురు.[1] ఆ సంఖ్య లీక్రింద నీయఁబడినవి.

౧౯౩౧-వ సంవత్సరము

		పురుషులు	స్త్రీలు
ఆర్జకులు	...	౧,౨౮,౮౪,౦౦౦	౫౨,౦౫,౦౦౦
ఉపజీవులు	...	౯,౩౫,౦౦౦	౪౧,౪౦,౦౦౦
మొత్తము సంపాదకులు.	...	౧,౩౮,౧౯,౦౦౦	౧,౨౩,౪౫,౦౦౦

పైపద్ధతి ప్రకారము పనిచేయఁగల వారిలో పురుషులసంఖ్య ౧,౨౯,౫౮,౦౦౦ అయియుండగా సంపాదకులసంఖ్య ఈ లెక్క ప్రకార మంత కెక్కువగా నున్నది. అనగా ౧౫ సం॥రముల వయస్సుకు లోఁబడు బాలురును అరువది సంవత్సరములకు పైబడిన వృద్ధులగు కొందరును, జీవనోపాధికై ప్రాకులాడుచు తాము పనిచేయఁజాలని వయస్సులోకూడ పాటుపడుచున్నా రన్నమాట. ఇక స్త్రీల విషయ మన్ననో పనిచేయఁగల స్త్రీలసంఖ్య ౧,౩౫,౯౧,౦౦౦ కాగా సంపాదించుకొనుచున్నవారి సంఖ్య ౧,౨౩,౪౫,౦౦౦ అని

1. Earners and Working dependents—ఆర్జకులు, ఉపజీవులగు ఆర్జకులు.

తెలియుచున్నది. స్త్రీలలో సంపాదించుకొను వారి సంఖ్య ఈవిధముగా తక్కువగా నుండుటకు కారణము, సాధారణ గృహస్థుల ఇండ్లలోని స్త్రీ లందరును సంఘగౌరవముకొరకు గృహకృత్యనిర్వహణమే తమపని యని చెప్పుకొనుట కావచ్చును.

పనిచేయుటకు శక్తిచాలని వయస్సుగల బాలకులు కొందరును, వయసుమీరిన వృద్ధులు కొందరును పనిచేయుచున్నారని తెలుసుకొనుటవలన, అర్హులుగా చూపించబడినవా రందరకును సంపూర్ణ మగు పని దొరకుట లేదని చెప్పవలసియున్నది.

హిందూదేశమున మొత్తముమీద నూటికి ౭౦ మందికి పైగా వ్యవసాయము పైననే ఆధారపడియున్నారు.[1] మన రాష్ట్రమున వ్యవసాయమే ప్రధాన వృత్తియగుటచే నిచ్చటగూడ వ్యవసాయము పై నాధారపడియుండువారి సగటుసంఖ్య యింతకు తీసిపోదని యెంచుకొనవచ్చును. ౧౯౩౧-వ సంవత్సరపు లెక్కలను తీసుకొందుమేని మొత్తము పని చేయగలవారిసంఖ్యలో ౧,౮౬,౮౪,౦౦౦ వ్యవసాయముపై నాధారపడియున్నా రని చెప్పదగును. వ్యవసాయకులకు సాలునకు నాలుగుమాసములు పని లేకుండు నని మన మనుకొనుట సత్యదూరము కాజాలదు. అట్లయిన పనిలేనివారిసంఖ్య ౬౧,౯౬,౦౦౦ లని తేలును. కాని స్త్రీలలో నందరును వ్యవసాయపుపని చేయరు. అట్టివారు మొత్తములో నాల్గవవం తుందురని చెప్పవచ్చును. ఆకారణమున ౨౩,౭౬,౦౦౦ స్త్రీల సంఖ్య పైసంఖ్యనుండి తీసివేసి సాలు మొత్తముమీద పనిలేనివారు వ్యవసాయకులలో ౩౮,౧౯,౦౦౦ లని తేల్చవచ్చును. కాబట్టి ఎంత జాగ్రత్తగా అంచనా వేసినను సాలునకు ౨౫ లక్షల వ్యవసాయకులకు మదరాసు రాష్ట్రమున పని లభించుట లేదని చెప్పవలసియున్నది.

పై సంఖ్యలకు తోడు యంత్రపరిశ్రమ లభివృద్ధి నొందుచుండుటచే తమ వృత్తులను గోల్పోవుచున్నవారి సంఖ్య నందు చేర్పవలసియుండును. పదుగురను పాడొనర్చి యొకనికి సాయపడుట యంత్రముయొక్క నైజము. ఆ పదిమందియు తమవృత్తి నశించుటచే నితరవృత్తులలో చేరుటగాని నిరుద్యోగులై బాధపడుటగాని జరుగక తప్పదు. ఈవిధముగా నెందరు తమ వృత్తులను గోల్పోవుచున్నారో తెలుపుటకుగాను మదరాసురాష్ట్రమునకు సంబంధించిన జనాభా లెక్కలనుండి కొన్నియంకె లీ ౨-వ పట్టికలో నీయబడినవి. ౧౯౩౧-వ సంవత్సరపు స్థితి ౧౯౨౧-వ సంవత్సరముతో పోల్చి చూచినచో నీ విషయ మవగత మగును.

---

1. పూర్వము విదేశములకు వలసపోయి ఆదేశములలో తమపై ప్రబలిన ద్వేషమువలన స్వదేశమునకు తిరిగి వచ్చినవారును, వెడలగొట్టబడినవారు తండ్రితాతలనాటి గ్రామముల నాశ్రయించి వ్యవసాయికులుగనే లెక్కకు వచ్చుచున్నారు. ఈ మధ్య ఇట్టివారిసంఖ్య బాగుగ పెరిగిపోవుచున్నది. దక్షిణాఫ్రికాకుతోడు బర్మాలోను, సింహళములోనుగూడ మనవారిని వెడలనడచుటకు యత్నములు జరుగుచున్నవి. వీరిని వ్యవసాయికులుగా నెంచుట సరికాదు. వలసనుండి తిరిగివచ్చిన నిరుద్యోగులుగానే వీరిని చూపించు టవసరము.

౨-వ పట్టిక

ఇందలి సంఖ్యలు వేలలో నీయబడినవి.

పరిశ్రమ లేక వృత్తి	౧౯౩౧			౧౯౨౧			తగ్గుదల
	పురుషులు	స్త్రీలు	మొత్తము	పురుషులు	స్త్రీలు	మొత్తము	
పరిశ్రమలు							
బియ్యము దంపుట ...	౧౨	౩౯	౫౧	౧౯	౫౭	౭౬	౨౫
కల్లుగీత ...	౯౬	౭	౧౦౩	౧౦౬	౨	౧౦౮	౫
ఇండ్లు కట్టుట వగైరా ...	౧౧౫	౨౨	౧౩౭	౧౭౯	౧౦౧	౨౮౦	౧౪౩
వర్తకము							
బ్యాంకులు ...	౨౮	౯	౩౭	౩౩	౧౧	౪౪	౭
తోళ్లు ...	౧౩	—	౧౩	౧౫	౩	౧౮	౫
రాసాయనికములు ...	౪	౧	౫	౭	౨	౯	౪
బట్టలు, సౌందర్యపోషక పదార్థములు వగైరా ...	౧౨	౧	౧౩	౩౮	౬	౪౪	౩౧

పైసంఖ్యలనుబట్టి పరిశ్రమలందును వ్యాపారమునందునుగూడ నిరుద్యోగు లెట్లధిక మగుచున్నారో తెలియగలదు.

౧౯౨౧-వ సంవత్సరముతో పోల్చి చూచినచో బియ్యము దంపువారి సంఖ్య ౧౯౩౧-వ సంవత్సరమునాటికి ౨౫ వేలవరకును తగ్గినది. ఈసంఖ్య ఇప్పటికిని తగ్గి యుండవలెను. ధాన్యపుమర లభివృద్ధిని పొందినకొలదిని పాటకపుజనము లోసైతము స్వోపయోగమునకు బియ్యము దంపుకొనుట తగ్గిపోవుచున్నది. ఈ మధ్య దంపుడుబియ్యమునుగూర్చి ప్రజలలో నొకింత సదభిప్రాయము కలిగినను అది ఈవృత్తిలో నిరుద్యోగుల సంఖ్య నరికట్టజాలదు. కల్లుగీతలో తగ్గుదల ౫ వేలు మాత్రమే కాన్పించినను, ఈసంఖ్య

చున్నవి. కాంగ్రెసువా రధికారములో నున్నప్పుడు మద్యనిషేధమును తమయాశయముగా నుంచుకొని అందులకై విశేషముగా యత్నించిరి. ఈయత్న మిప్పుడు గాకపోయినను ఇకముందైనను ఫలింపవచ్చును. ఇందువలన దేశమందంతటను కల్లుగీయువారెందరో తమవృత్తిని గోల్పోవుదురు. వీరందరికిని వేరువృత్తి చూపించవలసియున్నది. పైపట్టికయందు చూచాయగ కొన్నిటినిగూర్చి మాత్రమే లెక్క లీయబడినవి. ౧౯౩౧-వ సంవత్సరమునందలి తగ్గుదలలో కొంతభాగము అప్పటి కప్పుడే ప్రారంభించిన ఆర్థికదురవస్థయొక్క ఫలితము కావచ్చును. ఆర్థికపరిస్థితులు మంచికి మారినకొలదిని వీరిలో కొందరైనను తిరిగి పనిని సంపాదించుకొనవచ్చును; కాని, నిరుద్యోగుల సంఖ్యమాత్రము ఆర్థికపరిస్థితులకంటె

వేరుకారణములచే వృద్ధి నొందుచున్న దని చెప్పక తప్పదు.

సాధారణప్రజలలో నిరుద్యోగమును తగ్గించుటకుగాను గృహపరిశ్రమల నభివృద్ధి చేయు టత్యావసరము. మన దేశమునందలి వ్యవసాయకుల దృష్టిని, అల్పాదాయముతో, ఎక్కువనే ధనసరము లేకయే తాము తీరికగా నున్నప్పుడు చేసుకొనగలిగిన పనుల పైకి మరలింపవలసియున్నది. అట్లయినచో వారు తమ ముఖ్యవృత్తిని గోల్పోకుండ అదనపురాబడి నార్జించుకొనగలుగుదురు. క్రొత్తగా స్థాపింపబడబోవు పరిశ్రమలవిషయమునం దీయంశమునుగుర్తుంచుకొనవలెను. సాధ్యమగునంతవరకు పారిశ్రామికసంస్థలు చిన్నవిగానుండి దేశమం దంతటను విరివిగాస్థాపింపబడవలెను. నిరుద్యోగసమస్యను పరిష్కరించుటకుగాను ప్రభుత్వ మవలంబింపదగిన విధానము ప్రజోపయోగమగు కార్యములను విస్తరింపజేయుట[1] ఈకాలమున చాల దేశములలో ప్రభుత్వము నిరుద్యోగులకు పని చూపించుటగాని, లేనిచో వారిని పోషించుటగాని తన విధిగా నెంచుకొను టాచారమైనది. ఈ సమస్య తీవ్రరూపమును దాల్చుటకు ముందే మనప్రభుత్వము దాని నరికట్ట యత్నించుట మంచిది.

తుదకు తేలిన పర్యవసాన మిది: హిందూదేశమున నిరుద్యోగము ప్రబలుచున్నది. విద్యావంతులలో నిరుద్యోగమును విద్యావిధానమును మార్చియు, విద్యావంతుల కవకాశములను హెచ్చించియు పరిష్కరించవలసిన యావసరము వచ్చినది. సాధారణ ప్రజలలో గూడ నిరుద్యోగము హెచ్చుగనే యున్నది. కాని దేశమునందు చాలమంది వ్యవసాయకు లగుటచేత నది ఇంకను పైకి కనపడుట లేదు. అట్లని దానిని త్రోసిపుచ్చుటకు వీలు కాదు. ప్రభుత్వము తగినంత ప్రయత్నము చేసినచో నట్టివారందరకును పూర్తిగా పని చూపించుటకు తగిన యవకాశము లున్నవి. పరిస్థితులు విషమించకముందే ప్రభుత్వ మీ విషయమున శ్రద్ధ వహింపవలెను.

నిరుద్యోగసమస్యను మనఃపూర్తిగా నెదుర్కొనుటకు ముందు ఈ విషయమై సరియైన వివరములను సేకరించి నిరుద్యోగుల సంఖ్యను, నిరుద్యోగము ప్రబలియున్న తావులను వృత్తులను జాగ్రత్తగా తెలుసుకొనవలసియున్నది. ఈసమస్యయొక్క నిజరూప మవగత మయిననే తప్ప దానిని పరిష్కరించుట కవలంబించవలసిన విధానమును నిశ్చయముగా నిర్ణయించుటకు వీలు గాదు. ప్రభుత్వము రాబోవు జనాభా లెక్కలలో నీ యంశమును గుర్తుంచుకొని వ్యయమునకు వెనుదీయక, అనవసర వివరములను మానివేసియు నూతన వివరములను దీసుకొనుటకు యత్నించియు నిరుద్యోగు సంఖ్యను దాని వివరములను తెల్పుట కత్యవసరమై యున్నది.

---

1. కరువు వచ్చినప్పుడెల్ల ప్రభుత్వ మేదియో కొన్ని నూతన నిర్మాణములను ప్రారంభించి ప్రజలకు సాయపడుచున్నది, కాని యంతమాత్రము చాలదు. సాధారణముగా నిరుద్యోగమును తగ్గించుటకుగాను ప్రభుత్వము ప్రజానుకూలములగు క్రొత్త పనులను విరివిగా చేయుచుండవలెను.

రష్యా ఫిన్లాండుల యుద్ధము

సింహావలోకనము

శ్రీ గో. వెం. కృష్ణారావు

ఐరోపాఖండమందు పోలండుపై జర్మనీ ప్రారంభించిన యుద్ధము నేడు రెండవ ప్రపంచమహాసంగ్రామముగ మారుచున్న దని చెప్పవచ్చు. చిన్న రాజ్యాలపై జర్మనీ మొదలుపెట్టిన దాడులకు రష్యా దోహద మొసగుటయే గాక వానిలో పాల్గొనుటకు కూడ సంసిద్ధత కనపరుస్తున్నది. ఆష్ట్రియా, జెకోస్లవోకియా, పోలండుల స్వాతంత్ర్యమును జర్మనీ నాశనము గావించినది. నేడు రష్యా ఫిన్లాండుపై అక్రమదాడి గావించి, ఆ దేశపుస్వాతంత్ర్యము నపహరింప ప్రయత్నిస్తున్నది. చిన్నరాజ్యాల స్వాతంత్ర్య రక్షణమునకు కంకణము కట్టుకున్నాననీ, కార్మిక, కర్షక ప్రపంచమునకు నాయకత్వము వహించి వారిని బానిసవిముక్తుల గావించుటకు ప్రయత్నించెదననీ ప్రకటనము గావించిన సోవియటురష్యా నేడు సాంఘిక వాదమునకు స్వస్తి చెప్పి, వక్రమయిన జాతీయోద్యమ మార్గమున నడచుట విషాదకరము. లెనిన్ ఆశయములను స్టాలిన్ త్రోసిరాజని, పూర్వపుజారుచక్రవర్తులపథమునే అనుసరించుటకు నిశ్చయించుకున్నట్లు స్పష్టపడుచున్నది.




సర్వసేనాని మేనర్ హీమ్

ఫిన్లాండు స్వాతంత్ర్యసంపాదనకు గావించిన కృషి నిరుపమానము. చిన్నరాజ్యమగు ఫిన్లాండు ప్రాచీనచరిత్రను పరిశీలించినయెడల సామ్రాజ్యవాదము ఎట్టికాలపరిస్థితులందైనను ఒక్కటే మార్గమున నడచుననీ, స్వతంత్రులను బానిసలుగ మార్చుటకు ఒక్కటేవిధమగు నిర్బంధముల ప్రయోగించుననీ వ్యక్తపడును. ఇప్పుడు ఫిన్లాండు రష్యాలమధ్య జరుగుచున్న యుద్ధమును గురించి చర్చింపకపూర్వము ఫిన్లాండు ప్రాచీనచరిత్రను అవగాహనచేసికొనుట అవసరము.

ప్రాచీనచరిత్ర

౧౨-వ శతాబ్దమునుండి ౧౮౦౯-వ సంవత్సరమువరకును ఫిన్లాండు స్వీడనురాజ్యములో ఒకభాగముగ నుండెను. ౧౨-వ, ౧౩-వ శతాబ్దములందు ఫిన్లాండులో పరిస్థితు లెట్లున్నదియు దెల్పు చారిత్రకగ్రంథములు లేకుండెను. అప్పటికి జాతీయోద్యమవాదము యింకను తలయెత్తలేదు. స్వీడనుతో కలిసి యున్నప్పటికీ ఫిన్లాండుదేశీయుల రాజకీయహక్కులకెట్టి నష్టము గల్గలేదు. ౧౩౬౨-వ సంవత్సరమందు స్వీడను దేశీయులతోపాటు రాజును ఎన్నుకొను ఎన్నికలలో ఫిన్లాండు పాల్గొనినది. స్వీడనుతోపాటు సమాన


హక్కులు కల్గియున్నప్పటికిని రెండు జాతులమధ్య అప్పుడప్పుడు సంఘర్షణలు సంప్రాప్తిస్తూ వచ్చాయి. ఫిన్లాండు దేశీయులు స్వీడను రాజ్యమందలి వివిధ రాష్ట్రములందును నివసించుటచే అల్ప సంఖ్యాకుల స్థితిలో నుండటంవలన వారికి రాజ్యాంగవ్యవహారము లందు పలుకుబడి చాలతక్కువయ్యెను. అదిగాక స్థానిక విషయములందు ఫిన్లాండు దేశీయులు తమ యిష్టము వచ్చినటుల ప్రవర్తించటానికి స్వీడను అనుమతించ లేదు. యుద్ధప్రకటనమునగాని, పన్నుల విధించుటలో గాని ఫిన్లాండు దేశీయులు తమ



అభిప్రాయముల దెల్పటానికి, అధికారులు సూచించు నిర్ణయముల విచారించటానికి అవకాశము లేకుండెను. ఫిన్లాండుపరిపాలనకు స్వీడనుజాతీయులను అధికారు లుగ నియమించటంవలన ఫిన్నులలో (ఫిన్లాండు దేశీయులలో) అసంతృప్తి తీవ్రముగ ప్రబలినది. నామకః స్వీడనుతోపాటు సమానహక్కులు కల్గియున్నప్పటికీ ఫిన్లాండు ఒక శాసితరాజ్యముగనే పరిపాలింపబడెనని చెప్పాలి.

జాతీయ భావాంకురము

ఫిన్లాండు స్వీడనుతో కలిసియున్న కాలమందు ఫిన్నులలో స్వభాషాభిమానము కల్గుటయు, స్వభాషోద్ధరణకు ప్రచారము జరుగుటయు ప్రారంభ మయ్యెను. ఏలపాటలు, పురాణగాథలు సమకూర్చుట కును, ఫిన్నుల ప్రాచీనజాతీయతయొక్క మహోత్కృష్టతను నిరూపించుటకును, ఆరోజులలో హెన్‌రిక్ గబ్రీల్ పోర్తాన్ గొప్పకృషిసల్పాడు. ఫిన్నుల సారస్వతమును అభివృద్ధిపరచుటయే కాకుండ పోర్తాన్ తన జాతీయచరిత్రమును చక్కగా వ్రాసి, నిద్రపోవు చున్న ఫిన్నులను లేవగొట్టి, జాతీయతాభావమును నలుగడల వ్యాపించునట్లు చేశాడు. అతనికృషి మూలాన్నే ఫిన్నులు స్వజాతీయౌన్నత్యమును గుర్తించి, తమ ప్రత్యేకతను కాపాడుకొనుటకు కృషి సల్పినారు. ఆరు శతాబ్దములు స్వీడనుతో ఫిన్లాండు కలిసియున్నప్పటికిని రెండు రాజ్యాలమధ్య సంయోగముగాని ఐక్యముగాని యేర్పడలేదు. ఫిన్నులజాతీయ తను నాశనము గావించుటకు స్వీడను చేసిన ప్రయ



హెల్సింకి, హార్బరు

త్నము లన్నియు నిష్ఫలము లయినాయి. ౧౮౦౮-౯ సంవత్సరమందు స్వీడెను రష్యాలమధ్య యుద్ధము జరిగెను. ఆ యుద్ధమందు స్వీడెను ఓడిపోవుటవలన ఫిన్లాండును రష్యాకు దానము చేసింది.

రష్యా పరిపాలన


ఫిన్లాండు రష్యారాజ్యమం దొకభాగముగ యేర్పడినపుడు ప్రథమంలో స్థానికవిషయములందు స్వాతంత్ర్యము కల్గియుండెను. వ్యవసాయమే వారి ముఖ్యపరిశ్రమ. రాకపోకలకు సౌకర్యాలు తక్కువ. నవీనపద్ధతులపై కాలువలు, రైళ్లు అప్పటికి యేర్పడ లేదు. వ్యవసాయముకూడ పూర్వపద్ధతులపై నడపుటచే తన్నుదాను పోషించుకోడానికి మాత్రమే అర్హత కల్గి యున్న రాజ్య మగుటవలన, జనాభా యెక్కువై దుర్భిక్షము సంప్రాప్తించినపుడు అనేకవేలమంది తిండిలేక చనిపోయెడివారు. ఫిన్లాండు అడవులమయము. కలప కావలసినంత దొరుకును. అప్పటికి ఆర్థికముగ లాభకరమగు యీ పరిశ్రమ అంత అభివృద్ధి పొందలేదు. అచ్చటచ్చట యినుపగనులు గలవు; కాని అప్పటికి యినుముపరిశ్రమకూడ నవీనపద్ధతులపై నడుపబడలేదు. పరిపాలనావిషయములందు పూర్వము స్వీడెనుతో కలిసియున్నపుడు అమలులో నున్న రాజ్యాంగమునే తాత్కాలికముగ రష్యాకూడ అమలులో పెట్టినది.

౧౮౦౨౫ సంవత్సరమందు అలెగ్జాండరు దిఫస్టు ఫిన్లాండు అధిపతి యయ్యెను. తరువాత మొదటి నికలాస్ రాజ్యపరిపాలన గావించెను. అతని కాలమందు ఫిన్నుల జాతీయతను నాశనము గావించుటకు కనేక ఎత్తులు వేయబడెను. ఫిన్నుల భాషను త్రోసివేసి, వారికి పాఠశాలలలో రష్యన భాషను నేర్పవలె నను ప్రయత్నాలు జరిగెను. ఈ ప్రయత్నాలకు కొందరు ఫిన్ను నాయకులు దూరాలోచన లేకుండ తోడ్పడిరి. వారి ప్రాపవ్వదృపూర్ణమగు పనివలన జనసామాన్యమునకు తరగతులకు మధ్య విభేదములు యేర్పడుటకు అవకాశము కల్గెను. కాని కవియు, చరిత్రకారుడును, వార్తాపత్రిక రచకుడును అగు ఆడల్ఫ్ ఇవాన్ ఆర్విడ్సన్ రష్య గావించు ప్రయత్నాలకు ప్రతికూలంగా ప్రచారం చేశాడు. స్వీడెనునుండి ఫిన్లాండు విడిపోవుట నొప్పజాతీయ దుర్దినమని అతడు స్వదేశీయు


లను నచ్చజెప్పాడు. తన పత్రికయను "అబోమార్నింగ్ న్యూస్" ద్వారా ఫిన్లాండుయొక్క స్థితిగతులను వివరిస్తూ, ఆ దేశపు భవిష్యత్తు స్వభాషోద్ధరణపై ఆధారపడియుం దని స్పష్టపరిచాడు. స్వభాషోద్ధరణకు తరగతుల వారిని జనసామాన్యమును కలుపవలె ననియు, ఫిన్నుల భాషయే జాతీయభాషగ పరిగణింపవలె ననియు, స్వభాషోద్ధరణకు పట్టుదల గన్పరచనియెడల ఫిన్నుల జాతీయత నాశనము పట నిశ్చయమనియు ఘంటాపథముగ ప్రకటించాడు. స్వభాషోద్ధరణపై ఆధారపడియున్న జాతీయోద్యమమే ఎట్టి ఆటంకములు సంభవించినను విజయము పొందుననీ, రాజకీయస్వాతంత్ర్య మన్న ఫిన్నులచే గావింపబడు రాజ్యపరిపాలన కాదనీ, స్వభాష ననుసరించి యేర్పడు జాతీయపరిపాలనమే సక్రమ స్వాతంత్ర్యమనీ ఆర్విడ్‌సన్ తనపత్రికలో స్వదేశీయులకు స్పష్టపరిచాడు. అతని నిరంతర ప్రచారము వలన ఫిన్నులలో కాలక్రమేణా గొప్ప మార్పు వచ్చింది. రష్యాపాలకులు ఫిన్నుల జాతీయతత్వమును నాశనము చేయ చేసిన ప్రయత్నము లన్నియు నిరుపయోగమైనాయి. తుదకు ఫిన్నుదేశీయులలో ఉన్నత తరగతులవారు కూడ ఆర్విడ్‌సన్ గావించు ప్రబోధముయొక్క సత్యాసత్యముల గ్రహించి అతని సూచనలనే అనుసరించారు.

సంస్కరణప్రసాదము

ఆర్విడ్‌సన్ చేసిన ఆందోళన ఫలితంగా రెండవ అలెగ్జాండరురాజు కాలమందు *కొన్ని సంస్కరణములు గావింపబడెను. అతని ఉదార ధూయిష్ఠమగు పరిపాలనవలన ఫిన్నుల రాజకీయజీవితమందు సంచలనము కల్గుటచే, వా రతని అభిమానముతో గౌరవించారు. అతనికాలమందే ప్రప్రథమమున ఫిన్నుల భాష రాజభాషగ అంగీకరింపబడెను. కోర్టులందును, ఆఫీసులందును ఫిన్నులభాషను యుపయోగించుటకును, స్వీడిషుభాషతో పాటు సమాన గౌరవ ప్రతిపత్తి కల్గియుండుటకును, ౧౮౭౮-వ సంవత్సరము నుండి ఫిన్నులభాషయే రాజభాషగ నుండుటకును రెండవ అలెగ్జాండరురాజు అంగీకరించాడు. ౧౮౬౩-వ సంవత్సరమందు రెండవ అలెగ్జాండరు గావించిన



హెల్సింకీ నగరమున ప్రభుత్వోద్యోగుల మందిరములు



హెల్సింకీ నగరమందలి ఒక వీధి

యీ ప్రకటనమువలన ఫిన్నుల జాతీయోద్యమమునకు విజయము సంప్రాప్తించినట్లు కన్పడినా, వారికష్టములు నివారణ కాలేదు.

నిరోధములు

రెండవ అలెగ్జాండరు ప్రసాదించిన సంస్కరణలు అమలులో పెట్టటానికి రష్యను అధికారులు అనేక ఆటంకాలు కల్పించారు. ఫిన్ను సెనేటువారు (శాసన సభ) ౧౮౬౩-వ ప్రకటనను అమలులో పెట్టుటలేదని ఫిన్ను యువకుల నాయకుడగు ప్రొఫెసరు కాస్కి-నెన్ నేరారోపణ గావించాడు. సెనేటు అతనిపై అసత్య నేరారోపణ కని కేసు దాఖలుచేసింది. ఆ కేసులో తన వాదమును కాస్కి-నెన్ ఫిన్నుభాషలో కోర్టుకు నివేదించాడు. కాని కోర్టువారు "స్వీడిషు భాషయే రాజభాషయనీ, రాజభాష బాగుగ వచ్చినవ్యక్తి ఫిన్నుభాష యుపయోగింపకూడదనీ, కావున కాస్కి-నెన్ స్వీడిషుభాషలోనే తన విజ్ఞప్తిని కోర్టులో దాఖలుచేయవలెననీ" శాసించారు. కోర్టు వారి ఉత్తరువుతో రెండవ అలెగ్జాండరు రొసంగిన ప్రకటనను మసిపూసిన మారేడుకాయగ పరిణమించెను.

ఫిన్నుల మాతృభాషను జాతిలో చేర్చుకొనుటకు చేసిన ఎత్తులన్నియు సాగనపుడు రష్యాపాలకులు ఫిన్నుల కిచ్చిన స్వల్పస్వాతంత్ర్యము లను అపహరింప ప్రయత్నించారు. ౧౮౯౯-వ సంవత్సరమందు రెండవనికలాస్ చక్రవర్తి ఫిన్నుపార్లమెంటుకు (శాసనసభకు) గల శాసనాధికారమును రద్దు పరచాడు! అతని ఉత్తరువుప్రకారము—

౧. అమలులో నున్న శాసనాలను మార్చవలసిన యెడల ముందుగా చక్రవర్తి అనుజ్ఞను పొందవలె.

౨. అట్టి అనుజ్ఞ పొందుటకు చక్రవర్తికి విజ్ఞాపనపత్రము సమర్పించాలి.

౩. అనుజ్ఞ పొందినతరువాత ఫిన్నుల శాసనసభయు రాజప్రతినిధియు మార్చవలసిన శాసనముల గురించి తమ అభిప్రాయములను ముందు తెల్పవలె.

౪. వారి అభిప్రాయాలను సెంటుపీటర్సుబర్గునందున్న

౫. ఆటుపై వారు సూచించు నిర్ణయములు అమలులో పెట్టవలె.

జాతీయ విజ్ఞప్తి

రెండవ నికలాస్ చక్రవర్తి ఉత్తరువువలన ఫిన్నులలో అసంతృప్తి, ఆందోళన వెల్లివిరిసినాయి. ప్రజా ప్రతినిధులుగల శాసనసభవారు (డైయిట్) తమఅసమ్మతిని పీటర్సుబర్గు నందున్న అధికారులకు తెల్ప ప్రయత్నించారు కాని అవకాశము లభింపలేదు. సెనెటువారు మాత్రము ఉపాధ్యక్షుని వోటుతో అత్యధిక సంఖ్యాకబలము సంపాదించి చక్రవర్తి యుత్తరువు అమలులో పెట్టటానికి నిశ్చయించారు. రాజప్రతినిధియగు బొబ్రికాఫ్ గావించు నిరంకుశ చర్యలగురించి విజ్ఞప్తి నొసంగుటకు ఫిన్ను నాయకులు ౫,౨౩,౦౦౦ల ప్రజలచే సంతకములు గావించిన విజ్ఞప్తిపత్రమును సంసిద్ధపచారు. దానిని చక్రవర్తికి నొసంగుటకు ఫిన్లాండు నాల్గుమూలలనుండి యు ప్రతినిధులు ౫౦౦ మంది పీటర్సుబర్గు నగరానికి చేరారు. ఫిన్నుల ప్రతినిధివర్గమువారు విజ్ఞప్తి నొసంగుటకు వచ్చుచున్నారని ముందుగా చక్రవర్తికి తెలియుటచే అతను రాయబారుల సందర్శింప నిరాకరించెను. అధికారులకు తెలియకుండ యింతమంది ప్రతినిధులు పీటర్సుబర్గునగరము చేరుట ఫిన్ను దేశీయులలో తీవ్రమగు ఆందోళన కల్గించుటకు కారణభూత మగుటయే కాక ప్రపంచపుదృష్టిని ఆకర్షించెను. ఫిన్నుల విజ్ఞప్తిని అన్యరాజ్యములందున్న రాజకీయ, సారస్వత ప్రముఖులును నాయకులును ఆమోదిస్తూ, రెండవ నికలాస్ చక్రవర్తిని వారికోరికల సఫల పరుపవలసిందని ప్రార్థించిరి. కాని రష్యాఅధికారులు ఫిన్నులకోరికను నెరవేర్పలేదు. వారి ఆందోళనకు నిర్బంధముల రూపమున ప్రత్యుత్తర మొసంగబడెను. పత్రికా నిరోధములు హెచ్చయ్యెను. అనేకమంది పత్రికా రచకులు కారాగారముల కేగిరి.

నిర్బంధ సైనికశిక్షణ

ఇదికు ప్రజలను యింకను భీతావహులుగ చేయాలని రాజప్రతినిధియగు బొబ్రికాఫ్ ౧౯౦౦-వ సంవత్సరమందు నిర్బంధ సైనికశిక్షణ శాసనము

ఫిన్నో సైనికులను ఇండ్లకు పంపివేసి, ఫిన్నో యువకులను రష్యా సైన్యాలలో నిర్బంధక సైనిక శిక్షణము పొందాలనీ, వారికి ప్రత్యేక సైన్యపటాలముల రేర్పరచకూడదనీ బొబ్రికాఫ్ ప్రకటించాడు. ఈ ప్రకటనముతో అధికార ప్రజాశక్తుల సంఘర్షణ తీవ్రమయింది. ౧౯౦౦-వ సంవత్సరమందు సైనిక శిక్షణము పొందుటకు ౫౦౦ ల మంది. మాత్రమే హాజరయిరి. మిగిలిన వారందరును (దాదాపు ౨౮,౫౦౦ల మంది) సైనిక శిక్షణము పొందుటకు నిరాకరించారు. రష్యనుభాషను రాజభాషగ స్వీకరింపవలెనని కూడ బొబ్రికాఫ్ శాసించాడు. ఈ నిర్బంధములు ౧౯౦౫-వ సంవత్సరమందు రష్యాలో విప్లవము జరుగువరకును అమలులో ఉన్నాయి. వీనివలన ఫిన్నో దేశీయుల దృక్పథమందు గొప్ప మార్పు రావటానికి అవకాశము కల్గింది. అప్పటివరకును ఫిన్నో దేశీయులలో ప్రబలియున్న మితవాద తత్వము రూపుమాసిపోవటానికీ అతివాద తత్వము చురుకుగా వ్యాపించటానికీ వీలయింది. ౧౯౦౪-వ సంవత్సరమందు జపాను రష్యాల మధ్య యుద్ధము సంప్రాప్తించినపుడు ఫిన్నులు అతివాదుల నాయకత్వముక్రింద రష్యాకు సహాయము చేయ నిరాకరించుటయే కాకుండ, రహస్యముగ ఆయుధములు సంపాదించి, రష్యాలోని విప్లవకారులతోను పోలండులోని విప్లవనాయకులతోను రహస్య సంప్రదింపులు గావించి, అధికారులపై బహిరంగముగ కుట్రలు, తిరుగబాట్లు గావించారు. రాజప్రతినిధియను బొబ్రికాఫ్‌ను, అటర్నీ జనరలగు జాన్‌సన్ సాయివిసెన్‌ను



మంచుతో నిండియుండు ప్రదేశములందు పోవుచున్న ఫిన్లాండు సైనికులు

నూతన సంస్కరణములు

రష్యాలో జరిగిన ౧౯౦౫-వ సం. విప్లవపు ప్రతిఫలముగ ఫిన్నులస్థితి కొంతవరకు బాగుపడింది. ఆ సంవత్సరమందే అక్టోబరు నెలలో ఫిన్నులందరును జాతీయసమ్మె గావించారు. అన్ని పక్షములవారును, సమ్మెలో పాల్గొన్నారు. అప్పుడు రష్యాచక్రవర్తి ఫిన్నుల అసంతృప్తి నణచివైచుటకు నవంబరు ౪ వ తేదీని అన్ని నిర్బంధములను తొలగిస్తూ, ఫిన్నో శాసనసభ

వకు హేతువైన విషయముల నన్నిటిని పరిశీలన గావించి సక్రమ పరిపాలన చేయుటానికి నూతన రాజప్రతినిధిని నియమించెను. అంతేకాకుండా నూతన రాజ్యాంగనిర్మాణమును, నూతన ఎన్నిక శాసనమును ఫిన్నులకు రష్యాచక్రవర్తి ప్రసాదించెను. రాజకీయ రంగమందు ఫిన్నుశాసనసభ తాను గోల్పోయిన అధికారమును తిరిగి సంపాదించినది. రాజకీయ స్వాతంత్ర్యమును కొంతవరకు ఫిన్నులు అనుభవించారు. అప్పుడు పార్లమెంటరీ పద్ధతులపై యేర్పడిన రాజ్యాంగమే రష్యాలో ౧౯౧౭-వ సంవత్సరమందు జరిగిన విప్లవము వరకును ఫిన్లాండులో అమలు నందుండెను. కాని మూడు సంవత్సరములలో యీ సంస్కరణలన్నియు యెండమావులుగ పరిణమించాయి. ౧౯౦౮-వ సంవత్సరము నుండి మరల రష్యాఅధికారులు ఫిన్నులను నిర్బంధించుటకు ఉద్యమించారు. సామ్రాజ్య విషయములకు సంబంధించిన సమస్యలగురించి ఫిన్నుశాసనసభ చర్చింపగూడదని ఒకశాసనము అమలులో పెట్టబడింది. ఫిన్లాండులో ౧౯౧౩-వ సంవత్సరమునుండి రష్యనుదేశీయులకే అధికారపదవులు హెచ్చుగ యివ్వబడుట ప్రారంభమయ్యెను. విద్యకును, పరిశ్రమాభివృద్ధికిని వినియోగింపవలసిన ఫండులను అధికారులు తమ యిష్టప్రకారము వెచ్చించారు. ౧౯౧౪-వ సంవత్సరమందు మహాసంగ్రామము ప్రారంభమునప్పటికి ఫిన్లాండులో సక్రమపాలన చాలవరకు అంతరించింది. మహాసంగ్రామసమయమునకూడ నిరోధనలను తీవ్రముగ అమలులో పెట్టారు. సైనికశాసనముక్రింద వ్యక్తి స్వాతంత్ర్యము హరింపబడింది. వ్యక్తుల స్వంతఆస్తులు అపహరింపబడ్డాయి. యుద్ధముసాగించటానికి ప్రత్యేక పన్నులు ప్రజలపై విధించారు. ఫిన్ను భాషను అంతరింపజేయటానికి మరలప్రయత్నాలు చేయబడ్డాయి. పత్రికా స్వాతంత్ర్యము రద్దు గావింపబడినది. ఫిన్నుల పౌరస్వత్వపు హక్కులు రద్దుచేయబడి, వారందరు రష్యను జాతీయులుగ పరిగణించుటకు యేర్పాటు గావింపబడెను. ఇట్టి తీవ్రనిరోధముల గురించి ఫిన్ను శాసనసభ అనేకమార్లు ప్రజల తరఫున అసమ్మతులను తెల్పినను, రష్యా అధికారులు లెక్క చేయలేదు. ౧౯౧౭-వ సం. రష్యాలో విప్లవము జరుగు కాలమువారికి ఫిన్లాం

డులో సక్రమమగు రాజ్యాంగ పేడితమును అమలులో లేదు. మహాసంగ్రామసమయమున ఫిన్నులను రష్యా సేనలలో చేరుమని ఎంతప్రబోధము గావించినా ఎవరును సహాయము చేయుటానికి యిష్టపడలేదు.

స్వతంత్రప్రభుత్వ నిర్మాణము

౧౯౧౭-వ సంవత్సరమందు రష్యాలో విప్లవము జరిగినప్పుడు తాత్కాలికముగ యేర్పడ్డ విప్లవ ప్రభుత్వంవారు ఫిన్లాండుకు స్వాతంత్ర్యము ప్రసాదించి, సమానసంఖ్య గల సాంఘికవాదులును మధ్యతరగతుల ప్రతినిధులును గల ఒక సంఘమును యేర్పరచి, రాజ్య పరిపాలన ఆ సంఘానికి వప్పగించారు. రష్యాలో విప్లవముకాగానే యీ సంఘమువారు ఫిన్లాండు సంపూర్ణస్వాతంత్ర్యము గురించి ప్రత్యేక ప్రకటనము గావించారు. రష్యాలో విప్లవప్రభుత్వమువారుకూడా ఫిన్లాండు స్వాతంత్ర్యమును సమ్మతించారు. అటుతరువాత ఫిన్లాండు దేశీయులలో అధికార సంపాదనముకొరకు తీవ్రసంఘర్షణ ప్రారంభమయింది. సాంఘికవాదు లందరు రష్యాలోవలె కార్మిక కర్షక ప్రజాయత్త ప్రభుత్వాన్ని స్థాపించటానికి నిశ్చయించినప్పుడు తరగతులవారందరును జర్మనీపై సానుభూతిగలవారగుటచే ఆ దేశపు సహాయము నపేక్షించారు. ౧౯౧౮-వ సంవత్సరములో చాలకాలము ఫిన్లాండులో అంతర్యుద్ధము జరిగింది. తరగతులవారందరు మేనర్‌హీం సేనాని నాయకత్వముక్రింద జర్మనీ సహాయముతో సాంఘికవాదులపై తిరుగబాటుబావుటా ఎత్తించారు. అనేకవేలమంది సాంఘికవాదులను ప్రజాస్వామ్యవాదులను మేనర్‌హీం సేనానియు అతని అనుచరులును చంపిరి. ఆ సంవత్సరమే జూన్ నెలలో సమావేశమైన శాసనసభలో సాంఘికవాదులకు ప్రాతినిధ్యం కూడ యివ్వబడలేదు. శాసనసభలోని ప్రతినిధులందరూ జర్మనీపై సానుభూతి గలవారవుటచే, వారు కైజరుబంధువు నొకనిని తమరాజుగా ఎన్నుకొనుటకు కూడ నిశ్చయించారు. కాని ప్రపంచసంగ్రామము తారుమారగుటచే జర్మనీ ఫిన్లాండుతో ఐక్యము కల్గజేసికొనటానికి నవకాశము లభింపలేదు. తుదకు మేనర్‌హీమే నియంతగా యేర్పడి తరగతులవారి

ప్రభుత్వమును యేర్పాటు చేశాడు. ౧౯౧౯-వ సం. వరకు మేనర్‌హీమ్ యేర్పరచిన ప్రభుత్వము రాజ్య పాలన గావించింది. తరువాత ఎగ్రేరియన్ ప్రోగ్రసీవు పక్షములవారు కలిసి సంయుక్త మంత్రివర్గము యేర్పరచారు. ఈ సంయుక్త మంత్రివర్గమువారు అంతర్యుద్ధములో పాల్గొనినవారి నందరిని క్షమించి, వారికి పౌర స్వాతంత్ర్యపు హక్కుల ప్రసాదించి, దేశమందు శాంతి నెలకొల్పారు.

అమలులోనున్న రాజ్యాంగము

ఇప్పుడు అమలు నందున్న రాజ్యాంగము ప్రకారము ఒక్కటే శాసనసభ ఉండును. ప్రజాప్రతినిధుల సభలో ౨౦౦ మంది సభ్యులుంటారు. ౨౪ సంవత్సరాలు వయస్సుగల పురుషుడుగాని స్త్రీగాని ఎన్నికలందు పాల్గొనవచ్చును. ప్రజాప్రతినిధుల సభకు సభ్యులను ప్రజలు ౩ సంవత్సరాల కొకమారు యెన్నుకొంటారు. ఫిన్లాండు అధ్యక్షుని ప్రజలు ౬ సంవత్సరాల కొకమారు ఎన్నుకుంటారు. అధ్యక్షుడే మంత్రివర్గమును నియమించుతాడు. అతను నియమించు మంత్రివర్గము ప్రజాప్రతినిధులసభలో అధికసంఖ్యాక బలమును కల్గి యుండాలి. ప్రజాప్రతినిధులసభలో సోషల్ డిమోక్రాట్ పక్షమువారు ౮౫ స్థానము గలరు. ఆగ్రేరియన్ పక్షమువారు ౫౬ స్థానమును, స్వీడిషు భాషాపక్షమువారు ౧౮ కుర్చీలును, యూనియనిస్టు పక్షమువారు ౨౫ సీటును, జాతీయపక్షమువారు ౧౪ సీటును, ప్రోగ్రెసీవు పక్షమువారు ౭ సీటును, ఇతర అల్పసంఖ్యాకపక్ష ప్రతినిధులును ఉన్నారు. ఫిన్లాండు ప్రజాప్రతినిధి సభలో వోటింగు అతినవీనపద్ధతిపై నడుపబడుచున్నది. ఏతీర్మానముపైనగాని, బిల్లుపైనగాని సభ్యులు వోటివ్వవలసి వచ్చినప్పుడు రెండువందలమంది సభ్యులు తాము కూర్చున్న స్థలములనుండే యే ప్రశాంతిలేనుగ తమవోట్ల నిచ్చుటకు ఒక యేర్పాటు చేయబడెను. ప్రతిసభ్యునిముందు గల బల్లమీదను ౩ విద్యుచ్ఛక్తి బొత్తములు (Buttons) అమర్చబడినాయి. అందులో ఒకటి అంగీకారము సూచించటానికి, రెండవది ప్రతికూలత గన్పరచటానికిని, రెండుబొత్తములను ఒత్తినయెడల తాటస్థ్యతను నిరూపించుటకు యేర్పరచబడెను. సభ్యులందరు తమవోట్ల నొసంగవలసినపుడు యీ బొత్తముల ఒత్తుటయు, వారి వోట్లు వెంటనే ముందున్న గ్లాసు పటముపై రికార్డుచేయబడుటయు, ఇట్లు రికార్డయిన వోట్లను



ఫిన్లాండులో స్త్రీవాలంటీరు దళమందుచేరిన స్త్రీలు

అధ్యక్షుడు ప్రకటించుటయు జరుగుచున్నది. అట్టిపద్ధతి యేరాజ్యమందును అమలులో లేదు.

ఫిన్నుల జాతీయత

౧౯౨౦-వ సంవత్సరమందు రష్యాఫిన్లాండుల మధ్య టార్టువద్ద జరిగిన యొడంబడిక ననుసరించి ఫిన్లాండు స్వాతంత్ర్యమును రష్యా అంగీకరించి, రెండు రాజ్యాలవారును రాయబారుల బంపుకొనె యేర్పాటు చేసికొన్నారు. ౧౯౩౨-వ సంవత్సరమందు లట్వియా, ఎస్టోనియా, పోలండులతో ఫిన్లాండు తాటస్థ్య యొడంబడిక చేసికొన నిరాకరించుటం వలన స్కాండినేవియా రాజ్యము లనుసరించు విదేశాంగ విధానమునే అమలులో పెట్టి నిశ్చయించు కున్నట్లు స్పష్టమయింది. ఆలండుద్వీపాల విషయములో ఫిన్లాండు స్వీడెనులకు కొంతకాలము వివాదము జరిగింది. కాని సమితివారు తగాదాను శాంతంగా పరిష్కరించారు. అప్పటినుండియు స్వీడెను, నార్వే, ఫిన్లాండులమధ్య స్నేహము, సహకారము వృద్ధి అయ్యెను. ఫిన్లాండులో నూతనరాజ్యాంగము యేర్పడి నప్పటినుండియు, క్రొత్త మంత్రివర్గమువారు దాస్య చిహ్నముల నన్నిటిని తొలగించారు. విద్య, పరిశ్రమాభివృద్ధి, ప్రజాపాలనము జాతీయపద్ధతులపై సాగించుటకు యేర్పాట్లు చేయబడెను. తుదకు స్థలముల పేర్లు కూడ జాతీయముగ నుండునట్లు మార్పు చేయబడెను. ఫిన్లాండు ముఖ్యపట్టణ మగు హెల్సింగు ఫోర్సుకు "హెల్సింకి" అని మారిననామ మిడిరి.

దేశపరిస్థితులు

ఫిన్లాండు౧,౩౪,౫౫౭ చదరపుమైళ్లవైశాల్యము గల దేశము. హైదరాబాదు (బీరారుతో కలిపి)కు రెండింతలుండును. నూటికి మున్పాతిక భాగము ఫిన్లాండు అడవులమయము. దాదాపు ౬౦,౦౦౦ సరస్సులు, పెద్దవి చిన్నవి,ఉన్నాయి. ఫిన్లాండు సముద్రతీరము చుట్టునూ దాదాపు ౮౦,౦౦౦ చిన్న ద్వీపా లున్నాయి. బాల్టిక్ సముద్రం నిండా యీ చిన్న ద్వీపాలే గలవు. ఫిన్లాండు దక్షిణభాగమందే హెచ్చుమంది ప్రజలు నివాసముల నేర్పరచుకున్నారు. ఉత్తర భాగమందు జనసంఖ్య చాల తక్కువ. ౧౯౩౬-వ జనాభా లెక్కల ననుసరించి చూస్తే ఫిన్లాండు జన సంఖ్య ౩౮౦ లక్షలు. వీరిలో నూటికి ౭౦.౧ మంది గ్రామాదులలోను, ౨౯.౯ మంది పట్టణాలలో నివసిస్తున్నారు. నూటికి ౫౨.౧ భాగముల భూమి వ్యక్తుల స్వంత ఆస్తిగ పరిగణింపబడినా ౩౯.౯ భాగముల భూభాగము ప్రభుత్వాధీనమందు గలదు. ఆర్థికాభివృద్ధికొరకు ఫిన్లాండు ప్రభుత్వమువారు తీవ్రముగ కృషి సల్పినారు. అడవులమధ్యలోనే ఫ్యాక్టరీలను స్థాపించి, పరిశ్రమాభివృద్ధి గావించుటకు ప్రయత్నిస్తున్నారు. ఫిన్లాండులో ప్రజల ఆర్థికాభివృద్ధికి తోడ్పడుటకు సహకారోద్యమముకూడ ప్రారంభింపబడెను. ౨౦ సంవత్సరములలో సహకారపద్ధతులపై యేర్పడిన సంస్థలు రెండు రెట్లు వృద్ధి చెందినాయి. సహకార బ్యాంకులు కూడ ౬౦౦ నుండి ౧౦౦౦ వరకు హెచ్చింపబడెను. ఫిన్లాండు దేశీయులు ధైర్య సాహసోపేతులు. వారి పట్టుదల, పరిశ్రమ శ్లాఘనీయము. ఆ దేశపు స్త్రీలు ప్రజాహితజీవితమునం దక్కువ ఉత్సాహముతో పాల్గొంటారు. అనేక మహిళాసంస్థలు వారు స్థాపించి, ప్రపంచమందలి తదితర స్త్రీలకు మార్గదర్శకులైనారు. ౧౯౦౬-వ సంవత్సరమందే ఫిన్లాండు స్త్రీలు వోటింగుహక్కును సంపాదించుకున్నారు. అన్ని వృత్తులలోను, కట్టెడపుపని యందును వీరు కృషి సల్పుచున్నారు. ట్రాముకార్లు నడుపువారిలో హెచ్చుమంది స్త్రీలే. రాజకీయములందు వారికి అభిరుచి తక్కువగ నున్నట్లు కన్పడుతుంది. జాతీయార్థికాభివృద్ధికిని, సంఘాభివృద్ధికిని, బాల బాలికల సౌకర్యముల పెంపొందించుట యందును ఫిన్లాండు స్త్రీలు బహుశ్రద్ధ వహిస్తారు. వారొక ఐచ్ఛిక సేవాదళమును కూడ యేర్పరచినారు.

సైనికబలము

ఆర్థికాభివృద్ధికిగాను ఫిన్లాండు అన్యరాజ్యాలనుండి తీసికొన్న అప్పులను సకాలమున చెల్లించి, తన గౌరవమును మాటను నిల్పుకొన్నది. సైనికముగ కొద్దిబలము గల రాజ్యము. ౨౫,౦౦౦ మంది సైనికులే ఫిన్లాండు



కలపకు ప్రసిద్ధిచెందిన ఫిన్లాండులో కలపసరకు రవాణా

పటాలములలో గలరు. కాని ౨౧ సంవత్సరముల వయస్సుగల యువకులందరు సైనికశిక్షణమందు తర్ఫీతు కాకతప్పదు. ఒకసంవత్సరముపైగా యువకులకు సైనికశిక్షణ మివ్వబడును. ౨౧ సంవత్సరముల వయస్సుకు లోపుగ నున్నవారికికూడ కొంతవరకు సైనికశిక్షణ మిచ్చుటకు యేర్పాటుగలదు. దేశ శాంతిని కాపాడుటకు పోలీసు బృందముగలదు. వీరిని సివిక్ గార్డ్సు అంటారు. వీరు దేశసంరక్షణకుకూడ తోడ్పడుతారు. వీరిసంఖ్య ఒకలక్షకలదు. వీరందరు అధ్యక్షుని నాయకత్వముక్రింద తమ ధర్మముల నిర్వహిస్తారు. ఫిన్లాండుకు కొద్దిగా నావికాబలము కూడ కలదు. రెండుయుద్ధనావలు, ౬ గన్‌బోట్లు, ౭ మోటారు టార్పెడోబోట్లు, ౩ గనులు యేర్పరచునావలు, ౫ జలాంతర్గాములు, యింకను చిన్న చిన్ననావలు కొన్ని గలవు. కొద్దిగా వాయువిమాన బలమునుకూడ కడచిన ఆరుసంవత్సరములలో ఫిన్లాండు సంపాదించినది. ఇట్టి చిన్న రాజ్యంపై రష్యా కత్తి

ఫిన్లాండు అపహరించునను భయమా? లేక ఆర్థికముగ ఫిన్లాండు తనతో సంపూర్ణ సహకారము గావింపకున్న రష్యాకు దెబ్బతగులునను భీతియా? లేక రష్యా ఆర్థికాభివృద్ధికి ఫిన్లాండు ఒకవలస రాజ్యంగా ఉండాలను విశ్వాసమా? ఫిన్లాండు యే రాజ్యంతో చేతులు కలిపి రష్యాపై దండెత్తుతుంది? ఏ అవాంతరమును రాకుండ చేయటానికి స్టాలిన్ (రష్యానియంత) నేడు ఫిన్లాండుతో యుద్ధానికి దిగినాడు? స్టాలిన్ను అతని అనుచరులనుపట్టి బాధించుచున్న రహస్యభీతి యేమిటి? అంతర్జాతీయముగ గౌరవమర్యాదల పోషించుకొనుచు, యితర రాజ్యాలతో సమాన ప్రతిపత్తుల సంపాదించుకొన్న రష్యా నేడు యీ చిన్నరాజ్యంపై అధర్మదాడి గావించటానికి గల ప్రబలకారణా లేమిటి?

బాల్టిక్ రాష్ట్రముల స్థితి

౧౯౧౮ వ సం॥ మహాసంగ్రామమైన తరువాత వర్సైల్సు సంధిప్రకారము లట్వియా, లిథూనియా, ఎస్టోనియా రాజ్యాలను ప్రత్యేక స్వాతంత్ర్య రాజ్యాలుగా సూప్రీంకౌన్సిలువారు యేర్పరచినారు. ఈ రాజ్యాలనే బాల్టిక్ రాష్ట్రము లంటారు. మధ్యయుగములనుండియూ లట్వియా, ఎస్టోనియాలలో జర్మనీపలుకుబడి హెచ్చు. కడచిన మహాసంగ్రామ సమయమున లిథూనియాను జర్మనీ ఆక్రమించి, రష్యాతో బ్రెస్టులిటోవిస్కు వద్ద చేసికొన్న సంధి ప్రకారము లిథూనియాను ప్రత్యేకస్వతంత్రరాజ్యంగా యేర్పాటుచేయటానికి అంగీకరించింది. రష్యాకు ఉత్తరభాగమందుగల ఫిన్లాండులో కూడ జర్మనీపలుకుబడి హెచ్చు. బాల్టిక్ రాష్ట్రములందు జర్మనీదేశపు అల్పసంఖ్యాకు లనేకమంది గలరు. వీరందరు మాతృభూమియగు జర్మనీపై అభిమానము కల్గి, జర్మనీపురోభివృద్ధి కనుకూలమగు రీతిని ప్రవర్తిస్తూ వచ్చారు. రష్యా సామ్రాజ్యము విచ్ఛిన్నమయి అచ్చట బోల్షివిక్కు ప్రభుత్వము యేర్పడినప్పుడు సూప్రీం కౌన్సిలువారు కార్మిక ప్రచారము అన్యరాజ్యాలకు ప్రాకకుండా చేయాలను ఊహతో యీ రాజ్యాలనన్నిటిని స్వతంత్ర రాజ్యాలుగ యేర్పరచినారు. స్వతంత్రరాజ్యాలుగ యేర్పడినా యీ రాజ్యాలన్నిటికిని యిప్పటికి కొద్దో గొప్పో అభిమానము జర్మనీపై గలదు. ఎప్పుడైన జర్మనీ అత్యున్నతస్థితికి వచ్చినయెడల, యీ రాజ్యాలన్నీ జర్మనీతో కలిసియుండుట నిశ్చయము. తుదకు ఫిన్లాండుకూడ జర్మనీపై అభిమానము కల్గి ఆరాజ్యంతో వర్తకసంబంధమును పెంపొందించుకొనుచూ, అవసరమున్న జర్మనీతో చేతులుకలుపుట నిశ్చయము. ఈ స్థితిగతులను రష్యా పూర్తిగా అర్థము చేసికొన్నది. పోలండుపై ఆక్రమదాడి గావించిన జర్మనీ, యింగ్లాండు ఫ్రాన్సులు యుద్ధంచేయకుండా మాని యున్నట్లయితే, యీపాటికి బాల్టిక్ రాజ్యాలనన్నిటిని తనతో కలుపుకొనివచ్చి, రుమేనియాపై దాడి వెడలియుండెడిది. అందుచే యిక ఆలసించిన లాభం లేదని రష్యా నిశ్చయించుకొని యింగ్లండు ఫ్రాన్సులతో జర్మనీ యుద్ధమునందు నిమగ్నురాలై యున్నపుడు బాల్టిక్ రాజ్యములన్నిటియందు తన పలుకుబడి, అధికారము హెచ్చించుకొనటానికి ముందంజ వైచినది. ఒకానొక సమయాన జారుచక్రవర్తియగు పీటరు ది గ్రేటు "ఐరోపాఖండపు పశ్చిమభాగమందున్న కిటికీలను తెరవండి. కిటికీలను తెరవటానికి వీలు లేకపోతే, బ్రద్దలుకొట్టండి" అని హెచ్చరిక గావించాడు. పీటరు వాక్యములనే నేడు స్టాలిన్ కార్యరూపము దాల్చునట్లు చేస్తున్నాడు.

రష్యా కోరికలు

లట్వియా, లిథూనియా, ఎస్టోనియాలతో పరస్పర సైనికసహాయపు టొడంబడికలు గావించుకొని, ఆరాజ్యాలందు తన సైన్యాలను, వాయువిమాన దళాలను, నావికాబలాన్ని యేర్పాటు చేసికొనటానికి స్థలాలను సంపాదించుకొన్న తరువాత రష్యా ఫిన్లాండుతోకూడ యిట్టి ఒడంబడికనే యేర్పరచుకోవాలని తలంచినది. సరిహద్దులందున్న బాల్టిక్ రాజ్యాలందు రష్యా కల్పించుకొన్న సౌకర్యాలవలన యెవ్వరుగాని ఫిన్లాండు గల్ఫులోనికి సముద్రంమీదుగా త్రోసికొని రావటానికి అవకాశము లేకుండా కల్పింపబడెను. కాలక్రమేణా యీ రాజ్యాలలో అంతర్విప్లవముల సృష్టించి, కార్మిక కర్షక ప్రభుత్వాల యేర్పరచ

వచ్చునని స్టాలిన్ ఆలోచన. ఇట్టి అభిప్రాయంతోనే స్టాలిన్ ఫిన్లాండుతో కూడ సంప్రదింపులకు దిగినాడు. ఫిన్లాండును రష్యా ౬ కోరికలను కోరింది. అవే వంటే :—

(౧) పరస్పర సైనిక సహాయపు టొడంబడిక గావించుకొనుట.

(౨) లెనిన్‌గ్రాడ్ నగర సంరక్షణమునకు కరేలియా రాష్ట్రమందు ఫిన్లాండు రష్యాలు కొంత భూ భాగము పరస్పరముగ మార్చుకొనుట.

(౩) ఫిన్‌లాండు గల్ఫుద్వార మనదగు హాంగో ద్వీపమును రష్యాకు నావికాలయము చేర్పరచుకొనుటకు ఫిన్‌లాండు లీజు (**Lease**) కిచ్చుట.

(౪) ఫిన్‌లాండుకు సంబంధించిన కొన్ని ద్వీపాలను రష్యా కివ్వి, రష్యాయిచ్చు భూభాగాన్ని ఫిన్‌లాండు తీసికొనుట.

(౫) రష్యా ఫిన్‌లాండు సరిహద్దులవద్ద కొంత దూరము వరకు యిరుపక్షాలవారు సైనికపు టేర్పాట్లు ఆపుదల చేయుట.

(౬) రష్యా కోరికలను ఫిన్‌లాండు సఫలపరచినట్లయితే ఆలండు ద్వీపములందు కోటలనిర్మాణమును చేసికొను సందర్భమున రష్యా ఆటంకములను కల్పింపదు.

ఫిన్లాండు అభిప్రాయము

రష్యా బహిరంగముగ తనకోరికల నిట్లు స్పష్టపరచినపుడు ఫిన్‌లాండు విదేశాంగమంత్రియగు ఎల్జాస్ ఎర్కో యిట్లు ప్రకటించాడు :—

“ రెండవపక్షముతో ముందుగా సంప్రదించకుండా ఒక పక్షము యిట్లు బహిరంగముగ విదేశాంగ విషయముల చర్చించుటవలన విషమస్థితిగతు లేర్పడి, అపనమ్మకమునకు, అవిశ్వాసమునకు తావు యేర్ప



సైన్యములో క్రొత్తగాచేరిన ఫిన్లాండు యువకులు

దును. ఫిన్‌లాండు తటస్థరాజ్యము. ఫిన్నుదేశీయులలో ప్రాణము, త్రాణము ఉన్నంతవరకు వారు తమ తాటస్థ్యమును నిర్వహించుకొనెదరు. ఫిన్నులకు చెందిన రాజ్యభాగముపై యింకే రాజ్యమునకు గాని అధికారము ఒసంగినయెడల, ఫిన్‌లాండుతాటస్థ్యమునకు భంగము వాటిల్లును. అయినప్పటికి యీ వివాదమును శాంతముగ పరిష్కరించుకొనుటకు మా ప్రతినిధులను రష్యాకు పంపెదము."

ఎర్కో ప్రకటనను ననుసరించి, ఫిన్ను రాయబారులు మూడుమారులు రష్యాకు వెళ్లి వచ్చారు. రెండు రాజ్యాలమధ్య దీర్ఘమగు రహస్య సంప్రదింపులు అనేక దినములు జరిగినాయి. రష్యాకోరికల నన్నిటిని ఫిన్లాండు నెరవేర్చటానికి యిష్టపడలేదు. సామరస్యముతో వివాదము పరిష్కరించుకొనటానికి ఫిన్లాండు కొంతవరకు అంగీకరించింది. కాని స్టాలిన్ హాంగో ద్వీపాన్ని తనవశము చేయాలంటే ఫిన్లాండు ఒప్పుకోలేదు. లెనిన్‌గ్రాడ్ సంరక్షణకు తానుగూడ కావలసిన బాధ్యత వహిస్తానని ఫిన్లాండు వ్యక్తపరచింది. అయితే స్టాలిన్ తనమాటే నెగ్గాలనే పట్టుదల గన్పరచటంవలన రాయబారాలు విఫలమయినాయి.

ఇక ఫిన్లాండును యేవిధంగా వశపరచుకొనవలెనను క్లిష్టసమస్య రష్యా అధికారులను వేధించటం మొదలుపెట్టింది. ఇంతవరకు బాల్టిక్ రాష్ట్రములకు రష్యాసేనలు వెళ్లినపుడు, ఆరాజ్యాలందున్న ప్రజలు వారిని హృదయపూర్వకముగ ఆహ్వానము గావించిరని రష్యా అధికారులు చేసిన ప్రచారము ఫిన్లాండు కన్పరచు ప్రతికూలభావముతో అసత్యభూయిష్ఠమయినదని వ్యక్తపడుచున్నది. ఫిన్లాండును వశపరచుకొనటానికి సైన్యాలను పంపిస్తే, రష్యాకూడ అక్రమదాడికి దిగినదను అపవాదు వచ్చుట నిశ్చయము. అందులో ఫిన్లాండు రష్యాలు ఒకరిపై ఒకరు పరస్పరదాడి గావించుకొనమను ఒడంబడికను యిదివరలో చేసికొన్నారు. రష్యా బెదరింపులకు లెక్కచేయకుండా ఫిన్ను దేశీయులు "రష్యాతో క్రొత్తగా ఒడంబడిక చేసికొని ప్రయోజన మేమిటి? ఇదివరలో చేసికొన్న ఒడంబడికకు విలువలేనప్పుడ"ని ప్రశ్నించటం మొదలు పెట్టారు. అదిగాక యీ యుద్ధము ప్రారంభము కాక పూర్వము ఫిన్లాండు తటస్థరాజ్యంగా ఉండేందుకు రష్యా ఒప్పుకుందట! అట్టిస్థితిలో యిప్పుడు రష్యాకోరికల నెరవేర్చిన ఫిన్లాండు తాటస్థ్యమునకు భంగము కల్గదా? స్వాతంత్ర్య రక్షణము ప్రతి స్వతంత్ర రాజ్యము యొక్క జన్మహక్కని ఫిన్నుల విదేశాంగమంత్రి గావించిన ప్రకటనము రష్యాకు కోపము కల్గించినదట! బుజ్జగింపులకు, బెదరింపులకు, దానములకు ఫిన్లాండు లొంగలేదు. ఫిన్లాండుసరిహద్దులవద్ద సైన్యాలనుసమకూర్చిన యుద్ధభీతి వలన సైనా లొంగకపోతుందా అనునమ్మకముతో స్టాలిన్ తన సైన్యాలను సరిహద్దులవద్ద సంసిద్ధ పరిచాడు. కాని ఫిన్నులు స్వతంత్ర రక్షణము కొరకు తమ సైన్యాలను సిద్ధ పరచటం ప్రారంభించారు. రెండు రాజ్యాలమధ్య యుద్ధము లేకుండా శాంతంగా వివాదము పరిష్కరించటానికి తోడ్పడెదమని అమెరికా, ఫిన్‌లాండు రష్యాలకు చెప్పింది. కాని రష్యా యీ సూచన అంగీకరింపలేదు. తుదకు సరిహద్దులవద్ద తన సైనికులపై అక్రమముగ ఫిన్ను సైనికులు తుపాకులు కాల్చిరని రష్యా ఫిన్‌లాండుతో చేసికొన్న పరస్పరము దాడి గావించుకొనమను ఒడంబడికను త్రోసిరాజని, ఫిన్‌లాండుపై దాడి గావించటానికి సన్నద్ధమైంది. నవంబరు ౩౦-వ తేదీనాడు రష్యా సైనికులు ఫిన్‌లాండుపై అక్రమదాడిని ప్రారంభించారు.

యుద్ధ ప్రారంభము

రష్యా దాడి ప్రారంభించగానే ఫిన్లాండు మంత్రివర్గమువారు మేనర్‌హీమ్‌సేనానికి సంపూర్ణ సైనికాధిపత్యము నొసంగి, దేశసంరక్షణమునకు యేర్పాట్లు చేయమన్నారు. దేశమందుగల వివిధపక్షముల ప్రతినిధులు గల మంత్రివర్గము యేర్పడుట అవసరమని ఫిన్లాండుమంత్రివర్గమువారు నిశ్చయించుకొని, తాము రాజీనామా యిచ్చారు. తరువాత సర్వపక్షముల ప్రతినిధులు గల మంత్రివర్గము రైటో ప్రధాని నాయకత్వముక్రింద యేర్పడినది. మంత్రివర్గపు రాజీ

నామా విషయము వినగానే రష్యా అధికారులు ఫిన్లాండులో తమపై అభిమానము గన్పరచువారిని ఒకచోటకు చేర్చి, వారినే ఫిన్లాండు ప్రజాప్రభుత్వపు మారిన మంత్రివర్గముగ యేర్పరచి, వారితో రాజీచేసికొన్నట్లు ప్రకటిస్తూ, రైటో ప్రధానిచే యేర్పరుపబడిన మంత్రివర్గము ప్రజలచే యెన్నుకొనబడినది కాదని ప్రచారము చేశారు. కాని రష్యాచేసిన ఎత్తువలన లాభమేమీ కల్గలేదు. ఫిన్ను దేశీయులు రష్యా యేర్పరచిన మంత్రివర్గముపై ఎట్టి అభిమానమున్నూ గన్పరచలేదు. రష్యా దాడిని ఎదుర్కొనటానికి ఫిన్ను దేశీయు లందరూ, పెద్దలు, పిన్నలు, స్త్రీలు, పురుషులు, యువకులు సైన్యాలలో చేరారు. ఇప్పుడు రెండుదేశాలమధ్య యుద్ధము చురుకుగా సాగుచున్నది. నాల్గురోజులలో ఫిన్నులను బానిసలుగా చేయవచ్చునని రష్యా దలంచినది. కాని ఫిన్‌లాండు యుద్ధమందు గన్పరస్తున్న అసమాన ధైర్యసాహసములు రష్యా మనస్సును కలతపరుస్తున్నాయి. ఇప్పటికి ౩౮ రోజులనుండి యుద్ధము సాగుచున్నప్పటికీ రష్యా యింకా ఫిన్‌లాండుసరిహద్దుల దాటి దేశమధ్యంలో ప్రవేశింపలేదు

అన్యరాజ్యాల సానుభూతి


రష్యాచేసిన అధర్మదాడిని పురస్కరించుకొని అంతర్జాతీయంగా సానుభూతిని, సహాయమును పొందటానికి ఫిన్‌లాండు సమితికార్యనిర్వాహకసభా సమావేశాన్ని, సాధారణసభా సమావేశాన్ని జరుపవలసిందని కోరినది. సమితివారు సమావేశమై విషయమంతయు తర్జన భర్జనగావించి, ఫిన్‌లాండుపై రష్యా అధర్మమును, ఆక్రమమును, న్యాయవిరుద్ధమును దాడిగావించినది కాన రష్యాను సమితిసభ్యత్వమునుండి తొలగించుటకు నిశ్చయించారు. సమితిసభ్యు లందరూ ఫిన్‌లాండుకు చేతనైనంతవరకు సహాయము చేయవలసిందని తీర్మానించారు. సమితి తీర్మానించిన తరువాత అన్ని రాజ్యాలవారును రహస్యముగను బహిరంగముగను కొద్దో గొప్పో ఫిన్లాండుకు సహాయముచేస్తూ ఉన్నట్లు కన్పడుతుంది. యుద్ధసమయమైనప్పటికీ అమెరికాకు యివ్వవలసిన బాకీమొత్తమును ఫిన్‌లాండు చెల్లిస్తే అమెరికా ఆ పైకాన్ని ఫిన్‌లాండుకు స్వాతంత్ర్యరక్షణమునకై ప్రసాదించినది. ఇంగ్లండు, ఫ్రాన్సు, యిటలీలు బహిరంగముగ ఫిన్‌లాండుకు సహాయము చేస్తున్నాయి. నార్వే, స్వీడెను సందలి యువకులు స్వచ్ఛందసైనికులుగ ఫిన్ను సైన్యాలలో చేరుతున్నారు. సముద్రమువీదుగా ఫిన్‌లాండుకు ఎట్టిసహాయమున్నూ రాకుండా బాత్నియాగల్ఫువద్ద ముట్టడి గావించటానికి నావికాబలసహాయమును ఇవ్వమని స్టాలిన్ హిట్లరును కోరగా అందుల కతడు సమ్మతించలేదు. ఫిన్నులు పట్టుదలతో పోరాడుట వలన రష్యాకు సైనికముగ గొప్పనష్టము కల్గుచున్నట్లును, ఆయుధబలమును చాలవరకు యుద్ధరంగమందు ఫిన్నులకు వప్పగించి రష్యాసైనికులు వెనుకంజవేస్తున్నట్లును వార్తలు వచ్చాయి. చలికాలమువరకు ఫిన్లాండు యుద్ధాన్ని కొనసాగించినట్లయితే రష్యా ఫిన్‌లాండును వశపరచుకొనటం కష్టం.

రష్యాకు నష్టముకల్గుట

ఈ యుద్ధంతో రష్యాకు సైనికముగ గల ప్రతిష్ఠకు గొప్ప దెబ్బతగులుట నిశ్చయము. అనుభవముగల నాయకులనందరిని స్టాలిన్ చంపించటంవలన యిప్పుడు సేనలను అనుభవంలేని యువకులు నడుపటంమూలాన ఫిన్‌లాండువంటి చిన్న దేశపు సేనలచేతనే ఓడింపబడుటకు అవకాశము కల్గుచున్నది. అదిగాక రష్యను సైనికులలో ఫిన్నులు ప్రచారమునుసల్పటం ప్రారంభించారు. ఈ ప్రచారఫలితంగా కొన్ని సైన్యాలు యుద్ధం చేస్తున్నట్లు నటించటం, యుద్ధానికని పంపిన సైన్యాలు యుద్ధసామగ్రిని ఫిన్నులకు వప్పగించి వారికి తోడ్పడటం సంభవిస్తున్నట్లు తెలుస్తుంది ఇట్టి కల్మషపూరితమైన సైన్యాలతో రష్యా యుద్ధాన్ని ఎల్లా కొనసాగింపగలదు? కొందరు సైనికనాయకులు యుద్ధమును సరిగ జరిపించుట లేదని స్టాలిన్ ముగ్గురు సైనికనాయకులకు మరణశిక్ష విధించాడు. సైనికులు చురుకుగా పనిచేస్తున్నది లేనిదీ విచారించటానికి రహస్యపు వేగులవాండ్రను సైన్యములతో కలిసిమెలసి విచారించటానికి స్టాలిన్ పంపినట్లును, వారు సైనికులను బెదరించి ఎచ్చుకెచ్చుట లోపములు గలవో కనుగొని స్టాలిన్‌కు దెల్పప్రయత్నిస్తున్నటులను వార్తలు

వచ్చాయి. ఇట్టిపద్ధతులపై సైన్యాలను యుద్ధరంగానికి పంపినయెడల విజయము యెట్లు సంప్రాప్తించును? ఫిన్లాండు యింతపట్టుదల నవలంబిస్తుందని స్టాలిన్ అనుకోలేదు. యుద్ధానికి దిగిన తరువాత వెనుకంజ వైచినట్లు యితే రష్యా ప్రతిష్ఠకు లోపము వస్తుందని స్టాలిన్ యుద్ధాన్ని కొనసాగిస్తున్నాడు. ఈయుద్ధమువలన ఆర్థికముగకూడ రష్యాకు చాలనష్టము వచ్చుట నిశ్చయము. యుద్ధములో ప్రవేశింపకుండ, జర్మనీ, యింగ్లాండు ఫ్రాన్సులమధ్య జరుగు యుద్ధాన్ని పురస్కరించుకొని సాధ్యమైనంతవరకు లాభాలు పొందాలని ఆశించిన స్టాలిన్‌కు ఫిన్లాండు వెలగముద్దవలె గొంతునడ్డ పట్టుకున్నది. ఫిన్లాండును తనతో కలుపుకొని రాకున్నచో యుద్ధమందు జర్మనీ బలము సంపాదించుకొన్న తరువాత బాల్టిక్ సముద్రమందు తనతో రగాడా పెట్టుకొనుట నిశ్చయమనీ, అప్పుడు ఫిన్లాండు జర్మనీపై సానుభూతి గన్పరచవచ్చుననీ, భవిష్యత్తులో జర్మనీతో యుద్ధం సంప్రాప్తిస్తే లెనిన్‌గ్రాడ్ సంరక్షణకు ఎట్టి అవకాశమూ ఉండదనీ, ఫిన్‌లాండు జర్మనీతో కలుస్తే ఉత్తరమునుండి విరోధుల దాడితిప్పికొనజాలమనీ స్టాలిన్ ఆలోచించి, ఎట్లయినా ఫిన్‌లాండులో తనపలుకుబడి, అధికారము చెలాయించాలని నిశ్చయించుకున్నాడు. అదికాకుండా యీ బాల్టిక్ రాజ్యాలను ఫిన్‌లాండును తనతో కలుపుకొని వచ్చినయెడల పూర్వపు రష్యాసామ్రాజ్యమును తిరిగి ప్రతిష్ఠింపవచ్చుననీ, జారుచక్రవర్తియలుపెట్టిన ఆదర్శము ఫలించుననీ స్టాలిన్ ఆశయము. ఎంతవరకు స్టాలిన్ ప్రయత్నాలు సఫలమగునో చూడాలి. కార్మిక కర్షక సేవకు, ప్రచారమునకు స్వస్తిచెప్పి, అక్రమముగ జాతీయోన్మాద్యపు మార్గమున స్టాలిన్ నడుచుటవలన రష్యాకు కూడా అప్పుడే క్షీణదశ ప్రారంభమయినట్లు తలంపవచ్చు. ఏలనన జాతీయోన్మాద్యమతత్వమే రష్యాలో నాల్గుమూలల ప్రాకినయెడల ఆదేశమందు గల వివిధజాతులకు చెందిన అల్పసంఖ్యాకులలో కూడ యీ తత్వము జీర్ణించి అంతఃకలహాలకు, తిరుగుబాట్లకు, అంతర్విప్లవములకు దారితీయుట తథ్యము.

(1—1—40.)



శ్రీ సూర్యరాయాంధ్ర నిఘంటువు

శ్రీ వడ్లమూడి వెంకటరత్నము

నేను పై శీర్షికతో సూర్యరాయాంధ్రనిఘంటువును విమర్శించుచు ఆంధ్రపత్రిక—ప్రమాది– ఉగాది సంచికలో నొక వ్యాసమును వ్రాసియున్నాను. దానిని పరామర్శించుచు ఆంధ్రసాహిత్యపరిషత్పక్షమున శ్రీ పెనుపాటి విశ్వేశ్వరశాస్త్రిగారు ప్రమాది సంవత్సర-భాద్రపదమాస – భారతిపత్రికయం దొకవ్యాసమును ప్రకటించియున్నారు. ఆపరామర్శను నొక్కమారు పరిశీలింతను.

శ్రీ శాస్త్రులవారు తమ వ్యాసము మొదట నా వ్యాససారాంశము నిటుల దెలిపియున్నారు. "తమ మిత్రులొకరు మహాభారతమునకు ప్రత్యేకముగా నొక నిఘంటువును రచించినారనియును, దానిలోని పదములును, సూర్యరాయాంధ్రనిఘంటువులోని పదములును వా మెత్తి వ్రాయగా మహాభారతనిఘంటు విచ్చినవి సూర్యరాయాంధ్రనిఘంటువులో అకారాదిపదముల లోనే యయిదు వందల పదములు కనబడలే దనియు, కనుక సూర్యరాయాంధ్రనిఘంటువు సమగ్ర నిఘంటువు గాదనియును తమకు దోచిన యా విషయమును లోకమునకు దెలుపుటకై యీ వ్యాసమును వ్రాసినారట" అని.

దీనినిబట్టి చూచినచో ఏదేని విషయమున దమ కభిప్రాయభేద మున్న యొక వ్యక్తిపై శాస్త్రులవారు దోషము లెట్టు లారోపింపగలరో తెలియవచ్చుచున్నది. ఏమనగా 'లోకమునకు దెలుపుటకై యీవ్యాసమును వ్రాసినారట' అనివారు అన్నారే అది సరికాదు. 'లోకమునకు దెలుపుటకై యీవ్యాసమును వ్రాయుచున్నాను' అని నే ననలేదు. వీరు 'అట' అని చేర్చి అది నామాటగా లోకమునకు చాటజూచినారు.

అయిదువందలపదములు లే వనుటయు, అది సమగ్ర నిఘంటువు కా దనుటయు నిజమే ; లోకమునకు ఇది తెలియగూడ దనియు నాతలంపు గాదు. కాని లోకమునకు తెలుపుటకై యే నేను వ్రాయలేదు. నిఘంటువున సమగ్రత కది యొకటియే కారణమును కాదు. ఆ నా వ్యాస మిట్లు ముగింపబడినది.

"ఇంతకును నిఘంటులోపములను పలువురి చెవుల వేసి పరిష్కర్తారిని పరిహాసపాత్రులను జేయుట నాయుద్దేశము గాదు. సమగ్రనిఘంటువు నాకాంక్షించువారు దాని స్వరూపమును స్థూలముగా నిర్ణయింప బూనుట సాహసము గాదు. అంగుల కిప్పుడు బయలు వెడలిన సంపుటములోని లోటుపాట్లను దెలిపి యవి దిద్దుట కవకాశము గల్పించుటయు సహింపరానిది గాదు. ఇది యంతయు భాషాభిమానమునసే, పరిష్కర్తృనిర్వాహకు లీ లోపములు గమనించి రానున్న సంపుటము లందైన నిట్టిలోపములు కలుగకుండునట్లు జాగరూకత వహించి అయిన యాలస్య మెటులైన నైనది గావున నింక కొంత యాలస్యమైనను సైరించి నిఘంటువు మాత్రము సమగ్రముగా నుండునట్లు ప్రయత్నింప ప్రార్థితులు" అని నా వ్యాసోద్దేశ మిటులుండగా శాస్త్రులవారు పైకిటుల నీయగారణ మేమొ! నా వ్యాసములోని విషయములలో కొన్నిటిని శాస్త్రులవారు ముక్తకంఠముతో నంగీకరించియే యున్నారు, చూడుడు. వారు నన్నుగూర్చి వ్రాయుచు "నిఘంటువువారు గ్రహించిన పదములకైనను సమగ్రముగా నర్థములు వ్రాయలే" దని యింకొక యారోపణము చేసినారు. "వ్యావహారిక శబ్దముల నన్నిటిని నిఘంటువులో గ్రహింపలేదని మఱియొక యారోపణముగూడ చేసినారు." అని సందర్భాను

లోకమునకు ఎదుటివారియొక్క దురభిప్రాయము గల్గించుటకై, తమ వాదమును బలపఱచుకొనుటకై తెలిసియో తెలియకయో ఎదుటివారి కొన్ని మాటలు వాక్యములు మార్చివేసిన అట్టి ప్రమాదము వేరు గాని ఉన్నతశ్రేణికి చెందిన విద్యాసంస్థయగు ఆంధ్రసాహిత్యపరిషత్పత్రికయందు జరుగు చర్చయందును ఇట్టి పద్ధతి గాని నడత విచారకరము. ఎదుటివారి వాదము నున్నతస్థాయికి గొనిపోదగిన పరిషత్తు తాను క్రిందికి [illegible]?

శాస్త్రులవారు నిఘంటునిర్మాతలలో నొకరగుటచే వారికి నిఘంటు విమర్శను పరామర్శించుటయే కారణము గాదు; కొన్ని తావుల నా విషయము సూచించినారు. చూడుడు. "నేను వీని నన్నిటిని వెదకి వ్రాసెను. 'ఉప సర్గ పూర్వక పదముల నన్నింటిని గ్రహింపక కొన్నింటిని (ముఖ్యములగు వానిని) మాత్రమే గ్రహించినాము' 'వివరముగా గ్రహించి యచ్చట నుంచినాము.' అనుచు నటనటు వ్రాసియున్నారు. కనుక పరిషత్తువారు ఉపసర్గాయుక్తములకు వీనిని నియమించినట్లు తెలియుచున్నది. కావున నీపరామర్శను పరిషత్పత్రికయందే వచ్చియుండుట సమంజసమే యగును.

వీరు మఱియొక తావున "వ్యావహారిక శబ్దముల నన్నిటిని నిఘంటువులలో గ్రహింపలేదు." 'అని మఱియొక యారోపణ మొనర్చినారు' అని యూహా కల్పము నా వాక్యముగా తోచునట్లు ఉద్ధరించినారు (క్షేపము)లో కూడ నుంచి చూపినారు. కాని 'వ్యావహారిక' శబ్దము నేను ప్రయోగించినది గాదు. నా వాక్యము లివి.

"గ్రంథపదము లిట్లుండగా దేశ్యపదము లెంతవఱకు స్వీకరించినారో చూతము. మన తెలుగు దేశ్యపదములు గ్రంథములు కావలసినవి, నిఘంటువుల కెక్కవలసినవి కొండలకొలదిగా నున్నవి. నేలలో నుండు వన్నె ఆశ్చర్యము గాదు."

"ఆమాటలు పూర్వపలయున్న . . . వాడుకలోని తెనుగుపదముల నేటికి పూర్వపలయును." ఇందు నా యుద్దేశము తెలుగు దేశ్యపదము లని స్పష్టముగా తెలియుచున్నదిగదా! మఱి శాస్త్రులవారు ప్రయోగించిన 'వ్యావహారిక' శబ్దము దేశ్యపదములన్న యర్థమునే స్పష్టముగా జూపగలదా? దేశ్యపదములను కావ్యములలో ప్రయోగించుటకు (నాకున్న అల్పపరిచయమును బట్టి) ఏలాక్షణికుడును నిషేధింపలేదు. కాని వ్యావహారిక శబ్దముల విషయ మింకను తర్జనభర్జనలో నున్నది. వ్యావహారిక మనునది శబ్దమున లోకరూపముగా తెలుపబడుచున్నది. ఆ శబ్దము తత్సమతద్భవదేశ్యములలో నేదైనను గావచ్చును. కాని, 'దేశ్య' మట్టి రూపభేదము గాదు, అది భాషలోని శబ్దములలో నొకతెగ. కనుక శాస్త్రులవారు వివాదగ్రస్తమగు శబ్దమును నామాటగా జూపుటకంటె, నామాటనే యుదాహరింపరాదా? వ్యావహారికమనగా గ్రంథము కానిభాష యందురా? అయినను ఆ యర్థమునన్నే లోకమున రూఢము గాకునదా! సరియే. వీని నింక పోనిండు. అసలు నా వ్యాసోద్దేశమును, దానికి శాస్త్రులవా రిచ్చిన ప్రత్యుత్తరమును కొంచెము సింహావలోకన మొనరింతము. సమగ్రనిఘంటువులో

౧. 'ఆంధ్రపదము లన్నియు మనభాషలో చేరిన యితరపదసమూహముతో నిమిడియుండవలయును.' అన్న నా యభిప్రాయమునకు శాస్త్రులవారు వ్యతిరేకముగ నేమియు ప్రకటింపలేదు. కనుక శాస్త్రులవారి కీయభిప్రాయ మంగీకార్యమే యనవచ్చును.

౨. 'ఆంధ్రపదముల యర్థపరిణామమును వివరింపవలయును.' అని నేను వ్రాసితిని.

ఈ విషయమును నిఘంటువులలో గలదని శాస్త్రులవా రనలేదు. అట్లు అనుటకును వీలులేదు.— ఏమనగా పూజ్యపాదులు జయంతి రామయ్యపంతులు గారే పీఠికయందు

"ఏయేయర్థ మెప్పుడెప్పు డేకాలమున నేర్పడినదో నిర్ణయించుటకు దగినసాధనసామగ్రి మనకు దొరకలేదు." అని వ్రాసియున్నారు. సమగ్ర నిఘంటువున

కీ విషయము నవసర మయినచో పీఠికలో నుదాహరించు టకే హేతువును లేదుగదా!

౩. 'శబ్దరూపపరిణామము వివరింపవలయును.'

అని నా యభిప్రాయము తెలిపితిని.

ఇదియును వివరింపబడ్డదని శాస్త్రులవారనలేదు.

౪. 'ఆంధ్రభాషలోని పదములు తత్సమములో, వైకృతములో, దేశ్యములో ఏ భాషనుండి వచ్చినవో, వాని మూలపదము లేవో, వానియర్థ మెట్లు మారినదో తెలుపవలయును.'

అని నేను వ్రాసితిని.

ఈ విషయమును శాస్త్రులవారు తమ నిఘంటువులో (సమగ్రముగ) నున్నట్లు చెప్పుటలేదు. సమగ్ర నిఘంటువున కిది యనావశ్యకము లనుటకును వీలులేదు. వీలయిన పీఠికాకర్త (దీనిలోని పూర్వభాగమును గూర్చి) పీఠికలో నిట్లు వ్రాసియున్నారు.

"ప్రాకృతాంధ్ర భాషలకు గల సంబంధము చక్కగా తెలుపు గ్రంథము లిప్పటివంతగా లేవు. ఈ సంబంధ మింకను విమర్శనపూర్వకముగా నిర్ణీతము కావలసియున్నది. వర్తమానకాలమందీ విభాగము చేయుట సాహసముగా నుండుటను కృతిచేత మానివేయుట జరిగినది."

౫. 'తెనుగుశబ్దములకు ధాతువు లేవో నిరూపింప వలయును.' అని నేను.

దీనినిసయితము సమగ్రముగా సమకూర్చి నట్లు శాస్త్రులవారు పలుకుటలేదు.

౬. 'గ్రామనామములు మున్నగుశబ్దముల మూల రూపములు తెలిపి వానియర్థములను, వాని పరిణామములను, ఆశబ్దముల చరిత్రములను క్రమముగ నెఱిగింప వలయును.' అని నేను.

ఈ విషయమును నెఱిగించినట్లు శాస్త్రులు వారు తమ సమాధానములో చెప్పుటలేదు.

౭. 'భాషలోని రూఢశబ్దములను గూర్చియైన నీ విషయమైన మనకు విస్పష్టముగా నెల్లెడింప వలయును.' అన్నాను నేను.

ఇట్లు చెల్లింపగలదని వీరు తమనిఘంటువును గూర్చి తెలుపుటలేదు. ఇంతియేకాక 'అరుణము' 'ఇరువంబలుడు' మొదలగుశబ్దముల కీ సంపుటములో లేవనియు, ఇట్టివాని నొక యనుబంధముగా ప్రత్యేకముగ తయారుచేసియుంచినా మనియు చెప్పుచున్నారు. మఱియు "'అన్నప్రాసనము' మొదలగు శబ్దములలో గూడ నిక్కి సప్రయోగముగా నీభాషను నే వ్రాయుట న్యాయ్యము. వాని ననుబంధములో జూపితిమి." అనియు తెలిపియున్నారు. కనుక శాస్త్రులవారు ప్రత్యుత్తరము లిచ్చినవిషయముల నన్నిటి నొప్పుకొన్నను నిఘంటువు సమగ్రము కాదనుటకు ఈ పై విషయములే చాలును.

ఇక శాస్త్రులవారి యభిప్రాయముల నొకమాఱు పరిశీలింతము.

నిఘంటువుల కెక్కవలసిన దేశ్యపదములు పెక్కులు గలవనుచు నే నుదాహరించిన (అబ్బరలు, ఆటే ఆటు అనుట యుచితము) ఆమాంతము, ఊకము, అత్తనపు సెగ, అరికలు, అంకెవేయుట, ఉచ్చిళ్లు, తయగట్టుట.) వానిలో 'ఊకము' అనుదానింగూర్చి శాస్త్రులవా రిట్లు వ్రాసియున్నారు.

"దీనిని ఊహాము అని పెక్కురును, ఊగము అని కొందఱును, ఊఘము అనిమఱికొందఱును వ్యవహరించు చున్నారు. విమర్శకులు ఊకము అని వ్రాసియున్నారు. ఇప్పుడీ నాలుగు రూపములలో దేనిని గ్రహింపవలయును? ఒకటి గ్రహించిన తక్కినవి గ్రహింప కుండుటకుగల కారణ మేమి? అన్నియును గ్రహించిన నేవి సాధువులు? ఏవి అసాధువులు? వీని సాధుత్వాసాధుత్వములకు ప్రమాణ మేమి?.....ఇది గ్రాంథిక భాషానిఘంటువు గాని, వ్యావహారిక భాషా నిఘంటువు గాదుగదా! మఱియు నీ నిఘంటువు సందిగ్ధార్థరూపములు, సప్రమాణములునగు వ్యావహారిక శబ్దములను తెక్కింటిని గ్రహించియే యున్నది" అని వ్రాసియున్నారు.

మంచిది. దేశ్య పదప్రయోగము నే లాకుశించు [illegible]

ప్రయోగించుటకు ఎవరును అడ్డుపెట్టలేరు గదా! అట్టిచో నిపుడీ శబ్దము నెవరైన గ్రంథకర్తలు ప్రయోగింతురనుకొందుము. అపుడది గ్రాంథికమయి నిఘంటువులోని కెక్కదగునుగదా! ఈ నాలుగు రూపములను గ్రంథములలో కానవచ్చినచో నపుడు పరిష్కర్తలేమి చేయుదురు? ఏ రూపమును గ్రహింతురు? ఎక్కువమంది దేనిని వాడుదురో దానినా? యతి ప్రాసలలో చేరుప మిడిమిడియుండునో దానినా? లేక వ్యాకరణము ననుసరింప బ్రయత్నించిన గ్రంథప్రయోగమునా? వ్యాకరణములో చెప్పిన శబ్దజాలము వ్యాకరణము ననుసరించినను వ్యాకరణములు చెప్పని ఉకముకంటె దేశ్యశబ్దములు దేని ననుసరించి ప్రయోగింపబడును? ఏ దేని రూపము ప్రయోగించుటకు ఆ వ్యాకరణబద్ధగ్రంథకర్తకు గల యాధారమేమి? ఆయొక్కనికి లభించిన నిర్ణయభక్కి సాహిత్యపరిష్కర్తకు లభింపదా? వ్యాకరణబద్ధగ్రంథములలో పై నాలింటిలో చేరుప యున్నను దానిని గ్రహియింతురా? లేక ముద్రణప్రమాదమనియో, లేఖకప్రమాదమనియో, కవిప్రమాదమనియో దిద్దుదురా? అట్లు దిద్దుటకు వీరికిగల యాధారమేమి? కవులు నిరంకుశులు; వారియిష్టము వచ్చిన శబ్దములు ప్రయోగింపవచ్చు నందురా? అయినచో ఏశబ్దము లెటు లున్నను దిద్దుటకు పండితుల కవకాశము లేదుగదా! దిద్దుటకు పండితుల కవకాశము లున్న నందురా? ఆ పనియిప్పుడేల చేయరాదు? కవులు ప్రయోగించినవానినే దిద్దదగును గాని ప్రయోగింపని వానిని దిద్దరాదందురా యేమి?

ఈ నాలుగురూపములును గ్రంథప్రయుక్తములే యైయున్నచో బహుశః పరిష్కర్తలు రోకటిని చేసియుందురు. 'ఉఘము'లో తెలుగున లేని ఘకారమున్నది గాన దీనిని కొట్టివేసియుందురు. ఊహము— క గలకు వ్యవహారములో తఱుచుగా హకారము కానవచ్చుచున్నది కాన (ఒకటి, ఒహటి, ఇక; ఇహ, మొగము; మొకము; మొహము, మొ) దీనిని కూడను త్రోసివైచి యుగమునో, ఉకమునో లేక యీ రెంటినో గ్రహించియుందురు. (క గలతో రూపభేదములు గలవి మొగము, మొకము, సగము సకము, ఇక ఇగ, వచ్చిక వచ్చిగ మొ) అటులే యిపుడేల చేయరాదు?

"అసందిగ్ధార్థరూపములు సప్రమాణములు నగు వ్యావహారికశబ్దములను పెక్కింటిని గ్రహించియే యున్నది." అని శాస్త్రిలవారు సెలవిచ్చియున్నారు. ఈ నిఘంటువునందు గ్రహింపబడిన వ్యావహారికశబ్దముల ఉచ్చారణరూపములో గాని, అర్థములో గాని సందిగ్ధత లేదా యేమి? ఇందు గ్రాహ్య శబ్దోచ్చారణము, అర్థములే ఆంధ్రదేశమునందంతటను వ్యవహారములో నున్నవా?

ఈ వాక్యమున 'సప్రమాణములు' అని శాస్త్రిలవారు సెలవిచ్చియున్నారే; వీరు గ్రహించిన వ్యావహారికములకు ప్రమాణమేమి? ఆ ప్రమాణము లాక్షణికమా? వ్యావహారికమా? లాక్షణికమయినచో గ్రంథస్థమేగదా! అప్పు డది గ్రాంథికమే యగునుగాదా? 'అది కవిప్రయుక్తముగాదు; శబ్దరత్నాకరాదులు సంగ్రహించిన వ్యావహారికము" అందురా? రత్నాకర్తల కాధారమయిన నియమము సాహిత్యపరిష్కర్తకు దుర్గమమా? వారి కవసరమని తోచిన దేశ్యపదములు సమగ్రనిఘంటురచనమునకు బూనుకొన్న సాహిత్యపరిషత్తున కవసరములుగా దోపలేదా? ఆ ప్రమాణము కేవల వ్యావహారికమే యందురా? ఎవరి వ్యావహారికము? ఆ వ్యవహారము ప్రమాణముగా గొనుట కాధారమేమి? ఆరూపముతో నా శబ్దమును మాటలాడువారే శిష్టులని నిర్ణయ మెట్లు? 'ఉకము' విషయమున శాస్త్రిలవారడిగిన ప్రశ్నల నన్నిటిని మన మీసందర్భమున నడుగవచ్చును.

ఇప్పుడు పరిష్కర్తవారు నిఘంటువునందు చేర్పక విడిచిన దేశ్యపదము లన్నియు శబ్దరూపములలో, అర్థములలో భిన్నత్వ ముండుటయే కారణమా? నేను నావిమర్శనములో నుదాహరించిన 'ఉకము'ను గూర్చి శబ్దరూపములో భిన్నత్వ మున్నదన్నారు శాస్త్రిలవారు. కాని మిగిలిన అమాంతము, అంకవేయుట, అలికిలి, ఆయకట్టుట మొదలగు పదములు నిఘంటువులో గ్రహింపకుండుటకు గారణము శబ్దరూపము

లలో, అర్థములలో భిన్నత్వ ముండుటయేనా? అయి నచో నే యేరూపములలో, నే యే యర్థములలో, నే యే ప్రాంతములం దెట్టెట్టులు వాడుకలో నున్నవో పరిషత్తువారు ప్రకటింపగలరా? లేక యివి గ్రంథస్థములు కావని గ్రహియింపలే దందురా? అందులోని కొన్ని పదములు గ్రంథముల కెక్కియున్నవి. చూడుడు.

౧. అమాంతము :—

చ "......క,
న్నలుగిరికింది తూర్పుమల
నున్నని తిన్నెల జాబునీటిమ
బ్బులపయి వాడుచుం దరలి
పోరు నమాంతము రెప్పపాటులో.
—క్షేత్రలక్ష్మి, ౧-౧౪

"...అమాంతముగ నొక్కడూరు దూర (అల్లక) శ్రీ వేదుతులు ఉభయభాషాప్రవీణులు తుమ్మల సీతారామమూర్తి చౌదరిగారిది.

సీ. "కీటికిరువ క్రింద నిలువుదోపిడి చేయు
ఉద్యోగి మాటల లాలుచువాడ
తన కులంపు చాల దని యుల్లసిల్లెడు
పంచులు దోలగ ద్రోయించువాడ
చదువు సంఘాలపేర చెదపుర్వువలె చేరి
కొండ నమాంతము గుండె కొలుచువాడ"
—క్షేత్రలక్ష్మి, ౫-౪౧.

ఉ. "......పలుకైపుల కైతము గోలపుచ్ఛ్యధీ
మంతుల దృష్టిదోషము న
మాంతము దగ్ధమొనర్ప జేలరా."
—క్షేత్రలక్ష్మి, ౧-౨౦

గ్రామ్యము మిశ్రపదముగా దీనిని కూర్చినది.

శబ్దరత్నాకర మీ శబ్దమును గ్రహించినది "అమాంతము. దే. వి. ౧. చిల్లర బేరము; ౨. అకస్మాత్తు"
—శబ్దరత్నాకరము, ౩౩ పుట

ఆంధ్రవాచస్పత్యమును దీనిని సంగ్రహించినది. "అమాంతము. దే. వి. ౧. చిల్లర బేరము; అవ్య. ౨. అకస్మాత్తు" —ఆంధ్రవాచస్పత్యము ౧౪౧ పుట.

౨. అటక:—

మ. "అటకల్ లేవ మఱేమి వెల్లివడుచా!
అపాదమస్తంబు పెం,
బిత్తై జాడినమాడ్కి భగ్నమగు నీ
చిత్తెంచకున్..."
—క్షేత్రలక్ష్మి, ౩-౪.

౩. అంకవేయుట:—

సీ. "అంకవేసెడి కోడె యంకవేసిన మట్టి
తెగియుండి చెవి బట్టి తెచ్చు నొకడు."

— శతావధాని త్రిపురనేని రామస్వామిచౌదరిగారి సూతపురాణము ౪. ఆ. ౧౧౩ ప.

ఉ. "కాటుకకన్ను దోరగిలి
కాడికి రాక పెడం కవేసి కోం,
డాటకమాడు కోడెల కె
డమ్ముగ నిచ్చిన రైతుకన్నులన్."
—క్షేత్రలక్ష్మి, ౧-౯.

ఆ. "బట్టకొడవు జల్లు పనికుంపు గావించె
కొంద్రవేర దున్న కొనెడువాడె,
తడపచుట్టి మేడి తలక్రిందలై పోరు
అట్టు మోప కద్దు లంకవేసె."
—క్షేత్రలక్ష్మి, ౧-౧౭.

"అంక. దే. వి. ౨ మెడమీదనున్న కాడి మెడక్రిందికి దెచ్చుకొనుట"
—ఆంధ్రవాచస్పత్యము.

"అంక—దే. వి ౧...౨ అణకయొక్క రూపాంతరము" —శబ్దరత్నాకరము, ౧ పుట.

అణక అను శబ్దమునకు (దే. వి. మెడమీద నున్న కాడి మెడలుగువానిని మెడక్రిందికి దెచ్చుకొనుట. అని) అర్థము శ్రీ విక్రమార్కచరిత్రములోని లక్ష్య మీయబడియున్నది. ఇదే యర్థమును, ఇదే లక్ష్యమును ఈ అణక అను రూపమునకు సూర్యరాయాంధ్ర నిఘంటువును ఇచ్చియున్నది కాని 'అంక' అను రూపాంతరమును (ఆ యర్థము నిచ్చుదానిని) గ్రహింపలేదు. ఈ అంకయే అంక అయియుండును (అంక

వన్నియ, అంకెవన్నియ మొ॥ వానివలె) (సూ. సూ. ఆం. ని, "అంకెవన్నియ" "అంకె చేసుకొనుట or అణకె చేసుకొనుట. U. N. To be restiff, as a bullock in the yoke. ఎద్దు కాడి కెదురుతిరుగుట. వాడు చేపచేపకు అంకె చేసుకొంటాడు He turns resteff" —బ్రౌణ్యము.

౪. ఉచ్చిళ్లు:—

సీ. "పప్పు పచ్చడి వాయపదును రా దిగిచిన
తోలిముద్దకే నోట జలము గ్రమ్మ
అలచేతిలో నుజ్జు పెరిగిపోవుకొలంది
ఉచ్చిళ్లు నాల్కపై కుదుటుమాపు"
—శ్రీలక్ష్మి, 3-౧౦.

౫. "ఆటుట:—

U. N To suffice: to last నాన్ని పొదుపుగా వాడితే యింకా నెలదినములకు ఆటివచ్చును. with caution it may suffice for a month ఆటదు or ఆటిరాదు. It is not enough కష్టపెలు చొక్కమాటుగా తీసుకొంటే ఆటివస్తుంది. చిల్లర చిల్లరగా తీసుకొంటే ఆటిరాదు." —బ్రౌణ్యము.

౬. ఆయగట్టుట:—

ఆ. "కడుపు నాయగట్టి కల కెల్ల నున నిచ్చి
పరువు నిలుపుచున్న భాగ్యశాలి...
—శ్రీలక్ష్మి, 3-౧౪.

ఇది కుదుక, తాకట్టు అనునర్థము నిచ్చు 'ఆయకము' అను దేశ్యపదమునుండి వచ్చియుండునేమో ?

ఈ పై నుదాహరించిన పదములు గ్రాంథికములు గావా ? లేక గ్రంథకర్తలు శిష్టులుగారా? ఇట్లు నిఘంటువురచనాకాలమునందే యసమగ్రమగుటకు దేశ్యపదములను గ్రహింపకపోవుట యొక ప్రధానకారణమే గదా! వ్యస్తపదముల నటుంచుడు. "సమస్తపదములలోని అంగములను పెక్కులు వివరణమును వాంఛించుచున్నవి." అని ఆఱు, ఆరు, ఏడుపదములను నే నుదాహరించియుంటిని. అవి యన్నియు సుప్రసిద్ధములే. కాని శాస్త్రిలవారు ఆశబ్దముల విషయమైన ప్రస్తావన యెత్తుకొనలేదు. చూడుడు.

౧ ఆది:— (అ)

సీ. "ఏడాదిపోడుగున నింత తీరిక లేక
చేలలో గష్టించు సేద్యగాండ్ర"
— శ్రీరాయప్రోలు సుబ్బారావుగారి జడకుచ్చులు ఆహారతియను.

ఏడు + ఆది అని సూర్యరాయాంధ్రనిఘంటువులో నయిరి మిచ్చి ప్రయోగములు చూపబడియున్నవి. కాని 'ఆది'నిగూర్చి యేమియు తెలుపుటలేదు ఆంధ్రవాచస్పత్యము . . . (ఆదిశబ్దము నిరర్థకము. ఇట్లు శబ్దములు మహాకవిప్రయోగములందు ఇంకను కొన్ని గలవు. పంచాది, పాటాది మొ॥) అని వ్రాసియున్నది. శబ్దరత్నాకరము నిటులనే వ్రాసియున్నది.

(ఆ) పంచాది:—

సీ. "పంచాదియరుగుపై పంచాస్త్రు బాణ స
మాకులమానసుం డగుచు నుండె"

—పరమయోగివిలాసము 3. ఇది శబ్దరత్నాకరమున నుదాహరింపబడ్డది.

(ఇ) ఒడ్డాది:—

సీ. స్. "మారెనులు ప్రేళ్ళ నొడ్డాది మోదునర్చి"
—మనుచరిత్ర, ౧-3౬.

ఒడ్డాది=ఒడ్డాది యనెడు పట్టణమును(ఓఢ్రదేశము అని కొందరు) అని వ్యాఖ్య.

ఈ శబ్దమును లక్ష్మినారాయణీయ మిచ్చి దీనికి ప్రకృతి "ఓఢ్రా" అని వ్రాసియున్నది. శబ్దరత్నాకరమును, ఆంధ్రవాచస్పత్యమును దీనిని గ్రహించినవి కాని సూర్యరాయాంధ్రనిఘంటువు గ్రహింపలేదు. సంగ్రాహ్యకము గాన నిడబడియుండదా? కాక అపశబ్దమా? లేక అనావశ్యకమా? గృహీతమా? తటాకల వ్రాతలలో మఱి యేమేని యున్నదో! ప్రసంగవశమున దీని నిపుడు చెప్పవలసి వచ్చినదిగాని నిఘంటువులో లేనిపదములను మఱికొన్నిటి నిపుడు చూపుట నా యుద్దేశము గాదు.

ఈ పద విభక్తివులను వాడియున్నారు.

సీ. "పేరాది యొద్దాడి భారాదులను వచ్చు
గోనెలు తేటగాలు గోతములును"
—హంసవింశతి, ౪-౭౪.

(ఈ) పేరాది:—

పై హంసవింశతిపద్యము. నిఘంటువులు దీని నీయలేదు. పరిమన్నిఘంటు విచ్చునా?

(ఉ) ఏనాది:—

ఈ పదము నన్ని తెలుగునిఘంటువులు నిచ్చినవి.

(ఊ) బారాతి:—

క. "ఓరోరి రాచవాడా!
రారా నా వెంటదిరుగరా బాసుదపై
బారాది మాడలి చ్చెద
కోరా నీ యప్పు దీర్చుకోరా యనుచున్"
—హరిశ్చంద్ర నలోపాఖ్యానము, ౪-౨౩౩.

క. "వా రిరువురు తమ లోపల
వైరము గొని రాజ్యకాంక్ష విజిగీషువులై
పోరాపోరిం బోరిరి
బారాదిదినంబు లవని ప్రజలు దలంపన్"
—ఆముక్త మాల్యద ౩-౨౧.

ఈ రెండు లక్ష్యములను బ్రౌణ్యమిచ్చుచు దివ రకు "టి. పారాదిదినంబులు అనగా పండ్రెండు దినములు" అని యర్థము వ్రాసియున్నది. ఈశబ్దము పకారాదిగా నూడ గలదా? ఇది ఆముక్తమాల్యదలో ౩-౧౫ గా నున్నది. అందు ౨-వ పాదము "వైరము గొని . . ." అనియున్నది. బారాదిపదము మనుచరిత్రను (౪-౩౭) పాండురంగమాహాత్మ్యము (౪-౨౩౨) లందును గలదు. ఈలక్ష్యములోనే శబ్దరత్నాకరము నిచ్చియున్నది.

(ఋ) ఉత్తరాది, దక్షిణాది:—

"...ఆది. . . ఉత్తరాదినుంచి వచ్చినారు, ఉత్తరాదివాండ్లు, దక్షిణాదిసరుకులు." (బ్రౌణ్యము)

(ౠ) ఇట్లు జాలాది మొదలగుశబ్దములును గలవు.

ఇట్లు పెక్కుశబ్దములలో అదిపదము కనబడుచున్నది. దీనినిగుఱించి తెలిసికొన దలచిన పాఠకులకు సమగ్రనిఘంటువు నేమి సమాధానము చెప్పును?

ఇల్లే:—

ఆరు:—

ఆరుకొండ, ఆరువీడు, ఆరుకోణము, ఆరుపల్లి మున్నగు మాటలలోని ఆరున కర్థ మేమి?

ఏరు:—కోనేరు, కొల్లేరు, పాలేరు, నల్లేరు, పల్లేరు మున్నగు మాటలలోని ఏరున కర్థ మేమి?

"అయితానగరము, అయితవోలు, అయితము, అయితాపల్లె మొదలగు ఊళ్ల పేర్లలో అయితా అనుశబ్దము కనబడుచున్నది. బాలచంద్రుని తల్లి 'అయితాంబ' ఈ అయితకు మూల మేది? ఈనామముతో నేవి యొకరైన గలరా?"

ఇవి అపశబ్దము లందురా? లేక అనావశ్యకములా? కాక గృహీతములా? పరామర్శములో శాస్త్రిలవారు పైవిషయములకు ప్రత్యుత్తర మీయలేదేమి?

ఇందులో అమాంతము మిశ్రాంధ్రము గాన నీయలే దందురా? 'అంతరదామర', 'అంతరపల్లటి' మొదలగు శబ్దముల నిచ్చినదే! అంతకంటె 'అమాంతము'లో వచ్చిన అపాయ మేమి?

పైన దాహరించిన కొన్ని మాటలలోని 'అది' పదమునకు ప్రదేశవాచకమగు 'అధి' అను సంస్కృత పదము మూలమై యుండునేమో చూడుడు ఆప్టే నిఘంటువు "అధిః ౪ A place, residence ౫ Location, Site" ఈ 'అధి' 'ఉత్తర' మొదలగు వానిలో చేరి వైకృత మయి యుండవచ్చును. వైకృత మయి పంచ మొదలగువానిలో చేరి యుండవచ్చును. పండితు లాలోచింతురు గాక! నిఘంటువిమర్శనమునకు పరిమిత్వంశీతులు ప్రత్యుత్తరము లిచ్చుట న్యాయ్యమే; అయ్యును విమర్శకుల పాండిత్యలోపము నెన్ని తత్కారణమున వారికి విమర్శన కధికారము లేదనుట సమంజసము గాదు. నిఘంటువిమర్శనమునకు పండితుల కర్హత గల దనుట నిర్వివాదమే. వారు నిఘంటు లాభాలాభములను, ప్రయోజనకరములగు విధానములను సమగ్రముగా చర్చించి నిర్ణయింపగలరు. శ్రీయుతులు మహామహోపాధ్యాయులు గిడుగు వేంకటరామమూర్తి పంతులుగారివంటివారు అట్టిమార్గముననే విమర్శించుచున్నారు.

రచించబడ్డదో వారిలో నొకరు నిఘంటువు లేటు లున్న దేమ ఉపయోగకరముగ నుండునో ఆ స్వరూపమును సామాన్యముగ రూపించుటకు సమగ్రజ్ఞానసంపాదిత్య మక్కర లేదు. కాని నిఘంటునిర్మాతలకు మాత్రము శబ్దార్థములకు సంబంధించిన యన్ని విషయములందును సమగ్రపాండిత్య మవసరము. కనుక విమర్శకులకు సంపూర్ణపాండిత్యము లేదని రచయితలు తమసంపూర్ణ పాండిత్యమును నిరూపించుకొనవలసి యున్నారు. కొన్నిమాటలకుమాత్రమే మర్దించబడినవి. కొందరు కవిపదముల యను కొన్ని యర్థములను కొనవలెను మర్దించక తమ యర్థసంగ్రహశక్తికొలది రచించుటయే జరుగవలెను. కాని నిఘంటు కట్టడి గాదు. అది రచయితల యర్థసంగ్రహశక్తి గాదు; చదువుకొన్నవారిలో నొకవరికి కీర్తి గాదు. దాని ప్రయోజనరంగము విశాలము. భాషాభిమాను లెల్లరును నిఘంటుప్రయోజనము నొందవలసి యున్నారు. కనుక వారు తమ తమ యభిప్రాయములను వెల్లడించుటకు శాస్త్రీలవారు కినియక యుందురు గాక!

(సశేషం.)

పుస్తక సమీక్ష

రషీదా

(రచయిత: వఝ్ఝ శ్రీ కృష్ణమూర్తి. వెల అర్ధ రూపాయి. ప్రతులకు — వఝ్ఝ వీరభద్రరావు. ధూళిపూడి Via రేపల్లె.)

ఇది ఒక చారిత్రిక నాటకం. ఇందులోని కథ అక్బరుకాలంనాటిది. రాజభక్తుడు, విద్వాంసుడు నైన ముర్తాజ్ మతసంబంధ మైనవిషయాల్లో అక్బరు వల్ల అవమానింపబడతాడు. ముర్తాజ్ ఎక్కువ మతావేశంకల వాడసుడు. ఇప్పటివరకు చూపించిన రాజభక్తిని వదలుకొని, ఇప్పుడు చక్రవర్తితో విరోధించడ మంటే అతని మనస్సు వెనకముందు లాడుతుంది. కాని అతని మిత్రుడు రాజా అతన్ని ప్రేరేపిస్తాడు. అప్పుడు ముర్తాజ్ తన ఏకైక పుత్రిక రషీదా చెప్పే హితోక్తులనైనా వినకుండా నలువైపుల చక్రవర్తికి వ్యతిరేకంగా ప్రచారం చేస్తాడు. అదే సమయంలో అక్బరుకొడుకు సలీముకూడ తండ్రికి విరుద్ధంగా తిరుగుబాటు చూపుతాడు. అక్బరు వృథాగా ముర్తాజ్‌ను అవమానించానుగదా అని పశ్చాత్తప్తుడౌతాడు.

అక్బరు బయట తిరుగుతూఉండే సమయంలో ముర్తాజ్ కత్తి తీసుకుని అతని మీదికి దుముకుతాడు. అప్పుడు ఒకయువకునివేషంలో రషీదా హఠాత్తుగా ఇద్దరి మధ్యన ప్రవేశిస్తుంది. ఆ దెబ్బ రషీదాకు తగులుతుంది. తరువాత సైనికులు ముర్తాజ్‌ను బంధిస్తారు. అతనికి మరణదండన విధించబడుతుంది. కాని రషీదా అక్బరుదగ్గరకు వచ్చి తనతండ్రికి ప్రాణభిక్ష పెట్టమంటుంది. తరువాత చచ్చిపోతుంది. కుమారసేనుడు అను ఒకయువకుడు రషీదా చచ్చిపోయిందని వినగానే, అక్బరు తనప్రధానిగా ఉండవలసిందని కోరినా వినక, ప్రేయసికొరకు ఇహలోకయాత్ర చాలిస్తాడు.

సాహిత్యానికి ప్రాతిపదికం సౌందర్యం. ఆ సౌందర్యం పాత్రల కష్టసుఖాల్లో, జీవితవికాసంలో, మనోభావాల్లో ప్రస్ఫుటితం కావాలి. అందులోనూ నాటకంలో పాత్రల వ్యక్తిత్వం దృఢంగా, స్వాభావికంగా ఉండాలి. నాటకంలోని ఘట్టాలు, భావాలు ఒకదాన్ని ఒకటి ఒరుసుకుంటూ మనోవేగంతో ముందుకు పోతున్నట్టు కనపడాలి. అప్పుడే నాటకంలో జీవం వస్తుంది. అంతర్ద్వంద్వం, బహిర్ద్వంద్వం ఈ రెండు నాటకానికి ముఖ్య సూత్రాలు. ఈరెంటిల్లో ఏది లోపించినా నాటకంలో కొంత లోటు వస్తుంది. ఈద్వంద్వమే జీవితంలోని నిగ్గును బయటికి తీస్తుంది. ఇది లేకుండా పెద్దపెద్దపాత్రలు, గొప్పగొప్పఘట్టాలు ప్రవేశపెట్టినందువల్ల ప్రయోజనం లేదు. నవలలో వెనకముందు సందర్భాలు చెపుతూ పోవచ్చు. నాటకంలో అది వీలుకాదు. నాటకపాత్రలు తమజీవితసమస్యల్లోంచే కథను ముందుకు సాగించాలి.

ఈ దృష్టితో రషీదానాటకం విమర్శిస్తే నిరాశయే కల్గుతుంది. ఇందులో ఒకపాత్ర ఐనా సరియైన వ్యక్తిత్వంతో ప్రకాశించ లేదు. సలీమ్, ముర్తాజ్, కుమారసేనుడు, అక్బరులు అందరు ఒకే రకంవారు. అక్బరు ఎంత ఆత్మవివేకి ఐనా చక్రవర్తి. ముర్తాజ్ రాజభక్తిని వీడి మతోద్ధరణకు నడుము కడతాడు. కాని చివరికి మిత్రుడైన రాజావల్ల మోసపోయినానని వాపోతాడు. కుమారసేనుడు తన ప్రేయసి అక్బరుని రక్షించటానికి సిద్ధపడుతూంటే ధన్యవాదము చెప్పి తప్పుకుంటాడు. ఇక నాటకం చివరే అతను దర్శనమిస్తాడు. ఈపాత్ర నిష్ప్రయోజనం. ఇక రషీదా! రషీదా మారువేషంలో తిరుగుతుంది. ఆవిడ ఉద్దేశ్యం ఏమిటో ఎక్కడా బోధపడదు. ఆమెకు ప్రణయసంబంధం కల్పించడం రాతికి వివాహంచేసినట్టే. రషీదాచరిత్ర డిటెక్టివునవలకు ఎక్కువ అనుకూలంగా ఉండేదని మా నమ్మకం. చారిత్రిక నాటకంలో ఘట్టాలు మార్చవచ్చా అనేది ఒకప్రశ్న. రససృష్టి కళాకారుని లక్ష్యంగనక, కొంతవరకు స్వతంత్రం చూపించవచ్చు. చరిత్రకారుడు వరుసగా ఘట్టాలన్నీ [illegible] ఏకరువు పెడతాడు. కాని [illegible]

చేయవీలులేదు. అతనికి కావలసింది సౌందర్యం. పాపం, పుణ్యం, సాంఘికం, ఆర్థికం, లాభం, నష్టం అన్ని విషయాలకూ సౌందర్యదృష్టితో పరిణామాన్ని తేలుస్తాడు. హృదయంలోని భావద్వయాన్ని తీవ్రరూపంలో చూపించడమే అతని పరమలక్ష్యం. అందుకనే కళాకారుడు చరిత్రలోంచి తన రససృష్టికి అనుకూలించినంతవరకే గ్రహించి మిగిలినవాటిని వదిలివేస్తాడు. అందులోనే కళాకారుని ప్రతిభ చమత్కారం చూపుతుంది.

ఇంకా నాటకానికి సంభాషణ చాలా అవసరం. తాను చెప్పదలచుకున్న దానిని ఇద్దరు పాత్రల ద్వారా చెప్పిస్తే బాగుంటుంది కాని పేజీలకు పేజీలు ఒకేవ్యక్తిచే మాట్లాడించడం బాగుండదు.

రచయితకు నాట్యకళాకోవిదులు డాక్టరు సుబ్బారావుగారి ఆశీస్సులు లభించినాయి. రచయిత వయస్సునిబట్టి చూస్తే నాటకంలోని దోషాలు కొంత వరకు క్షమ్యం. ముందుముందు రచయిత తన కళాభిజ్ఞతను వృద్ధిచేసి చారిత్రక నాటకాలను ఆంధ్రలోకానికి అందచేస్తారని ఆశిస్తున్నాం.

వేంకటేశ్వరరావు.

రైతుబిడ్డ

కర్త. శ్రీ పన్నీసు రామారావుగారు, వినుకొండ, గుంటూరుజిల్లా. వెల ఎనిమిదణాలు.

సాహిత్యం కొన్నాళ్ళు ఆదరించేవాళ్ళు పట్టణాలలోనే ఉండటంచేత పట్టణాలవైపే నడిచింది. మళ్ళీ ఇప్పుడు వెనక్కు తిరిగి పల్లెలవైపు ప్రవహిస్తున్నది. పట్టణాలలో నివసిస్తూ నాగరికజీవనాని కలవాటుపడినవారికి పల్లెటూరి సమాచారాలు బొత్తిగా తెలియవు. అందువలననే గ్రామసౌభాగ్యంకొరకు పట్టణవాసులు చేసిన శాసనాలు నిష్ఫలమై ఎడారిలో నదుల మాదిరి మధ్యలోనే ఎండిపోతున్నవి. ఇప్పుడు గ్రామాలలో రైతులు అనుభవించేకష్టాలను ఈనాటకం కండ్లకు కట్టినట్లుగా చూపిస్తున్నది. దీనివలన గాంధీ మహాత్ముని గ్రామపునర్నిర్మాణ కార్యక్రమం ఎంత అవసరమో, దానిని ఏవిధంగా నెగ్గించవచ్చునో కూడా తెలుస్తుంది.

వెంకయ్య గ్రామంలో ఉండే మోతుబరిరైతు. న్యాయాన్యాయవిచారణ గలిగిన పెద్దమనిషి. అన్యాయాలకు అలవాటుపడిన పున్నిసెట్టి కరణం కొండయ్య సహాయంతో అప్పను అక్రమంగా పెంచి వెంకయ్య ఆస్తినంతా వేలం వేయిస్తాడు. ఊళ్ళలో కరణాలు, పై ఉద్యోగస్థులు చేసే అన్యాయాలు కవి చక్కగా చూపించాడు. వెంకయ్య కుటుంబంతో బెజవాడకు లేచిపోయి కూలినాలి చేసికొని జీవిస్తుంటాడు. ఇంతట్లో కరణంగారికొడుకు బారిష్టరు నారాయణరావుకు వెంకయ్యదీనావస్థను చూడటంవలన ఆత్మసంస్కారం కలుగుతుంది. అంతటితో ప్లీడరువృత్తిని వదిలిపెట్టి గ్రామసంస్కారానికి నడుంకట్టాడు. వెంకయ్య కుటుంబాన్ని ఊళ్ళోకి తీసికొనివచ్చి అతని సహాయంతో గ్రామంలోని దురాచారాలన్నీ పోగొట్టి అందరినీ దేశసేవకు పురికొల్పటంతో నాటకం ముగుస్తుంది.

కవి రైతులలో కలిసిమెలిసి వారి భాషను కూడా అవగాహన చేసికొన్నాడు. నాటకంలో భాష పల్నాటిరైతులు వాడుకొనే భాష. పల్లెటూరి ముఖం చూడనివారి కిది అర్థం కాదు. కాని ఇది పల్లెలలో ఆంగ్లసంపర్కం లేకుండా జీవిస్తున్న స్వచ్ఛమైన భాష. ఇతరమండలాలలో వారికికూడా కష్టంగా కనపడవచ్చును. కాని కాలక్రమేణ వారి మాటలు తాము ఉపయోగించుమాటలకు రూపాంతరాలని గ్రహించినప్పుడు భాష సులభంగా గ్రాహ్య మవుతుంది. అంతేగాక ప్రస్తుతం నాగరికవ్యవహారంలో లేక పూర్వగ్రంథాలలో వాడబడిన 'తిల్లిక' వంటి పదాలు ఈ నాటకంవలన అందరికీ తెలియగలవు. ప్రథమ ప్రయత్న మవడంలో నాటకంలో కొన్ని లోపాలు దొర్లినప్పటికీ మొత్తంమీద రసవంతంగానే నడిచింది. ఇటువంటి నాటకాలు పల్లెలలో ప్రచారంచేయడానికి బాగా ఉపయోగపడగలవు. గ్రాంథికాని కలవాటుపడిన నాగరికుల కీ నాటకం రంగస్థలంమీద ఎక్కువగా ఆకర్షించదేమోనని భయపడుచున్నాను. మారుమూల పదాలను వదిలిపెట్టి ఇటువంటి నాటకాలను

ఎక్కువగా వ్రాసి గ్రామసంస్కారానికి తోడ్పడ మని రామారావుగారిని కోరుచున్నాను.

వెంపటి శ్రీనివాసమూర్తి.

విప్లవ సందేశం

(అనువాదకులు: శ్రీ మహీధర జగన్మోహన రావుగారు. విశ్వ సాహిత్యమాల. ముంగండ, అంబాజీపేట పోస్టు. వెల రెండణాలు.)

'విశ్వసాహిత్యమాల'వారు ప్రపంచంలో నానాటికి పెచ్చుపెరుగుతున్న సమాజవాదభావాలను ఇంగ్లీషురాని తెలుగుసోదర సోదరీమణులకు అందచేయవలెనన్నే ఉద్దేశ్యంతో ఈ పబ్లికేషను ప్రారంభించినారు. వారి ప్రయత్నం ప్రశంసనీయమైనది. ఇతర భాషలలో సమాజవాదాన్ని గురించి అనేక గ్రంథాలున్నాయి. రోజూ క్రొత్తగా వెలువడుతున్నాయి. కాని తెలుగులో అంతగా ఈ సాహిత్యం తయారు కాలేదు. ఈ 'మాల'వారు తయారుచేసిన పుస్తకాలు కూడ ఎక్కువగా అనువాదములు. దీన్ని బట్టి చూస్తే తెలుగులో సమాజవాదాన్ని సరిగా జీర్ణించుకుని వ్రాసే సమర్థులు లేరనీ, ఒకవేళ ఉన్నా తెలుగుప్రజల ప్రోత్సాహం లేదనీ అనిపిస్తుంది.

ఈ పుస్తకం క్రోపాట్కిన్, న్యాయవాది యువకులకు, ఇంజనీరింగ్ యువకులకు, బడిపంతుళ్లకు, కళోపాసకులకు ఇచ్చిన ఉపన్యాసాల అనువాదం. మొదట్లో ౧౦ పేజీలలో జీవితంకూడచేర్చబడింది.

సినీమాపరిశ్రమ

(రచయిత: కం. కృష్ణమూర్తి గారు — క్రౌను సైజు. పుటలు ౭౮. శ్రీకృష్ణాముద్రాక్షరశాల, పిఠాపురము.)

ఈ పరిశ్రమనుగురించి ఆంధ్రములో అచ్చు జరిగిన పుస్తకము ఇంతవరకు ఇది ఒకటే.

భాష, అంతా, గ్రాంథికమయినా అందరికీ అర్థమయేలాగుననే ఉంది. తాలూకాకు తాలూకాకీ తేడాఉన్న తెలుగుభాషలో అందరికీ ఆవశ్యకత ఉన్న ఈ పరిశ్రమనుగురించి వ్రాయటంలో ఇదే ఉత్తమపద్ధతి.

పరిశ్రమనుగురించిన యావత్తు విషయాలూ బాగా తెలిసేలాగ విభజించి - ఏప్రకరణమునకాప్రకరణము జోత్తిగా క్లుప్తముగా గానీ, ఎక్కువ విసుగెత్తేటంత విశదంగా గాని కాకుండా, ఎత్తుకొన్న విషయాన్ని చాలావరకు సమగ్రంగానూ సులభముగానూ వ్రాశారు. ఎంతో అనుభవమూ - దానికి తోడు తగినంత గ్రంథ పరిచయము ఉంటేకాని ఈ సినిమా కెమిరాలనుగురించి గాని, శబ్దగ్రహణయంత్రాన్నిగురించిగాని వ్రాయటం తేలికైన పనిగాదు. ఇలా విభజించిన ప్రకరణాల్లో పరిశ్రమలో ప్రధానమైన వివిధయంత్రాలనూ వర్ణించారు. ఈ విషయాలు కావలసినవారు చదువుకుని, అక్కర్లేని వారు మిగిలిన విషయాలు అర్థం చేసుకోవడానికి ఏమాత్రం కష్టంలేకుండా ఉండేటట్లు వ్రాయబడ్డాయి మిగిలిన ప్రకరణాలు.

ఈ పరికరాల వర్ణనలతరువాత అందరికీ అవసరమున్న సామాన్యవిషయాలు—చిత్రశాల (స్టూడియో) పనిచేసే విధానము, చిత్రనిర్మాణము (ఫిలిమ్ ప్రొడక్షను) దిగ్దర్శకుడు (డైరక్టరు) మొదలయినవారి నియమాలు, నటునికి కావలసిన లక్షణాలు, అతను వినదగిన సలహాలు చాలా ఉపయోగకరముగా ఉండేలాగున వ్రాయబడ్డాయి.

ఇంతేకాక ఈ పరిశ్రమలో మిగిలిన వ్యాపకపు కంపెనీలు, వాటాదార్లయిన ప్రకటనకర్తలు కూడా ఉదాహరించబడ్డారు.

సమగ్రమైన ఈ రచనలో చాలాచోట్ల, పరిశ్రమకు ఆయువుపట్లనదగిన అభిప్రాయాలనూ ఉపోద్ఘాతములోనే ఈపరిశ్రమకు ఉపనిషత్తు వంటి వాక్యమున్నది. "దీనిలో పనిచేయు ప్రతివాడును దీని ప్రతిశాఖనుగురించి బాగుగ తెలిసినవాడు, అనుభవమున్నవాడు అయి ఉండినవాడే అచిరముగ జయప్రదమగును."

కథ వ్రాయటంలో—సూచనగా ఉదాహరణలే గాక, సూటిగా నిబంధనలునూ క్రమంగా చూపించబడ్డాయి.

" సినేరియో యందలి నటనను అస్పష్టముగాను, అనిశ్చితముగాను వ్రాయగూడదు. అనగా, అతడు మనస్సులో కష్టపడెను, ఏమియుచేయుటకు తోచినది గాదు, ఆలోచన తట్టినదిగాదు- ఇట్లు వ్రాయగూడదు. ఇందునటన స్పష్టీకరింపబడియుండలేదు. దీని సరియగు రూపము ఇట్లుండును.— అతనిముఖము కష్టమును సూచించుచుండెను. ఏమియు తోచక నటునిటు చూచెను, ఏ ఆలోచనయు తట్టనట్లు తలగోకికొనుట మొదలిడెను."

అలాగే దిగ్దర్శకులకూ-

" వీరి (అధికుల - ఎక్స్ట్రాలయొక్క-) నటన కథ కంతముఖ్యము కాకపోయినప్పటికిని వీరి నటనలో ఏదైన పొరపాటువచ్చిన అతిస్పష్టముగ కనబడి కథను పాడుచేయును. మరియు ఒకముఖ్యపాత్రధారుని నటన యొక్క ఔచిత్యము, అతని ప్రధానత్వము అప్రధాన నటుల నటనపై ఆధారపడియుండును. అప్రధాన పాత్రలు . . . . అతనికి ఉత్తేజయనిరెడల అతడెంతబాగుగ నటించినను వ్యర్థమే."

సంస్కర్తలకు...కూడా ఆదర్శనులైన అభిప్రాయాలను అచ్చటచ్చట సమయానుకూలంగా పర్చారు.

ప్రస్తుతంలో ఆచరణలో అలక్ష్యంగా చూడబడుతూండే విషయాల ప్రాముఖ్యతగా, నటులకి రిహార్సలులలో ఇవ్వవలసిన తర్ఫీదులను గురించి—

"అభ్యాసపునకుల (రిహార్సలుగములు) యందు రంగ సజ్జపైన ఏయే వస్తువులు ఏవిధముగ నుండునో అట్లే యుంచిన యెడల అది నటునికి ... మిక్కిలి సహాయ

సినీమానటుడు తప్పక అలవాటు చేసుకోతగిన మానసిక పరివర్తనము

"ఎదురుగా నిలబడియున్న దిగ్దర్శకుడే ఆ ఇతరపాత్రధారుడు, ప్రేక్షకులు అనుకొని ఇతడు నటింపవలెను. ఇతడు ఎట్లు నటించునో యని దిగ్దర్శకుడు ఆతురతతో కనిపెట్టుకొనియుండును. నటుడు బాగుగా నటించిన ప్రజల తరఫున సంతోషించునది అతడే, పాడుచేసిన విచారించునది అతడే."

డైరక్టరు సలహాలు ఎప్పుడుతీసికొనవలెనో, ఎట్లు తీసికొనవచ్చునో, మొదలైనవన్నీ ముఖ్యంగా ఆచరణలో పెట్టతగినవి.

వీటన్నిటికంటే కష్టమైనది, ఇంగ్లీషు పదాలను ఆంధ్రీకరించడము ఐనప్పటికీ పుస్తకమంతటనూ ప్రతి క్లిష్టపదానికీ వాడుకలోనున్న ఇంగ్లీషు పదము వేస్తూండటంవల్ల చదువుటకు సులభముగానున్నది.

పుస్తకము మంచి అచ్చుతో **Neat** గా ఉన్న అట్టతోనూ చాలా ఉపయోగకరమైనది. ఐతే జనసామాన్యానికి కొన్ని ఫోటోలుకూడా ఉంటే ఇంకా ఎక్కువ ఆకర్షణీయంగానూ, ఎక్కువ సులభముగా అర్థమయేదిగానూ ఉండేది అని అనవచ్చు.

ఎస్. జగన్నాథ్.

కమ్యూనిష్టులతో — కార్లమార్క్సు

(అనువాదకులు రామమోహన్. విశ్వసాహిత్యమాల, ముంగండ, హైదరా అంబాజీపేట. వెల అణాన్నర).

పుస్తకంపేరే లోపలి విషయాన్ని చెప్తుంది. మొదటిలో కార్లమార్క్సు పరిచయం కూడ ఇవ్వబడింది. కార్లమార్క్సు సిద్ధాంతాలు కొంతవరకు ఈ పుస్తకంద్వారా పాఠకులు తెలుసుకోగలుగుతారు.

రాజ్యాంగయంత్రము

(రచయిత: వి. ఐ. లెనిన్. అనువాదకులు: శ్రీ మాల, ముంగండ. హైదరా అంబాజీపేట. తూర్పుగోదావరి. వెల రెండణాలు.)

కార్లమార్క్సు సిద్ధాంతాలను మనసార ఒప్పుకొని కార్యాచరణలోనికి తెచ్చిన వీరుడు లెనిన్. అందుకనే మేలుకొలుపులుపాడే యువకులకు లెనిన్ అంటే పెద్ద ఆకర్షణ. ఆయన చెప్పిన ప్రతిమాటకు కొంత విలువవుంటుంది. రాజ్యాంగాన్ని గురించి స్వెర్డ్లోవ్ యూనివర్సిటీ విద్యార్థుల కిచ్చిన ఉపన్యాసం ఈరాజ్యాంగయంత్రం. రాజ్యాంగాన్ని గురించి లెనిన్ దృక్పథం ఏమిటో ఈ పుస్తకంద్వారా కొంతవరకు తెలుసుకోవచ్చును.

తెనుగు తిరుప్పావు

(గ్రంథకర్త: శ్రీ సామినేని రాజారావుదాసు గారు. వావిళ్ల రామస్వామిశాస్త్రులు అండ్ సన్స్, చెన్న, ఎస్ప్లనేడ్ అని వ్రాసిన గ్రంథములు దొరకును. వెల రు ౦-౮-౦.

శ్రీ భూదేవి అంశతో బుట్టిన గోదాదేవి, ఆండాళ్ అనుపేరుతో ప్రఖ్యాతికెక్కి భగవద్భక్తురాలై శ్రీ రంగనాథస్వామియందు లీనమైపోయిన వృత్తాంతం సాధారణంగా దాక్షిణాత్యు లందరూ అందులోనూ వైష్ణవ సంప్రదాయాలకు చెందినవారందరూ ఎరిగే వుంటారు. భక్తలోకంలో శ్రీ గోదాదేవి గానము చేసిన ద్రవిడభాషలోని పాశురములను శ్రీ రాజారావుదాసుగారు తెనుగులోనికి అనువదించి యాంధ్రుల మన్ననలకు అర్హులైనారు. మొత్తంమీద ఇది పైకి శృంగారవేషంతో అంతర్యానికి వేదాంతం బోధించే గ్రంథం. భగవత్ కైంకర్యానికి నోములు నోచుకోవలెనని ఆండాళ్ ధనుర్మాసమున తెల్లవారుజామున లేచి తన నేస్తురాండ్ర నందరినీ మేలుకొలుపుతుంది. వీరందరూ పరస్పరం ఆడుకునేమాటలు పైకి శృంగారరసంతో కూడుకొన్నవిలాగానే వుంటాయి. శ్రీ రాజారావుదాసుగారు అట్టివాక్యాలలోగల వేదాంతప్రభావాని

ప్రతిపదార్థమూ, దాని యడుగున మంజరీవ్యాఖ్యానంలో దాని యర్థమూ, తరువాత అందరి తాత్పర్యమూ క్రమంగా వున్నాయి.

గ్రంథస్వీకారము

చేనేత భజనావళి — సంపాదకులు: శ్రీ పెండెం కృష్ణస్వామిరావు, మార్కండేయ నారాయణరావుగార్లు. చేనేత గ్రంథమాలవారి ప్రథమ ప్రసూనం. చీరాలపోస్టు, గుంటూరు జిల్లా.

వెల రు. ౦-౧-౦.

శంభూకే సాథ్ ఏక్ దిన్ (హిందీ)— మూలలేఖకుడు శ్రీ కే. ఎస్. వేంకటరమణి - అనువాదకుడు, శ్రీ క. మ. శివరాంగారు. హిందీ ప్రచారసభా, త్యాగరాయనగర్, మద్రాస్, వెల రు ౦-౩-౦.

శ్రీ మృగీస్తోత్రం — ప్రణేతా: శ్రీ పుల్లెల సుబ్రహ్మణ్యశాస్త్రి. ప్రకాశకులు: శ్రీ రామకృష్ణ సేవా సంఘము, బారువ, జిల్లా వైజాగ్. వెల రు. ౦-౨-౦.

గాంధీబోధ — ప్రకాశకులు: హరిజనసేవాసంఘం-బారువ, జిల్లా వైజాగ్.

వెల రు. ౦-౧-౦.

తత్త్వమీమాంస—గ్రంథకర్త: శ్రీ రాజా మంత్రిప్రెగడ భుజంగరావుగారు. ఏలూరు, పశ్చిమ గోదావరిజిల్లా. వెల ౧-౮-౦.

నీతిరత్నములు—రచయిత: శ్రీ రాజా మంత్రిప్రెగడ భుజంగరావుగారు. మంజువాణీ ప్రెస్సులో ముద్రితము. మేనేజరు, శ్రీ రాజా భుజంగరావుగారి ఆఫీసు- ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లా అని వ్రాసిన పుస్తకములు దొరకును.

చీనారోదనం—రచయిత: ట్రెటి. రూకోవ్ అనువాదకుడు: శ్రీ కృత్తివాసతీర్థులుగారు. నవశక్తివారి తొలి ప్రచురణం: నవశక్తి కార్యాలయం, బెజవాడ. వెల రు ౦-౮-౦.

కొట్టిపల్లి గీతాలు—సంపాదకులు: శ్రీ ఆచార్య రంగాగారు. ప్రకాశకులు: రైతాంగ గ్రంథమాల, గుడివాడ. వెల రు. ౦-౨-౦.

ఆంధ్రసారస్వత విప్లవం (ఇంగ్లీషు) — సంపాదకులు: శ్రీ ఆచార్యరంగాగారు. ప్రకాశకులు: ఆంధ్రరైతాంగ గ్రంథమాల. గుడివాడ.

వెల రు. ౦-౨-౦.



Printed and Published by S. Sambhu Prasad, at the Andhra Patrika Press,